


ఈనాడు



కరీంనగర్ 7-2-2019 గురువారం సిటీ సంపుటి 45 సంచిక 178

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



కాల్ కలుస్తలే!

మొబైల్ నెట్‌వర్క్‌లో తరచూ ఇబ్బందులు

- తెలుగు రాష్ట్రాల్లో సగటున 7 శాతం సమస్య
- నాణ్యతలేని నెట్‌వర్క్.. శబ్దం.. గందరగోళం
- ఫిర్యాదులపై స్పందించని టెలికం కంపెనీలు
- రోజురోజుకూ పడిపోతున్న విశ్వసనీయత
- దేశంలో ట్రాయ్ పరిశీలనలో వెల్లడైన నిజాలివి

సికింద్రాబాద్‌కు చెందిన వ్యాపారి రాజేష్ ప్రతిరోజూ కారులో సికింద్రాబాద్ బోట్స్ క్లబ్ నుంచి ట్యాంక్ బండ్ మీదుగా తెలుగుతల్లి విగ్రహం వరకు ప్రయాణిస్తుంటారు. ఆ మార్గంలో రోజూ కనీసం మూడుసార్లయినా కాల్‌డ్రాప్ అవుతోంది. వ్యాపార లావాదేవీల విషయంలో ఇదెంతో ఇబ్బందికరంగా మారుతోంది.

★ ★ ★

ఇది సాధారణ పౌరులకు మాత్రమే ఎదురవుతున్న సమస్యకాదు.. సాక్షాత్తు దేశ ప్రధానికి కూడా ఇటీవల ఇదే ఇబ్బంది ఎదురైంది. గత ఏడాది సెప్టెంబరులో ప్రధాని మోదీ దిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి అధికారిక నివాసానికి వెళ్తున్నపుడు కాల్‌డ్రాప్ సమస్యను ఎదుర్కొన్నారు.

వెంటనే ఆయన.. ఈ సమస్యకు సాంకేతిక పరిష్కారాన్ని కనుక్కోమని టెలికాం విభాగాన్ని ఆదేశించారు. టెలికం కంపెనీలు వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలను అందించాలని సూచించారు. ఇది జరిగి ఆరు నెలలు కావస్తున్నా వాటి పనితీరులో మార్పు రాలేదు. కాల్‌డ్రాప్, నెట్‌వర్క్ సమస్యలు అలాగే ఉన్నాయి. నాసిరకం నెట్‌వర్క్. ప్రపంచంలోనే అత్యంత తక్కువ వేగం ఉన్న ఇంటర్‌నెట్.. చివరకు పాకిస్థాన్ కంటే తీసికట్టు కావడం విశేషం. ఇదీ మన దేశ ప్రగతి!

ఈ పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం 11లో

అత్యంత వేగవంతమైన డేటా స్పీడ్ (ఎంబీపీఎస్)

సింగపూర్	44.31
నెదర్లాండ్స్	42.12
నార్వే	41.20
దక్షిణ కొరియా	40.44
హంగేరీ	39.18
ఆస్ట్రేలియా	36.08
కెనడా	32.90
అమెరికా	27.33
యూఏఈ	23.11
భారత్	6.07

అయ్యప్ప అందరివాడు

శబరిమలకు అన్ని వయసుల మహిళలూ రావొచ్చు



- సుప్రీంకోర్టుకు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు వెల్లడి
- మునుపటి వైఖరిలో మార్పు
- తీర్పు మార్చాల్సిన అవసరం లేదన్న కేరళ సర్కారు
- తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన రివ్యూ పిటిషన్లపై విచారణ

దిల్లీ: శబరిమల అయ్యప్ప ఆలయాన్ని నిర్వహించే ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) తన వైఖరిని మార్చుకుంది. ఆలయానికి అన్ని వయసుల మహిళల్నీ అనుమతించవచ్చని బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ విషయంలో గత తీర్పును సమర్థించింది. తాజా వైఖరి వెనుక రాజకీయ ఒత్తిళ్లు లేవని స్పష్టం చేసింది. శబరిమల పుణ్యక్షేత్రంలోకి అన్ని వయసుల మహిళలూ ప్రవేశించేందుకు అనుమతించాలంటూ సర్వోన్నత ...మిగతా 2లో



ప్రగతిభవన్‌లో రిసోర్స్‌పర్సన్లతో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నిధులపై నిఘా

అయిదేళ్లలో పంచాయతీలకు రూ. 40,000 కోట్లు

- తనిఖీకి 25 ప్రత్యేక బృందాలు.. ఒక బృందంలో నేనూ ఉంటా
- తేడా వస్తే సర్పంచి, కార్యదర్శుల సస్పెన్షన్ తప్పదు
- విద్యుత్ బిల్లు బకాయిపడితే పదవి నుంచి తొలగింపే
- ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర హెచ్చరిక
- రోడ్డుపై చెత్తవేస్తే రూ. 500 జరిమానా విధించాలి
- ఆరు నెలల్లో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణం
- సర్పంచిని నేలపై కూర్చోబెట్టిన సంఘటనకు ఖండన
- సర్పంచులకు శిక్షణ ఇచ్చే నిపుణులతో సుదీర్ఘ సమావేశం
- పద్యాలు, శ్లోకాలు, సామెతలతో సీఎం హితోక్తులు

2లో

చట్టసభల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే పదాలు పోవాలి. గ్రామాల్లోనూ అధికారం అనే మాట రాకూడదు. ప్రజా ప్రతినిధులంతా తాము ప్రజా సేవకులమే తప్ప, అధికారం చెలాయించే వాళ్లం కాదన్న భావన కలిగి ఉండాలి.

★ ★ ★

దురదృష్టవశాత్తూ ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా మారుతోంది. ఇది మంచిది కాదు. ప్రజలందరి భాగస్వామ్యంతో రాజకీయాలకు అతీతంగా అంతా పనిచేయాలి.



నింగిలోకి దూసుకెళ్తున్న ఏరియన్ వాహక నౌక

సమాచారం మరింత చేరువ

- కక్ష్యలోకి జీశాట్-31 ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు రెండో విజయం
- దీవులకు సైతం డీటీహెచ్ సహా పలు సేవలు అందుబాటులోకి

న్యూస్‌టుడే, సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 2019 సంవత్సరంలో రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. గత నెలలో పీఎస్ఎల్‌వీ-సీ44 వాహక నౌక ద్వారా కలాంశాట్, మైక్రో శాట్-ఆర్ ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశ పెట్టారు. తాజాగా బుధవారం దక్షిణ అమెరికా ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఏరియాన్ 5వీఏ వాహక నౌక ద్వారా మన దేశానికి ...మిగతా 2లో

రాష్ట్రానికి రూ. 700 కోట్లే?

- పీఎం-కిసాన్ అర్హుల గుర్తింపునకు మార్గదర్శకాలు జారీ
- ఈ నెల 25లోగా అర్హుల వివరాలను పోర్టల్‌లో పెట్టాలి
- 26 నుంచి వారి ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ: కేంద్రం

5లో

దోస్త్.. ఇక పూర్తిగా ఆన్‌లైన్



- డిగ్రీ ప్రవేశాలు... రుసుముల చెల్లింపులు..
- సీటు నిర్ధరణ అంతా ఆన్‌లైన్‌లోనే
- విద్యార్థులకు మరింత సులభతరం

11లో

ఈడీ ముందుకు రాబర్ట్ వాద్రా

లండన్‌లోని ఆస్తులపై సుదీర్ఘ విచారణ

- 5.30 గంటలపాటు 40కిపైగా ప్రశ్నలు సంధించిన అధికారులు
- నేడూ కొనసాగనున్న దర్యాప్తు ప్రక్రియ
- భర్తతో పాటు కార్యాలయం వరకు వచ్చిన ప్రియాంక
- ఆయనకు అన్నింటా అండగా ఉంటానని వెల్లడి

2లో



దిల్లీలోని ఈడీ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యేందుకు వెళ్తున్న రాబర్ట్ వాద్రా

బాలికపై ప్రేమోన్మాదం



ప్రేమోన్మాది చేతిలో కత్తి దాడికి గురై... హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

- ఇంటర్ విద్యార్థినిపై కొబ్బరి బొండాల కత్తితో యువకుడి దాడి
- ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
- పోలీసుల అదుపులో నిందితుడు
- హైదరాబాద్ నగరంలో దారుణం



నిందితుడు భరత్

ఈనాడు, హైదరాబాద్: న్యూస్‌టుడే, కాచిగూడ, మలక్‌పేట, ఓయూ: శ్రద్ధగా చదువుకుని జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుకోవాలనే ఆకాంక్ష ఆ బాలికది. ఆకర్షణనే ప్రేమనుకుని, దాన్ని గెలవడమే జీవిత ధ్యేయమనే భ్రమ ఆ కుర్రాడిది. ఇద్దరి మధ్య కొన్నాళ్లుగా సంఘర్షణ జరిగింది. ఆమె మాత్రం తను అనుకున్న లక్ష్యానికే కట్టుబడగా.. అతను ఉన్మాదిగా మారాడు. తన ...మిగతా 2లో

బుల్లితెర నటి నాగ ఝాన్సీ బలవన్మరణం 6లో

తెగుళ్లు విపత్తే!

- రసాయనాల అధిక వాడకంతో పెరుగుతున్న సాగువ్యయం
- ఖర్చు తగ్గించడానికి జీవ రసాయనాల వినియోగం
- ప్రయోగాత్మకంగా వరంగల్ గ్రామీణ, అర్బన్ జిల్లాల్లో అమలు

ఈనాడు - హైదరాబాద్

పంటలకు సోకుతున్న తెగుళ్లను విపత్తు మాదిరిగానే గుర్తించి పోరాడితేనే రసాయన పురుగుమందుల వాడకం తగ్గించడం సాధ్యమవుతుందని 'భారత వ్యవసాయ పరిశోధనా మండలి' (ఐసీఏఆర్) స్పష్టం చేసింది. విచ్చలవిడిగా రసాయనాల వాడకం కారణంగా పురుగులు మరింత బలం పుంజుకుని విజృంభిస్తున్నాయి. వాటిని అరికట్టడానికి జీవ రసాయనాలను వాడితే రసాయనాలకు వెచ్చిస్తున్న ఖర్చు తగ్గుతుంది. దీన్ని ప్రయోగాత్మకంగా వరంగల్ గ్రామీణ, అర్బన్ జిల్లాల్లో మూడు రకాల పంటలపై ఏడాది కాలంగా అమలు చేస్తున్నారు. ఈ ప్రయోగాత్మక కార్యక్రమాన్ని 'జిల్లా తెగుళ్ల నిర్వహణ ప్రణాళిక' (డీపీఎంపీ) పేరుతో రాజేంద్రనగర్‌లో ఐసీఏఆర్ సంస్థలైన 'భారత మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ' (ఎన్ఐపీహెచ్ఎం), జాతీయ వ్యవసాయ విస్తరణ, నిర్వహణ సంస్థ (మేనేజ్)లు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి, మిరప సాగు అధికంగా ఉంది. వీటిపై తెగుళ్ల వ్యాప్తి వాటి నియంత్రణకు రసాయనాల వాడకం కూడా పెరిగినందున ఈ జిల్లాను మేనేజ్ ఎంపిక చేసింది. ఖరీఫ్ సీజన్‌లో అమలు చేసిన ఈ కార్యక్రమంపై మేనేజ్ సంస్థ నివేదిక తయారు చేసింది. ఇందులో ముఖ్యాంశాలు...

ఎలా అమలు చేస్తున్నారు...

వరంగల్ గ్రామీణ జిల్లాలో వరికోలు, నల్లబెల్లి, రేలకుంట, అర్బన్ జిల్లాలో శంభునిపల్లి, ముచ్చర్ల గ్రామాలను ఈ కార్యక్రమం అమలుకు ఎంపిక చేశారు. రైతులు వాడుతున్న రసాయన మందుల వివరాలు తెలుసుకున్నారు. వీటి స్థానంలో ఎన్ఐపీహెచ్ఎంలో శాస్త్రీయంగా తయారు చేసిన 2 వేల లీటర్ల జీవ రసాయనాలు జీవ బ్యాక్టీరియా, జీవ శిలీంధ్రనాశినీలను అందజేశారు. వరికి సోకే అగ్గి, పొడ వంటి తెగుళ్ల నివారణకు వీటిని పిచికారీ చేయించారు. దీంతో లీటరు సాధారణ రసాయన పురుగుమందు రూ.600కు కొనడానికి బదులు రూ.వంద ఖర్చుతోనే జీవ రసాయనాలను వాడేలా రైతులకు అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్నవారందరిని భాగస్వాములను చేశారు. రైతులకు వేపనూనె, లింగాకర్షక బుట్టలు, నాణ్యమైన విత్తనాలు అందజేశారు. పాత వరంగల్ జిల్లాలో లక్షన్నర మంది రైతుల సెల్‌ఫోన్ నంబర్లు సేకరించారు. వీరిలో ఈ 5 గ్రామాల రైతుల నంబర్లు 2500దాకా ఉన్నాయి. ఈ నంబర్లకు ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు, వాట్సప్ సందేశాల ద్వారా తెగుళ్ల నివారణ, వాతావరణంపై సూచనలు పంపుతున్నారు. ఈ గ్రామాల రైతులు, పురుగుమందుల డీలర్లకు ఎన్ఐపీహెచ్ఎంలో శిక్షణ ఇప్పించారు. వారే సొంతంగా జీవ బ్యాక్టీరియా, జీవ శిలీంధ్రనాశినీలను తయారు చేసుకోవడానికి ఒక్కొక్కరికి రూ.30 వేల విలువైన తయారీ సామగ్రి అందజేశారు. వీటిని తయారు చేసుకున్నవారు సొంతంగా వాడుకోవడమే కాకుండా ఇతర రైతులకు లీటరు రూ. 50కే అమ్మాలని సూచించారు.



వరి పైరుకు సోకే తెగులు నివారణ గురించి మహిళా రైతుకు వివరిస్తున్న శాస్త్రవేత్త

ఇదీ సంగతి!




తప్పేంటి సార్, సమాజంలోని ద్రవ్యలోటును భర్తీ చేస్తున్నాం!

పదవీ విరమణ పొందే ఉద్యోగులెందరు?

- దీనివల్ల ప్రభుత్వంపై పడే భారమెంత?
- అన్ని శాఖలను వివరాలు కోరిన ఆర్థికశాఖ
- జాబితా తయారీలో నిమగ్నమైన సంబంధిత విభాగాలు

ఈనాడు హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎంత మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు?, వారికి చెల్లించాల్సిన మొత్తం ఎంత ఉంటుంది తెలుసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61 సంవత్సరాలకు పెంచుతామని ఎన్నికల సమయంలో తెరాస హామీ ఇచ్చింది. భారీ విజయంతో రెండోసారి అధికారం చేపట్టిన తెరాస ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఉద్యోగల పదవీ విరమణ వయసు పెంపునకు సంబంధించిన హామీపై కూడా దృష్టి సారించినట్లు దీనిని బట్టి తెలుస్తోంది. ప్రతి ఆర్థిక సంవత్సరం చివరలో తదుపరి వచ్చే సంవత్సరం పదవీ విరమణ చేసే వారి జాబితా సిద్ధమవుతుంది. ఆ జాబితా ఏడాది ఆరంభంలోనే ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంటుంది. అయితే ఇప్పుడు 2019-20వ ఆర్థిక సంవత్సరంలో పదవీ విరమణ చేసే వారి వివరాలు, పదవీ విరమణ ...మిగతా 2లో



మీ రాక మాకు సంతోషమే

- కానీ చట్టబద్ధంగా రావాలి.. వలసలపై ట్రంప్ వెల్లడి
- ప్రతిభకే పట్టం కట్టాలన్న అమెరికా అధ్యక్షుడు
- కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ప్రసంగం

14లో

రెండో పీజీ విద్యార్థులపై దేగ కళ్లు

- చట్టబద్ధ నివాసం కోసం నిబంధనలు అతిక్రమిస్తున్నారనే అనుమానం
- గడువు తీరి వెళ్లి ఆరా... కొందరికి తాఖీదులు
- అమెరికా వలస విభాగ అధికారుల చర్యలు
- వెనుదిరిగే యత్నాల్లో భారతీయ విద్యార్థులు

16లో

TG

సర్పంచిగా ఎన్నిక కాగానే కొందరి వేషభాషల్లో మార్పు వస్తోంది. ఇది సరికాదు. సర్పంచులు తమ సహజత్వాన్ని కోల్పోకూడదు. తాము పెత్తనాన్ని చేయడానికే ఉన్నామనే భావనను వారు మనసులోకి రానివ్వకూడదు".

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు వేదికగానే ప్రగతి ప్రణాళికలు అమలు కావాలి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు.. వార్డు సభ్యుల, గ్రామ ప్రజల సహకారంతో గ్రామ వికాసానికి పాటుపడాలి.

-ముఖ్యమంత్రి కేసీఆర్



కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్‌పర్సన్లతో బుధవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నిధుల వినియోగంపై నిఘా

ఈనాడు - హైదరాబాద్

పంచాయతీల్లో నిధులను ఏవిధంగా ఖర్చుపెడుతున్నదీ తెలుసుకోవటానికి 25 ఆకస్మిక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఒక బృందంలో తాను కూడా ఉంటానని చెప్పారు. ఈ బృందాలు దూర ప్రాంతాల్లో పర్యటించేందుకు హెలికాప్టర్లు కూడా సమకూరుస్తామన్నారు. ఎప్పుడు ఎక్కడికి పోతారో తెలియకుండా తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. ఇంటెలిజెన్స్ ద్వారా కూడా సమాచారాన్ని తెప్పించుకొంటామని, ఎక్కడ తేడా వచ్చినా సర్పంచి, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేస్తామని సీఎం హెచ్చరించారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు అయిదు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు నిపుణులు (రిసోర్సుపర్సన్స్)గా ఎంపికైన పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధ్యాయులు, సేవా సంస్థల ప్రతినిధులు, రిటైర్డు ఉద్యోగులు, తదితర 350 మందితో ప్రగతి భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. రెండు విడతలుగా అయిదు గంటలపాటు.. పద్యాలు, శ్లోకాలు, సామెతలు మేళవించి, హాస్యాన్ని రంగరించి ఆద్యంతం ఆసక్తి కలిగించే రీతిలో.. పంచాయతీలకు సంబంధించిన అంశాలను ఆయన వెల్లడించారు. పంచాయతీరాజ్ కొత్తచట్టం తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్ల సందేహాలను నివృత్తి చేశారు.

- 14వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి ఏడాదికి రూ.1,628 కోట్లు వస్తాయి. దానికి రాష్ట్రం మరో రూ.1,628 కోట్లు ఇస్తుంది. అంటే 500 జనాభా కలిగిన గ్రామానికి ఏడాదికి రూ.8 లక్షలు వస్తాయి. ఏటా రూ.3,500 కోట్ల ఉపాధి హామీ నిధులు వస్తాయి. దీనిలో వస్తు సామగ్రి కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులు వాడుకోవాలి. వీటి ద్వారా రూ.480 కోట్లు వస్తాయి. ఇలా మూడు మార్గాల్లో వచ్చే రూ.7,236 కోట్లతో పాటు బడ్జెట్‌లో మరికొన్ని నిధులు ఇస్తాం. దాతల విరాళాల ద్వారానూ నిధులను సమకూర్చుకోవాలి. ఇలా మొత్తంగా రానున్న అయిదేళ్లలో రూ.40 వేల కోట్లు గ్రామాలకు అందుతాయి.
- ప్రతి గ్రామంలో ఒక నర్సరీ తప్పక ఉండాలి. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు కాకుండా అడిగినన్ని మొక్కలు ఇవ్వాలి.
- గ్రామాల్లోని రోడ్లు అద్దంలా మెరవాలి. రోడ్లపై చెత్తవేసేవారికి రూ.500 జరిమానా విధించాలి. ప్రతి గ్రామంలో ట్రైసైకిళ్లు, డంపింగ్ యార్డులు ఉండాలి.
- వైకుంఠధామాల (శ్మశానం) కోసం పంచాయతీ స్థలాన్ని ఇవ్వాలి. పంచాయతీకి స్థలం లేకుంటే ప్రభుత్వ భూమిని వాడుకోవాలి. రెండూ లేకుంటే పంచాయతీ నిధులతో భూమిని కొనాలి. దాతలు ముందుకొస్తే వారి భూమిని తీసుకోవాలి. ఆరు నెలల్లో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణాలు పూర్తికావాలి.
- ప్రతి పంచాయతీలో నూరు శాతం పన్నులు వసూలు చేయాలి. విఫలమయ్యే కార్యదర్శిపై చర్యలు తీసుకొంటాం. సర్పంచులు గ్రామంలోనే నివాసం ఉండాలి. నెలకోసారి పంచాయతీ సమావేశాన్ని నిర్వహించాలి. గ్రామంలో వ్యక్తిగత ఆస్తుల మ్యుటేషన్ (పేరు మార్పిడి)పై కొత్త పంచాయతీలు నిర్ణయం తీసుకోవాలి.
- వీధి దీపాలు, ఇతరత్రా అవసరాల కోసం వాడే విద్యుత్‌కు స్థానిక సంస్థలు బిల్లులను సరిగ్గా చెల్లించటంలేదు. పంచాయతీలు రూ.2,570 కోట్లు, మున్సిపాలిటీలు రూ.455 కోట్లు చెల్లించాలి. ఇలాగైతే విద్యుత్ సంస్థలు నడిచేదెలా? కరెంటు బిల్లులను జాప్యం చేసిన వారిని ఇక సస్పెండ్ చేస్తాం.

జాతస్య మరణం ధ్రువం

పుట్టినవారు గిట్టక మానరు కనుక వారు చనిపోయిన తర్వాత మర్యాదగా, గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించటానికి శ్మశానవాటికలను నిర్మించాలని పేర్కొంటూ భగవద్గీతలోని 'జాతస్య మరణం ధ్రువం..' అనే శ్లోకాన్ని సీఎం ప్రస్తావించారు. ఇలా ఆయా అంశాలను వివరించేటప్పుడు వేమన పద్యాలు, సుమతీ శతకం, ఏనుగు లక్ష్మణ కవి సుభాషితాలు ఉటంకించారు. గ్రామాల్లో సంస్కరణలు అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగాలంటూ.. 'అనగననగ రాగమతిశయిల్లుచునుండు' అనే వేమన పద్యాన్ని ప్రస్తావించారు. 'నయమున బ్రాలున్ ద్రావరు, భయమున విషమ్మునైనా భక్షింతురుగా' అనే పద్యాన్ని పాడి.. విధి నిర్వహణలో అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడితే కఠినంగా శిక్షించాలని సూచించారు.

అలా చేయడం దారుణం

మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచి బాలప్పను నేలపై కూర్చోపెట్టిన సంఘటనను సీఎం తీవ్రంగా ఖండించారు. ఇలా చేయటం దారుణమని, భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె జోషి, ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, సెర్ప్ సీఈవో పౌసమి బసు, ముఖ్యమంత్రి కార్యాలయం కార్యదర్శి స్మితా సబర్వాల్, కొందరు ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఎం నిర్వహించిన సమావేశానికి హాజరైన రిసోర్స్‌పర్సన్లు గురువారం నుంచి అయిదు రోజుల పాటు రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థ భవనాల్లో శిక్షణ పొందుతారు.



రిసోర్స్‌పర్సన్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. వేదికపై మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, నిరంజన్‌రెడ్డి, సీఎస్ ఎస్‌కే జోషి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, గంగదేవి పల్లి మాజీ సర్పంచి రాజమౌళి

గంగదేవిపల్లి మాజీ సర్పంచికి అరుదైన గౌరవం

వరంగల్ జిల్లా గంగదేవిపల్లి మాజీ సర్పంచికి ఈ సమావేశంలో అరుదైన గౌరవం లభించింది. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన వారి గురించి సీఎం వివరిస్తూ గంగదేవిపల్లిని అభివృద్ధి పరచిన మాజీ సర్పంచి కూసం రాజమౌళి గురించి వివరించారు. ఆ సమయంలో రాజమౌళి రిసోర్స్‌పర్సన్‌గా సమావేశంలోనే ఉండటంతో సీఎం ఆయన్ని వేదికపైకి పిలిచి సీనియర్ అధికారులు, ఎమ్మెల్యేల సరసన కూర్చోపెట్టారు. రాజమౌళిని స్ఫూర్తిగా తీసుకొని గంగదేవిపల్లిలో గ్రామ జ్యోతిని ప్రారంభించానని ఆయన పేర్కొన్నారు. మహిళల సాధికారతకు నిజామాబాద్ జిల్లా అంకాపూర్ ఒక ఉదాహరణ అని చెప్పారు. ఒక్క దోమైనా లేకుండా పరిసరాలను ఎలా కాపాడుకోవచ్చో హైదరాబాద్ శివారులోని ప్రగతి రిసార్ట్స్ చేసి చూపించిందన్నారు.

ఈడీ ముందుకు వాద్రా

దిల్లీ

నగదు అక్రమ చలామణి ద్వారా విదేశాల్లో ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారించింది. మధ్య దిల్లీలోని జామ్‌నగర్ హౌస్‌లో ఉన్న ఆ సంస్థ కార్యాలయానికి ఆయన సాయంత్రం 3.47 గంటలకు హాజరయ్యారు. అంతకుముందే ఆయన తరఫు న్యాయవాదులు వచ్చారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు సిబ్బంది భద్రత నడుమ తెల్లని టొయోటా ల్యాండ్ క్రూయిజర్ కారులో భార్య ప్రియాంక గాంధీతో కలిసి వచ్చారు. ఆయనను అక్కడ దింపిన వెంటనే ప్రియాంక తిరిగి వెళ్లిపోయారు. ఆ సమయంలో అక్కడ ఇదే కేసులో గతంలో విచారణను ఎదుర్కొన్న దిల్లీ కాంగ్రెస్ నాయకుడు జగదీశ్ శర్మ ఉన్నారు. ఈడీ ముందు హాజరు కావడం వాద్రాకు ఇదే తొలిసారి. తల్లి చికిత్స నిమిత్తం లండన్ వెళ్లిన ఆయన అక్కడ నుంచే దిల్లీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ సమర్పించారు. ఈ నెల 16 వరకు బెయిల్ మంజూరు చేస్తూ దర్యాప్తునకు సహకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. బుధవారం ఉదయమే లండన్ నుంచి వచ్చిన ఆయన మధ్యాహ్నం ఈడీ కార్యాలయానికి వెళ్లి ఆదేశాలను పాటించారు.

ఎలాంటి ఆస్తులు లేవు: వాద్రా

రాబర్ట్ వాద్రాను ఈడీ దాదాపు అయిదున్నర గంటల పాటు విచారించింది. దాదాపు 40 ప్రశ్నలు వేసి లిఖిత పూర్వకంగా సమాధానాలు రాబట్టింది. జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, మరో అయిదుగురు అధికారులు విచారించారు. తనకు లండన్‌లో ఎలాంటి ఇల్లులేదని వాద్రా చెప్పినట్టు తెలిసింది. సంజయ్ భండారీ ఎవరో కూడా తెలియదని అన్నట్టు సమాచారం. తన సంస్థలో పని చేస్తున్నందున మనోజ్ అరోరా తెలుసని చెప్పారు. రాత్రి 9.40 ప్రాంతంలో వాద్రా తిరిగి అదే కారులో ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం 10.30 గంటలకు మళ్లీ విచారణ జరగనుంది.

అది కుంభకోణం సొమ్మే: భాజపా

అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలోని మధ్యవర్తులతో వాద్రాకు చెందిన కంపెనీలకు సంబంధం ఉందని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. 2008-09 మధ్య కాలంలో రక్షణ, పెట్రోలియం కాంట్రాక్టుల ద్వారా లండన్‌లో 9 ఆస్తులు కొనుగోలు చేశారని చెప్పారు.

ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే...: కాంగ్రెస్

కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను గందరగోళ పరచడానికి ఇలాంటి విచారణలు జరుగుతున్నాయని విమర్శించారు.



దిల్లీలోని ఈడీ కార్యాలయం బయట బుధవారం కారులో ప్రియాంకా గాంధీ, రాబర్ట్ వాద్రా

అసలు కేసేమిటి?

రాబర్ట్‌కు లండన్‌లో ఆస్తులు ఉన్నట్టు ఈడీ ఆరోపించింది. ఇందులో భాగంగానే గత డిసెంబరులో వాద్రాకు సంబంధం ఉన్న స్కైలైట్ హాస్పిటాలిటీ సంస్థ ఉద్యోగి మనోజ్ అరోరాను విచారించింది. మరో కేసులో ఆదాయపు పన్ను విభాగం మనోజ్ అక్రమ నగదు చలామణికి పాల్పడినట్టు గుర్తించిందని పేర్కొంది. పరారీలో ఉన్న ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీకి చెందిన కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు ఇది వెలుగులోకి వచ్చిందని తెలిపింది. భండారి 2010లో లండన్‌లోని 12, బ్రైన్‌స్టన్ స్క్వేర్‌లో 1.9 మిలియన్ పౌండ్లు (రూ.17.62 కోట్లు)తో భవనం కొనుగోలు చేశారని, దానికి 65,900 పౌండ్లు (రూ.61 లక్షలు)తో అదనపు సౌకర్యాలు కల్పించారని పేర్కొంది. భండారీ, మనోజ్‌లు బినామీలని అసలు యజమాని రాబర్ట్ వాద్రాయేనని ఆరోపించింది. మనోజ్ పేరున ఒక్కొక్కటి దాదాపు రూ.37 కోట్లు విలువ చేసే రెండు ఇళ్లు, నాలుగు ఫ్లాట్లు ఉన్నట్టు సమాచారం అందిందని పేర్కొంది. మరోవైపు మనోజ్‌కు కూడా ఈ నెల 12 వరకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం దిల్లీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

దర్యాప్తు ఎందుకో అందరికీ తెలుసు: ప్రియాంక

ఈడీ కార్యాలయం నుంచి నేరుగా కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చి పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. భర్తను ఈడీ కార్యాలయం వద్ద దింపడం ద్వారా ఏ రాజకీయ సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ "ఆయన నా భర్త. ఆయన నా కుటుంబం. కుటుంబానికి అండగా ఉంటా. ఈ దర్యాప్తు ఎందుకు జరుగుతోందో అందరికీ తెలిసిందే" అని అన్నారు.

సమాచారం మరింత చేరువ

(మొదటి పేజీ తరువాయి)

చెందిన జీశాట్-31 సమాచార ఉపగ్రహాన్ని విజయవంతంగా రోదసిలోకి పంపారు. ఇదే వాహక నౌక నుంచి సౌదీఅరేబియాకు చెందిన హెల్లాస్ సాట్-4 ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించారు. ఈ ఉపగ్రహం ద్వారా కమ్యూనికేషన్ సేవలు మరింత చేరువ కానున్నాయి. గతంలో పంపిన ఇన్శాట్-4ఏ, ఇన్శాట్4సీఆర్ ఉపగ్రహాలకు ప్రత్యామ్నాయంగా దీనిని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.

ప్రత్యేకతలివీ..

- జీశాట్-31 ఉపగ్రహం బరువు 2,536 కిలోలు. ఇస్రోకు చెందిన 40వ కమ్యూనికేషన్ ఉపగ్రహం. 15 ఏళ్లపాటు సేవలందించనుంది.
- భూమికి సమాచారాన్ని అందించేందుకు కీలక వ్యవస్థ అయిన క్యూబ్యాండ్‌ను జీశాట్-31 ద్వారా మరింత శక్తిమంతంగా మార్చనుంది.
- వీశాట్ నెట్‌వర్కులు, టెలివిజన్ అప్‌లింకులు, డిజిటల్ ఉపగ్రహం, డీటీహెచ్ టెలివిజన్ సేవలు, చరవాణి అనుసంధాన అనుకూల సాంకేతికతతో రూపుదిద్దుకుంది.
- మారుమూల ఉండే దీవులకు కూడ డీటీహెచ్ సహా అనేక సర్వీసులు అందించేందుకు వీలవుతుంది. సముద్రాలపై వైడ్ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఇది సాధ్యమవుతుందని ఇస్రో వర్గాలు అంటున్నాయి.

కచ్చితత్వంగా కక్ష్యలోకి : పాండ్యన్

జీశాట్-31 ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో ప్రతినిధిగా సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ సంచాలకులు ఎస్.పాండ్యన్ హాజరయ్యారు. ప్రయోగం విజయవంతమైన అనంతరం ఆయన మాట్లాడారు. ఉపగ్రహం కచ్చితమైన కక్ష్యలోకి చేరిందన్నారు. జూన్, జులై నెలల్లో మరో సమాచార ఉపగ్రహం జీశాట్-30 ప్రయోగాన్ని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచే చేస్తామని తెలిపారు.

బాలికపై ప్రేమోన్మాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రేమను కాదన్న యువతిని చంపేందుకు సిద్ధమయ్యాడు. ఆమె ఆశలను చిదిమేసేందుకు యత్నించి.. తన భవిష్యత్తును తానే పాతాళంలోకి నెట్టేసుకున్నాడు. కన్నవారిని తీరని ఆవేదనకు గురిచేశాడు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ప్రేమోన్మాద ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రాణాపాయ స్థితిలో కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతుండగా.. నిందితుడు భరత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాచిగూడ పోలీసులు..ప్రత్యక్ష సాక్షులు కథనం ప్రకారం.. బర్కత్‌పుర ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రైవేటు ఉద్యోగికి ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె (17) అదే ప్రాంతంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. వాళ్లింటి సమీపంలో ఉండే సి.భరత్ అలియాస్ సోను (20) డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ బాలిక వెంటపడుతున్నాడు.

మార్పు తేని హితబోధలు

కుమార్తె ఇచ్చిన సమాచారం మేరకు బాలిక తల్లిదండ్రులు యువకుడి కుటుంబసభ్యులను గతంలోనే హెచ్చరించారు. తర్వాత కూడా అతనిలో మార్పురాకపోగా, కొన్ని నెలలుగా వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. వాటిని భరించలేకపోతున్నానంటూ బాలిక చెప్పిన మీదట తల్లిదండ్రులు ఇటీవలే 'షి' బృందానికి ఫిర్యాదు చేశారు. వాళ్లు యువకుడికి కౌన్సిలింగ్ నిర్వహించారు. వేధింపులు ఆపాలని హెచ్చరించారు. అవేమీ అతనిలో మార్పు తేలేదు. ఆ పరిణామాల తర్వాత బాలికపై మరింత కక్ష పెంచుకున్న యువకుడు ఆమెకు హాని తలపెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు.

బస్తీవాసుల చొరవతో ఆసుపత్రికి

బాలిక ఆర్తనాదాలు విన్న బస్తీవాసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాధితురాలి చెల్లెలు ఇచ్చిన సమాచారం మేరకు బాలిక బాబాయ్ అక్కడికి చేరుకున్నాడు. నెత్తుటి మడుగులో పడి ఉన్న బాధితురాలిని చేతుల మీదే ప్రధాన రహదారి వరకు తీసుకొచ్చాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న కాచిగూడ పోలీసులు 108లో మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావమైనందున బాధితురాలి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, శ్వాస ఆడడం లేదని వైద్యులు తెలిపారు.

నిందితుడి అరెస్టు

బాలికపై పాశవికంగా దాడి చేసిన ప్రేమోన్మాది భరత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'తన ప్రేమను అంగీకరించడం లేదని, తనతో మాట్లాడటం లేదన్న కక్షతోనే నిందితుడు బాలికపై దాడి చేశాడు. పరారీలో ఉన్న నిందితుణ్ని మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో మూసీనది ఒడ్డున అదుపులోకి తీసుకున్నాం. కత్తిని అతని ఇంట్లోనే స్వాధీనం చేసుకున్నాం. అతనిపై హత్యాయత్నం, పోక్సో-2012 చట్టం, అక్రమ ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేశాం' అని తూర్పు మండల డీసీపీ ఎం.రమేష్‌రెడ్డి తెలిపారు. నిందితునికి ఎలాంటి నేరచరిత్ర లేదని, దాడి జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు అందుబాటులో లేవని వెల్లడించారు.

ఉరి తీయాలి: బాధితురాలి తండ్రి

తన కుమార్తెను వేధింపులకు గురిచేయడంతో పాటు కత్తితో దాడిచేసిన భరత్‌ను ఉరి తీయాలని బాధితురాలి తండ్రి డిమాండ్ చేశారు. లేని పక్షంలో తానే హతమారుస్తానన్నారు. 'వేధింపుల గురించి తన బిడ్డ మూడు నెలల క్రితమే చెప్పింది. వెంటనే అతని తల్లిదండుల దృష్టికి తీసుకెళ్లా. వాళ్లు పట్టించుకోని కారణంగానే భరత్ ఉన్మాదిలా వ్యవహరిస్తూ బిడ్డను చిత్రహింసలకు గురి చేశాడు. వేధింపులపై జనవరి 7న ఠాణాలో ఫిర్యాదు చేశాం. ఆ కక్షతోనే పాశవికంగా దాడి చేశాడు" అని విలేకర్లతో మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యాడు.



అప్రమత్తంగా ఉన్నా తప్పని ముప్పు

కళాశాలకు వెళ్లే మార్గంలో భరత్ వేధింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో బాలిక కుటుంబసభ్యులు జాగ్రత్తపడ్డారు. ఇంటికి సమీపంలోనే ఉండే బాబాయ్ ఇంటికి వెళ్లేలా, అక్కణ్నుంచి అతనే బాలికను ద్విచక్రవాహనంలో కళాశాలలో దిగబెట్టేలా ఏర్పాట్లు చేశారు. దాన్ని పసిగట్టిన యువకుడు, ఆమె తన బాబాయ్ ఇంటికి వెళ్లే, వచ్చే సమయాలపై ఆరా తీశాడు. ఆ సమయంలో కొన్నాళ్లుగా ఆమెను రహస్యంగా అనుసరిస్తున్నాడు. కళాశాలకు క్రమం తప్పకుండా వెళ్తుందని నిర్ధారించుకుని, ఆ సమయంలోనే దాడి చేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు రోజుల క్రితం కొబ్బరి బొండాలు నరికే కత్తిని దొంగిలించి తెచ్చుకున్నాడు. బాలిక ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరుతుందనే అంచనాతో ముందుగానే ఆమె బాబాయ్ ఇంటి సమీపంలో మాటు వేశాడు. బాలిక రాగానే ఇరుకైన గల్లీలోకి లాక్కెళ్లాడు. తనను పెళ్లి చేసుకోకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అతని ప్రతిపాదనను బాలిక తిరస్కరించడంతో వెంట తెచ్చుకున్న కత్తితో మెడపై నరికాడు. తర్వాత తల, మెడ, భుజంపై విచక్షణా రహితంగా దాడి చేసి అక్కణ్నుంచి పరారయ్యాడు.

క్షణ..క్షణం..

- ఉదయం 7.45 గంటలు: సామాజిక భవనం వద్ద మాటేసిన భరత్
- 8.15 గంటలు: ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలిక
- 8.30: బాలికతో మాట్లాడేందుకు యత్నించిన భరత్
- 8.40: ఆమెతో వాగ్వాదం
- 8.45: బాలికపై కత్తి దాడి
- 8.50: బాధితురాలిని కాపాడేందుకు స్థానికుల ప్రయత్నం
- 8.55: బాబాయ్‌కి సమాచారం. బాధితురాలిని ఆసుపత్రికి తరలించే యత్నం
- 9.00: పోలీసుల రాక. అంబులెన్స్‌లో మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలింపు.

బానిస తత్వం

ఎప్పుడైతే బానిస తన సంకెళ్లను చూసి గొప్పగా మురుసుకుంటూ, వాటిని అమూల్య ఆభరణాల్లా పొదివి పట్టుకోవటం ఆరంభిస్తాడో.. అప్పుడు యజమాని విజయం సంపూర్ణమైనట్లే!

- మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

7-2-2019 గురువారం

శ్రీ వికంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
తదియ: పూర్తి
శతభిషం నక్షత్రం: ఉ. 10.24 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: తె. 3.57 నుంచి 5.42 వరకు
వర్జ్యం: సా. 5.25 నుంచి 7.10 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10.21 నుంచి 11.07 తిరిగి మ. 2.53 నుంచి 3.38 వరకు
రాహుకాలం: మ. 1.30 నుంచి 3.00 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5.54

అయ్యప్ప అందరివాడు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం 2018, సెప్టెంబర్ 28న తీర్పు ఇచ్చింది. దీన్ని సమీక్షించాలని కోరుతూ దాఖలైన 65 పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. రివ్యూ పిటిషన్లు దాఖలుచేసిన పక్షాల వాదనలు వింటామని, తీర్పును పునఃసమీక్షించాలన్న అంశానికే వాదనలు పరిమితం కావాలని ధర్మాసనం న్యాయవాదులకు స్పష్టం చేసింది. బుధవారం మూడున్నర గంటలసేపు వాదనలు సాగిన అనంతరం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఇందూమల్హోత్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

తీర్పును ప్రజలు అంగీకరించాలి..

సుప్రీం తీర్పును సమర్థిస్తూ, శబరిమలకు అందరినీ అనుమతించాలని టీడీబీ పేర్కొనడంతో ధర్మాసనం కూడా ఆశ్చర్యపోయింది. ఇంతకు ముందు మహిళల ప్రవేశానికి వ్యతిరేకంగా వాదించారని టీడీబీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదిని జస్టిస్ ఇందూమల్హోత్రా అడగ్గా... తీర్పును గౌరవించాలని బోర్డు నిర్ణయించినట్లు బదులిచ్చారు. శరీర సంబంధ లక్షణాలతో ప్రత్యేకించి ఒక వర్గంపై వివక్షకు అంతం పలికేందుకు ఇదే సరైన సమయమన్నారు. తీర్పు మార్చాల్సిన అవసరం లేదని, రివ్యూ పిటిషన్లన్నింటినీ కొట్టివేయాలని కేరళ ప్రభుత్వం కోరింది.

పునః పరిశీలించాలి..

నాయర్ సర్వీస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్), శబరిమల దేవస్థానం తంత్రితోపాటు పలు సంస్థలు తీర్పును పునఃపరిశీలించాలంటూ వాదనలు వినిపించాయి. ఆర్టికల్ 15 ప్రకారం దేశంలోని లౌకిక సంస్థల్లోకి ప్రజలందరికీ ప్రవేశం ఉంటుందని, మతపరమైన సంస్థల్లోకి కాదని మాజీ అటార్నీ జనరల్ కె.పరాశరన్ ఎన్ఎస్ఎస్ తరఫున వాదించారు. దైవారాధన హక్కులో దేవుని విగ్రహానికి ప్రత్యేకత కూడా ఉంటుందని, ఇది అక్కడి అనివార్యమైన మతాచారంలో భాగంగా ఏర్పడుతుందని ఆలయ తంత్రి తరఫు న్యాయవాది వి.గిరి పేర్కొన్నారు. మతాన్ని నిర్దిష్ట పద్ధతిలోనే ఆచరించాలని ఏ వర్గాన్నీ న్యాయస్థానం ఆదేశించజాలదని సీనియర్ న్యాయవాది శేఖర్ నఫాడే పేర్కొన్నారు. మరో పిటిషనర్ తరఫున తెలుగు న్యాయవాది సాయిదీపక్ వాదనలు వినిపించారు. కాగా, ఫిబ్రవరి 12 నుంచి తెరిచే ఆలయానికి మళ్లీ వెళ్లి తీరతామని గతంలో శబరిమల ఆలయానికి వెళ్లి సంచలనం సృష్టించిన కేరళ మహిళలు బిందు, కనకదుర్గ సుప్రీంకోర్టుకు తెలిపారు. టీడీబీ వైఖరి మారడం వెనక ఎల్డీఎఫ్ ప్రభుత్వ ఒత్తిడి ఉందని హిందూ సంస్థల ఉద్యమకారులు ఆరోపించారు.

పదవీ విరమణ పొందే ఉద్యోగులెందరు?

(మొదటి పేజీ తరువాయి)

చేసినపుడు వీరికి చెల్లించాల్సిన మొత్తం ఎంత అన్న వివరాలను సిద్ధం చేసి పంపాలని పే అండ్ అకౌంట్ కార్యాలయం అన్ని శాఖల్లోని డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులను(డీబీఓ) కోరింది. ప్రతి శాఖలోనూ విభాగాల వారీగా ఉన్న డీడీఓల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి పంపాలని ఆర్థికశాఖ పే అండ్ అకౌంట్స్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. విభాగం, సంబంధిత డీబీఓ, ఉద్యోగి పేరు, ఐ.డి, హోదా, ఎన్ని సంవత్సరాల సర్వీసు, ఏ పే స్కేలులో ఉన్నారు, పే ఎంత, హెచ్ఆర్ఏ ఎంత, పదవీ విరమణ చేసే సమయంలో ఎన్ని ఆర్జిత సెలవులు(ఇ.ఎల్) జమ అవుతాయి, జీపీఎఫ్‌లో నిల్వ ఎంత ఉంటుంది, టీఎస్‌జీఐఎస్ సేవింగ్స్ ఎంత, టీఎస్‌జీఎల్ఐ మెచ్యూరిటీ విలువ వివరాలను పంపాలని కోరింది. స్టెనో నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగి వరకు అందరి వివరాలను పంపాలని సూచించింది. 2019 ఏప్రిల్ నుంచి 2020 మార్చి వరకు నెలల వారీగా పదవీ విరమణ చేసే వారికి సంబంధించి ఈ వివరాలన్నీ పే అండ్ అకౌంట్స్ కోరడంతో, ఈ వివరాల తయారీలో సంబంధిత విభాగాలు నిమగ్నమయ్యాయి. తద్వారా 2019-20వ ఆర్థిక సంవత్సరంలో పదవీ విరమణ చేసే వారి వల్ల ఎంత ఆర్థిక భారం పడుతుందో అంచనాకు రావచ్చు. గతంలో ఎప్పుడూ ఇలాంటి వివరాలు కోరలేదని, పదవీ విరమణ వయస్సు పెంపు అంశం ప్రభుత్వం దృష్టిలో ఉన్నందున ఈ వివరాలను కోరినట్లు తెలుస్తోందని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	14.0	31.8
మెదక్	14.5	35.7
విశాఖపట్నం	15.6	32.8
రామగుండం	15.8	31.6
శ్రీకాకుళం	17.0	32.0
హైదరాబాద్	17.3	32.0
కరీంనగర్	17.5	31.0
నిజామాబాద్	17.9	32.1
హన్మకొండ	18.0	31.0
తిరుపతి	18.0	31.5
నల్గొండ	19.0	30.0
రాజమహేంద్రవరం	19.0	35.0
కడప	19.0	35.0
మహబూబ్‌నగర్	19.4	34.0
గుంటూరు	19.9	32.8
సూర్యాపేట	20.0	29.0
విజయవాడ	20.5	31.1
ఖమ్మం	21.0	32.0

పెరిగిన 'యాదాద్రి థర్మల్' వ్యయం

- తొలి అంచనా వ్యయం రూ.25,099 కోట్లు
- సవరించిన అంచనా రూ.29,665 కోట్లు
- కాలుష్య నివారణకు రూ.4,566 కోట్లు
- మార్పులతో పెరిగిన ఆర్థిక భారం
- కాలుష్య నివారణ ప్రమాణాలు మార్చిన కేంద్రం



యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం ఏర్పాటు చేసే ప్రాంతంలో నిర్మాణ సామగ్రి

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెరిగింది. తొలి అంచనా వ్యయం రూ.25,099 కోట్ల కన్నా అదనంగా మరో రూ.4,566 కోట్లు పెంచి రూ.29,665 కోట్లతో సవరణ ప్రణాళికను తెలంగాణ జెన్‌కో సిద్ధం చేసింది. కొత్త థర్మల్ కేంద్రాల నుంచి గంధకం, నైట్రస్ ఆమ్లం, బూడిద వ్యర్థాలు అధికంగా వెలువడకుండా కొత్త ప్రమాణాలను కేంద్ర విద్యుత్‌శాఖ అమల్లోకి తెచ్చింది. దేశంలో కొత్తగా నిర్మించే థర్మల్ కేంద్రాలన్నీ తప్పనిసరిగా ఈ ప్రమాణాలను పాటించాల్సిందేనని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నల్గొండ జిల్లా దామరచర్ల వద్ద 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ కేంద్రం అంచనా వ్యయాలన్నీ మారిపోయాయి. ఒక్కోటి 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఐదు ప్లాంట్లను నిర్మించనున్నారు. 2017 అక్టోబరు 17న నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాది తరవాత కాలుష్య నివారణ ప్రమాణాల ప్రకారం మళ్లీ అంచనా వ్యయాలను మార్చాల్సి వచ్చింది. తొలి అంచనాల ప్రకారం ఈ కేంద్రంలో ఒక మెగావాట్ విద్యుదుత్పత్తి వ్యయం సగటు రూ.6.27 కోట్లు అవుతుందని పనులు ప్రారంభించారు. ఈ లెక్క ప్రకారం ఇక్కడ ఉత్పత్తయ్యే కరెంటు సగటు వ్యయం యూనిట్‌కు రూ.4.57కు వస్తుందని భావించారు. సవరించిన వ్యయం ప్రకారం సగటు వ్యయం రూ.7.42 కోట్లకు పెరిగింది. దీనివల్ల యూనిట్ కరెంటు ఉత్పత్తి వ్యయం రూ.4.95కు చేరనుంది.

ఎందుకీ వ్యయం?

థర్మల్ కేంద్రాల నుంచి వెలువడుతున్న కాలుష్య వాయువుల్లో గంధకీకామ్లం, నైట్రస్ ఆమ్లం వంటి రసాయనాలు ఉంటాయి. ఈ రసాయనాలు ఎక్కువగా బయటికి రాకుండా బాయిలర్ నిర్మాణాల్లో మార్పు చేసి అదనపు పరికరాలు అమర్చాలి. దీన్ని 'ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్'(ఎఫ్‌జీడీ) అని పిలుస్తున్నారు. ప్రస్తుతం పాత థర్మల్ కేంద్రాల నుంచి వెలువడుతున్న క్యూబిక్ మీటరు ఘనపు వాయువులో గరిష్ఠంగా 760 మిల్లీగ్రాముల నైట్రస్ ఆమ్లం, మరో 300 మిల్లీగ్రాముల గంధకీకామ్లం ఉంటున్నాయి. ఈ రెండూ చెరో వంద మిల్లీగ్రాములకు మించి బయటికి రాకుండా బాయిలర్ వద్దనే ఆపేందుకు థర్మల్ కేంద్రాలన్నింటిలో ఎఫ్‌జీడీ ఏర్పాటు తప్పనిసరి చేస్తూ కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) కొత్త మార్గదర్శకాలను జారీచేసింది. ఒక మెగావాట్‌కు సగటున రూ.80 లక్షల నుంచి కోటి వరకు అదనంగా ఖర్చుపెడితేనే ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటవుతుంది. పాత థర్మల్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలంటే దేశవ్యాప్తంగా ఇప్పటికిప్పుడు రూ.లక్షా 30 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాలి. ఇంత వ్యయం ఇప్పటికిప్పుడు పెట్టలేరని 2022 వరకు కేంద్ర విద్యుత్ శాఖ గడువు ఇచ్చింది. ప్రస్తుతం థర్మల్ కేంద్రాలను నిర్మించాలంటే వాటిలో ఎఫ్‌జీడీ తప్పనిసరిగా పెడితేనే అనుమతిస్తోంది. మరోవైపు గతేడాది జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరవాత థర్మల్ కేంద్రాల పరికరాలపై పన్ను భారం పెరిగి నిర్మాణ వ్యయం మరింత అధికమైంది. ఇవన్నీ కలిపితే అంచనా వ్యయం రూ.29,665 కోట్లకు చేరింది. ఎఫ్‌జీడీ ఏర్పాటు వల్ల కాలుష్యం బాగా తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రజారోగ్య దృష్ట్యా దీని ఏర్పాటును తప్పనిసరి చేస్తూ ప్రపంచ పర్యావరణ ఒప్పందాలు ఉన్నందునా వాటిని పాటించాల్సిందేనని జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు చెప్పారు.



సిద్దిపేటలో సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హరీశ్‌రావు. చిత్రంలో కృష్ణభాస్కర్, రాజనర్సు తదితరులు

అన్ని పట్టణాల్లో సమీకృత మార్కెట్లు

- ఇదే కేసీఆర్ ఆకాంక్ష: హరీశ్‌రావు

సిద్దిపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లోనూ సమీకృత మార్కెట్లు నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా సిద్దిపేటలో నిర్మించిన సమీకృత మార్కెట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గజ్వేల్‌లో ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నిజాం కాలంలో హైదరాబాద్‌లో నిర్మించిన మోండా మార్కెట్ ఇప్పటికీ ఎంతో ప్రయోజనకరంగా ఉందని.. గతంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి మార్కెట్లనే రాష్ట్రంలో ఇతర చోట్ల కూడా నిర్మించాలనడంతో, సిద్దిపేటలో ఇప్పుడు తొలి అడుగు పడిందన్నారు. ఇక నుంచి కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం, చేపలు, ఇతర నిత్యావసర వస్తువులన్నీ ఒకే చోట ఆహ్లాదకర వాతావరణంలో లభిస్తాయని హరీశ్‌రావు వివరించారు. అభివృద్ధి పనులతో పాటు మార్కెట్లలో ఆరోగ్యకర వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సభలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా పాలనాధికారి కృష్ణభాస్కర్, మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకులు లక్ష్మణుడు, సిద్దిపేట బల్దియా అధ్యక్షుడు రాజనర్సు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులే శ్రీరామ రక్ష

- హోంమంత్రి మహమూద్ అలీ
- 'ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్' ప్రారంభం



'ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్'లో సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ

మాదాపూర్, న్యూస్‌టుడే: సేంద్రియ ఆహార ఉత్పత్తులను ఉపయోగించేలా ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహమిస్తుందని, ఈ తరహా సాగు చేసే మహిళా రైతులకు రాయితీలు కల్పించడంతోపాటు, వారి ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెంపొందించే దిశగా ఆలోచన చేస్తామన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, తెలంగాణ మహిళా, శిశు సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన 'ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్'ను హోం మంత్రి ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులతోపాటు, మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ..పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సేంద్రియ సాగు దిశగా మహిళలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకం తగ్గించకపోతే భవిష్యత్తులో భూమిపై మొక్కలు పెరిగే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. సినీ నటి అక్కినేని అమల మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం ఎంత అవసరమో ఆ ఉత్పత్తులను కొనుగోలు చేయడమూ అంతే ముఖ్యమన్నారు. తమ కుటుంబం ఎప్పట్నుంచో సేంద్రియ ఉత్పత్తులనే వినియోగిస్తోందన్నారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ..తన తండ్రి సేంద్రియ వ్యవసాయం చేస్తారని, అక్కడ పండే కూరగాయలు, పండ్లనే తాము వినియోగిస్తామని వెల్లడించారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి నందితమిశ్రా, తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్ర బోయి, సినీనటి మధుమిత, తెలంగాణ ఉమెన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, ఫిక్కి మహిళా ఆర్గనైజేషన్ అధ్యక్షులు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన యాసంగి సాగు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత యాసంగి(రబీ) సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం సాధారణంకన్నా 26 శాతం తక్కువగా ఉన్నట్లు వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడించింది. వరి సాగు 21 శాతం తగ్గింది. సీజన్ అన్ని రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 13.38 లక్షల హెక్టార్లకు గాను 9.85 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 10.82 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి ఏకంగా 97 వేల హెక్టార్లు తక్కువగా ఉంది. గత జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర సాధారణ వర్షపాతంకన్నా 15 శాతం తక్కువగా కురిసింది. మొత్తం 16 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 45 శాతం దాకా ఉంది. వర్షాలు తక్కువగా కురిసిన మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు మరింత లోతుకు పడిపోయాయి. బోర్లలో నీరు అడుగంటిన చోట వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తున్నారు. సెనగ తప్ప మరే పంట సాధారణంకన్నా ఎక్కువగా సాగు కాలేదు.

15 రోజుల పాటు కొన్ని మెమూ, డెమూ రైళ్ల రద్దు

ఈనాడు, హైదరాబాద్: మరమ్మతు పనుల కారణంగా కొన్ని మార్గాల్లో డీజిల్ ఎలక్ట్రిక్ (డెమూ), మెయిన్‌లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (మెమూ) రైళ్లను 15 రోజుల పాటు దక్షిణమధ్య రైల్వే రద్దు చేసింది. ఫలక్‌నుమా-భువనగిరి, భువనగిరి-ఫలక్‌నుమా, ఫలక్‌నుమా-జనగాం, జనగాం-ఫలక్‌నుమా మెమూలు; కరీంనగర్-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్-కరీంనగర్ డెమూ రైళ్లను 7 నుంచి 21వ తేదీ వరకు రద్దుచేసినట్లు సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు.

ఇంజక్షన్ వికటించి మహిళ మృతి

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: ఓ ఆర్ఎంపీ వేసిన ఇంజక్షన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గోస్కి సుశీల(60) జర్వంగా ఉందని ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ఇంజక్షన్ చేయించుకుంది. ఇంటికి వెళ్లిన కొద్ది సమయానికే తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందింది. ఆర్ఎంపీ వైద్యుడు పరారీలో ఉన్నాడు.

'విద్యా వలంటీర్ల'పై నిర్ణయమెందుకు చెప్పరు?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యావలంటీర్ల సర్వీసు పొడిగింపునకు సంబంధించి ఏం నిర్ణయం తీసుకున్నారో ఎందుకు వెల్లడించడం లేదంటూ ప్రభుత్వాన్ని బుధవారం హైకోర్టు ప్రశ్నించింది. ఏడాది పూర్తయ్యాక సర్వీసును పునరుద్ధరించకుండా తిరిగి నియామక ప్రక్రియ చేపట్టడాన్ని సవాలు చేస్తూ ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బి.శైలజతోపాటు మరికొంత మంది వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం విదితమే. వీటిపై బుధవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎవీవీఎస్ భుజంగరావు వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మందికి పైగా విద్యా వలంటీర్లు పనిచేస్తున్నారని చెప్పారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యేవరకు వీరిని కొనసాగించడానికి నియామకం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఏడాది పూర్తయ్యాక సర్వీసును పొడిగించేందుకు ఉత్తర్వులు ఇవ్వకుండా తిరిగి నియామక ప్రక్రియ చేపడుతున్నారని చెప్పారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించే వరకు వీరిని కొనసాగించడం వల్ల వచ్చే ఇబ్బందులేమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయడానికి రెండు వారాల గడువు కావాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను అనుమతిస్తూ విచారణను వాయిదా వేశారు.

టీపీసీసీ ఎస్సీ విభాగం కో ఛైర్‌పర్సన్‌గా మహేశ్వర్‌రాజ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఎస్సీ విభాగం కో ఛైర్‌పర్సన్‌గా కల్వగిరి మహేశ్వర్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ఎస్సీ విభాగం ఛైర్మన్ డాక్టర్ నితిన్ రౌత్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఈనాడు

ప్రజల వద్దకు న్యాయం!

కొండల్లా పేరుకున్న పెండింగ్ కేసుల భారంతో భారత న్యాయ వ్యవస్థ కుదేలైపోతున్న దురవస్థ ఈనాటిది కాదు. నేతాగణాల మాటల్లో పోటెత్తే ఆదర్శాలు ఆకాశంలో, వాస్తవ కార్యాచరణ పాతాళంలో ఉండబట్టే భారతావనిలో న్యాయం ఎండమావిగా మారిందని చెప్పకతప్పదు. మూడు కోట్ల పైచిలుకు పెండింగ్ కేసులు ఒకవంక, నాలుగొందల దాకా హైకోర్టు న్యాయ పీఠాల్లో ఖాళీలు మరోవంక, న్యాయపాలికకు జంట సవాళ్లుగా మారాయని మున్నాళ్లక్రితం భారత ప్రధాన న్యాయమూర్తే ఉద్ఘాటించారు. ప్రతి హైకోర్టు న్యాయమూర్తి తలసరి సగటున నాలుగున్నర వేలు, సబార్డినేట్ కోర్టుల్లో ప్రతి జడ్జి సగటున 1,300 పెండింగ్ కేసులతో కుస్తీ పట్టాల్సి వస్తోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి కేంద్ర న్యాయశాఖ వర్గాలు! వివాదాల సత్వర పరిష్కారానికి గ్రామ న్యాయాలయాలే సరైన వేదికలన్న స్పృహ పుష్కలంగా క్రితమే పాలకుల్లో పాదుకొని ఆ మేరకు పదేళ్లనాడే చట్టం రూపు దాల్చినా, దాని ప్రయోజనాల్ని అందిపుచ్చుకొనే చొరవ ఇంతకాలం కొరవడింది. తెలంగాణ వ్యాప్తంగా 55 గ్రామ న్యాయాలయాల ఏర్పాటుకు సంబంధించి 2016లో హైకోర్టు చేసిన ప్రతిపాదనలను యథాతథంగా ఆమోదం పొందటంతో సిబ్బంది, మౌలిక వసతుల నిమిత్తం ఖర్చు అయ్యే మొత్తాలకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు వెలువరించడమే తరువాయి, పల్లెలకు న్యాయసేవలు చేరువ కానున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ 82 న్యాయాలయాలు ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందన్న నివేదన నేపథ్యంలో అందుకు సంబంధించి తీసుకొన్న చర్యల వివరాల్ని తెలపాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. న్యాయపాలికలో నాలుగో అంచెగా, న్యాయసేవల వికేంద్రీకరణకు ఊతమిచ్చేలా గ్రామ న్యాయాలయాలు గట్టిగా పాదుకొంటేనే, కోట్లాది న్యాయార్థుల జీవితాలు తెరిపిన పడతాయి. గ్రామ స్థాయి వివాదాలకు అక్కడే పరిష్కారాలు లభించడంతో క్రమంగా పెండింగ్ కేసుల కొండలూ కరుగుతాయి!

గ్రామస్థాయి వాద వివాద పరిష్కారంలో అనాదిగా భారతదేశానిది విలక్షణ సంస్కృతి. పంచాయతీ పెద్దలిచ్చే తీర్పు ధర్మబద్ధమైనదిగా ఆమోదించే కట్టుబాటు- న్యాయార్థులెవరూ పొలిమేర దాటాల్సిన అవసరం లేకుండా చేసేది. నాలుగు దశాబ్దాల క్రితం దాకా 'గ్రామీణులకు న్యాయం' అన్న నినాదంతో దేశవ్యాప్తంగా 30వేల దాకా న్యాయ పంచాయతీలు నెలకొన్నా- నిధుల మంజూరూ అవి రాజకీయ కోర్టులుగా భ్రష్టుపట్టిపోయాయి. తెలుగునాట మండల ప్రజా న్యాయ పరిషత్తు బిల్లును 1989లో ఎన్టీఆర్ ప్రభుత్వం పట్టుబట్టి అసెంబ్లీలో నెగ్గిస్తే, అధికారం చేతులు మారాక హస్తం పార్టీ దానిపై వేటు వేసింది. మళ్ళీ ఎన్టీఆర్ 1995లో మండల న్యాయ పంచాయతీల బిల్లును ఆమోదింపజేసినా, మరుసటి ఏడాదే దాని కథ కంచికి చేరింది. కడపంక్తిలోని చిట్టచివరి వ్యక్తికీ న్యాయం దక్కాలన్న పండిత నెహ్రూ ఆకాంక్షకు అనుగుణంగానంటూ 2007లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం- గ్రామానికో కోర్టు ప్రతిపాదనను ఆమోదించింది. 2008 డిసెంబరులో పార్లమెంటు ఆమోదం పొంది ఆ మరుసటి సంవత్సరం మహాత్మాగాంధీ జయంతినుంచి పట్టాలెక్కిన గ్రామ న్యాయాలయాల చట్టం- న్యాయ పాలనలో అద్భుతాల్ని సాకారం చెయ్యనుందన్న అంచనాలు మోతెక్కిపోయాయి. సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా పనిచేసే న్యాయాలయాలు- 1908 నాటి పౌర స్మృతి, 1872 నాటి భారతీయ సాక్ష్యాధారాల చట్టానికి లోబడనక్కర లేదని, కొన్ని పరిధులకు లోబడి సివిల్, క్రిమినల్ కేసుల్ని ఆర్నెల్ల వ్యవధిలో పరిష్కరించాలని చట్టం నిర్దేశించింది. దాని అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తుందని నాడు ముఖ్యమంత్రిగా సందడి చేసిన వైఎస్, దరిమిలా వాటి అవసరం లేదంటూ నాలుక మడతేయడంతో- ఆ వ్యవస్థ ఇక్కడ పాదుకొనే లేదు. ఇంతకాలానికి ప్రజల వద్దకు న్యాయాన్ని చేర్చే చొరవ ఏ దశలోనూ పట్టాలు తప్పకుండా కాచుకోవడం ఉభయ ప్రభుత్వాల విధి!

దేశవ్యాప్తంగా పెండింగులో ఉన్నవాటిలో 50 లక్షల వ్యాజ్యాలు చిన్నాచితక కేసులేనని, అందులో సగం పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ వెల్లడించారు. పంతాలకుపోయి, పలువు కోసం కోర్టుకెక్కి, పాడిని అమ్ముకోవాల్సిన దురవస్థకు నిదర్శనలే ఆయా కేసులన్నీ! న్యాయపాలికకు 'బైపాస్ సర్జరీ'గా అభివర్ణిస్తున్న న్యాయాలయాల వల్ల ఒనగూడే ప్రయోజనాలపై అప్పటి కేంద్ర మంత్రులు ఎన్ని మాట కచేరీలు చేసినా, కేంద్రం తనవంతుగా ఇస్తామన్న నిధుల వాటాపై చేయి విదిపితే ఒట్టు! కాబట్టే దేశవ్యాప్తంగా 5000 గ్రామ న్యాయాలయాల ఏర్పాటును సంకల్పించినా- ఇప్పటికి 11 రాష్ట్రాల్లో 343 నోటిఫై కాగా, తొమ్మిది రాష్ట్రాల్లో 210 మాత్రమే పని చేస్తున్నాయి. న్యాయాలయాలు ఏర్పాటు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అయినా, కేంద్రం తనవంతుగా ఇచ్చే గ్రాంటు, మూడేళ్లపాటు నిర్దిష్ట మొత్తంలో నిర్వహణ ఖర్చులు- నేటి అవసరాలకు దీటుగా పెరగకపోవడం, పలు ప్రభుత్వాల్ని వెనకంజ వేయిస్తోంది. మొదటి తరగతి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ స్థాయిగల న్యాయాధికారుల్ని హైకోర్టు సలహాతో రాష్ట్ర ప్రభుత్వం నియమించాలని, కక్షిదారుల నడుమ రాజీ కుదర్చడానికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చట్టం చెబుతోంది. మొబైల్ కోర్టు నిర్వహణ, అక్కడే సాక్షుల విచారణ, న్యాయాలయాలు ఇచ్చే తీర్పుపై ఒకే అప్పీలు, వాటినీ ఆర్నెల్లలో పరిష్కరించాలనడం- న్యాయార్థుల నెత్తిన పాలుపోసేవే. న్యాయ పంచాయతీల వైఫల్యాల తాలూకు చీడపీడలు న్యాయాలయాలకు సోకకుండా, అవి గ్రామాల్లో సువ్యవస్థితమైతే- న్యాయ సేవల రంగంలో గుణాత్మక మార్పులు చోటు చేసుకొంటాయి. వివాదాల సత్వర పరిష్కారంతో గ్రామసీమలూ కోలుకొంటాయి!



పీవీ రావు



విద్యుత్ కార్ల రంగంలో వెనకబడిన భారత్‌లో పునర్వినియోగ (రీచార్జబుల్) బ్యాటరీలతో నడిచే వాహనాల శకం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. చమురు ధరలు, కాలుష్యం నానాటికీ పెరిగిపోవడం, బ్యాటరీ సాంకేతికతలో వచ్చిన మార్పుల వల్ల 2008 నుంచి విద్యుత్ కార్ల ఉత్పత్తి ఊపందుకొంటోంది. పన్ను రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలతో విద్యుత్ కార్ల పరిశ్రమకు ప్రభుత్వాలు ఊపునిస్తున్నాయి. అన్ని దేశాలకన్నా గరిష్ఠంగా అమెరికా ప్రతి విద్యుత్ కారుకు 7,500 డాలర్ల పన్ను రాయితీ (క్రెడిట్) ఇస్తోంది. అంటే ప్రభుత్వానికి కట్టాల్సిన పన్ను నుంచి ఈ మొత్తాన్ని తగ్గిస్తారన్నమాట. ఇళ్లలో కాని, బహిరంగ ప్రదేశాల్లో కాని చార్జింగ్ కేంద్రాల ద్వారా విద్యుత్ కార్ల బ్యాటరీలను చార్జింగ్ చేయ

పర్యావరణానికి భేషైన రక్ష

వచ్చు. ఒక్కసారి చార్జింగ్ చేసిన తరవాత ఒక్కో కారు ఎంత దూరం ప్రయాణిస్తుందనేది చాలా ముఖ్యమైన అంశం!

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

ప్రస్తుతం విపణిలో ఉన్న అగ్రశ్రేణి విద్యుత్ కార్లు నిస్సాన్ వారి లీఫ్, టెస్లావారి మాడల్ ఎస్. వీటిలో లీఫ్ ఒక్క చార్జింగ్‌తో 243 కిలోమీటర్లు తిరిగితే మాడల్ ఎస్ 539 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 2018 సెప్టెంబరునాటికి ప్రపంచమంతటా 40 లక్షల విద్యుత్, హైబ్రిడ్ కార్లు తిరుగుతున్నాయి. వాటిలో 65 శాతం (26 లక్షల) కార్లు పూర్తిగా విద్యుత్ కార్లే. నేడు ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడవుతున్న విద్యుత్ కారు నిస్సాన్ లీఫ్. 2018 డిసెంబరునాటికి 3,80,000 లీఫ్ కార్లు రోడ్ల మీద తిరుగుతున్నాయి. 2,63,500 కార్ల అమ్మకాలతో టెస్లా మాడల్ ఎస్ తదుపరి స్థానం ఆక్రమిస్తోంది. సాధారణ కార్లకన్నా విద్యుత్ కార్ల నిర్వహణ, మరమ్మతు ఖర్చులు తక్కువే కాని, వాటి కొనుగోలు ధర మాత్రమే ఎక్కువ. వాటి అరుగుదల, తరుగుదల (డిప్రిసియేషన్) కూడా అధికం. విద్యుత్ కార్ల ధరలో పెద్ద భాగాన్ని బ్యాటరీయే ఆక్రమిస్తుంది. టెస్లా బ్యాటరీ ధర కిలోవాట్ అవర్‌కు 200 డాలర్లుగా లెక్కతేలుతుంది. అమెరికాలో ఒక విద్యుత్ కారు నిర్వహణకు సగటున ఏటా 485 డాలర్లు ఖర్చవుతుందని 2018లో ఒక అధ్యయనం తెలిపింది. అదే సాధారణ కారు నిర్వహణ వ్యయం 1,117 డాలర్లుగా లెక్కతేలుతుంది. తమ లీఫ్ కార్లు అన్నీ మొత్తంగా 100 కోట్ల కిలోమీటర్లు తిరిగాయని 2014 డిసెంబరులో నిస్సాన్ కంపెనీ ప్రకటించింది. దీనివల్ల 18 కోట్ల కిలోగ్రాముల కర్బన ఉద్గారాలు తగ్గిపోయాయి. 2016 డిసెంబరుకల్లా ప్రపంచమంతటా లీఫ్ యజమానులు 300 కోట్ల కిలోమీటర్లు తిరగడాన్నిబట్టి ఉద్గారాలు మరెంత భారీగా తగ్గాయో అర్థం చేసుకోవచ్చు. విద్యుత్ కార్లకు బదులు సాధారణ పెట్రోలు, డీజిల్ కార్లు తిరిగి ఉంటే పైనచెప్పుకొన్న ఉద్గారాలన్నీ వాతావరణంలోకి విడుదలై ఉండేవి. సాధారణ కార్లలో పెట్రోలును దహించగా వచ్చే శక్తిలో 15 శాతమే వాహనాన్ని ముందుకు నెట్టడానికి ఉపయోగపడుతుంది. డీజిల్ ఇంజన్లు 20 శాతం శక్తిని ఇస్తే విద్యుత్ కార్లలోని బ్యాటరీలు 80 నుంచి 90 శాతం శక్తినిస్తూ బండిని ముందుకు నడిపిస్తాయి. లిథియం బ్యాటరీలు అధిక శక్తిని ఇచ్చినా అవి తొందరగా క్షీణిస్తాయి. ఈ సమస్యను అధిగమించడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. ఇళ్లలోనైతే విద్యుత్ కారుకు రాత్రి అంతా చార్జింగ్ చేసుకోవాలి. బయటైతే వేగంగా చార్జింగ్ చేసే కేంద్రాలను ప్రభుత్వమో, ప్రైవేటు సంస్థలో ఏర్పరచాల్సి ఉంటుంది. రాత్రిపూట ఎనిమిది గంటలపాటు 120 ఓల్టుల గృహ చార్జింగ్ వల్ల విద్యుత్ కారు 40 మైళ్లు తిరిగితే, బయట వాణిజ్య కేంద్రాల్లో 240 ఓల్టులతో అదే ఎనిమిది గంటలు చార్జ్ చేస్తే 180 మైళ్లు తిరగొచ్చు. ప్రపంచమంతటా విద్యుత్ కార్లకు ఒకే రకమైన చార్జింగ్ స్టేషన్లు ఉన్నా టెస్లా కార్లకు మాత్రం ప్రత్యేకమైనవాటిని వాడాల్సి ఉంటుంది. కన్వర్టర్‌తో ఈ సమస్యను అధిగమించవచ్చు. కొన్ని కంపెనీలు చార్జింగ్ ఖాళీ అయిన బ్యాటరీలను తీసుకుని పూర్తిగా చార్జి చేసిన బ్యాటరీలను అమర్చుకునే వీలు కల్పించాలని యోచిస్తున్నాయి. ఆ దిశగా ప్రయోగాలు చేస్తున్నాయి. ఇళ్లలో చార్జింగ్ కాస్త నెమ్మదిగా జరిగినా పెద్ద ఇబ్బంది ఉండకపోవచ్చు. రహదారుల మీద, బహిరంగ ప్రదేశాల్లో మాత్రం వేగంగా చార్జింగ్ జరగాలి. లేదంటే కార్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరాల్సి వస్తుంది. కొన్ని కంపెనీలు తమ కార్లకు వేగంగా చార్జ్ అయ్యే బ్యాటరీలను అమర్చుతున్నాయి. ఉదా



విద్యుత్ వాహనాలకు కావాలి ప్రోత్సాహం

హరణకు బీఎమ్‌డబ్ల్యు ఐ3 కారు బ్యాటరీ కేవలం అర గంటలో 80 శాతం చార్జ్ అవుతుంది. టెస్లా కారులోని సూపర్ చార్జర్ 300 మైళ్ల దూరం పయనించడానికి కావలసిన విద్యుత్తును గంటలోనే అందిస్తుంది. ఇక్కడ గమనించాల్సిన అంశం మరొకటి ఉంది. ఇంట్లోనైనా బయటైనా చార్జింగ్ కేంద్రాల నుంచి బ్యాటరీలకు సరఫరా అయ్యే విద్యుత్తు బొగ్గు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల నుంచో, అణు కేంద్రాల నుంచో ఉత్పత్తి అయినదైతే పర్యావరణానికి ప్రయోజనమేదీ ఉండదు. ఈ విద్యుత్కేంద్రాలు కర్బన ఉద్గారాలను విరజిమ్మి భూతాపాన్ని ఎగదోస్తాయి. వీటికి బదులు సౌర, జల విద్యుత్కేంద్రాల నుంచి సరఫరా అయ్యే విద్యుత్తును విద్యుత్ కార్ల చార్జింగ్‌కు ఉపయోగిస్తే కాలుష్యాన్ని నివారించవచ్చు. నేడు ప్రపంచమంతటా 180 నమూనాల విద్యుత్ ప్రయాణికులు, సరకుల రవాణా వాహనాలు అందుబాటులో ఉన్నాయి. రెనో-నిస్సాన్-మిత్సుబిషి సంస్థల కూటమి ప్రపంచంలో అతిపెద్ద విద్యుత్ కార్ల ఉత్పత్తిదారుగా ఆవిర్భవించింది. గతేడాది మధ్యనాళ్లకే ఈ కూటమి ఆరు లక్షల విద్యుత్ కార్లను విక్రయించింది. ఈ కూటమి నుంచి వెలువడిన నిస్సాన్ లీఫ్ కారు 2013, 2014 సంవత్సరాల్లో ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన విద్యుత్ కారు. 2018లో టెస్లా మోడల్ 3 ఆ ఘనతను చేజిక్కించుకుంది. 2015 సెప్టెంబరునాటికి ప్రపంచంలో విద్యుత్ ప్రయాణికుల కార్లు, తేలికపాటి రవాణా వాహనాల విక్రయాలు పది లక్షలకు చేరాయి. హైబ్రిడ్ విద్యుత్ వాహన విక్రయాలకు ఇది రెట్టింపు. అయినా 2018 సెప్టెంబరులో ప్రపంచంలో విక్రయించిన ప్రతి 300 వాహనాల్లో ఒక్కటి మాత్రమే విద్యుత్ వాహనమని గుర్తించాలి.

భారత్ వెనకంజ

ప్రపంచమంతా విద్యుత్ వాహనాలవైపు జోరుగా పయనిస్తుంటే భారతదేశం మాత్రం కాళ్లు ఈడుస్తోంది. ఈ రంగానికి తాజా బడ్జెట్లో కేంద్రం ఊపు ఇస్తుందని ఆశించినవారికి నిరుత్సాహం ఎదురైంది. విద్యుత్ కార్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే ఇతర వాహనాల విస్తరణకు త్వరలో గట్టి వ్యూహం రూపొందిస్తానంటూ ప్రధాని నరేంద్ర మోదీ సరిపెట్టారే తప్ప నిర్దిష్ట చర్యలేమీ ప్రకటించలేదు. 2030కల్లా భారతదేశ రహదారులపై నూటికి నూరు శాతం విద్యుత్ వాహనాలే తిరగాలని లక్షిస్తున్నట్లు 2017లో అప్పటి విద్యుత్ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. కానీ, ఇప్పుడు 30 శాతం మాత్రమే విద్యుత్ వాహనాలై ఉంటాయని ఓ ఉన్నతాధికారి అంటున్నారు. వీటికోసం ప్రత్యేక విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇప్పుడు అలాంటి విధానమేదీ లేదంటున్నారు. 2018 సెప్టెంబరు నీతి ఆయోగ్ సభలో హ్యుండయ్, మహీంద్రా వంటి సంస్థలు విద్యుత్ వాహనాలను పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టడానికి సంబంధించి తమ తమ సొంత వ్యూహాలను ఆవిష్కరించి, ప్రభుత్వం నుంచి సహాయం కోరాయి. స్వదేశీ, విదేశీ పరిశ్రమలు వేగంగా విద్యుత్ వాహనాలకు మారిపోతున్న సమయంలో ఈ రూపాంతరీకరణకు దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పర్యావరణాన్ని కాపాడటానికి కట్టుబడి ఉన్నానని పారిస్ సదస్సులో ప్రకటించిన భారత్, తదనుగుణంగా పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యమిస్తోంది. మారుతున్న పరిస్థితుల్లో ప్రజల అవసరాలూ మారతాయి. అందుకు తగ్గట్లు పరిశ్రమలూ తీరు మార్చుకోవాలి. ఇందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండదండలు ఇవ్వాలి. విద్యుత్ వాహనాల తయారీ, వినియోగాలకు అనువైన వాతావరణం కల్పించాలి. అందుకు పకడ్బందీ విధానాన్ని రూపొందించి అమలు చేయాలి. ఆ విధానంలో ప్రకటించే లక్ష్యాలను అందుకొనేలా పరిశ్రమలకు తగిన వసతులు కల్పించాలి. నేడు భారతదేశం ప్రపంచంలో ఆటోమొబైల్స్‌కు నాలుగో అతిపెద్ద విపణిగా నిలుస్తోంది. ద్విచక్ర వాహనాలకు ఇదే అన్నింటికన్నా పెద్ద విపణి. ఒక్క 2017లోనే భారత్‌లో 2.45 కోట్ల సాధారణ ఆటోమొబైల్ వాహనాలు విక్రయమయ్యాయి. 2030కల్లా విక్రయాల సంఖ్య 8.45 కోట్లకు చేరుతుందని నీతి ఆయోగ్ లెక్కకట్టింది. మరోవైపు నిరుడు అమ్ముడైన బ్యాటరీ విద్యుత్ కార్ల సంఖ్య 2000 మాత్రమేనని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) తెలిపింది. 2030కల్లా రోడ్లపై తిరిగే వాహనాల్లో 30 శాతం విద్యుత్ వాహనాలే ఉండాలన్న నీతి ఆయోగ్ లక్ష్యం నెరవేరాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణం మేల్కోవాలి. దేశంలో వెలువడుతున్న కర్బన ఉద్గారాల్లో 25 శాతం రవాణా రంగం నుంచే వస్తున్నాయి. ఇకనైనా విద్యుత్ వాహనాలకు మారకపోతే కాలుష్యం కట్టలు తెంచుకొంటుంది. వినియోగదారులు ఈ వాహనాల్లో తిరగడానికి సుముఖంగానే ఉన్నా తగిన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలను అందించి వారిని కొనుగోలుదారులుగా మార్చడానికి ప్రభుత్వం నడుం బిగించాలి!

(రచయిత- ఆర్థిక, సామాజిక విశ్లేషకులు)

అమ్మకాలకు ఊపు వచ్చేదిలా...

నిరుడు నవంబరుకల్లా ప్రపంచంలోని మొత్తం విద్యుత్ కార్ల సంఖ్య 26 లక్షలని నావిగాంట్ రిసెర్చ్ సంస్థ అంచనా కట్టింది. వీటి అమ్మకాలను మరింత పెంచడానికి అనేక దేశాలు గ్రాంట్లను, పన్ను క్రెడిట్లనూ ఇస్తున్నాయి. అమెరికా 7,500 డాలర్ల పన్ను క్రెడిట్ ఇస్తుంటే, బ్రిటన్ 5,929 డాలర్ల వరకు గ్రాంటు ఇస్తోంది. విద్యుత్ కార్లు, బ్యాటరీలకు మరింత ఆధునిక సాంకేతికతల అభివృద్ధికి అమెరికా ప్రభుత్వం 240 కోట్ల డాలర్ల గ్రాంట్లను ప్రకటించింది. ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాలు కూడా కొత్త విద్యుత్ కార్ల అమ్మకాలను ప్రోత్సహించడానికి పన్ను మినహాయింపులు, తగ్గింపులు ఇస్తున్నాయి. విద్యుత్, హైబ్రిడ్ వాహనాల కొనుగోలుదారులకు బోనస్ ప్రకటిస్తున్నాయి.

మాటల తూటాల మరాఠీ

'గడ్కరీ... గడుసరి' అంటూ దేశ రాజకీయ రంగస్థలం మీద సరికొత్త రాగాలు వినిపిస్తున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు అమిత్ షాలతోపాటు భాజపా నాయకుల్లో వినిపిస్తున్న మూడో స్వరం గడ్కరిది! అది స్వరమా, భాస్వరమా అని కూడా అనొచ్చు! కుటుంబాన్ని నడపలేనివాడు దేశాన్ని ఏం నడుపుతాడన్నది తాజాగా సంధించిన మాటల తూటా!

'అభివృద్ధి రాజకీయాలు' అని ఆయన పదే పదే చెబుతుంటారు. అసలు 'గడ్కరీ అభివృద్ధి' ఎలా ఉంటుందనేదీ ఇప్పుడు చర్చనీయాంశమైంది. తాను మంత్రిగా ఉన్న అధికార పక్షాన్ని, ఆ పార్టీ అధినేతను ఇరుకునపెట్టేలా ఆయన మాట్లాడుతుంటే అందరి చర్చల్లో ఆయన 'కేంద్ర'బిందువు అవుతున్నారు. అటువంటి మాటలు విన్నప్పుడు అధికార పక్షం, ప్రభుత్వాల్లోని వీరవిధేయులు ఆయన్ను 'మాటల మరాఠీ'గా చిత్రించి, మెటికలు విరుస్తుంటే, రాహుల్‌గాంధీ లాంటి ప్రతి'కక్ష' నాయకులు 'అవును నిజం అవును నిజం... నీవన్నది నిజం నిజం' అంటూ ఆయన్ను వెనకేసుకు వస్తున్నారు. ముందుకు లాగాలని చూస్తున్నారు.

రాష్ట్రీయ సేవక్‌సంఘ్ 'కండదండలు' పుష్కలంగా ఉన్న గడ్కరీ ఏం మాట్లాడినా అవి అతివేగంగా రాజుకుంటున్నాయి. వివాదాల్లో ఆయన ఇరుక్కుంటున్నారు. అయినా వివాదం లేకపోతే రాజకీయాల్లో విషయం ఏముంటుంది, విజయం ఎలా సాధ్యమవుతుంది? అనూహ్య రాజకీయాల్లో ఇది సాధారణమైన 'అసాధారణ' విషయం!

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మాటల్లో అప్పుడప్పుడు మంటలు కనిపిస్తుంటాయి. ఆ తరవాత వాటిని ఆర్పడానికి ఈ 'మాటల మరాఠీ' తానే ప్రయత్నించినా ఆరిపోవు. 'ఓటమికి అధినాయకులు బాధ్యత వహించాలి' అన్న ఆయన మాటల్లోని ఆంతర్యాన్ని పసికట్టడానికి రకరకాల 'పరి'శోధనలు జరిగాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి భాజపా అధ్యక్షుడు అమిత్‌షా బాధ్యత వహించాలన్నదే ఆయన ఉద్దేశమన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. తన వ్యాఖ్యను వక్రీకరించారని గడ్కరీ అన్నా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు.

విజయాలను ఎవరైనా తమ ఖాతాలో వేసుకుంటారని, పరాజయానికి బాధ్యత తీసుకోరని గడ్కరీ అంటుంటే, ఆ మాటలు ఎవరికి గురిపెట్టినట్లని ఆయన సొంత పార్టీవాళ్లను నిలదీస్తుంటారు. ప్రత్యక్ష ఎన్నికల్లో నిలబడి, కలబడి గెలిస్తేగా ఆ కష్టసుఖాలు తెలియడానికి అనీ వారు వేలెత్తి చూపుతున్నారు. 2014 ఎన్నికల్లో గెలుపు కోసం పెద్దపెద్ద తప్పుడు హామీలను భాజపా ఇచ్చిందన్న గడ్కరీ వ్యాఖ్యలను వారు గుర్తుచేస్తున్నారు. అధికార పక్షంలో ఉన్నవాళ్లు అనాల్సిన మాటలేనా ఇవి అన్నది వాళ్ల ప్రశ్న! ఇది ఆ పార్టీలోనే కాదు... అన్ని పార్టీల్లోనూ అప్పటి రాజకీయాల్లో ప్రశ్నార్థకమైంది.

'ఎవరు ఏ పార్టీలోనైనా ఉండవచ్చు, ఏమైనా మాట్లాడవచ్చు' అన్నది తాజా రాజకీయం. 'ఏ పార్టీ' అని వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకు, పలుగాకులకు' అంటూ రాజకీయ నాయకుల అంతరాత్మ ఘోషిస్తోంది. సత్యం చెప్పాలి... ప్రియమైనది చెప్పాలి కానీ ఎదుటివారికి అప్రియమైన సత్యం చెప్పకూడదంటారు. కానీ అధికార పక్షంలో ఉంటూ ప్రతిపక్షానికి ప్రియమైన మాటలు



మాట్లాడటం, ప్రతిపక్షంలో ఉండి అధికార పక్షానికి అనుకూలంగా స్పందించడం ఈ రోజుల్లో ఎవరికీ ఆశ్చర్యం కలిగించడం లేదు.

'నితిన్ గడ్కరీ సత్యమే మాట్లాడారు. తప్పేముంది? యథార్థవాదీ పార్టీ విరోధి' అని అనుచరులు సమర్థిస్తున్నారు. 'మాట కఠినమనిపించును... లోన వెన్న కనిపించును' అనీ చెబుతున్నారు. ఏ మాటకామాటే చెప్పాలంటే- ఇలాంటి మాటలవల్ల బోలెడంత రాజకీయ ప్రయోజనం ఉంటుంది. టికెట్ దక్కిన కారణంగా సొంతపార్టీవాళ్లు ఓటేసుకుంటారు... మాటల వల్ల ఇతర పార్టీలవాళ్లు 'వాటేసుకుంటారు' అంతకన్నా కావల్సిందేముంటుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నవాళ్లూ ఉన్నారు. అలాంటప్పుడు ఇలాంటివాళ్లకు సొంత పార్టీవాళ్లు గెలిచినా, ఓడినా పన్నీరే. గెలిస్తే 'నేనప్పుడు చెప్పబట్టి సరిదిద్దుకున్నారు. అందువల్ల గెలిచాం' అనవచ్చు. ఓడిపోతే 'నేను అప్పుడే చెప్పాగా' అనవచ్చు. కత్తికి రెండు వైపులా పదును ఉంటుంది. అదను చూసుకుని దేనినైనా ఉపయోగించుకోవచ్చు.

ఏం నిమిషానికి గడ్కరీ ఏం మాట్లాడతారోననే భయం భాజపా వాళ్లకూ ఉంది. నౌకాదళ అధికారులు అందరూ విలాసవంతమైన దక్షిణ ముంబయిలోనే ఎందుకు నివాసం ఉండాలనుకుంటారు? వాళ్లు ఉండటానికి క్వార్టర్స్ గాని, ఫ్లాట్లుగాని కట్టడానికి ఆ ప్రాంతంలో ఒక్క అంగుళం భూమి అయినా ఇచ్చేది లేదని నితిన్ గడ్కరీ కరాఖండిగా చెప్పారు. 'రహదారులకు రారాజు అయిన మంత్రే అలా అంటే మాకేది దారి' అని నౌకాదళాధికారులు వాపోయారు.

ఎప్పుడూ విమర్శల బాణాలు సంధించే గడ్కరీ, తాను ఎప్పుడూ విమర్శలపాలు కాకుండా ఉండటానికి 'శీఘ్రమే అభివృద్ధి రస్తు' అనుకుంటుంటారు. అభివృద్ధిలో తేడా వస్తే వీరభద్రావతారమెత్తుతాడు. 1995-99లో అధికారంలో ఉన్న శివసేన-భాజపా ప్రభుత్వంలో ప్రజాపనుల శాఖామంత్రిగా పని చేసినప్పటినుంచీ ఆయన వరస అదే. ముంబయిలో 55 పైవంతెనలు నిర్మించి 'ఫ్లై ఓవర్‌మ్యాన్' అనే బిరుదును జనం నుంచి సంపాదించుకున్నారు. అంతెందుకు? ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్ వే ను కేవలం రెండేళ్లలో నిర్మించి- ఆహా ఓహో అనిపించుకున్నారు.

ఏ ఎన్నికల్లో ఎవరైనా గడ్కరీ మీద గెలవగలరేమోగాని, వింత వ్యాఖ్యల్లో ఆయన మీద గెలిచేవాళ్లు కాదు కదా... కనీసం దరిదాపుల్లో ఉండేవాళ్లు కూడా దొరకరు. ఆయన మాటలు వింటుంటే 'సాహసం శాయరా డింభకా' అన్న పాతాళ భైరవి సినిమా మాటలు గుర్తొస్తాయి. 'ఇది రామభక్తుల ప్రభుత్వం' అని గతంలో అన్నారు. అదే నోటితో ఆరాధ్య దేవుడైన శ్రీరామచంద్రుడిది, ఉగ్రవాది దావూద్ ఇబ్రహీమ్‌ది మేధ స్థాయి(ఐక్యూ లెవెల్) ఒకటేనని, ఎటొచ్చీ శ్రీరాముడు దాన్ని జాతినిర్మాణానికి ఉపయోగిస్తే, దావూద్ ఇబ్రహీం నేర ప్రపంచ నిర్మాణానికి ఉపయోగిస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఆయన అలాగే మాట్లాడతారు... మేం దానికి అలవాటైపోయాం అని భాజపావాళ్లు అంటుంటారు.

హోరెత్తే సముద్రం లాంటి గడ్కరీ నోటినుంచి ఇటువంటి ఎన్ని 'అలలు' వస్తాయో చూడాల్సిందే. ఊహించలేం!

– శంకరనారాయణ

ఈనాడు లేఖలు

సానుకూల దృక్పథం పెంచాలి

ఆత్మహత్యలు ఓ సామాజిక సమస్యగా జడలు విప్పుకొంటోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు అనేక మంది చిన్న విషయాలకే ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. కుటుంబ సభ్యులను తీరని వేదనకు గురిచేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటితరంలో సమస్యలను సానుకూలంగా అర్థం చేసుకుని సమర్థంగా ఎదుర్కొనే అవగాహన లోపిస్తోంది. మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో వస్తున్న పెడపోకడలే ఇందుకు కారణమని చెప్పాలి. అందరితో కలిసిమెలిసి ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం చదువుల లక్ష్యాలతో సతమతమైపోతోంది. ఓటమిని హుందాగా స్వీకరించి, ఆత్మశోధన చేసుకుని ప్రతిభకు సానపట్టుకునే అవకాశం బాల్యం నుంచే లోపిస్తోంది. పిల్లలను ఒత్తిళ్ల నుంచి బయటపడేసి బాల్యం ఆహ్లాదకరంగా సాగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఈ జాడ్యాన్ని నివారించడానికి పాలకులు, సామాజికవేత్తలు విస్తృతంగా చర్చలు జరిపి నివారణోపాయాలు కనుగొనాలి.

- అలువాల సురేశ్, అంబేడ్కర్ నగర్, హైదరాబాద్

బ్యాంకు పింఛనుదారులకు అన్యాయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతన సవరణ చేస్తుంటాయి. ఆ సందర్భంగా ఉద్యోగులతోపాటు పింఛనుదారులకూ మూలవేతనాన్ని మారుస్తుంటాయి. బ్యాంకుల రంగానికి వచ్చేసరికి ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నప్పుడు మూల వేతనాన్ని ఉద్యోగులకు మాత్రమే వర్తింపజేస్తున్నారు. పింఛనుదారులను విస్మరిస్తున్నారు. దీంతో పదవీ విరమణ సమయంలో ఎంత బేసిక్‌ను నిర్ధారిస్తున్నారో అది ఎప్పటికీ మారడం లేదు. పదిహేనేళ్ల క్రితం పదవీ విరమణ చేసిన బ్రాంచ్ మేనేజర్ పింఛను, ఇటీవల రిటైరైన తక్కువ హోదాగల సిబ్బందికన్నా తక్కువగా ఉంటోంది. అయిదేళ్లకు ఒకసారి జరిగే ద్వైపాక్షిక ఒప్పందంలోని అంశాలను పింఛనుదారులకూ వర్తింపజేయాలి. గుర్తింపు పొందిన బ్యాంకు ఉద్యోగ సంఘాలు కేంద్రంలోని ఆర్థిక శాఖపై ఒత్తిడి తీసుకురావాలి.


- చామర్తి వెంకట రామకృష్ణ, హైదరాబాద్

యౌవనం

యౌవనం కొత్త వస్త్రం వంటిది. బాల్య, యౌవన, గార్హస్థ్య, వార్ధక్య దశలు మానవ జీవితంలో భాగాలు. ఇతర ప్రాణికోటికి ఈ దశల పరిణామ స్పృహ, స్ఫురణ ఉండవు. మనసు గల మనిషి ఈ మార్పు చెందే అవస్థలను క్షుణ్నంగా ఎరుకతో అనుభవించి, ఆనందించాల్సి ఉంటుంది.

ఆడుతూ పాడుతూ బాల్యం గడుస్తుంది. యౌవనం మానవ జీవితంలో ఉత్తేజకరమైన, ఉద్వేగ భరితమైన దశ. ఆ దశలో శరీర ఆకృతి, రూపం, ఆరోగ్యం సుభిక్షంగా ఉంటాయి. యౌవనం అందాలను, ఆనందాలను ప్రసాదిస్తుంది. కోటి ఆశలకు వేదికవుతుంది. ఆ దశ ఆనందం కోసం మనిషిని తహ తహలాడిస్తుంది. ఆ దశలో అతడు/ఆమె పెళ్లి చేసుకొని గృహస్థ జీవితానికి నాంది ప్రస్తావన చేస్తారు. కాలం, అడుగులో అడుగు వేసుకుంటూ నడిచే లయబద్ధమైన నడకలా, అవిశ్రాంతంగా సాగుతూనే ఉంటుంది. క్షణాలు సంవత్సరాలుగా, దశాబ్దాలుగా మార్పు చెందుతూ ఉంటే మనిషికి తాను క్రమంగా పెద్దవాడినైపోతున్నానన్న స్పృహ కలిగి వింత భయం ఆవహిస్తుంది. శారీరకంగా సంప్రాప్తించే మార్పులు స్త్రీ పురుషులను ఉద్విగ్నభరితం చేసి కుంగదీస్తాయి. ముసలివారు అవుతున్నది వాస్తవమే అయినప్పటికీ ఆ నిజాన్ని జీర్ణించుకోలేక, సత్యాన్ని ఒప్పుకోలేక మనిషి మానసికంగా, శారీరకంగా సతమతమవుతాడు. కుంగిపోతాడు. దుర్బలుడవుతాడు.

యౌవనంలో గాడిద సైతం అందంగానే ఉంటుందని నానుడి! ఏ ప్రాణి అయినా, ముఖ్యంగా మనిషి విషయం చెప్పుకోవలసి వస్తే యువతీ యువకులు ఆ దశలో వారి పూర్తి సామర్థ్యం మేరకు అంగ సౌష్టవం కలిగి ఉంటారన్నది కాదనలేని నిజం. యౌవనం నూతన వస్త్రం లాంటిది. తళతళలు, మెరుపులు దాని సొంతం. చూసే కళ్లను జిగేల్మనిపిస్తుంది. ఆ సమయంలోనే బాగు పడటానికి గాని, నైతికంగా పతనం చెందడానికి గాని అవకాశాలు మెండు. కొందరు నైతిక పతనం చెందేది ఆ దశలోనే!



అంతర్వాణి

చెడు స్నేహాలు పతనానికి దోహదం దారితీస్తాయి. స్నేహితులను చూసి మనిషి అలవాట్లు, ఆహార విహారాలు మార్చుకుంటాడు. స్నేహం మంచిదైతే బతుకు మంచిదే అవుతుంది. జీవితం పండుతుంది. లేదా మొగ్గగా ఎండి, పిందె కాకుండానే రాలిపోతుంది. చెడు స్నేహాలకు బతుకు బలైతే జీవితం వ్యర్థమవుతుంది. జీవిత సత్యాలను మనిషి చరమాంకంలో నేర్చుకొన్నా ప్రయోజనం ఉండదు. సరైన చికిత్స అందక ప్రాణాంతక రోగం వల్ల మరణించిన తరవాత, ఓ అద్భుతమైన మందును శాస్త్రజ్ఞులు ఆవిష్కరించి విపణిలోకి తెచ్చినా రోగికి ప్రయోజనం సిద్ధించదు. అలాగే జీవిత సత్యాల అవగాహన ముదిమి వయసులో లాభించదు. విజ్ఞత ఉన్న మనిషి నైతికంగా తాను మంచి స్థితిలో ఉండేందుకు ఎల్లవేళలా ప్రయత్న లోపం లేకుండా కృషి చేయాలి.

మనిషి తాను భవిష్యత్తులో ఏ ఎత్తులకు ఎదుగుతాడో, లేక ఏ లోతులకు జారుతాడో నిర్ణయించే కాలం, కొలమానం యౌవన, యౌవనాత్ పూర్వ దశ అని గ్రహించాలి! కొందరు 'టీన్స్' అని పిలుచుకొనే పదమూడు- పందొమ్మిది ఏళ్ల వయసులో చదువు పట్ల సుముఖత చూపలేక వయసులో పెరిగి జీవితంలో అస్థిరులై నిర్వీర్యులవుతారు. అప్పుడు జీవితాన్ని కోల్పోవడం తప్ప ఏ లాభం ఉండదు. సరైన సమయంలో సరైన పని చేయకపోతే పశ్చాత్తాపం తప్ప మరో దరి-దారి; దశ-దిశా ఉండవు. కొత్త వస్త్రంలా మెరిసిపోయే యౌవనంలో మాదిరిగానే, వయసు మీరినా కొందరు యోగ్యులు కాంతులీనే ధ్రువతారలుగా కనిపిస్తారు. మనం చూసే, వినే మహాత్ములు, విజేతలు ఆ కోవకు చెందినవారే! అలాంటివారి జీవితాలనుంచి మనం ఎంతో నేర్చుకోనవలసి ఉంది. స్ఫూర్తి పొంది అయోగ్యత నుంచి విముక్తులమై జీవితాన్ని సరిగమల పొందికతో జీవించాల్సిన అవసరమూ ఉంది. ఎల్లవేళలా మేలుకొలుపుతో మనుగడ సాగించాల్సిన అవసరం, అగత్యం ప్రతి మానవుడిది. ఆ దిశగా ప్రస్థానం మన జీవితాలను తప్పక ఫలవంతం చేస్తుంది!

– గోపాలుని రఘుపతిరావు

జూన్‌లోగా కాళేశ్వరం కాలువలు సిద్ధం

- ఆయకట్టుకు విడుదలచేసే నీరు సద్వినియోగం చేసుకొనేలా చర్యలు
- సమన్వయంతో అవరోధాలను అధిగమించేద్దాం
- ప్రాజెక్టు పరిధిలోని ప్రజాప్రతినిధులు, ఇంజినీర్ల భేటీ
- భూసేకరణ సమస్యల పరిష్కారానికి నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్. పక్కన ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇ.ఎన్.సి మురళీధర్, ఎంపీ వినోద్‌కుమార్ తదితరులు

ఈనాడు - హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా మళ్లించే నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడానికి అవసరమైన కాలువల పనులను జూన్‌లోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ఈ ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత ఇంజినీర్లు సమన్వయంతో వ్యవహరిస్తారని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా మళ్లించే నీటితో కాళేశ్వరం కింద పూర్తయిన కాలువల పరిధిలో కొంత ఆయకట్టుకు ఇచ్చే ప్రయత్నం చేయడంతో పాటు శ్రీరామసాగర్ మొదటి దశ, రెండోదశ, వరదకాలువ కింద ఆయకట్టుకు నీరివ్వడం, కాలువల పనులు పూర్తి కాని చోట చెరువులు నింపి సద్వినియోగం చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఇందులో భాగంగా ఈ ప్రాజెక్టుల పరిధిలోని ప్రజాప్రతినిధులు, ఇంజినీర్ల సమావేశం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సోలిపేట రామలింగారెడ్డి, రసమయి బాలకిషన్, వొడితెల సతీష్, సుంకె రవిశంకర్, నన్నపనేని నరేందర్, ఆరూరి రమేష్, సీతక్క, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు హరిరాం, అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు.

- పనులు పూర్తి చేయడానికి వచ్చే ఐదు నెలలు కీలకం. ఈ సమయంలో పనులు పూర్తి చేయడానికి ఎమ్మెల్యేలు, ఇంజినీర్లు సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు.
- భూసేకరణ సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.
- వరద కాలువ కింద లక్ష ఎకరాల వరకు నీరిచ్చేలా కాలువల పనులు పూర్తి చేయడం, కాళేశ్వరం కింద కాలువల పనులు చేపట్టిన చోట అవి పూర్తి చేయడం, పూర్తికాని చోట చెరువులు నింపడం, ఎల్ఎండీ కింద శ్రీరామసాగర్ మొదటి, రెండో దశ ఆయకట్టుకు నీటి సరఫరా గురించి వివరంగా చర్చించారు.
- శ్రీరామసాగర్ కింద 14 లక్షల ఎకరాలుంటే ఆరు లక్షల ఎకరాలకు మాత్రమే ఇవ్వగలిగారని, తెరాస ప్రభుత్వం కొత్త ఆయకట్టుతో పాటు ఉన్న ప్రాజెక్టుల కింద కూడా సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకొందని, ఎస్సారెస్పీ కాలువల సామర్థ్యం మూడువేల క్యూసెక్కుల నుంచి ఆరువేల క్యూసెక్కులకు పెంచామని సమావేశం అనంతరం నీటిపారుదల శాఖ పేర్కొంది.
- చెరువులను, కుంటలను అధికారికంగానే నింపుతామని, ఎకరం కూడా ఎండిపోనివ్వమని, మిడ్‌మానేరు నుంచి గౌరవెల్లి రిజర్వాయర్ వరకు పనులకు భూసేకరణ సమస్యలను అధిగమించి వీలైనంత త్వరగా పూర్తిగా చేయాలని నిర్ణయించారు.
- పోచంపాడు నుంచి ఖమ్మం వరకు 14 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు ఎత్తైన ప్రాంతాలకు లిఫ్టుల ద్వారా నీరందించే పనులు వేగవంతం చేస్తారు. ఫిబ్రవరి 10 నుంచి దిగువమానేరు కింద పంటలకు ఒక తడి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.
- ఎస్సారెస్పీ కాలువల సామర్థ్యాన్ని మూడువేల నుంచి ఆరువేల క్యూసెక్కులకు పెంచి నీటిని వదిలి పరీక్షించామని, ఎండాకాలంలో రైతులకు నీళ్లిచ్చేందుకు కృషి చేస్తున్నామని మాజీ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కొన్ని చోట్ల భూసేకరణ సమస్య ఉన్నా అధిగమిస్తామని, వేగంగా పనులు జరిగేలా చూసేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని చెప్పారు.

కన్నెపల్లి పంపుహౌజ్‌కు ప్రహరీ

రూ.4.65 కోట్లతో 4.80 కిలోమీటర్ల మేర నిర్మాణం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాణాధారమైన కన్నెపల్లి పంపుహౌజ్ చుట్టూ రక్షణగా ప్రహరీ నిర్మించనున్నారు. రూ.4.65 కోట్ల అంచనా వ్యయంతో 4.80 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. 2.4 మీటర్ల ఎత్తు, 0.23*0.23 మీటర్ల వెడల్పుతో దీని నిర్మాణం చేపట్టనున్నారు. పంప్‌హౌజ్ లోపలికి వెళ్లేందుకు అక్కడక్కడ ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రహరీ నిర్మాణం పూర్తయ్యాక భవిష్యత్తులో మరింత ఎత్తు పెంచేందుకు వీలుగా ఇనుప తీగలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారని సంస్థ ప్రతినిధులు, అధికారుల ద్వారా తెలిసింది. పంపుహౌజ్ పనులను మరో ఐదు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

జీఎస్టీ ఎగవేసిన సినీ నిర్మాణ సంస్థ

రూ.7.26 కోట్లు రాబట్టిన అధికారులు

ఈనాడు, హైదరాబాద్: ఓ సినీ నిర్మాణ సంస్థ జీఎస్టీ చెల్లించకుండా ఎగవేతకు పాల్పడిందని రంగారెడ్డి సీజీఎస్టీ కమిషనర్ ఎ.ఆర్.ఎస్.కుమార్ వెల్లడించారు. పరిశోధన సాగించి రూ.7.26 కోట్ల మేరకు పన్ను రాబట్టామని బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ సంస్థ జీఎస్టీని వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించలేదని.. రంగారెడ్డి జీఎస్టీ కమిషనరేట్‌లోని ప్రత్యేక అధికారుల బృందం గుర్తించింది. జీఎస్టీ రిటర్న్‌లు దాఖలు చేయలేదని గ్రహించింది. అదే సంస్థ సినిమాలు నిర్మించడంతో పాటు డిస్ట్రిబ్యూషన్ ప్రారంభించిందని కూడా తెలుసుకున్నారు. నిరుడు జులై నుంచి జీఎస్టీని చెల్లించనట్లు తేలడంతో, గత జనవరి 31న సమన్లు జారీచేశారు. విదేశాలకు చెందిన సాంకేతిక నిపుణులను వినియోగించినట్లు గమనించారు. ప్రాథమికంగా రూ.7.40 కోట్ల మేరకు జీఎస్టీ చెల్లించాల్సి ఉన్నట్లు సంస్థ సైతం అంగీకరించిందన్నారు. ఇదే నేపథ్యంలో రూ.7.26 కోట్ల వరకు పన్ను చెల్లించారన్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందని, జీఎస్టీ పూర్తి బకాయిలను అంచనా వేస్తున్నామని కుమార్ పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి మారుపేరు మల్లపురాజుపల్లి

- ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగని గ్రామంగా గుర్తింపు

నాంపల్లి, న్యూస్‌టుడే: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి మల్లపురాజుపల్లి మారుపేరుగా నిలిచింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామస్థులు ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామంలో పోటీ ఉన్నప్పటికీ గ్రామస్థులంతా ఏకతాటిపై నిలిచి విశ్రాంత ఉపాధ్యాయుడు మునగాల సుధాకర్‌రెడ్డిని సర్పంచిగా నామినేషన్ వేయించడంతోపాటు ఖర్చుల కోసం సహాయమందించి అధిక మెజార్టీతో గెలిపించారు. గ్రామంలో 1,118 మంది ఓటర్లు ఉండగా 978 ఓట్లు పోలయ్యాయి. 880 ఓట్లు సుధాకర్‌రెడ్డికి వచ్చాయి. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రంగనాథ్ బుధవారం గ్రామంలో ప్రజా అభినందన సభను ఏర్పాటు చేసి సర్పంచి సుధాకర్‌రెడ్డితోపాటు ఉపసర్పంచి గోగు శ్రీనివాస్, వార్డు సభ్యులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లందరికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచి పదవిని కిరీటంగా భావించడం లేదన్నారు. దేశనాయకుల స్ఫూర్తితో డబ్బులు పంచకుండా ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్న తనకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించారని చెప్పారు. ఈ ఎన్నికల్లో రూ.2 వేలు నామినేషన్ దాఖలుకు, రూ.3 వేలు కరపత్రాలకు ఖర్చు చేశానని తెలిపారు. ఎన్నికల ఖర్చులకు వృద్ధాప్య పింఛన్‌దారులు సైతం ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వడం తనను కలిచివేసిందని, చందాల రూపంలో వచ్చిన రూ.1.7 లక్షల నిధులను గ్రామాభివృద్ధికే వినియోగిస్తానని సర్పంచి సుధాకర్‌రెడ్డి చెప్పారు.



మల్లపురాజుపల్లి సర్పంచి సుధాకర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా ఎస్పీ ఏ.వి.రంగనాథ్

రాష్ట్రానికి వచ్చేది రూ.700 కోట్లే?

- పీఎం-కిసాన్ అర్హుల గుర్తింపునకు మార్గదర్శకాలు జారీ

ఈనాడు, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం-కిసాన్) పథకం కింద అర్హులైన రైతులను గుర్తించేందుకు కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. ఐదెకరాల లోపు భూమి ఉన్నవారందరినీ కాకుండా నిజమైన రైతులనే గుర్తించాలని రాష్ట్రాలకు సూచించింది. ఈ జాబితాలో ఎవరెవరిని తొలగించాలనే అంశాలను స్పష్టం చేసింది. ఈ నెల 25కల్లా అర్హుల వివరాలను పీఎం కిసాన్ పోర్టల్‌లో నమోదు చేస్తే ఆ మరుసటి రోజు నుంచే రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ అవుతాయని రాష్ట్ర వ్యవసాయశాఖకు తెలిపింది. అర్హులందరినీ గుర్తించే వరకు ఆగకుండా ఎప్పటికప్పుడు సేకరించిన వారి వివరాలు నమోదు చేయాలని సూచించింది. మార్చి నెలాఖరులోగా అర్హులైన ప్రతీ రైతు ఖాతాలో తొలి విడత రూ.2 వేలు జమ చేయనున్నారు. బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన రోజున రాష్ట్ర వ్యవసాయశాఖ లెక్కకట్టిన ప్రకారం రాష్ట్రానికి దాదాపు మూడు వేల కోట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ తాజా మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రానికి రూ.700 కోట్లు రావచ్చని తెలుస్తోంది.

ఈ పథకానికి అర్హులు కానివారు వీరే..

- సంస్థల పేరుతో భూములున్నవారు
- రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఈ పదవుల్లో పని చేసి విరమణ చేసినవారు.
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు. ఈ పదవుల్లో గతంలో పనిచేసినవారు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, స్వయం ప్రతిపత్తి, స్థానిక సంస్థల ఉద్యోగులు, ఈ ఉద్యోగాల్లో పనిచేసి పదవీ విరమణ చేసినవారు. వీరిలో గ్రూప్ డి లేదా 4 వ తరగతి ఉద్యోగులు మాత్రం అర్హులవుతారు.
- విశ్రాంత ఉద్యోగుల్లో నెలకు రూ.10 వేలకు పైగా పింఛన్ అందుకుంటున్నవారు.
- ఏటా ఆదాయపు పన్ను చెల్లించేవారు.
- వైద్యులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టు తదితర నమోదైన వృత్తి నిపుణులు.
- ఈ జాబితాలో తాము లేమని ప్రతి రైతు నుంచి ధ్రువీకరణపత్రం తీసుకోవాలి. కుటుంబ పెద్ద భూమి ఉన్న గ్రామంలో ఉండకపోతే కుటుంబసభ్యుల్లో ఎవరైనా పెద్దవారు ఈ పత్రం ఇవ్వాలి. తప్పుడు పత్రం ఇస్తే క్రిమినల్ కేసుపెట్టి డబ్బు వసూలు చేస్తారు.
- ఈ జాబితాలో లేకున్నా తమ పేరు నమోదు చేయలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే అలాంటి ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలి. జాతీయ కమిటీకి కేబినెట్ కార్యదర్శి అధ్యక్షుడుగా ఉంటారు. రైతు ఫిర్యాదు చేసిన తేదీ నుంచి 2 వారాల్లోగా పరిష్కరించాలి.

ఉమ్మడి కుటుంబానికి..

- ఒక కుటుంబంలో తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలకు కలిపి 2 హెక్టార్లలోపు ఉండాలి. వీరిలో ఎవరి పేరుతో ఎక్కువ విస్తీర్ణం ఉంటే వారి బ్యాంకు ఖాతాలోనే రూ.రెండు వేలు తొలి విడతలో జమ అవుతాయి. ఒకవేళ ఇద్దరు నుంచి నలుగురు సభ్యుల పేరిట సమానంగా భూమి ఉంటే వయసులో పెద్దవారి ఖాతాలో వేస్తారు.
- రైతు పేరుతో కాకుండా సామూహిక సంఘం పేరుతో భూములుంటే వీటికి ఎలా ఇవ్వాలనేదానిపై కమిటీ నిర్ణయిస్తుంది.
- ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా తీసుకుని దాన్ని ఆధార్ పోర్టల్‌లో తనిఖీ చేయాలి. దాని ఆధారంగా అనర్హులను గుర్తించాలి.
- ఈ పథకం అమలుకు కేంద్ర వ్యవసాయశాఖలో 'ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేస్తారు. ఇలాగే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేయాలి. ఈ పథకం కింద ఒక రాష్ట్రానికి వచ్చే సొమ్ములో 0.25 శాతాన్ని ఈ కమిటీ పాలనా ఖర్చులకు కేంద్రం ఇస్తుంది. పథకం అమలుపై పెద్దయెత్తున ప్రచారం చేయాలి.
- దేశంలో అన్ని ప్రాంతాల లబ్ధిదారుల వివరాలు 'పీఎం-కిసాన్' పోర్టల్‌లో కనిపిస్తాయి. ఎవరికి ఎంత సొమ్ము ఎప్పుడు జమయిందో ఇందులో చూడవచ్చు.
- సొమ్ము జమయిన తరవాత రైతు సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సందేశం పంపుతారు.

భారీగా తగ్గనున్న లబ్ధిదారులు

భూముల యజమానుల్లో అనర్హులను గుర్తించి, ప్రతి రైతు నుంచి ధ్రువపత్రం తీసుకోవడానికి ఇంటింటి సర్వే చేయాలని తెలంగాణ వ్యవసాయశాఖ నిర్ణయించింది. మూడు వారాల్లోగా సర్వే పూర్తిచేసి అర్హుల జాబితాను గ్రామాల వారీగా ప్రకటిస్తారు. తొలుత రేషన్ కార్డు ఆధారంగా రైతు కుటుంబాలను తీసుకుని వారి ఆధార్ సంఖ్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల సదరు కుటుంబానికి ఎంత భూమి ఉందనే లెక్క కంప్యూటర్ గుర్తిస్తుంది. ఇందులో ఐదెకరాలలోపు ఉన్నవారిని విడదీస్తారు. వారిలో మళ్లీ నిబంధనల ప్రకారం అనర్హులను తొలగిస్తారు. ప్రస్తుతం తెలంగాణలో 5 ఎకరాల్లోపున్న వారు 47 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ రూ.6 వేల చొప్పున ఇస్తే దాదాపు రూ.2825 కోట్ల వరకూ వస్తాయని బడ్జెట్ ప్రకటించిన రోజున వ్యవసాయశాఖ లెక్కగట్టింది. కానీ ఇప్పుడు అనర్హులను తొలగిస్తే చివరికి రూ.700 కోట్ల వరకూ రావచ్చని అంచనా. సర్వే అనంతరమే అసలు విషయం తేలుతుంది. అర్హుల గుర్తింపు కూడా పెద్ద సమస్యే అని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు 'ఈనాడు'తో అన్నారు.

ఐఎఫ్‌ఎస్‌లో తెలుగు విద్యార్థుల హవా

ఉత్తమ ర్యాంకులు సాధించిన తెలంగాణ, ఏపీ విద్యార్థులు ◆ దేశవ్యాప్తంగా ఎంపికైన 89 మందిలో ఆరుగురు మనవాళ్లు

ఈనాడు - హైదరాబాద్

అఖిలభారత స్థాయి పోటీ పరీక్షల్లో తెలుగు విద్యార్థులు మరోసారి సత్తా చాటుకున్నారు. ఇండియన్ ఫారెస్టు సర్వీసెస్ (ఐఎఫ్ఎస్)లో ప్రథమ ర్యాంకు సహా మొత్తం ఆరింటిని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల వారు కైవసం చేసుకున్నారు. నల్గొండ జిల్లాకు చెందిన మందాడి నవీన్‌రెడ్డి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 41 (పసుపులేటి మౌనికా కిశోర్), 42 (సి.చైతన్యకుమార్‌రెడ్డి), 45 (మహమ్మద్ అబ్దుల్ షాహిద్), 46 (కంకణాల అనిల్‌కుమార్), 76 (భూక్యా నరసింహస్వామి) ర్యాంకర్లు సైతం తెలుగు వారే కావడం విశేషం. ఐఎఫ్ఎస్-2018 తుది ఫలితాలను యూపీఎస్సీ బుధవారం వెల్లడించింది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు దిల్లీలో అభ్యర్థులతో ముఖాముఖీ జరిపి ఎంపికైన 89 మంది జాబితాను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారు ప్రతి ఏటా సాధారణంగా ఇద్దరు వరకు ఐఎఫ్ఎస్‌కు ఎంపికవుతుండగా... ఈసారి ఆ సంఖ్య ఆరుకు పెరగటం విశేషం. 'సివిల్ సర్వీసెస్ రాసే వారే ఈ పరీక్షకు ఎక్కువ మంది హాజరవుతున్నారు. సరైన అవగాహన కల్పించి శిక్షణ ఇస్తే జాతీయ స్థాయి పరీక్షలు వేటిల్లోనైనా తెలుగు రాష్ట్రాల వారు విజయం సాధిస్తారు' అని పోటీ పరీక్షల నిపుణుడు, లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నిర్వాహకుడు డాక్టర్ లక్ష్మయ్య చెప్పారు.

సివిల్స్ లక్ష్యంగా సన్నద్ధమయ్యాను

మాది ఏపీలోని కర్నూలు అయినా హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నగరంలో 2013లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాను. సివిల్స్‌కు శిక్షణ తీసుకొన్నా. ఆంధ్రాబ్యాంకు అసిస్టెంట్ మేనేజరుగా మూడేళ్లపాటు పనిచేశా. గత ఏడాది ఆంధ్రప్రదేశ్ గ్రూపు-1 రాసి ముఖాముఖీ వరకు వెళ్లాను. గత ఏడాది ఐఎఫ్ఎస్ రాసి ముఖాముఖీకి ఎంపికైన తర్వాత లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో మోహన్‌కందా తదితరుల నిపుణుల నమూనా ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. మళ్లీ సివిల్స్ రాస్తాను.

- పసుపులేటి మౌనికా కిశోర్, 41వ ర్యాంకర్

మహేశ్ భగవత్ మార్గదర్శకత్వంలో 10 మంది ఎంపిక

సివిల్స్ శిక్షణార్థులకు రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ అమూల్యమైన సలహాలిస్తున్నారు. ఈ సలహాలు అందుకున్న 10 మంది తాజా ఐఎఫ్ఎస్ ఫలితాల్లోనూ విజయం సాధించారు. దేశవ్యాప్తంగా మొత్తం 89 మంది ఎంపిక కాగా..వారిలో పది శాతానికి పైగా ఆయన సలహాలు అందుకున్నవారే కావడం విశేషం. ఈ జాబితాలో జమీర్ షేక్(18వ ర్యాంకు), జీవన్ దాగాడే(56), అభిజిత్ వేకోస్(27), చంద్రశేఖర్ పర్దేశీ(59), శ్రీకాంత్ ఖండేకర్(33), విక్రమ్ నాధే(71), యోగేశ్ కులాల్(68), వాథోర్ హంస్‌రాజ్(77), మహమ్మద్ అబ్దుల్ షాహిద్(45), చైతన్యకుమార్‌రెడ్డి(42) ఉన్నారు. అబ్దుల్ షాహిద్ నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మన్‌పేటకు, చైతన్యకుమార్‌రెడ్డి అనంతపురానికి చెందినవారు. మహేశ్ భగవత్ వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఈ గ్రూపులో పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు సభ్యులుగా ఉండి సివిల్స్ రాసే వారికి సూచనలు చేస్తున్నారు.

గిరిపుత్రుడి ఘనత



నరసింహస్వామి (76వ ర్యాంకర్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం పత్తిపల్లి శివారు చింతకుంట తండాకు చెందిన భూక్య నరసింహస్వామి ఐఎఫ్ఎస్‌లో 76వ ర్యాంకు సాధించారు. విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని హార్టికల్చర్ కళాశాలలో బీఎస్సీ హానర్స్ చేసిన నర్సింహస్వామి పీజీ కోర్సు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బీహెచ్‌యూలో పూర్తిచేశారు. పీహెచ్‌డీ పూర్తిచేసి 2015 నుంచి న్యూదిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తగా ఉన్నారు. ఐఎఫ్ఎస్‌లో జాతీయ స్థాయిలో 76వ ర్యాంకు సాధించారు. నరసింహస్వామికి భార్య స్రవంతి, కుమారుడితో పాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. గతేడాది అనారోగ్యంతో చనిపోయిన తన తండ్రి గణ్యానాయక్ కల నెరవేర్చడమే లక్ష్యంగా ఐఎఫ్ఎస్ సాధించినట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

- న్యూస్‌టుడే, నర్సంపేట

అర్హులైన రైతులందరికీ బీమా

జిల్లా వ్యవసాయాధికారులకు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ బీమా పథకాన్ని వర్తింపజేయాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి.. జిల్లా వ్యవసాయాధికారులను ఆదేశించారు. రైతుబీమా పథకంపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష జరిపారు. ఈ పథకం కింద నమోదైన రైతుల్లో ఇప్పటి వరకు 6,775 మంది చనిపోగా వారి కుటుంబాలకు రూ.338.75 కోట్ల పరిహారాన్ని భారతీయ బీమా సంస్థ (ఎల్ఐసీ) ఇచ్చిందన్నారు. రైతు మరణించిన 10 రోజుల్లోనే పరిహారం ఇస్తున్నందుకు అధికారులను ఆయన అభినందించారు. ఈ పథకంపై అన్ని జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు స్థానిక అధికారులతో సమీక్షించాలన్నారు.

విత్తన ఎగుమతి మండలి ఏర్పాటు చేయాలి

ఈనాడు, హైదరాబాద్: భారతదేశం నుంచి ఇతర దేశాలకు విత్తన ఎగుమతులను, వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు విత్తన ఎగుమతి మండలి ఏర్పాటుచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సూచించారు. తెలంగాణలో విత్తనోత్పత్తిని పెంచడానికి రెండేళ్ల క్రితం చేపట్టిన ఇండో-జర్మన్ ప్రాజెక్టును మరో మూడేళ్ల పాటు జర్మనీ పొడిగించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రానున్న మూడేళ్లలో చేపట్టాల్సిన కార్యక్రమాల ఖరారుకు బుధవారం రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయంలో జర్మనీ ప్రతినిధులతో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో పార్థసారథి, సంస్థ సంచాలకుడు డాక్టర్ కేశవులు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడారు.

తీవ్రవాద ప్రభావ ప్రాంతాల్లో 4వేల టవర్లు

తెలంగాణలో 118, ఏపీలో 429 స్థలాల గుర్తింపు

ఈనాడు, దిల్లీ: దేశంలో వామపక్ష, తీవ్రవాద ప్రభావాలు అధికంగా ఉన్న 10 రాష్ట్రాల్లోని 96 జిల్లాల్లో 4,072 చోట్ల సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర టెలికాం శాఖ మంత్రి మనోజ్‌సిన్హా వెల్లడించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 8 జిల్లాల్లో 429, తెలంగాణలోని 14 జిల్లాల్లో 118 చోట్ల మొబైల్ టవర్ల ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ నిర్ణయించిందన్నారు. ఆయన బుధవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు తెలిపారు.

'ఆ గనులను ఏపీకి ఇవ్వడం లేదు'

పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో వెలుగుచూసిన బొగ్గు గనులను సింగరేణికి కాకుండా తమకే అప్పగించాలన్న ఆంధ్రప్రదేశ్ డిమాండ్‌ను తిరస్కరించామని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. లోక్‌సభలో బుధవారం తెరాస ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

విభజన చట్టం అమలుపై 18న కేంద్ర సమీక్ష

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 అమలుపై ఈనెల 18న సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్రం తెలిపింది. చట్టం అమలుపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్లు పేర్కొంది. తెదేపా సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ బుధవారం రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

తెలుగు రాష్ట్రాల్లో నాలుగు ఈఎస్ఐ ఆసుపత్రులకు అనుమతులు

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, విజయనగరం, పెనుకొండ... తెలంగాణలోని రామగుండంలలో 100 పడకల ఆసుపత్రులకు సూత్రప్రాయ అంగీకారం తెలిపామని మంత్రి సంతోష్ గంగ్వార్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం లేదు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వడంలేదని, దాని స్థానంలో ప్యాకేజీ ఇస్తున్నట్లు కేంద్రం పునరుద్ఘాటించింది. లోక్‌సభలో తెదేపా ఎంపీ మురళీమోహన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రణాళిక శాఖ మంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

జగన్‌కు అయింది చిన్న గాయమే

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన దాడిలో వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి చిన్న గాయమైనట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ జి.ఆహిర్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు.

ఆదర్శ్ పథకంలో తెలంగాణ స్టేషన్లు 25

ఈనాడు, దిల్లీ: రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు ప్రవేశపెట్టిన ఆదర్శ్ పథకంలో తెలంగాణలోని 25 స్టేషన్లను గుర్తించామని కేంద్రం తెలిపింది. నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు రైల్వేశాఖ సహాయ మంత్రి రాజెన్ గొహైన్ బుధవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆదిలాబాద్, ఆలేరు, భువనగిరి, స్టేషన్‌ఘన్‌పూర్, జమ్మికుంట, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట, ఖమ్మం, లింగంపల్లి, మహబూబ్‌నగర్, మల్కాజిగిరి, నల్గొండ, నిజామాబాద్, రఘునాథపల్లి, రామగుండం, శంకరపల్లి, తాండూరు, వికారాబాద్, వరంగల్, జహీరాబాద్, బాసర, మౌలాలి, నాగలపల్లి స్టేషన్లను ఆదర్శ్ పథకంలో అభివృద్ధి చేస్తామని వివరించారు.

తెలంగాణలో 'ఎంపీ ల్యాడ్స్' వ్యయం రూ.448 కోట్లు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో ఎంపీ ల్యాడ్స్ కింద గత నాలుగేళ్లలో మొత్తం రూ.448.14 కోట్లు ఖర్చుచేసి 15,091 పనులు ముగించినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్ తెలిపారు. ఆయన బుధవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ, 2015-16 నుంచి 2018-19 వరకు రాష్ట్రానికి కేంద్రం ఎంపీ ల్యాడ్స్‌గా రూ.362 కోట్లు మంజూరు చేసిందన్నారు. పాత నిధులన్నింటినీ కలిపి చూసినప్పుడు, నాలుగేళ్లలోనూ 23.79 శాతం అధికంగా వ్యయం చేసినట్లయిందని వివరించారు. మంజూరైన మొత్తం పనులు 16,541 అని, వాటిల్లో 15,091 (91శాతం) పూర్తయ్యాయని వెల్లడించారు. ఎంపీ నిధులు ఖర్చు కాకున్నా- అవి కేంద్రప్రభుత్వం వద్ద కానీ, జిల్లా యంత్రాంగాల వద్ద కానీ మురిగిపోవన్నారు. తదుపరి సంవత్సరానికి బదిలీ అవుతాయన్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి గిరిజన వర్సిటీ

కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు: కడియం శ్రీహరి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ గిరిజన విశ్వ విద్యాలయంలో స్థానిక గిరిజన విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చట్టాన్ని మార్పు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దిల్లీలో కేంద్ర మంత్రిని బుధవారం వారు కలిశారు. 2019-20 విద్యా సంవత్సరంలో గిరిజన వర్సిటీని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక గిరిజన విద్యార్థులకు ఉపయోగపడేలా సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించాలని కోరారు. కొత్త జిల్లాల్లో 2019-20 నుంచి నవోదయ విద్యాలయాలు (జేఎన్‌వీ), కేంద్రియ విద్యాలయాల (కేవీ) ప్రారంభానికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2019-20 విద్యా సంవత్సరంలోనే కొన్ని కోర్సులతో గిరిజన వర్సిటీ ప్రారంభం, చట్టం మార్పు, సగం జిల్లాల్లో జేఎన్‌వీలు, కేవీల ఏర్పాటుకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని కడియం శ్రీహరి తెలిపారు.

రామగుండం విద్యుత్తులో 85% తెలంగాణకే

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ఈనాడు, దిల్లీ: రామగుండంలో నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 85% తెలంగాణకే కేటాయించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశం దీనికి ఆమోదముద్ర వేసింది. పెద్దపల్లి జిల్లా రామగుండంలో నిర్మితమవుతున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు తొలిదశలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు యూనిట్లు ఉంటాయి. రెండో దశలో అంతే సామర్థ్యం ఉన్న మూడు యూనిట్లు ఏర్పాటవుతాయి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో చెప్పిన హామీ మేరకు 4వేల మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు తొలిదశ నిర్మాణంలో ఉంది. 2020-21 చివరి త్రైమాసికం నుంచి ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. రూ.11,811.26 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో 2018 మార్చి వరకు రూ.1,849 కోట్లు ఖర్చుపెట్టినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

రూ.36 వేలతో ఐఏఎస్ కుమారుడి వివాహం

ఈనాడు, విశాఖపట్నం : ఓ ఐఏఎస్ అధికారి ఇంట్లో వివాహమంటే ఎంతో హడావుడి.. భారీ ఖర్చు ఉంటుంది. కానీ.. విశాఖ మెట్రో ప్రాంతీయ అభివృద్ధి మండలి (వీఎంఆర్‌డీఏ) కమిషనర్ పట్నాల బసంత్‌కుమార్ తీరే వేరు. గతంలో తన కుమార్తె వివాహాన్ని కేవలం రూ.16,100 వ్యయంతో చేసిన ఆయన తాజాగా కుమారుడి వివాహానికి రూ.36,000 ఖర్చు చేయబోతున్నారు. ఈ నెల 10న విశాఖ నగరంలోని దయాల్‌నగర్‌లో సత్సంగ్ ఆధ్వర్యంలో వివాహం చేయబోతున్నారు. పెళ్లి కుమార్తె తరపువారు రూ.18 వేలు, పెళ్లి కుమారుడి తరపువారు రూ.18 వేలు భరించనున్నారు. వివాహం, విందు భోజనాలకు కలిపి ఇదే ఖర్చు. ఈ నెల 8న నూతన వధూవరుల ఆశీర్వాద కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దంపతులు హాజరవుతున్నారు.

పట్టభద్రులకు, వృత్తినిపుణులకు విశిష్ట సభ్యత్వం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ నూతన ఆవిష్కరణల విభాగం (టీఎస్‌ఐసీ) రాష్ట్రంలోని పట్టభద్రులు, వృత్తి నిపుణులకు ఏడాది పాటు విశిష్ట సభ్యత్వం(ఫెలోషిప్) ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు దీని ద్వారా అవకాశం ఉంటుందని టీఎస్‌ఐసీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమం జరిగే ఏడాదిలో మొదటి నాలుగు వారాలు నూతన ఆవిష్కరణల విభాగంలో పనిచేయాలని, ఆ తర్వాత వివిధ ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశం వస్తుందని తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎంపికైన వారికి వేతనం ఉంటుందని, హైదరాబాద్‌తో పాటు నగరాల్లో, పట్టణాల్లో పనిచేయాల్సి ఉంటుందని వివరించింది. ఆసక్తిగల వారు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలి.

8 నుంచి ఓయూలో 'హిస్టరీ కాంగ్రెస్'

ఈనాడు, హైదరాబాద్, ఓయూ, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో 39వ సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎస్.రామచంద్రం తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. మూడ్రోజులపాటు జరిగే సదస్సుకు వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 2వేల మంది ఆచార్యులు, వెయ్యి మంది పరిశోధక విద్యార్థులు హాజరుకానున్నారని.. ఇప్పటికే 400 మంది పరిశోధన పత్రాలను సమర్పించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. గతంలో ఒకసారి ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించిన ఘనత ఉస్మానియాకు ఉందన్నారు. ప్రస్తుత సదస్సుకు తెలంగాణ సీఎస్ ఎస్.కె.జోషి హాజరుకానున్నారని వెల్లడించారు. ఈసారి సదస్సుకుముఖ్యమంత్రిని ఆహ్వానించలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రుసా నిధుల కింద ఓయూకు రూ.100 కోట్లు మంజూరయ్యాయని.. ఇందులో తొలి విడతగా రూ.20 కోట్లు వచ్చాయన్నారు.

కార్మిక నాయకుల ఇళ్లలో అనిశా సోదాలు

కొత్తగూడెం (సింగరేణి), న్యూస్‌టుడే: కొత్తగూడెంలోని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకుల ఇళ్లలో అవినీతి నిరోధకశాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన అనిశా ప్రత్యేక బృందం వీటిని నిర్వహించింది. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకుడు, ఇటీవలే సింగరేణి ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన సంపత్‌కుమార్ లక్ష్యంగా ఈ సోదాలు జరిగాయి. 2014లో సింగరేణి మెడికల్ బోర్డులో అవినీతి జరిగిందని, ఉద్యోగుల బదిలీల్లో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణల నేపథ్యంలో ఇళ్లలో ఈ సోదాలు నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సంపత్‌కుమార్‌ను హైదరాబాద్‌లో బుధవారం అరెస్టు చేసినట్టు తెలిసింది. విచారణలో భాగంగా తగిన ఆధారాల కోసం కొత్తగూడెంలోని సంపత్, ఆయన సోదరుని ఇళ్లలోను, మరో నాయకుడు ప్రభాకర్ ఇంటిలో సోదాలు నిర్వహించి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే అనిశా అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు సింగరేణి యాజమాన్యం పేర్కొంది. ఈ మేరకు యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేస్తూ అవినీతికి పాల్పడేవారు ఎంతటి వారైనా వెనకాడేది లేదని పేర్కొంది.

బుల్లితెర నటి నాగ ఝాన్సీ బలవన్మరణం

- మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య
- పవిత్రబంధం సీరియల్‌తో ఆమెకు గుర్తింపు
- ప్రియుడి వేధింపులే కారణమని తల్లి ఫిర్యాదు
- మృతురాలిది కృష్ణా జిల్లా వడాలి గ్రామం



బుల్లితెర నటి ఝాన్సీ, ఆమె ప్రియుడు సూర్యతేజ చౌదరి

ఈనాడు, హైదరాబాద్: న్యూస్‌టుడే, పంజాగుట్ట: అనుమానంతో ప్రియుడి వేధింపులు... పెళ్లి విషయంలో జాప్యం.. తదితర పరిణామాలతో మనస్తాపానికి గురైన బుల్లితెర నటి నాగ ఝాన్సీ హైదరాబాద్‌లోని తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. కుమార్తె మృతికి ఆమె ప్రియుడు, విజయవాడకు చెందిన సూర్యతేజ చౌదరే కారణమంటూ ఝాన్సీ తల్లి సంపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజాగుట్ట పోలీస్ ఠాణా పరిధిలో బుధవారం ఘటన జరిగింది.

కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం, వడాలి గ్రామానికి చెందిన సువ్వాడ నాగఝాన్సీ అలియాస్ ఝాన్సీ (21) సినిమా అవకాశాల కోసం మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చింది. కొద్ది నెలలకే టీవీ సీరియళ్లలో నటించే అవకాశాలు దక్కించుకుంది. మా టీవీలో ప్రసారమయ్యే 'పవిత్రబంధం' సీరియల్ ఆమెకు గుర్తింపు తేవడంతో ఇక్కడే స్థిరపడింది. ప్రస్తుతం అమీర్‌పేట్‌లోని నాగార్జుననగర్ సాయిరాం రెసిడెన్సీలో ఫ్లాట్ నెంబర్ 401లో సోదరుడు దుర్గాప్రసాద్‌తో కలిసి నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఇంటికి వచ్చిన దుర్గాప్రసాద్ లోపల్నుంచి గడియ పెట్టి ఉన్నట్లు గుర్తించాడు. ఎంతసేపు కాలింగ్ బెల్ కొట్టినా తలుపు తీయకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. కిటికి గుండా ఇంట్లోకి వెళ్లాడు. పడక గదిలో ఝాన్సీ ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్టు గుర్తించి పోలీసులకు, 108కు ఫోన్ చేశాడు. పంజాగుట్ట ఎస్సై శ్రీనివాస్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చి మృతదేహాన్ని మరణోత్తర పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పరిచయం... ప్రేమ...అనుమానం

ఝాన్సీకి ఓ స్నేహితురాలి ద్వారా ఏడాది క్రితం విజయవాడకు చెందిన సూర్యతేజ చౌదరి పరిచయమయ్యాడు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. 'పెళ్లయ్యాక సీరియళ్లలో నటించకూడదని' ప్రియుడు షరతు విధించగా దానికామె అంగీకరించింది. అప్పట్నుంచి నటనకు స్వస్తి పలికింది. అర్నెల్ల క్రితమే పెళ్లి నిర్ణయాన్ని తల్లి సంపూర్ణకు చెప్పింది. సూర్యతేజ తల్లిదండ్రులు అంగీకరిస్తే పెళ్లి చేసేందుకు తనకు అభ్యంతరం లేదని తల్లి చెప్పినట్టు సమాచారం. అప్పట్నుంచి అతను ప్రియురాలి ఇంటికి వచ్చిపోతూ ఉన్నట్టు తెలిసింది.

వేధింపులే కారణమా?

పెళ్లి ప్రతిపాదన తర్వాత ఇతరులతో సంబంధాలున్నాయనే కోణంలో ప్రియుడు నుంచి ఝాన్సీ వేధింపులు ఎదుర్కొన్నట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఇదే విషయమై ఇద్దరి మధ్య ఇంట్లోనే స్వల్ప ఘర్షణ కూడా జరిగిందని పక్కింటి వారు పోలీసులకు తెలిపారు. "సూర్యతేజ ఇంటికి రాకపోవడం, పెళ్లి ప్రస్తావన తేకపోవడం వంటి పరిణామాలతో కొంత కాలంగా ఝాన్సీ మానసిక ఒత్తిడికి లోనైంది. తన బాధను ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా కుంగిపోయి రెండు రోజులుగా సరిగా ఆహారం కూడా తీసుకోవడం లేదు. ఆ బాధే ఆమెను ఆత్మహత్య వైపు పురిగొల్పిందని భావిస్తున్నాం. మృతురాలి పడక గదిలో రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. వాటిలోనే సమాచారాన్ని విశ్లేషించి సూర్య వేధించిట్టు తేలిన పక్షంలో అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

వేధింపులే కారణం: ఝాన్సీ తల్లి

సూర్యతేజ వేధింపులతో తన సోదరి తీవ్ర ఒత్తిడికి గురైందని, స్నేహితురాలి భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న బ్యూటీపార్లర్‌కు కూడా వెళ్లడం లేదని సోదరుడు దుర్గాప్రసాద్ విలేకర్ల ఎదుట వాపోయాడు. అతని వేధింపుల వల్లనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోవైపు ఝాన్సీకి ఇతరులతో సంబంధాలున్నాయని సూర్యతేజ ఆరోపించాడు. ఓ మీడియాకు పంపిన సందేశంలో అతను ఈ మేరకు ఆరోపణలు చేశాడు. 'పలువురితో ఆమె సన్నిహితంగా ఉన్న ఆధారాలు నా దగ్గరున్నాయి. వాటితో త్వరలో హైదరాబాద్ వస్తా' అని పేర్కొన్నాడు.

కేంద్రం, మమత విధానాలే వేరు

సురవరం విమర్శ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: 'శారద చిట్‌ఫండ్' కుంభకోణంలో కేంద్రప్రభుత్వం, మమత అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగ సంక్షోభానికి దారితీసేలా ఉన్నాయని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం మఖ్దూం భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కుంభకోణానికి సంబంధించి రెండు ప్రభుత్వాలూ నిందితులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎప్పుడో 9 నెలల క్రితం పోలీస్ కమిషనర్‌కు ఇచ్చిన నోటీసుపై ఇప్పుడు అరెస్టు చేయడానికి సీబీఐ రావడం, రక్షించేందుకు మమత ప్రభుత్వం ప్రయత్నించడం విడ్డూరమన్నారు.

యూపీ తంత్రం పనిచేయదు: ఒవైసీ

ఆబిడ్స్: యూపీ సీఎంకు రాజకీయ పరిపక్వత లేదని, హిందూత్వ నినాదంతోనే ఆయన మనుగడ కొనసాగిస్తున్నారని ఎంఐఎం పార్టీ అధ్యక్షులు-ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. అక్కడి మైనార్టీల పట్ల అనుసరించిన తీరును పరిశీలించి, యోగి తగిన రీతిలో స్పందించాలని కోరారు. హిందువులు, ముస్లింలు అని కాదు... మానవత్వమే ఇబ్బందుల్లో ఉందని ఉత్తర్ ప్రదేశ్ సంఘటనలు రుజువు చేస్తున్నాయన్నారు.

జయరాం హత్య కేసు హైదరాబాద్‌కు బదిలీ

నందిగామ,న్యూస్‌టుడే: పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరాం హత్య కేసును హైదరాబాద్‌కు బదిలీ చేసేందుకు నందిగామ పోలీసు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కావడంతో అక్కడి పోలీసుస్టేషన్‌కు కేసు బదిలీ చేయనున్నారు. గత నెల 31న జయరాం హత్య జరగగా, నందిగామ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో రిమాండ్‌కు తరలించిన నిందితులు రాకేష్‌రెడ్డి, శ్రీనివాస్‌లను ఇక్కడి పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారించాలని తొలుత భావించారు. ఏపీ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఠాణాకు బదిలీ చేయనుండటంతో కస్టడీ పిటిషన్ విషయాన్ని పక్కన పెట్టారు. నేరం జరిగిన ప్రాంతం, నిందితులు, ఆర్థిక లావాదేవీలు అక్కడికి సంబంధించినవి కావడంతో కేసు బదిలీకి నిర్ణయించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు ధ్రువీకరించారు.

నందిగామ ఉపకారాగారానికి నిందితులు

కేసులో పోలీసులు అరెస్టు చేసిన నిందితులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా నందిగామ ఉపకారాగారానికి తరలించారు. మంగళవారం సాయంత్రం నిందితులు రాకేష్‌రెడ్డి, శ్రీనివాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. రాత్రి స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి జేసురత్నకుమార్ ఎదుట హాజరుపరచగా.. ఈనెల 20 వరకు రిమాండ్‌కు పంపుతూ ఆయన ఆదేశాలు జారీచేశారు.

పద్మశ్రీ ఫిర్యాదులపై న్యాయసలహా!

జూబ్లీహిల్స్ న్యూస్‌టుడే: జయరాం హత్యకేసులో భార్య పద్మశ్రీ ఫిర్యాదుకు సంబంధించి, కేసు నమోదుపరంగా తెలంగాణ పోలీసులు న్యాయసలహా తీసుకుంటున్నారు. ఆయన మృతదేహం ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ పోలీసుస్టేషన్ పరిధిలో కనిపించడంతో, కేసును ఆ పోలీసులు విచారిస్తున్నారు. జయరాం హత్యపై ఇంకా అనుమానాలున్నాయని, ఆయనను జూబ్లీహిల్స్‌లో హత్య చేసినందున తెలంగాణ పోలీసులే కేసు విచారించాలని పద్మశ్రీ మంగళవారం రాత్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. జయరాం మేనకోడలు శిఖాచౌదరిపై అనుమానాలున్నాయని, ఇంట్లోని విలువైన వస్తువులు మాయమయ్యాయని వెల్లడించారు. ప్రస్తుతానికి జీడీలో నమోదుచేసినా, కేసు నమోదుకు న్యాయసలహా తీసుకుంటున్నామని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు.


తల్లి పార్థివదేహం వద్ద రోదిస్తున్న సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుడు, సోదరి

స్వగ్రామంలో సభాపతి మాతృమూర్తి అంత్యక్రియలు

పరామర్శించేందుకు నేడు సీఎం రాక

ఈనాడు డిజిటల్, కామారెడ్డి: శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి పాపవ్వ (107) అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. అనారోగ్యంతో ఆమె మంగళవారం అర్ధరాత్రి బాన్సువాడలో మృతిచెందారు. విషయం తెలుసుకొన్న సభాపతి, కుటుంబసభ్యులు అదే రాత్రి బాన్సువాడకు చేరుకున్నారు. అనంతరం స్వగ్రామం పోచారానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం వైకుంఠధామం వరకు అంతిమయాత్ర చేపట్టారు. అంత్యక్రియల్లో స్పీకర్ కుటుంబసభ్యులతో పాటు బంధుమిత్రులు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ట్విటర్‌లో సంతాపం తెలిపారు. హోం మంత్రి మహమూద్‌అలీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, జగదీశ్వర్‌రెడ్డి స్పీకర్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం ఫోన్లో సభాపతిని పరామర్శించారు. స్వయంగా పరామర్శించేందుకు గురువారం పోచారానికి రానున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

'ప్లాస్టిక్' కర్మాగారాల భవనాల కూల్చివేత!

- భారీ ఎత్తున ప్లాస్టిక్ సంచులు స్వాధీనం
- 'ఈనాడు' కథనంతో తక్షణం స్పందించి దాడులు

ఈనాడు- సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: నిబంధనలను తుంగలో తొక్కి 50 మైక్రాన్లకంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులను ఉత్పత్తి చేస్తున్న కర్మాగారాల భవనాలను కూల్చివేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇలా ఉత్పత్తి చేస్తున్న కర్మాగారాలన్నీ అక్రమంగా నిర్మించిన భవనాల్లోనే ఉండటమే ఇందుకు కారణం. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్లాస్టిక్ సంచుల తయారీపై బుధవారం 'మామూళ్ల మైకం.. అధికారులకు మైకం' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన బల్దియా విజిలెన్సు విభాగం కర్మాగారాలపై దాడులు నిర్వహించింది. రాజేంద్రనగర్, కాటేదాన్ పారిశ్రామికవాడల్లో జీహెచ్ఎంసీ రికార్డుల ప్రకారం 600-700 చిన్న, పెద్ద కర్మాగారాల్లో 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ సంచులు తయారవుతున్నాయి. ఇందులో 75 శాతం కర్మాగారాల భవనాలకు బల్దియా అనుమతుల్లేవు. 90 శాతం ప్లాస్టిక్ పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు లేవని తేలింది. బుధవారం దాదాపు 50 పరిశ్రమలపై విజిలెన్సు అధికారులు దాడులు చేసి భారీ ఎత్తున ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ ఇండస్ట్రీస్, సిరిగిరి ప్లాస్టిక్ ప్రైవేటు లిమిటెడ్, మహాచండీ ప్లాస్టిక్ కంపెనీతోపాటు పలు కంపెనీల యజమానులకు నోటీసులు ఇచ్చారు. వీటన్నింటినీ సీజ్ చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను కూల్చివేయాలని నిర్ణయించినట్లు విజిలెన్సు డైరెక్టర్ విశ్వజిత్ కంపాటి 'ఈనాడు'కు తెలిపారు. ఇక్కడ తయారైన నిషేధిత ప్లాస్టిక్ సంచులను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న 20 మంది టోకు వ్యాపారులకు, బేగంబజార్‌లోని 25 మంది చిన్న వ్యాపారులకు కూడా నోటీసులు జారీ చేశామన్నారు.


ప్లాస్టిక్ సంచుల మందాన్ని కొలిచే పరికరం

లోకాయుక్త నియామకంపై వివరణివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: లోకాయుక్త నియామకానికి సంబంధించి ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏవైనా పేర్లు పరిశీలనలో ఉన్నాయా? వివరాలు చెప్పాలని అడిగింది. 15 నెలలుగా లోకాయుక్త పోస్టు ఖాళీగా ఉండటాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతేడాది డిసెంబరు నాటికి లోకాయుక్త వద్ద 5500 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం అందే ఫిర్యాదులన్నింటినీ రిజిస్టర్ చేసుకుంటున్నారన్నారు. అధికారుల అవినీతి, బాధ్యతారాహిత్యంపై ప్రశ్నించే వ్యవస్థే లేకుండా పోయిందని చెప్పారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ లోకాయుక్త నియామకానికి చర్యలేమైనా చేపట్టారా? అంటూ అడ్వొకేట్ జనరల్(ఏజీ)ను ప్రశ్నించింది. ఏజీ బి.ఎస్.ప్రసాద్ స్పందిస్తూ.. రెండు వారాలు గడువిస్తే మొత్తం వివరాలను సమర్పిస్తానని చెప్పడంతో హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

చోరీకి ఆ ఆసుపత్రిదే బాధ్యత

- గొలుసు ఖరీదుతోపాటు పరిహారంగా రూ.20 వేలు చెల్లించాలి
- తేల్చి చెప్పిన జాతీయ వినియోగదారుల కమిషన్

ఈనాడు, హైదరాబాద్: ఆసుపత్రిలో ఉండగా రోగి మెడలో మంగళసూత్రం గొలుసు అపహరణకు గురైన దానికి ఆసుపత్రే బాధ్యత వహించాలని జాతీయ వినియోగదారుల కమిషన్ తేల్చి చెప్పింది. గొలుసు సొమ్ముతోపాటు పరిహారం చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల ఫోరం, రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ హైదరాబాద్ బర్కత్‌పురలోని సీసీ షరాఫ్ మెమోరియల్ ఆసుపత్రి జాతీయ వినియోగదారుల కమిషన్ (సర్క్యూట్ బెంచ్)ను ఆశ్రయించింది. ఈ అప్పీలుపై జాతీయ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, సభ్యురాలు ఎం.శ్రీషలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌కు చెందిన సుధారమణి 2010 ఏప్రిల్ 24న సీసీ షరాఫ్ ఆసుపత్రిలో చేరారు. మత్తు ఇంజక్షన్ ఇవ్వడం వల్ల స్పృహలో లేని ఆమె మెడలో 35 గ్రాముల మంగళసూత్రం గొలుసు చోరీకి గురైంది. గొలుసు కానీ నగదుకానీ ఏప్రిల్ 29లోగా చెల్లిస్తామని సుధారమణి భర్త నాగరాజ్‌కు ఆసుపత్రి సీఎంవో, ఇన్‌ఛార్జి అయిన డాక్టర్ దేవ్‌దాస్ 24న రాతపూర్వకంగా తెలిపారు. సొమ్ము ఇవ్వకపోవడంతో సుధారమణి జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఫిర్యాదుదారు భర్త బెదిరించడంతో సొమ్ము చెల్లిస్తామని రాతపూర్వకంగా ఇవ్వాల్సి వచ్చిందని ఆసుపత్రి తెలిపింది. ఆసుపత్రి ఇన్‌ఛార్జి ఏప్రిల్ 29 నాటికి ఇస్తానని చెప్పినప్పటికీ ఆగస్టు 30 వరకు పిటిషనర్ వేచి చూశారని.. ఈ మధ్య కాలంలో పోలీసులతో సహా ఎవరికీ ఫిర్యాదు చేయకుండా ఉండటాన్నిబట్టి చూస్తే బెదిరించారన్న వాదనతో ఏకీభవించలేమని జిల్లా వినియోగదారుల ఫోరం పేర్కొంది. ఇన్‌ఛార్జి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు గొలుసు విలువ రూ.70 వేలు, మానసిక వేదనకు గురి చేసినందున పరిహారంగా రూ.20 వేలు, ఆసుపత్రి ఖర్చులు రూ.5 వేలు, మందులకు రూ.2 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను రాష్ట్ర కమిషన్ సమర్థించగా.. ఆసుపత్రి జాతీయ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. జిల్లా ఫోరం వెలువరించిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని, ఆ తీర్పులో పేర్కొన్న సొమ్మును 9 శాతం వడ్డీతో చెల్లించాలంటూ కమిషన్ ఆదేశిస్తూ ఆసుపత్రి పిటిషన్‌ను కొట్టివేసింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన విషాద ఘటనిది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని కేసీఆర్ కాలనీకి చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు.. తల్లి, ఇద్దరు కుమారులను తీసుకుని ముదిగొండ మండలం వెంకటాపురంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం బుధవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై నేలకొండపల్లికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో(బౌద్ధస్తూపం రహదారి సమీపంలో) గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వెంకటేశ్వర్లు(40), అతని తల్లి పిచ్చమ్మ(60), ఇద్దరు కుమారులు కోదండరాం(8), ప్రణయ్(6) అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌తో జస్టిస్ చలమేశ్వర్ భేటీ

ఈనాడు, హైదరాబాద్: గవర్నర్ నరసింహన్‌తో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ భేటీ అయ్యారు. బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై అరగంటపాటు చర్చించారు. మర్యాదపూర్వకంగా ఈ భేటీ జరిగినట్లు గవర్నర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.


స్వాధీనం చేసుకున్న దుప్పుల చర్మం, మాంసం, వేటకు వినియోగించిన తీగ, గొడ్డలి

వేటగాళ్ల ఉచ్చుకు రెండు దుప్పులు హతం

- ఏడుగురి అరెస్టు.. చర్మం స్వాధీనం

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా పెంబి అడవుల్లో పెద్దపులిని హతమార్చిన సంఘటన మరువకముందే వేటగాళ్లు మరో దుశ్చర్యకు పాల్పడ్డారు. పెంబి అటవీ రేంజి పరిధిలోని తులసిపేట- బావోజిపేట అటవీప్రాంతంలో మంగళవారం నాలుగు కిలోమీటర్ల మేర విద్యుత్తు తీగలు అమర్చి రెండు దుప్పులను హతమార్చారు. తులసిపేటలోని ఓ జొన్న చేనులో వాటిని వధించి మాంసం, చర్మాన్ని ఉంచారు. అటవీ అధికారులకు సమాచారం అందడంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాత్రికిరాత్రే ఏడుగురు నిందితులను పట్టుకొని బుధవారం కోర్టులో హాజరు పరచగా వారిని రిమాండ్ చేశారు.


భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాట్స్) ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మకరందం

ఈనాడు

7 కరీంనగర్, గురువారం ఫిబ్రవరి 7, 2019

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

అమ్మకు వ్యాకులత ఎందుకు?

గుణదల మాత ఉత్సవాలు ఈనెల 9 నుంచి 11 వరకు

దేవుడు అన్ని చోట్లా ఉండలేక తల్లులను సృష్టించారంటారు. మరి ఆ దైవ కుమారుడికే పుట్టుకను ఇచ్చిన మాతృమూర్తి మేరీమాత. ఆమె మూడేళ్ల వయసులోనే దేవుడి అనుగ్రహాన్ని పొంది యెరూషలేము లోని దేవాలయంలో అర్పణ పొందినట్లు, ఏడేళ్ల వయసులోనే కన్యగా వ్రత దీక్ష తీసుకున్నట్లు లేఖనాలు పేర్కొంటున్నాయి. ఆమెను భక్తులు వ్యాకులమాతగా స్మరిస్తారు. దీనికి కారణం ఆమె జీవితంలో జరిగిన ఏడు వ్యాకులతలు. అంటే విచారం.



1 ఏసు పుట్టిన ఎనిమిదో రోజున ఆయనను గుళ్లో కానుకగా అర్పించడం. అంటే ఆయనను పాపుల రక్షణ కోసం త్యాగం చేయడం ఆమె మొదటి వ్యాకులతగా చెబుతారు.

2 క్రీస్తు పుట్టిన రెండేళ్లకు ఆనాటి చక్రవర్తి హేరోదు వల్ల ఆపదను గుర్తించి ఆ బాలుడిని సురక్షితంగా దేశాన్ని దాటించడం రెండో కష్టం.

3 యేసు పన్నెండేళ్ల వయసులో యెరూషలేము దేవాలయం దర్శించినప్పుడు ఆయన తప్పిపోయి మూడో రోజు దొరికాడు. అప్పుడు ఆ తల్లి వ్యధను మూడో వ్యాకులతగా భావిస్తారు.

4 క్రీస్తును సిలువ వేసే ముందు సైనికులు ఆయనను కొరడాలతో హింసిస్తారు. రక్తసిక్తమైన ఆయన దేహాన్ని చూసి ఆ మాతృమూర్తి అంతులేని ఆవేదనను అనుభవించింది.

5 ఇద్దరు నేరస్తుల మధ్య క్రీస్తును సిలువ వేయడం

6 ప్రభువు రక్తసిక్తమైన దేహాన్ని సిలువపై నుంచి తన ఒడిలో పడుకోబెట్టినప్పుడు ఆ తల్లి హృదయం పడ్డ బాధ వర్ణనాతీతం.

7 ప్రభువు పరిశుద్ధ దేహాన్ని శిష్యులు సమాధిలో ఉంచిన ఘటన ఆ తల్లికి అంతులేని వ్యాకులతను కలిగించింది.

సాక్షాత్తు దైవ కుమారుడినే తన గర్భాన మోసిన ఆ తల్లి, చివరి వరకు ఆయనతోనే ఉండి ఆయనతో పాటే మోక్షారోహణంతో తన జీవితాన్ని సంపూర్ణం చేసుకుంది. 1929లో విజయవాడలోని గుణదలలో ఆ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు దేశవ్యాప్తంగా భక్తులు తరలివస్తారు.

– ఎం.సుగుణరావు

బోధివృక్షం

ఎవరు జహాపనా?

'జహాపనా! మన వల్ల గొప్ప తప్పు జరిగింది' చెరసాల అధిపతి బాబర్‌కు సలాం చేసి ఆందోళనగా అన్నాడు.

'మనవల్లా! ఏంటా తప్పు' బాబర్ దర్పంగా ప్రశ్నించాడు.

'చెరసాలలో ఒక మహాత్ముడు బందీగా ఉన్నాడు'

'ఆయన మహాత్ముడని నీకెలా తెలుసు?'

'ఖైదీలందరూ తమని విడిచి పెట్టమని వేడుకుంటుంటే, ఆయన ఆనందంగా దైవ సంకీర్తన చేస్తూ శ్రద్ధగా గోధుమ పిండి విసురుతున్నారు.'.. బాబరు ఆశ్చర్యంగా విన్నాడు.

'పద వచ్చి చూస్తాను' అంటూ చెరసాల వైపు వెళ్లాడు. అక్కడి దృశ్యం బాబర్‌కు ఆశ్చర్యం కలిగించింది.

నానక్ స్వగృహంలో ఉన్నంత సంతోషంతో తనకి శిక్షలో భాగంగా ఇచ్చిన గోధుమలను పిండిగా విసురుతున్నారు.

నానక్ మొహంలో దివ్యత్వం బాబర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వెంటనే చెరసాల తెరిపించి నానక్ ముందు చేతులు జోడించి 'మహాత్మా! మన్నించండి. మా సైనికులు మీరెవరో తెలియక ఇలా చెరసాలలో బంధించారు' అన్నాడు వినమ్రంగా తలవంచి.

'అంతా పైవాడి దయ. ఆయన ఆజ్ఞ ప్రకారమే అన్నీ జరుగుతాయి.' అన్నారు నానక్ పిండి విసురుతూనే.

'మహాత్మా! దయచేసి ఇలా ఉన్నత స్థానంపై కూర్చోండి'



బాబర్ ఆసనం చూపించాడు. నానక్ అక్కడ కూర్చున్నాక ప్రశ్నల వర్షం కురిపించాడు బాబర్.

'మనిషి జన్మకు సార్థకత ఎలా లభిస్తుంది?'

'ధర్మం తప్పకుండా, ఎవరికీ అపకారం చేయకుండా, అనుక్షణం భగవంతుని స్మరిస్తూ, కర్మలను చిత్తశుద్ధితో ఆచరించిన వారి జన్మ సార్థకమవుతుంది.'

'ఏది ధర్మం?'... 'అహింసే పరమ ధర్మం'

'ఎవరు నిజమైన ప్రభువు?'

'ప్రభువులకు ప్రభువైన పరమాత్మ సృష్టిని కాపాడేవాడు, ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునేవాడే నిజమైన ప్రభువు'

'మహాత్మా! ఈ క్షణంలోనే మీకు చెరసాల నుంచి విముక్తి కలిగిస్తున్నాను. మీకు ఇంకేం కావాలి?'

'చెరసాలలోని బందీలందరినీ విడుదల చేసి ఎవరి ఆస్తులు వారికి అప్పగించండి'

'అలాగే జరుగుతుంది. నా సంతోషం కోసం కనీసం ఈ మేలిమి రకం గంజాయిని స్వీకరించండి' అంటూ తన వద్ద ఉన్న ఖరీదైన చేతి సంచీని ఇవ్వజూపాడు.


'నవ్వి నేనెప్పుడూ దైవనామస్మరణ అనే మత్తులో ఉంటాను. నాకు వేరే మత్తు పదార్థాలు అవసరం లేదు... సున్నితంగా తిరస్కరించారు నానక్'.

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

ఆదివారం వసంత పంచమి

ఆమె అక్షరం... ఆమె అక్షయం...
ఆమె గీర్వాణి...
ఆమె సకల శాస్త్రాలకూ రారాణి
ఆమె జ్ఞానం...
ఆమె సర్వవిద్యలకూ మూలం...
వాల్మీకి నోట ఆది కావ్యాన్ని పలికించిన తల్లి ఆమె.
వ్యాసభగవానుడి చేత అపార సాహిత్యాన్ని రాయించింది ఆ తల్లే.
యాజ్ఞవల్క్యుడు, ఆదిశంకరులు, ఆదిశేషువు, బృహస్పతి అందరూ ఆమె అనుగ్రహంతోనే అనంతమైన జ్ఞానాన్ని వరప్రసాదంగా అందుకున్నారు.
ఆ తల్లి సరస్వతి... మనలోని విజ్ఞానానికి మాతృమూర్తి. ఆమె ఆవిర్భవించిన రోజు వసంతపంచమి.

వీణాపాణి వేద వాణి!



మాఘమాసం ప్రకృతి వికాసానికి, సరస్వతి మనోవికాసానికి సంకేతం. ఈ రెండింటి కలయిక పరిపూర్ణ వికాసానికి నిదర్శనం. దీనికి ప్రతీకగా వసంత పంచమి వ్యాప్తిలోకి వచ్చింది. మనిషిలో ఉండే అవిద్య లేదా అజ్ఞానం తొలగిపోయి ఎప్పుడు జ్ఞానం అనే వెలుగురేఖ ప్రసారమవుతుందో ఆ రోజు మనిషి వికాసానికి ప్రారంభసూచిక అవుతుంది. అజ్ఞానం అనే మంచుతో గడ్డకట్టిన మనిషి హృదయాన్ని చదువు అనే వేడితో కరిగించి జ్ఞానం అనే వెలుగును ప్రసరింపజేయటమే వసంత పంచమి అంతరార్థం. మాఘమాసంలో వచ్చే శుక్ల పక్ష పంచమిని వసంత పంచమిగా చేసుకుంటాం. ఈ రోజుకే శ్రీపంచమి, మదన పంచమి, సరస్వతీ జయంతి అనే పేర్లు కూడా వాడుకలో ఉన్నాయి.

- చైత్ర, వైశాఖమాసాల్లో వచ్చే వసంత రుతువుకు స్వాగతోపచారాలు మాఘమాసంలోనే మొదలవుతాయి. కాలగమనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే మకర సంక్రమణం (సంక్రాంతి) తర్వాత వాతావరణంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి. మాఘమాసం ప్రారంభం కావడంతోనే చెట్లు చిగురించడం, పూలు పూయడం మొదలవుతుంది. చలి, ఎండల మిశ్రమ వాతావరణం ప్రజలకు ఎంతో హాయి కలిగిస్తుంది. పంటలు నిండుగా చేతికి వచ్చి ఉంటాయి. పాడి పశువులకు పుష్కలంగా గ్రాసం లభిస్తుంది. దీంతో అవి సమృద్ధిగా పాలనిస్తాయి. గ్రహగమనాలన్నీ శుభస్థానాల్లో జరుగుతాయి. వివాహాది శుభకార్యాల సందడి మొదలవుతుంది. మొత్తంగా మానవజీవితానికి అత్యంత ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చే కాలం ప్రారంభమవుతుంది. ఇదంతా రాబోయే వసంతమాసానికి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉండి వసంత సందడి ముందుగానే వచ్చిన అనుభూతి కలిగిస్తుంది.
- పురాణ, ఇతిహాసపరంగా కూడా వసంత పంచమికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బ్రహ్మవైవర్త పురాణం, కృత్యసార సముచ్చయం, హేమాద్రి గ్రంథాల్లో ఇందుకు సంబంధించిన అనేక విషయాలు వివరణాత్మకంగా ఉన్నాయి. చారిత్రక ఆధారాల ప్రకారం ప్రాచీన రోమన్లు వసంతపంచమి ఉత్సవాన్ని జరిపేవారని తెలుస్తోంది. గ్రీకులు జ్ఞానదేవతగా భావించి ఈ రోజున సరస్వతీదేవికి పూజలు చేసేవారు.
- ఈ రోజును రతికామ దమనోత్సవంగా జరుపుకునే ఆచారం కొన్నిచోట్ల ఉంది. పంచమినాడు రతీదేవి కామదేవ పూజచేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. రుతువుల రాజు అయిన వసంతుడికి, కామదేవుడికి మధ్య ఎంతో సఖ్యత ఉంది. వసంతుడు సస్యదేవత. కాముడు ప్రేమదేవత. రతీదేవి అనురాగ దేవత. ఈ ముగ్గురి కలయిక... అంటే, ప్రకృతి ద్వారా లభించే అమితమైన జీవనోపాధి మనుషుల మధ్య ప్రేమానురాగాల్ని కలిగిస్తుంది. ఏ ప్రాంతమైతే పాడిపంటలతో సుభిక్షంగా ఉంటుందో అక్కడి మనుషులు ప్రేమానురాగాలతో సుఖంగా ఉంటారనేది ఇందులో అంతరార్థం.
- ఈరోజును బెంగాల్‌లో శ్రీపంచమిగా మూడురోజుల పాటు ఉత్సవం నిర్వహిస్తారు. ఉత్తరభారతంలో ఈ రోజున ఉదయం నుంచే సరస్వతీదేవిని పూజించి, సాయంకాలం ఆ ప్రతిమకు ఊరేగింపు జరిపి, నిమజ్జనం చేసే ఆచారం కొనసాగుతోంది. వసంతరుతువుకు స్వాగతం పలికే రోజు వసంత పంచమి అని, ఇది రుతువులకు సంబంధించిన పండుగ అని శాస్త్రాలు చెబుతున్నాయి. పంజాబ్, బిహార్ రాష్ట్రాల్లో ఈ రోజున పతంగుల పండుగ చేసుకుంటారు. వేదవ్యాస మహర్షి గోదావరీ నదీతీరంలో ఇసుకతో సరస్వతీదేవిని ప్రతిష్ఠించి, అర్చన చేశాడు. వ్యాసుడి కారణంగా ఏర్పడిన ఆ క్షేత్రమే 'వ్యాసర' లేదా 'వ్యాసపురి' కాలక్రమంలో 'బాసర'గా ప్రసిద్ధి పొందింది.

-డా॥ కప్పగంతు రామకృష్ణ

శ్వేతరూపం... జ్ఞానదీపం

- సరః అంటే కాంతి. కాంతి అంటే జ్ఞానం. మన జీవితాన్ని జ్ఞానంతో నింపే మాతృశక్తి సరస్వతి. శుద్ధ జ్ఞానానికి ఆమె ప్రతీక. వికాసం, విజ్ఞానాలకు ఆమె ఆకృతి. అక్షర అక్షయ సంపదలకు మూలమైన ప్రణవ స్వరూపిణి ఆమె. వేదజ్ఞానానికి మాతృకగా, గాయత్రిగా, సావిత్రిగా, లౌకిక, అలౌకిక విద్యల ప్రదాతగా ఆమె పూజలందుకుంటోంది.
- సరస్వతి అనే శబ్దానికి ప్రవాహం అనే అర్థం కూడా ఉంది. ప్రవాహం అంటే నిరంతరం సాగిపోయే చైతన్యం. సాధారణంగా జలం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. జలం జీవశక్తికి సంకేతం. దాన్నుంచే అన్ని జీవులకూ శక్తి అందుతోంది. తద్వారా ప్రకృతిలో ఉత్పాదకత జరుగుతోంది. ఈ ఉత్పాదకతకు ప్రతిఫలమే సరస్వతి (జ్ఞానం). సృష్టి కార్యాన్ని నిర్వహించే బ్రహ్మదేవుడికి కూడా అందుకు తగిన జ్ఞానాన్ని సరస్వతి అందిస్తుంది.
- సరస్వతీ అవతారం అహింసకు కూడా తార్కాణంగా కనిపిస్తుంది. తెల్లటి వస్త్రాలు, తెల్లటి పువ్వులు, తెల్లటి ముత్యాల సరం, గంధపు పూత ఇవన్నీ గీర్వాణికి ఇష్టమైనవి. ఇవన్నీ శాంతికి, స్వచ్ఛతకు చిహ్నాలు. ఏవిధమైన ఆయుధాలూ ఆమె చేతిలో ఉండవు. మనలో ఉన్న అజ్ఞానమనే రాక్షసుడిని సంహరించే విజ్ఞానమనే ఆయుధాన్ని అందించే పుస్తకాన్ని చేతుల్లో పట్టుకుని ఉంటుంది. జ్ఞానం ఉన్న చోట హింసకు, అశాంతికి తావుండదు కదా. ఇంకో ఉపమానంలో తెలుపు శుభ్రతకు, నిర్మలత్వానికి, స్వచ్ఛతకు ప్రతీక. ఈ ప్రకారం సరస్వతి స్వచ్ఛతకు ఆలంబనగా నిలుస్తుంది. అన్నిరకాలైన విద్యలు సరస్వతీదేవి అనుగ్రహంతో లభిస్తాయి. అంటే, విద్య ద్వారా మనిషి స్వచ్ఛంగా తయారై, నిర్మలహృదయంతో ప్రకాశిస్తాడని అర్థం చేసుకోవచ్చు.
- నదుల పరంగా చూస్తే గంగ, యమునలతో కలిసి సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. ఈ కోణంలో చూస్తే జ్ఞానం మనిషిలో అంతర్లీనంగా ప్రవహించాలే కానీ బాహ్యప్రదర్శనల కోసం విజ్ఞానాన్ని ప్రకటించకూడదనే సందేశాన్ని సరస్వతీ నది ద్వారా మనకు అందుతుంది.

బౌద్ధమతం వ్యాప్తిలో ఉన్న కొన్ని ప్రాంతాల్లో సరస్వతీదేవిని మంజుశ్రీ, మహాసరస్వతి, వజ్రసరస్వతి, ఆర్య వజ్రసరస్వతి, వజ్ర వీణా సరస్వతి, వజ్రశారద వంటి పేర్లతో ఆరాధిస్తారు. జైనులు కూడా శృతదేవత, షోడశవిద్యాదేవతగా పూజలు చేస్తారు.

- సరస్వతీదేవి చేతిలో ఉన్న పుస్తకం జ్ఞానానికి సంకేతం. పుస్తకం ద్వారా జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం మనిషిలో తీర్చిదిద్దిన సంపూర్ణ వ్యక్తిత్వానికి, హృదయ నిర్మలత్వానికి ప్రతీక. సంహరించాల్సింది వ్యక్తిని కాదు... అతడిలోని రాక్షస గుణాన్ని మాత్రమే అనే సంకేతాన్ని సరస్వతి చేతిలోని పుస్తకం ద్వారా అందుతుంది.

రుగ్వేదం, దేవీభాగవతం, బ్రహ్మవైవర్త, పద్మపురాణాల్లో సరస్వతీదేవి వర్ణన విస్తారంగా ఉంది. వీటిప్రకారం సరస్వతీదేవి తెల్లటి వస్త్రాలు ధరించి, హంసవాహనాన్ని అధిరోహించి ఉంటుంది. చేతుల్లో వీణ, రుద్రాక్షమాల, పుస్తకం ధరించి ఉంటుంది.

- ఆమె వాహనం హంస. పాలలో కలిసిన నీటిని వేరు చేసి కేవలం పాలను మాత్రమే స్వీకరించే గుణం హంసకు ఉంది. సమాజంలో మంచి, చెడూ పాలూనీళ్లలా కలిసే ఉంటాయి. ఉత్తమ జ్ఞానం కలిగిన వ్యక్తి హంసలాగా చెడును వదిలేసి మంచిని మాత్రమే గ్రహించాలని చెప్పటం హంసవాహనం ఇచ్చే సందేశం.
- అమ్మ చేతిలో వీణ సంగీతానికి ప్రతిరూపం. ఈ వీణ పేరు 'కచ్ఛపి'. చదువంటే కేవలం పుస్తకాల్లో ఉండేది మాత్రమే కాదు. కళలన్నీ చదువులో భాగమే. కళాకారుడు అత్యుత్తమ సంస్కారం, ఆత్మీయత కలిగి ఉంటాడు. మనుషులందరూ ఇలాంటివారు కావాలని సరస్వతి చేతిలోని వీణ చెబుతుంది. అందులో ఏడుతంత్రులు ఉంటాయి. వీటిద్వారా నాదం ఉత్పత్తి అవుతుంది. మనం చూసే ప్రపంచమంతా నాదమయం. పరమేశ్వరుడు నాదస్వరూపుడు. కాబట్టి, పరమేశ్వరుడిని చేరుకోవాలంటే నాదోపాసన చెయ్యాలన్న సందేశం కూడా సరస్వతీదేవి చేతిలోని వీణ చెబుతుంది.



- కమలం వికాసానికి, పవిత్రతకూ చిహ్నం. కమలం పుట్టుక బురదలోనే. కానీ, బురద వాసన, అపవిత్రత దానికి సోకవు. అందుకే అమ్మకు కమలం ఆసనమైంది. అలాగే మనిషి కూడా అనేక అపవిత్రాలు ఉండే సమాజంలో ఉంటూనే తన పవిత్రతను కాపాడుకోవాలి. మనోవికాసాన్ని సాధించాలనే సందేశాన్ని కమలం అందిస్తుంది. మన శరీరంలో ఉండే కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు అందుకు ప్రతీకగా కూడా కమలాన్ని యోగసాధకులు చెబుతారు.
- ఆమె చేతిలోని రుద్రాక్షమాల ఆత్మచైతన్యాన్ని సూచిస్తుంది. కేవలం భౌతికం, లౌకికమైన విద్య మాత్రమే మనిషిని భగవంతుడి వద్దకు చేర్చలేదు. అతడు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి. రుద్రాక్ష సాక్షాత్తు శివస్వరూపం. ఆత్మసాక్షాత్కారం పొందటానికి రుద్రాక్ష మార్గం చూపుతుంది. రుద్రాక్షను రుషులు భూమికి, స్వర్గానికి మధ్య వారధిగా భావిస్తారు.
- సరస్వతీదేవి ధరించే ధవళవస్త్రాలు స్వచ్ఛతకు చిహ్నం. మనిషి కూడా స్వచ్ఛంగా ఉండాలని ఇవి సూచిస్తాయి. తెలుపు వస్త్రం ఏ చిన్న రంగు పడినా అది సహజత్వాన్ని కోల్పోతుంది. చూడటానికి ఇంపుగా ఉండదు. మనిషి కూడా అంతే. ఏ చిన్న అపవాదు వచ్చినా, తప్పు చేసినా ఆ ఫలితం అతడి జీవితాంతం వెన్నంటి ఉంటుంది. అందుకే, ఏ తప్పూ చెయ్యకుండా స్వచ్ఛంగా, తెల్లటి వస్త్రంలా ఉండాలని ధవళ వస్త్రాలు సూచిస్తాయి.

మీ కోసం

అక్షరాభ్యాసం ఎలా చేయాలి?

విద్య బతుకు తెరువును చూపేది మాత్రమే కాక బతుకు పరమార్థాన్ని తెలిపేది అని కూడా మన పెద్దల అభిప్రాయం. ఈ దృష్టితోనే అక్షరాభ్యాసాన్ని ఒక పవిత్రమైన సంస్కారంగా మనవాళ్లు రూపొందించారు. వసంత పంచమి సందర్భంగా పిల్లలతో తొలిసారి అక్షరాలు దిద్దించడం మన ఆనవాయితీ.



- పర్వదినాలు అక్షరాభ్యాసానికి అనువైనవి. ముఖ్యంగా విజయదశమీ, శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రం ఉన్న రోజు, శ్రీపంచమి వంటి పర్వదినాలలో ఈ కార్యక్రమం చేయటంవల్ల ఆ దేవతల ఆశీస్సులూ అనుగ్రహమూ లభించి, విద్యాభివృద్ధికి దోహదం కలిగిస్తుందని మన నమ్మకం.
- సర్వసాధారణంగా అక్షరాభ్యాసం ఐదో ఏట చేస్తారు. ఆ వయస్సు వచ్చేసరికి విషయాన్ని గ్రహించి అర్థం చేసుకుని, మనస్సులో నిలుపుకొనే శక్తి విద్యార్థికి లభిస్తుంది. ఈ కాలంలో దేశకాల పరిస్థితులను బట్టి మూడవయేటనే అక్షరాభ్యాసం చేస్తున్నారు. ఉదయం వేళ ఇంట్లోగానీ, దేవాలయంలోగానీ, పాఠశాలలోగానీ, పెద్దలు, గురువుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించవచ్చు.
- మన సంప్రదాయంలో విద్యాధిదేవతలు కొందరున్నారు. అక్షరాభ్యాసం నాడు ఆ దేవతలను పూజించి విద్యార్థిచేత అక్షరాలు దిద్దించటం సంప్రదాయం. సకల విఘ్నాలనూ తొలగించే వినాయకుణ్ణి, విద్యల దేవత అయిన సరస్వతీ దేవిని అర్చించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. దక్షిణామూర్తి, దత్తాత్రేయుడు, విష్వక్సేనుడు మొదలైనవారిని విద్యాదేవతలుగా పూజిస్తారు.
- ఆ తరువాత 'ఓం నమః శివాయః సిద్ధం నమః' అనే అక్షరాలను విద్యార్థిచేత దిద్దిస్తారు. విద్యాధి దేవత సరస్వతి అయినా, జ్ఞానస్వరూపుడు శివుడు కాబట్టి 'నమశ్శివాయ' అక్షరాలు దిద్దడంతో అక్షరాభ్యాసం ప్రారంభమవుతుంది.
- విద్యార్థితో తొలి అక్షరాలను బియ్యంపై రాయించే ఆచారం కొన్నిచోట్ల ఉంది. ఆ చిన్నారికి ఎప్పుడూ ధనధాన్యాలు సమృద్ధిగా చేకూరాలని దీవించడమే ఇందులోని అంతరార్థం.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణ

ఈనాడు సినిమా


నాగచైతన్య

ప్రేమ మజిలీ

జీవితంలో ఒకొక్క దశ ఒక్కో మజిలీ. ఒక యువ జంట సాగించిన ప్రేమ మజిలీ వెనక సంఘర్షణ ఎలాంటిదో తెలియాలంటే మా చిత్రం చూడాల్సిందే అంటున్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మజిలీ'. దేర్ ఈజ్ లవ్... దేర్ ఈజ్ పెయిన్ అనేది ఉపశీర్షిక. సమంత, దివ్యాంశ కౌశిక్ కథానాయికలు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. ఇటీవలే విశాఖపట్నం పరిసరాల్లో రెండు గీతాల్ని, కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. నాగచైతన్య, సమంత పెళ్లి తర్వాత కలిసి నటిస్తున్న చిత్రమిది. ఇందులో నాగచైతన్య రెండు కోణాల్లో సాగే పాత్రల్లో కనిపించనున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఈ ఏడాదిలోనే...: 'మజిలీ'లో నటిస్తూనే, 'వెంకీమామ' కోసం రంగంలోకి దిగనున్న నాగచైతన్య మరో చిత్రానికి కూడా పచ్చజెండా ఊపినట్టు తెలుస్తోంది. యువ దర్శకుడు ప్రవీణ్ సత్తారు చెప్పిన కథ నచ్చడంతో, ఈ ఏడాదిలోనే ఆ సినిమాని కూడా పట్టాలెక్కించాలని నాగచైతన్య నిర్ణయించినట్లు సమాచారం.


షాలిని పాండే, కళ్యాణ్‌రామ్

పూల చెట్టు కళ్ల ముందే పువ్వులేమో కొమ్మ పైనే

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం '118'. నివేదా థామస్, షాలినీ పాండే నాయికలు. కె.వి గుహన్ దర్శకుడు. మహేష్ కోనేరు నిర్మాత. మార్చి 1న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. శుక్రవారం '118'లోని తొలి పాట బయటకు వస్తోంది. 'చందమామే చేతికందే.. వెన్నెలేమో మబ్బుల్లోనే, పూలచెట్టే కళ్ల ముందే, పువ్వులేమో కొమ్మ పైనే' అంటూ సాగే ఈ గీతాన్ని రామాంజనేయులు రచించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఇదో థ్రిల్లర్. 118 అనే టైటిల్ ఎందుకు పెట్టాం? అనేది ఆసక్తికరం. ఈ అంకె చుట్టూనే కథ నడుస్తుంది. థ్రిల్లర్ చిత్రమే అయినా ప్రేమ, భావోద్వేగాలకూ చోటుంది. పాటలు ఆకట్టుకుంటాయి. పోరాట ఘట్టాలు కొత్తగా కనిపిస్తాయ"న్నారు.

ప్రయాణం అలా ఉండాలి

సినిమాని ఒకొక్కరు ఒక్కో కోణంలో చూస్తుంటారు. నటులకి మాత్రం అదొక జీవితం. ప్రతి పాత్ర ఓ కొత్త జీవితాన్ని అనుభవించేలా చేస్తుంది. కథ విన్నాక 'ఇందులో పాత్రకి న్యాయం చేయగలనా లేదా?' అని ఒకసారి, 'ఇది ప్రేక్షకులకు నచ్చుతుందో లేదో?' అని మరొకసారి... ఇలా ప్రతి దశలోనూ ప్రశ్నలతో కూడిన ప్రయాణం చేస్తుంటారు నటులు. నాలో అలాంటి ప్రశ్నలు ఎక్కువే పుడుతుంటాయని చెబుతోంది కీర్తి సురేష్. కానీ చివరికి ఆ ప్రశ్నలన్నీ మేలే చేస్తాయని చెబుతోంది. "ఒక సినిమా చేస్తున్నప్పుడు సవాలక్ష సందేహాలు, భయాలు తలెత్తుతుంటాయి. వాటన్నింటికీ దర్శకుడి దగ్గర సమాధానం ఉంటుంది. కానీ ఒక నటిగా నాలో భయం తగ్గదు. ప్రతి సినిమాకీ ఇదే అనుభవం. అయితే ఆ భయం వల్లే చేస్తున్న పాత్రపై మరింత శ్రద్ధ పెడుతుంటానేమో అని నా అభిప్రాయం. చేసిన సినిమాల్ని చూస్తున్నప్పుడు... 'నిజంగా అప్పట్లో ఈ పాత్ర గురించి అంతగా భయపడకపోయి ఉంటే ఇలా వచ్చి ఉండేది కాదేమో కదా' అనిపిస్తుంటుంది. ఫలితాలపై ఉత్కంఠ కూడా మంచిదే. చేస్తున్న సినిమా కచ్చితంగా విజయవంతం అవుతుందని తెలిసినప్పుడు మనం దాన్ని తేలిగ్గా తీసుకొనే ప్రమాద ముంది. అందుకే సినిమా ప్రయాణం ఓ సస్పెన్స్ కథ లాగే ఉండాల"ని చెప్పింది కీర్తి. గతేడాది 'మహానటి'తో ఘన విజయాన్ని సొంతం చేసుకొన్న ఆమె, ఈసారి ఓ నాయిక ప్రాధాన్య చిత్రంలో నటిస్తోంది.


కీర్తి సురేష్

'మలుపు' దర్శకుడితోనే?

అఖిల్ అక్కినేని తన మూడో చిత్రం 'మిస్టర్ మజ్ను'తో సందడి చేస్తున్నారు. ఇదే నెలలో ఆయన నాలుగో చిత్రాన్నీ ప్రకటించబోతున్నారు. ముగ్గురు దర్శకులు అఖిల్ కోసం కథలు సిద్ధం చేసి వినిపించినట్టు తెలిసింది. ఆయన మాత్రం సత్యప్రభాస్ పినిశెట్టితో సినిమా చేయాలని నిర్ణయించుకొన్నట్టు తెలుస్తోంది. ప్రముఖ దర్శకుడు రవిరాజా పినిశెట్టి తనయుడే సత్య ప్రభాస్. ఆయన తన తమ్ముడు ఆది పినిశెట్టి కథానాయకుడిగా నటించిన 'మలుపు'తో దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే ప్రతిభ ఉన్న దర్శకుడు అనిపించుకొన్న సత్యప్రభాస్ చాలా రోజులుగా అఖిల్ కోసం కథని సిద్ధం చేస్తున్నారు. ఈ కలయికలో సినిమా గురించి త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి.


అఖిల్ అక్కినేని

కొత్త కబుర్లు


యష్


సంజయ్‌దత్

రెండో చాప్టర్‌లో సంజయ్‌దత్

కన్నడ చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన చిత్రం 'కె.జి.ఎఫ్'. యశ్ కథానాయకుడిగా నటించిన ఆ చిత్రం కన్నడలో రూపొందినా, దేశవ్యాప్తంగా విడుదలైంది. హిందీ, తమిళం, తెలుగు ప్రేక్షకులు కూడా ఆ సినిమా గురించి ప్రత్యేకంగా మాట్లాడుకొన్నారు. రికార్డు స్థాయి వసూళ్లు సొంతం చేసుకొన్న ఆ చిత్రానికి కొనసాగింపుగా మరో సినిమా తెరకెక్కబోతోంది. తొలి చిత్రం 'కె.జి.ఎఫ్ చాప్టర్1'గా విడుదలైంది. మలి చిత్రం 'చాప్టర్ 2'గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇందులో హిందీ కథానాయకుడు సంజయ్‌దత్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్టు సమాచారం. ఆ మేరకు సంజయ్‌దత్‌తో చిత్రబృందం సంప్రదింపులు జరుపుతోంది. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలున్నాయి.


రణ్‌వీర్‌సింగ్

ఆమీర్.. సల్మాన్ పాత్రల్లో రణ్‌వీర్... వరుణ్?

'అందాజ్ అప్నా అప్నా'... ఈ చిత్రం అప్పట్లో పెద్ద హిట్. అది మంచి కామెడీ చిత్రంగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయింది. ఆమీర్ ఖాన్, సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఆ చిత్రం విడుదలై ఈ ఏడాదికి 25 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా ఈ చిత్రాన్ని రీమేక్ చేసే ఆలోచనలో ఉన్నారట నిర్మాతలు వినయ్ సిన్హా, ప్రీతి సిన్హా. ఓ కొత్త తరహా కథనంతో ఈ చిత్రాన్ని మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనేది వాళ్ల ఉద్దేశమట. ఈ రీమేక్ చిత్రంలో రణ్‌వీర్ సింగ్, వరుణ్ ధావన్ నటిస్తున్నారంటూ వార్తలొస్తున్నాయి. ఇదే విషయాన్ని ఆమీర్ ఖాన్‌ను అడిగితే "ఆ వార్తల్లో నిజానిజాలు నాకూ తెలియదు. కానీ ఆ సినిమాను ఇప్పుడు తీస్తే రణ్‌వీర్, వరుణ్ చక్కగా సరిపోతారు. అప్పట్లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు ఆ చిత్రాన్ని రీమేక్ చేస్తారో, సీక్వెల్ తెరకెక్కిస్తారో తెలియదు గానీ, ఎలా తీసినా ప్రేక్షకులు ఆదరిస్తారు" అని చెప్పారు.



వరుణ్ ధావన్

మీసం తిప్పాల్సిందే

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తిప్పరా మీసం'. నిక్కీ తంబోలీ, రోహిణి కథానాయికలు. కృష్ణ విజయ్ దర్శకుడు. రిజ్వాన్ నిర్మాత. బుధవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఇదో యాక్షన్ డ్రామా. శ్రీవిష్ణు ఇదివరకెప్పుడూ కనిపించని పాత్రలో దర్శనమిస్తాడు. 'అసుర'తో విమర్శకుల ప్రశంసలు అందుకున్న విజయ్ ఈ కథని తెరకెక్కించిన విధానం ఆశ్చర్యపరుస్తుంది. సురేష్ బొబ్బిలి అందించిన స్వరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయ"న్నారు. అచ్యుత రామారావు, బెనర్జీ, రవి ప్రకాష్, రవి వర్మ, ప్రవీణ్, నేహా దేశ్ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు.


శ్రీవిష్ణు

యాత్ర.. రాజకీయ చిత్రం కాదు


మహి వి. రాఘవ్, దిల్‌రాజు, విజయ్ చిల్లా

"ఒకప్పుడు సినిమా ఫర్వాలేదనేలా ఉన్నా వసూళ్లు మెల్లమెల్లగా పుంజుకొనేవి. ఇప్పుడు సినిమా నిలబడాలంటే ప్రారంభ వసూళ్లు రావల్సిందే. 'యాత్ర' విడుదలకి మరో రెండు రోజులు సమయం ఉన్నప్పటికీ బుకింగ్స్ రూపంలో బలమైన ప్రారంభ వసూళ్లు వస్తున్నాయి" అన్నారు ప్రముఖ నిర్మాత దిల్ రాజు. ఆయన 'యాత్ర' సినిమాని నైజాం, విశాఖపట్నం ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్నారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి రాజకీయ జీవితంలో కీలకఘట్టమైన పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. మమ్ముట్టి ముఖ్య భూమిక పోషించారు. మహి వి.రాఘవ్ దర్శకుడు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించారు. చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ "వై.ఎస్ జరిపిన పాదయాత్రలోని సంఘటనల్ని, భావోద్వేగాల్ని ఆసరాగా చేసుకొని మహి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఎన్టీఆర్ తర్వాత అలాంటి ఓ ఇమేజ్ ఉన్న గొప్ప నాయకుడు రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందిన 'యాత్ర' విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అన్నారు. నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ "ఇది రాజకీయ చిత్రం కాదు. ఇందులో వివాదాలు లేవు. రాజశేఖర్‌రెడ్డి వ్యక్తిత్వం, స్ఫూర్తికి సంబంధించింది. ఆయన అభిమానులకి మాత్రమే కాకుండా, సినీ ప్రేమికులంతా ఆస్వాదించేలా చిత్రాన్ని రూపొందించాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ చిత్రం చూడటానికి ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. సినిమా చాలా బాగా వచ్చింది. వై.ఎస్.ఆర్ చిత్రం అంటే అందరికీ ఇష్టం ఉండొచ్చు, లేకపోవచ్చు. అంతమాత్రాన ఎవరినీ అగౌరవపరిచేలా వ్యవహరించకూడదు" అన్నారు.

పోలీస్ ఎందుకు మారాడు?


శిరీష

ఎన్.ఆర్. రెడ్డి ప్రధాన పాత్రధారిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'ఉన్మాది'. ఎన్.రామారావు నిర్మాత. కరణ్‌రెడ్డి సమర్పిస్తున్నారు. శుక్రవారం చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. దర్శకుడు మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. ఆపదలో ఉన్నవాళ్లకి అభయహస్తం అందించే పోలీసు కర్కశంగా ఎందుకు మారాడు? ఆయన ఉన్మాదిగా మారడానికి దారి తీసిన పరిస్థితులు ఏంటో తెరపైనే చూడాల'న్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: దంటు వెంకట్.

వెంకటేష్ మెచ్చుకున్నారు


టువ, ఈశ్వర్, అంకిత

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '4 లెటర్స్'. ఆర్.రఘురాజ్ దర్శకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. చిత్రాన్ని ఈ నెల 22న విడుదల చేయనున్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "హీరో వెంకటేష్ ప్రచార చిత్రాల్ని మెచ్చుకుని చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నేటితరం ఆలోచనలకి తగ్గట్టుగా సాగే ప్రేమకథా చిత్రమిద"న్నారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందన్నారు నిర్మాతలు.

సాంకేతిక మాయ 'సువర్ణ సుందరి'


పూర్ణ, సాగర్, బి.గోపాల్, సూర్య, తమ్మారెడ్డి భరద్వాజ, సాక్షి చౌదరి, లక్ష్మి

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి, ఇంద్ర, రామ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'సువర్ణ సుందరి'. ఎం.ఎస్.ఎన్.సూర్య దర్శకుడు. ఎం.ఎల్.లక్ష్మి నిర్మాత. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని దర్శకులు బి.గోపాల్, తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. బి.గోపాల్ మాట్లాడుతూ "ప్రచార చిత్రం చూస్తుంటే చిత్రబృందం తపన కనిపిస్తోంది. వాళ్ల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాల"న్నారు. "ఈ చిత్రం పూర్తిగా కొత్తకోణంలో సాగుతుందని ప్రచార చిత్రాలు చూడగానే అర్థమవుతోంద"న్నారు తమ్మారెడ్డి భరద్వాజ. దర్శకుడు మాట్లాడుతూ "స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే చిత్రమిది. విజువల్ ఎఫెక్ట్‌కి ప్రాధాన్యం ఉంది. మూడు తరాల కథ 'సువర్ణ సుందరి' చిత్రాన్ని నడిపిస్తుంద"న్నారు. పూర్ణ మాట్లాడుతూ "నా పాత్ర రెండు కోణాల్లో ఉంటుంద"ని చెప్పింది. "కత్తి యుద్ధాల కోసం ప్రత్యేకమైన తర్ఫీదు పొందాను. ఆ పోరాటాలు థ్రిల్ కలిగిస్తాయ"ని చెప్పింది సాక్షి చౌదరి. "త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు నిర్మాత.

వసుంధర

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో మహిళా చైతన్యం వెల్లివిరిసింది. ఓటింగ్‌లోనే కాదు... ఎన్నికల్లో అధికారాన్ని అందుకున్న మహిళల శాతం కూడా ఎక్కువే. అలా నారాయణఖేడ్ మండలానికి చెందిన నర్సాపూర్, శేరి తండా గ్రామాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలంలోని మాచినేపల్లి గ్రామాలు స్త్రీ శక్తికి నిదర్శనంగా నిలిచాయి.



అతివలకు పట్టం... అభివృద్ధే ధ్యేయం!

వెనకబాటుతనానికి పర్యాయపదం ఆ ప్రాంతం. కరవు కాటకాలతో అల్లాడుతూ వలసలకు పెట్టింది పేరు. మొన్నటి వరకు కొన్ని తండాలకు రహదారి సౌకర్యమూ లేదు. అక్షరజ్ఞానమూ అంతంతమాత్రమే. ఇప్పుడు మహిళా సాధికారతను పెంచే విషయంలో మా తరువాతే ఎవరైనా అంటూ చాటుకున్నారు. రెండు పంచాయతీల పాలకవర్గాల్లో పూర్తిగా మహిళలే ఉండేలా చొరవ తీసుకుని అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే నారాయణఖేడ్ మండలానికి చెందిన నర్సాపూర్, శేరితండా గ్రామ ప్రజలు. నర్సాపూర్‌లో ఎనిమిది మంది వార్డు సభ్యులతో పాటు సర్పంచ్‌గా మహిళలనే ఏకగ్రీవంగా ఎన్నుకోగా... శేరితండాలో ఎనిమిది మందిలో 5 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌తో పాటు మరో మూడు వార్డుల్లో ఎన్నికలు నిర్వహించారు. అందరూ మహిళలే పోటీపడటం విశేషం.

మహిళలను గౌరవించాలనే: నారాయణఖేడ్ మండలంలోని నర్సాపూర్ గ్రామ జనాభా 557. ఈసారి ఎన్నికల్లో ఇక్కడ సర్పంచ్ స్థానం బీసీ(జనరల్)కి, నాలుగు వార్డులు మహిళలకు కేటాయించారు. దీంతో గ్రామస్థులంతా కలిసి మహిళలను గౌరవించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకోవాలనుకున్నారు. ఊరంతా వార్డు సభ్యులు, ఉప సర్పంచ్, సర్పంచ్ ఇలా అందరూ మహిళలే ఉంటే గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని భావించారు. 'ఊర్లో ఉన్న పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. అంగన్‌వాడీకి సరైన భవనం లేదు. సీసీ రోడ్లు కూడా పూర్తిగా లేవు. ఏకగ్రీవంగా చేసుకుంటే వచ్చే ప్రోత్సాహక నగదుతో అభివృద్ధి చేసుకోవచ్చని అనుకున్నాం. మహిళలనే ఏకగ్రీవంగా ఎన్నుకుంటే వచ్చే గుర్తింపుతోనూ మరిన్ని నిధులు రాబట్టి పల్లెను బాగు చేసుకోవాలనుకున్నాం. అలా మాకు పగ్గాలు అప్పగించారు' అని చెబుతున్నారు నర్సాపూర్ సర్పంచ్ అరవైఏళ్ల గోసాయిపల్లి నాగమ్మ.

తొలి పాలకవర్గం: శేరితండాలో 344 మంది ఓటర్లు. ఇది ఒకప్పుడు చాప్టా(కె) పంచాయతీ పరిధిలో ఉండేది. నూతన పంచాయతీగా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ఈ గ్రామ ప్రజలు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. మహిళలకు రిజర్వు చేసిన ఐదు వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారు. మిగతా మూడు వార్డుల్లోనూ మహిళలే పోటీ చేసేలా చూశారు. ఇక్కడ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించారు. ఇలా ఈ పంచాయతీలో ఎనిమిది వార్డుల్లో మహిళలే. 'నేనొక్కదాన్నే 7 వరకు చదువుకున్నా. అధికారులు, గ్రామస్థుల సహకారం తీసుకొని పాలనలో మార్దైన ముద్ర వేస్తాం.' అని ధీమాగా చెబుతున్నారు శేరితండా ముప్ఫైఅయిదు సంవత్సరాల సర్పంచ్ సాంకిబాయి.

పైడిపల్లి తరహాలో: 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఈ మండలంలోని పైడిపల్లిలో గ్రామస్థులంతా ఇదే తరహాలో నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డుసభ్యులుగా మహిళలనే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏకగ్రీవంగా ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతను నిర్వర్తించారు. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినందుకు వచ్చిన నిధులతోపాటు ఎమ్మెల్యే నిధులు తెప్పించుకొని గ్రామంలో తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపారు. ఇప్పుడు పైడిపల్లి తోవలోనే ఇదే మండలంలోని మరో రెండు పంచాయతీలు ముందడుగు వేయడం శుభపరిణామం.



కృషి చేస్తాం కలిసికట్టుగా...

తాజాగా తెలంగాణలో జరిగిన పంచాయతీ పోరులో నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలంలోని మాచినేపల్లి గ్రామపంచాయతీలో వార్డు మెంబరు నుంచి సర్పంచి వరకూ మహిళలే గెలిచారు. నలుగురికీ మంచి చేయాలన్న ఆలోచన... మార్పుకోసం ప్రయత్నించే శక్తే వారిని గెలిపించింది. వీళ్లలో చాలామంది పురుషులతో పోటీపడినవారే. 'మా గ్రామ జనాభా సుమారు వెయ్యి. నేను డిగ్రీ చదివా. మా వార్డు సభ్యుల్లో చాలామందికి కనీస చదువూ లేదు. అయినా డ్వాక్రా సంఘాల్లో చురుకే. మా ఇళ్లను చక్కబెట్టుకున్నట్లే మా ఊరినీ తీర్చిదిద్దుకోవాలనేదే మా లక్ష్యం. కలిసికట్టుగా మా ప్రాంతాలను అభివృద్ధి చేసి మా మహిళాశక్తిని చాటిచెబుతాం. వందశాతం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేస్తాం. భూగర్భమురుగు నీటిపారుదల వ్యవస్థ ఏర్పాటు, మహిళలకు ఉపాధి కోసం స్థానికంగా కుట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం వంటివి మా ఎజెండాలో ఉన్నాయి...' అని అంటారు సర్పంచి సుధారాణి.

– సి. గోపి, -న్యూస్‌టుడే, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా
రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి



ఆ అమ్మాయికి ఆకాశం, నక్షత్రాలంటే ఇష్టం. అంతరిక్షం గురించి తెలుసుకోవాలనే ఆరాటం. ఆ ఆసక్తి, తపనే ఆమెను పరిశోధనల వైపు నడిపించాయి. గుర్తింపునూ తెచ్చిపెట్టాయి. పిన్నవయసులోనే రాష్ట్రపతి నుంచి అవార్డును అందుకుంది. తాజాగా యోనో ఎస్‌బీఐ '20 అండర్ 20' అవార్డును గెలుచుకుంది. ఆమే విజయవాడకు చెందిన పోతునూరి లయ.

పరిశోధనల లయ!

'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'యోనో ఎస్‌బీఐ 20 అండర్ 20' పోటీని నిర్వహించింది. క్రీడలు, ఆవిష్కరణలు, నటన... ఇలా పది విభాగాల నుంచి కొంతమంది ప్రతిభావంతుల్ని ఎంపిక చేసింది. ప్రామిసింగ్ గేమ్ ఛేంజర్ ఫిమేల్ విభాగంలో నాకు ఈ అవార్డు వచ్చింది. ఇందుకు దేశవ్యాప్తంగా 20 ఏళ్లలోపు వారిని ఎంపికచేశారు. వడపోతల అనంతరం 60 మందిని తీసుకున్నారు. దేశవ్యాప్తంగా పబ్లిక్ ఓటింగ్ ద్వారానే విజేతల్ని ఎంపిక చేశారు. చివరకు ఇరవై మంది తేలితే వారిలో నేనూ ఉన్నా. వాహన కాలుష్యాన్ని నివారించే ఫిల్టరును తక్కువ ఖర్చుతో తయారు చేశా. ఆ ఆవిష్కరణతోపాటు నాకు వచ్చిన జాతీయ అవార్డులను పరిగణించే ఈ పురస్కారాన్ని ఇచ్చారు. ఇప్పుడు సింగపూర్‌లోని నాన్‌యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో బి.టెక్. మెకానికల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నా. పరిశోధనలు చేయడానికి ఆసియాలోనే ఉత్తమమైన యూనివర్సిటీ ఇది.

- నేను పదో తరగతిలో ఉన్నప్పుడు ద హిందు పత్రిక 'బడ్డింగ్ సైంటిస్ట్' పేరుతో ఓ పోటీని పెట్టింది. 'మైక్రోబియల్ ఫ్యూయల్ సెల్' అనే పేరుతో వంటింటి వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే పరికరాన్ని తయారుచేశాం. ఆ ప్రయోగం నన్ను విజేతను చేసింది.
- ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు 'ఇన్నోవేషన్' విభాగంలో 2016 - నేషనల్ చైల్డ్ అవార్డ్ ఫర్ ఎక్సెప్షనల్ అచీవ్‌మెంట్ అవార్డును అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నా. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆ పురస్కారాన్ని అందుకున్న విద్యార్థినిని నేనే.

ఆ పుస్తకాలే ఎక్కువగా... మాది విజయవాడ. నాన్న సాంబశివరావు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఉద్యోగి. అమ్మ శ్రీదేవి గృహిణి. నాకో తమ్ముడు. నేను చిన్నప్పటి నుంచి స్కూల్లో జరిగే ప్రతి పోటీలో పాల్గొనేదాన్ని. ఆటలు, పాటలు, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాస రచన... ఇలా పోటీ ఏదైనా నేను పాల్గొనాల్సిందే. ఇప్పటి వరకు నాకు వీటన్నింటిలో దాదాపు ఎనభై దాకా ప్రశంసాపత్రాలు, బహుమతులు వచ్చాయి. నాకు లెక్కలంటే చాలా ఇష్టం. అలాగే స్పేస్ కూడా. అందుకే దానికి సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. నా పుట్టిన రోజులకు కూడా స్నేహితులు అంతరిక్షానికి సంబంధించిన పుస్తకాలనే బహుమతులుగా ఇచ్చేవారు. ఇలా నాకు తెలియకుండానే అంతరిక్షంపై ఇష్టం ఏర్పడింది. విజయవాడ గుణదలలోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో చదివా. శారదా కాలేజీలో ఇంటర్ పూర్తిచేశా.

స్కూలు నుంచే... ఎనిమిదో తరగతి నుంచే జాతీయ స్థాయి సైన్స్ పోటీల్లో పాల్గొనేదాన్ని. పదో తరగతిలో ఆంధ్రప్రదేశ్ తరఫున మైసూర్‌లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌కు ప్రాతినిథ్యం వహించా. ఎకో సిస్టమ్ అనే విభాగంలో మడ అడవులపై పరిశోధన చేశా. దీనికి అవార్డు వచ్చింది. రోజంతా పరిశోధనలతోనే గడిచిపోయేది. ఓ వైపు చదువుతూనే అన్నింటినీ సమన్వయం చేసుకునేదాన్ని. తమ్ముడికి ఆరోగ్యం సరిగా ఉండదు. ఆ సమయంలోనే నాన్నకు కడప ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అయినా అమ్మ నాకు ఏ కష్టం కలగకుండా చూసింది. ఇలా అందరి సహకారం వల్లే నేను ప్రయోగాలతో పాటు టెన్త్‌లో పదికి పది తెచ్చుకున్నా. ఇప్పుడు ఇటువైపు వచ్చా.

నజరానా

పెదాలు నల్లగా మారాయా... చెంచా చక్కెరను పెదాలకు అద్ది ఐదు నిమిషాలయ్యాక బ్రష్‌తో కడిగేయాలి. దీనివల్ల మృతకణాలు పోతాయి. ఆ తరువాత రెండు చెంచాల బీట్‌రూట్ రసంలో చెంచా గులాబీనీరు, కొద్దిగా తేనె కలిపి పెదాలకు పూతలా రాసుకోవాలి. పది నిమిషాలయ్యాక కడిగేయాలి. ఇలా రెండురోజులకు ఒకసారి చేస్తుంటే మార్పు కనిపిస్తుంది.



వారానికోరోజు మజ్జిగ చాలు



ఇంటి వైద్యం

ఇంట్లో పేరుకొనే చెత్తను ఎప్పటికప్పుడు తీసేస్తాం. మరి మన శరీరంలో పేరుకొనే మలినాలు. వాటినీ తొలగించాలి లేదంటే అనారోగ్యాలు దాడిచేస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించడమే కాదు... అవి పేరుకోకుండా కూడా జాగ్రత్తపడాలి. అందుకు ఆయుర్వేద పరంగా ఏం చేయాలో చూద్దామా...

శరీరంలో పేరుకునే రోగకారకాలను టాక్సిన్లు (ఆమం) అంటారు. ఇవి శరీరంలో పేరు కోకుండా ఉండటానికి, అలాగే పేరుకున్న వాటిని బయటికి పంపడానికి పలు పద్ధతులను ఉపయోగించవచ్చు. వాటినే 'లంఘన చికిత్సలు' అంటారు. వీటిలో కొన్నింటిని వైద్యుల పర్యవేక్షణలోనే చేయాలి. అలాగే మరికొన్ని తేలిక పద్ధతులను మనమే సొంతంగా చేసుకోవచ్చు. 'ఉపవాసం', 'పాచనం' అనే రెండు పద్ధతుల ద్వారా శరీరంలోని మలినాలను బయటికి పంపించొచ్చు. ఈ పద్ధతుల్లో భాగంగా మనం తీసుకునే ఆహారాన్నే 'డిటాక్స్ డైట్స్' అంటారు.

నిమ్మరసం, మజ్జిగ: వారంలో ఒక రోజు ఆహారంలో భాగంగా ఘనపదార్థాలను మానేసి, కేవలం ద్రవపదార్థాలను మాత్రమే తీసుకోవాలి. ఇలా చేస్తే, శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయి. ఇందుకు నిమ్మ రసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు తాగాలి. అలాగే పండ్లు మాత్రమే తినడం వల్ల కూడా శరీరంలో మలినాలు వెలుపలికి పోతాయి.

* ఉపవాసం చేయలేని వారు వారానికి ఒక రోజు కేవలం జావ తీసుకున్నా కూడా శరీరంలో పేరుకున్న వ్యాధి కారకాలను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం అర కప్పు బియ్యం, కప్పు పెసరపప్పును విడివిడిగా వేయించి, రెండింటినీ కలిపి కొంచెం బరకగా రవ్వలా మిక్సీ పట్టి భద్రపరుచుకోవాలి. కప్పు రవ్వకి నాలుగు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీళ్లను పొయ్యిమీద పెట్టాలి. అవి మరుగుతున్నప్పుడు రవ్వ వేయాలి. అది ఉడికి, జావలా తయారయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసిన తాలింపు, చెంచా నెయ్యి వేసుకుని వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలి. ఇలా రోజులో రెండు లేదా మూడు సార్లు ఈ జావని తీసుకుంటే చాలు. ఇలా వారానికి ఒకసారైనా ఘనపదార్థాలు తగ్గించడం మంచిది.

శరీరంలో అనేక రసాయన చర్యలు జరుగుతాయి. వాటిలో భాగంగానే కొన్ని మలినాలు శరీరం నుంచి విడుదలవుతూ ఉంటాయి. ఆహారం జీర్ణమయ్యాక, శ్వాస తీసుకునేటప్పుడు, కండరాల కదలిక... ఇలా ప్రతీ చర్యలోనూ మలినాలు విడుదలవుతూనే ఉంటాయి. ఇవి మలం, మూత్రం, నిశ్వాస, చెమట రూపంలో బయటికి వెళ్లిపోయేలా మన శరీరంలో ఏర్పాట్లున్నాయి. ఇవన్నీ సక్రమంగా జరిగి, శరీరంలో మలినాలు పేరుకోకుండా ఉంటేనే అనారోగ్యాలు దరిచేరవు.



జీర్ణశక్తిని పెంచుకుంటే...

ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియనే 'పాచనం' అంటారు. మనం తీసుకునే ఆహారం సంపూర్ణంగా జీర్ణమైతే శరీరంలో వ్యాధి కారకాలు పేరుకోవు. అందుకే తేలికగా జీర్ణమయ్యే పదార్థాలనే ఎంచుకోవాలి. అలాగే పొట్ట నిండేవరకు తినకూడదు. ఒకసారి తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణమయ్యేవరకు మళ్లీ ఏదీ తినకూడదు. రాత్రిపూట ఎనిమిది గంటల్లోపే ఆహారాన్ని తీసుకోవాలి. ఈ నియమాలను పాటిస్తే మలినాలు పేరుకొనే సమస్య ఉండదు.

కొన్ని పదార్థాలు జీర్ణశక్తిని పెంచుతూనే, మలినాలను కూడా తగ్గిస్తాయి. అదెలాగంటే...

* ఆహారం తినే ముందు అరచెంచా అల్లం ముక్కలు, చిటికెడు సైంధవ లవణం కలిపి తినాలి. తేలిగ్గా జీర్ణమవుతుంది.

* శొంఠిని నేతిలో వేయించి పొడి చేసి భద్రపరుచుకోవాలి. అన్నంలో మొదటి ముద్దను శొంఠి, నెయ్యి కలిపి తీసుకోవాలి.

* లీటరు నీళ్లను కాచి, వేడిగా ఉన్నప్పుడే ఫ్లాస్కులో పోయాలి. అందులో కొద్దిగా అల్లం ముక్కలు, పావు చెంచా చొప్పున జీలకర్ర, సోంపు, కొద్దిగా మిరియాల పొడి, ఎనిమిది పుదీనా ఆకులు వేసి మూత పెట్టేయాలి. రోజు మొత్తంలో ఈ నీటిని కొద్దికొద్దిగా తాగుతుంటే మలినాలు తొలగిపోతాయి. ఇటువంటి తేలికపాటి చిట్కాలు పాటిస్తే, వ్యాధులబారిన పడకుండా ఉండొచ్చు.



డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం

మీ ప్రశ్నలు ఇకపై vasuayur @eenadu.net కు పంపించగలరు.

చదువుకు... పొదుపు ఎలా?

మా అబ్బాయికి ఇప్పుడు ఏడో నెల. వాడి పేరు మీద ప్రతి నెల రూ.5వేలు పొదుపు చేయాలనుకుంటున్నా. ఇది వాడి చదువులకు ఉపయోగపడాలి. ఎటువంటి మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకుంటే బాగుంటుంది?

- ఓ సోదరి

ఇప్పటి నుంచే మీ బాబు కోసం పొదుపు చేయాలనే మీ ఆలోచన మంచిదే. ప్రముఖ విద్యాలయాల్లో పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు సుమారుగా ఫీజు నాలుగింతలు పెరిగింది. ఐఐఎం-అహ్మదాబాద్‌లో 2018లో రెండు సంవత్సరాల కోర్సుకు కలిపి రూ.19.5 లక్షలు ఉంది. ఇది 2007లో రుసుముకు నాలుగింతలు. ప్రతి సంవత్సరం ఇలాగే 20 శాతం చొప్పున ఫీజులు పెరుగుతూ పోతే ఐఐఎం-అహ్మదాబాద్‌లో 2042లో ఫీజు సుమారుగా 95లక్షల వరకు ఉండొచ్చు. అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల రుసుములు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఐఐటీలో ట్యూషన్ ఫీజు రూ.90 వేల నుంచి రూ.2లక్షల వరకు పెరిగింది. ఇది కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే. ఇంకా అసలు రుసుము ఎక్కువగానే ఉంటుంది. ఇంజినీరింగ్ కూడా అంతే. మీ చేతిలో ఇంకా 12 నుంచి 15 ఏళ్ల సమయం ఉంది కాబట్టి సిప్ రూపంలో ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు ప్రయత్నించండి.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే అప్పుడు పెరిగిన ధరల ఆధారంగా మీకు ఆదాయం వస్తుంది. మీ బాబు కళాశాలలో చేరేందుకు ఇంకా సుమారుగా 13 నుంచి 15 సంవత్సరాల సమయం పట్టొచ్చు. కాబట్టి మీరు కూడా మీ పెట్టుబడి 12 నుంచి 15 సంవత్సరాల వరకు కొనసాగించేలా చూసుకోండి. ఎటువంటి హెచ్చుతగ్గులకు గురికాకుండా బాగా స్థిరపడిన లార్జ్ క్యాప్ కంపెనీలలో పెట్టుబడి పెట్టండి. ఇవి మీకు మంచి రాబడిని ఇవ్వగలుగుతాయి. సుమారుగా 12 నుంచి 22 శాతం వరకు మీరు ఆదాయాన్ని పొందగలుగుతారు. మార్కెట్ స్థిరంగా లేనప్పుడు సైతం మీరు పొందే ఆదాయంలో మార్పు ఉండకపోవచ్చు.


మిడ్ క్యాప్ ఫండ్స్ కంపెనీలలో స్థిరత్వం ఉండదు. అవి చిన్న చిన్న విషయాలకే హెచ్చుతగ్గులకు గురవుతాయి. మరో విషయం మరచిపోకండి. మీరు పెట్టుబడి పెట్టిన డబ్బును మీ బాబు కళాశాలలో చేరే ఒక సంవత్సరం కంటే ముందే మీ చేతికి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. సరిగ్గా మీ పిల్లాడు కాలేజీలో చేరే సమయానికే డబ్బు తీసుకోవాలంటే అప్పుడు మార్కెట్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఇది మీ రాబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి ఆలోచించి ఓ నిర్ణయానికి రండి.



- స్వప్న కంతేటి, ఆర్థిక రంగ నిపుణురాలు

మీ ప్రశ్నలు ఇకపై vasufin@eenadu.net కు పంపించగలరు.

email: vasundhara @eenadu.net



6 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	34,360	34,420	33,750	33,700
ఆర్నమెంట్	32,090	32,130	31,350	31,300
వెండి (కిలో)	41,430	41,650	41,700	41,700
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	33,680	33,700	34,035	34,380
ఆర్నమెంట్	31,220	31,220	31,082	31,810
వెండి (కిలో)	41,500	41,500	41,300	41,600
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	34,060	34,260	------	------
ఆర్నమెంట్	31,680	31,870	3,182	3,181 గ్రా
వెండి (కిలో)	41,500	41,750	43.60	44.00గ్రా

మహిళల కోసం... పింక్ మార్కెట్!



మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులు వారే విక్రయించుకునేలా ఒక కేంద్రం... రద్దీ ఉన్న ప్రదేశంలో స్త్రీలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేకంగా మరుగుదొడ్లు... చిన్నారులకు పాలిచ్చేందుకు అనువైన గది... ఇవన్నీ ఒకే చోట... అన్నింటికీ అతివలే నిర్వాహకులు... ఇలా హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఏర్పాటైందే 'షీ మార్ట్ అండ్ లూస్'. దీన్ని జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసింది. ఇలాంటి సదుపాయాలన్నీ ఒకే చోట లభ్యం కావడం దేశంలో ఇదే మొదటిసారి.

మహిళలు వారు తయారు చేసిన వస్తువులను అమ్మడానికి అనేక తంటాలు పడుతుంటారు. బస్టాండ్లలో, రోడ్డు పక్కనో ఉత్పత్తులను విక్రయిస్తూ ఇబ్బందులూ ఎదుర్కొంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పింక్ మార్కెట్ ఏర్పాటైంది. ఇందులో రెండు స్టాళ్లు ఉంటాయి. ఒకదాంట్లో స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన వస్తువులు ఉంటే... మరోదాంట్లో తినుబండారాలు ఉంటాయి. పక్కనే బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గది, పింక్ టాయిలెట్లు, వెనుక భాగంలో దివ్యాంగ మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు కనిపిస్తాయి. ఇందుకోసం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఎఎల్) సంస్థ సీఎస్‌ఆర్‌లో భాగంగా నిధులు కూడా మంజూరు చేసింది.



నిర్వహణ ఇలా...

మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను చందానగర్ సర్కిల్ పరిధిలోని వేముకుంట మహిళా సమాఖ్య చేపట్టింది. స్టాళ్లలో అమ్మకాల ద్వారా వచ్చే లాభాలతో పింక్ టాయిలెట్లను నిర్వహిస్తారు. వీటిని పరిశుభ్రంగా ఉంచడం కోసం ఇద్దరు మహిళలు షిఫ్టుల వారీగా పనిచేస్తారు. మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాల ఏర్పాటు కూడా ఉంది. మరో ఇద్దరు మహిళలు స్టాల్స్‌లో వస్తువులు విక్రయిస్తారు.

లభించే వస్తువులు..

ప్రస్తుతం జవహర్‌నగర్‌లోని స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన జూట్, కాటన్ బ్యాగులు, చిరు ధాన్యాలతో తయారుచేసే స్వీట్లు విక్రయించనున్నారు. అన్ని రకాల సరుకులు, కూరగాయలు తెచ్చుకునే విధంగా వీటిని రూపొందించారు. ఇవి రూ.5 నుంచి రూ.150 మధ్యలో లభ్యం కానున్నాయి.

అసౌకర్యం లేకుండా...



దేశంలోనే మొదటిసారి పూర్తిగా మహిళల నిర్వహణతో షీమార్ట్ అండ్ లూస్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. స్వయం సహాయక సంఘాల మహిళలు వారి ఉత్పత్తులు ఇక్కడ విక్రయించొచ్చు. ఇక, పబ్లిక్ టాయ్‌లెట్ల వద్ద మహిళలు ఎదుర్కొనే సమస్యలూ నాకు తెలుసు. అందుకే వాటినీ ఏర్పాటు చేశాం. నిర్వాహకులు కూడా మహిళలే ఉంటారు.

– హరిచందన, జడ్సీ

– శంకర్ వంగల, న్యూస్‌టుడే, చందానగర్


చదువు

వైవిధ్య

అడ్మినిస్ట్రేషన్ కోసం దాదాపు అన్ని ఆర్గనైజేషన్లు ఎంబీఏ అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయి. కానీ కొన్ని ప్రత్యేక సంస్థలు వాటి ప్రత్యేకతకు అనుగుణంగా మేనేజర్లను ఎంచుకుంటాయి. అలాంటి ఆఫర్లను అందుకోవాలంటే ప్రత్యేక మేనేజ్‌మెంట్ కోర్సులు చేయాల్సిందే. వాటినే సెక్టోరల్ (రంగాలవారీ) ఎంబీఏలు అంటారు. అభ్యర్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కూడా వీటిని చేసుకోవచ్చు. ఇష్టమైన విభాగంలో ఉద్యోగాన్ని సాధించుకోవచ్చు.

మెచ్చిన రంగంలో మేనేజ్‌మెంట్

సెక్టోరల్ ఎంబీఏ





ఎంబీఏ కోర్సును జనరల్, సెక్టోరల్.. రెండుగా చెప్పుకోవచ్చు. రెగ్యులర్ ఎంబీఏ చదివినవారు తమ పరిజ్ఞానాన్ని ఏ విభాగానికైనా అన్వయించుకోవడానికి వీలవుతుంది. అంటే వీరు అన్ని రకాల పరిశ్రమల్లోనూ సేవలు అందించవచ్చు. అలా కాకుండా సెక్టోరల్ ఎంబీఏ విషయానికొచ్చేసరికి ఆ రంగానికి సంబంధించి పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. దానిలో సేవలందిస్తోన్న సంస్థల అవసరాలు తీర్చేలా ఈ కోర్సులను రూపొందించారు. దీంతో వీటిని చేసినవారికి ఎక్కువ శాతం అవకాశాలు ఆ రంగంతో ముడిపడే ఉంటాయి. కెరియర్ మొత్తం దాదాపుగా సంబంధిత విభాగంలో సేవలు అందిస్తోన్న సంస్థల్లోనే కొనసాగాల్సి వస్తుంది.

ఏ తరహా కంపెనీల్లో ఉద్యోగం చేయాలనుకుంటున్నారో, ఏ విభాగంలో సేవలందించాలని కోరుకుంటున్నారో పూర్తి స్పష్టత ఉన్నప్పుడు సెక్టోరల్ చదువుల దిశగా అడుగులు వేయవచ్చు. కొన్ని సెక్టోరల్ కోర్సుల విషయంలో ఇందుకు మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు పూర్తిచేసినవారు అంతర్జాతీయ వర్తకంతో ముడిపడే ఏ తరహా సంస్థలోనైనా ఉపాధి పొందడానికి వీలవుతుంది. సెక్టోరల్ కోర్సులు చదవాలనే ఆసక్తి ఉన్నప్పుడు ప్రామాణిక బీ స్కూళ్లలో చేరితేనే నాణ్యమైన పరిజ్ఞానం పొందగలరు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ ఉన్నత అవకాశాలు దక్కించుకోవచ్చు. సెక్టోరల్ కోర్సులతో ఆశించిన ప్రయోజనం సాధారణ సంస్థల్లో దక్కదని గుర్తుంచుకోవాలి.

ఎవరికి ఏది బాగు?

స్పెషలిస్టుగా సేవలందించాలని కోరుకునే విద్యార్థులు సెక్టార్ వైపు, జనరలిస్టుగా రాణించాలని ఆశించేవారు రెగ్యులర్ ఎంబీఏ దిశగా అడుగులేయడం ఉత్తమం. విద్యార్థి యూజీలో చదివిన కోర్సుల ప్రకారమూ ఒక నిర్ణయం తీసుకోవచ్చు. ఉదాహరణకు బీఫార్మసీ విద్యార్థి సాధారణ ఎంబీఏ బదులు ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరడం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. బీఏలో రూరల్ డెవలప్‌మెంట్ కోర్సులు చదువుకున్నవారు రూరల్ మేనేజ్‌మెంట్‌లో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఆసుపత్రుల్లోనే సేవలు అందించాలనుకునేవారు హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌కు జై కొట్టొచ్చు. విద్యార్థులు తమ ఇష్టాలు, నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా సెక్టోరల్, జనరల్ ఎంబీఏల్లో ఎటువైపు వెళ్లాలో నిర్ణయించుకోవాలి.

ఏ కోర్సులు... ఏ సంస్థల్లో?

ఇంటర్నేషనల్ బిజినెస్: జనరల్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఇంటర్నేషనల్ బిజినెస్‌పై పట్టు లభించేలా కరిక్యులమ్ ఉంటుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దారు. బహుళ జాతి కంపెనీలకు ఈ స్పెషలైజేషన్‌తో అవసరం ఉంటుంది. స్థానిక మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ ట్రెండ్ ఈ రెండింటికీ సరిపోయేలా ఉత్పత్తులను తయారు చేయడం, అభివృద్ధి పరచడం, వర్తకాన్ని విస్తరించడం, దానికి ప్రచారం కల్పించడం లాంటివన్నీ చూసుకుంటారు. అంతర్జాతీయ పరిణామాలు స్థానిక మార్కెట్‌పై ఏ విధమైన ప్రభావాన్ని చూపగలవో అంచనా వేస్తారు. ప్రధాన కార్యాలయాలు విదేశాల్లో ఉంటాయి. సాధారణంగా వీరు స్వదేశం నుంచి సేవలు అందిస్తారు.

సంస్థలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్. ఈ సంస్థ ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సులో సొంత పరీక్ష ద్వారా ప్రవేశం కల్పిస్తుంది. దిల్లీ క్యాంపస్‌లో 220, కోల్‌కతాలో 140 సీట్లు ఉన్నాయి. ఫీజు రూ.16 లక్షలు. ఇక్కడి విద్యార్థులు సగటున రూ.20 లక్షల వార్షిక వేతనంతో క్యాంపస్ నియామకాల ద్వారా అవకాశాలు పొందుతున్నారు. సింబయాసిస్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఎస్ఐబీ), పుణే స్నాప్ ద్వారా 120 మందికి అవకాశం కల్పిస్తోంది. ఇక్కడ ఫీజు రూ.15 లక్షల వరకు ఉంటుంది. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు సగటున రూ.10 లక్షలకు పైగా వార్షిక వేతనం పొందుతున్నారు.

> **ఫార్మా మేనేజ్‌మెంట్:** ఫార్మా కంపెనీల్లో మేనేజీరియల్ ఉద్యోగాలు ఆశించేవారు ఫార్మా మేనేజ్‌మెంట్ కోర్సులో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వవచ్చు.
>
> **సంస్థలు:** నార్సీ మోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎన్ఎంఐఎంఎస్), ముంబయి, ఎస్ఐఈఎస్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ముంబయి.



రూరల్ మేనేజ్‌మెంట్: ప్రాంతీయ సహకార సంఘాలు, అభివృద్ధి సంస్థలు, ఎన్జీవోలు, ఫండింగ్ సంస్థలు, ఫౌండేషన్లలో ఈ కోర్సులు చదివినవారికి అవకాశాలు ఉంటాయి. జాతీయ సంస్థలతోపాటు బహుళజాతి సంస్థలు సైతం గ్రామీణాభివృద్ధిలో పాలు పంచుకుంటున్నాయి. ప్రస్తుతం చాలావరకు కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్‌లో భాగంగా పెద్దఎత్తున గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నాయి. స్థానిక వనరులను అభివృద్ధి చేయడం, ఉత్పత్తులను మార్కెట్ చేయడంపైనా కృషి జరుగుతోంది. డెయిరీ, ఎరువులు, క్రిమిసంహారకాలు, వ్యవసాయ ఉత్పత్తులు...తదితర సంస్థల్లో పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయి.

సంస్థలు: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ (ఐఆర్ఎంఏ), ఆనంద్ (గుజరాత్), 180 సీట్లు ఉన్నాయి. క్యాట్ లేదా సొంతంగా నిర్వహించే పరీక్ష ఈ రెండింటితోనూ ప్రవేశం లభిస్తుంది. జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, భువనేశ్వర్, వెల్లింగ్‌కర్, ముంబయి, అమిటీ, నోయిడా. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), హైదరాబాద్ పీజీ డిప్లొమా ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందిస్తోంది. దరఖాస్తులకు గడువు ఏప్రిల్ 8..

అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్: దాదాపు రూరల్ మేనేజ్‌మెంట్ కోర్సుగానే ఉంటుంది. అయితే వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టితో రూపొందించారు. ఇందులో చేరిన ఐఐఎం విద్యార్థులు అగ్రికల్చర్ విభాగంతోపాటు సాధారణ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లు పొందుతున్న అవకాశాలూ సొంతం చేసుకుంటున్నారు.

సంస్థలు: ఐఐఎం - అహ్మదాబాద్, లఖ్‌నవూ; మేనేజ్, హైదరాబాద్, ఎస్ఐబీ, పుణే. ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, బెంగళూరు -అగ్రి బిజినెస్ అండ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఏబీపీఎం), ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీబీఎం) కోర్సు అందిస్తోంది. నేషనల్ అకాడెమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్), హైదరాబాద్ పీజీ డిప్లొమా ఇన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్ పేరుతో ఏడాది వ్యవధి కోర్సు అందిస్తోంది. దరఖాస్తులకు గడువు ఫిబ్రవరి 28. .

రిటైల్ మేనేజ్‌మెంట్: ఇప్పుడు అంతా రిటైల్ వ్యాపారమే. దుస్తులైనా, సరకులైనా కార్పొరేట్ రిటైల్ కంపెనీల్లో కొనుగోలు చేసుకోవచ్చు. రిలయన్స్, ఫ్యూచర్ గ్రూప్, ఐటీసీ, ఆదిత్య బిర్లా, టాటా, లైఫ్‌స్టైల్, స్పెన్సర్స్, డీమార్ట్, వాల్‌మార్ట్...ల్లో అవకాశాలు లభిస్తున్నాయి.

సంస్థలు: నార్సీ మోంజీ (ముంబయి), వెలింగ్‌కర్ (ముంబయి), బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (గ్రేటర్ నోయిడా), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ (లఖ్‌నవూ), ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) ఎంబీఏ (రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్) కోర్సు అందిస్తోంది. దరఖాస్తులకు గడువు ఏప్రిల్ 20.

మరికొన్ని...

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం), భోపాల్ రెసిడెన్షియల్ విధానంలో పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్ కోర్సు అందిస్తోంది. ఈ రెండేళ్ల కోర్సులో కన్జర్వేషన్ అండ్ లైవ్‌లీ హుడ్, డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్లు సైతం ఉన్నాయి. ఈ కోర్సులో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. క్యాట్/ ఎక్స్ఏటీ స్కోర్‌తో ఫిబ్రవరి 20లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ★ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఎన్ఐటీఐఈ), ముంబయి పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందిస్తోంది. బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు. ఈ సంస్థలో చదివినవారు మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందుతున్నారు. ★ వైఎస్ఆర్ నిథమ్, హైదరాబాద్‌తోపాటు పలు సంస్థలు హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో పీజీ కోర్సులు అందిస్తున్నాయి. వీరికి హోటళ్లు, రిసార్టులు, పర్యాటక కేంద్రాలు, ఎయిర్ లైన్స్...తదితర చోట్ల అవకాశాలు లబిస్తాయి. ★ రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ, అమేథీ ఎంబీఏ ఎనర్జీ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తోంది.

మిగతా కోర్సులు-సంస్థల వివరాలు.. www.eenadupratibha.net లో

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

విశాఖపట్నం జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టులు

విశాఖపట్నం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి కలెక్టర్ కార్యాలయం అర్హత కలిగిన అభ్యర్థుల (దివ్యాంగులు) నుంచి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఎల్‌డీ స్టెనో, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, ట్యాక్స్ కలెక్టర్, టెక్నికల్ సబార్డినేట్, ఆఫీస్ సబార్డినేట్, ఎల్‌జీఎస్ స్వీపర్, ఎలక్ట్రికల్ హెల్పర్ తదితరాలు. మొత్తం ఖాళీలు- 47. **అర్హత:** పోస్టును బట్టి అయిదు, ఏడు, ఎనిమిది, పది తరగతులు, ఇంటర్, ఐటీఐ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, డిగ్రీతోపాటు ఇతర నియమ నిబంధనలు. **వయసు:** 18-52 ఏళ్ల మధ్య ఉండాలి. **ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 20.02.2019.
http://visakhapatnam.nic.in/

వాక్-ఇన్స్

వైద్య బోధనా ఖాళీలు

నల్గొండ, సూర్యాపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి తెలంగాణ డీఎంఈ కార్యాలయం వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టు-ఖాళీలు: ప్రొఫెసర్- 09, అసోసియేట్ ప్రొఫెసర్- 08, అసిస్టెంట్ ప్రొఫెసర్- 18. **స్పెషాలిటీలు:** అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, టీబీ అండ్ సీడీ, సైకియాట్రి, అనస్థీషియాలజీ, ఓబీజీ తదితరాలు.

అర్హత: ఎంబీబీఎస్, సంబంధిత స్పెషాలిటీలో పీజీ, బోధన/ పరిశోధన అనుభవం ఉండాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది, ఇంటర్వ్యూ తేది: నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలకు 11.02.2019, సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు 13.02.2019.

వేదిక: సంబంధిత ప్రిన్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో. **వెబ్‌సైట్:** http://dme.telangana.gov.in/

ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్

ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ 2019-21 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కేంద్రాల్లో పీజీ డిప్లొమా ప్రోగ్రాములో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ (35వ బ్యాచ్) సీట్ల సంఖ్య: ముంబయి- 280, దిల్లీ- 100, కోల్‌కతా- 80, హైదరాబాద్- 40. **కాల వ్యవధి:** రెండేళ్లు. **అర్హత:** ఇంజినీరింగ్/ టెక్నాలజీ లేదా సైన్స్‌లో గ్రాడ్యుయేషన్. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ప్రవేశపరీక్ష తేది:** 13.06.2019. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 07.06.2019. www.iip-in.com


మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో.

దరఖాస్తు చేశారా?

❑ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

అర్హత: ఎంబీఏ/ పీజీడీఎం/ పీజీడీబీఎం ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి. చివరితేది: 11.02.2019.

❑ కొచ్చిన్ షిప్‌యార్డులో కాంట్రాక్టు వర్క్‌మెన్ పోస్టులు



అర్హత: ఏడు/ పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, సర్టిఫికెట్, పని అనుభవం. చివరితేది: 13.02.2019

❑ లఖ్‌నవూ హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో అసిస్టెంట్లు

అర్హత: ఐటీఐ, డిప్లొమా, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. చివరితేది: 13.02.2019.

❑ పంజాబ్ నేషనల్ బ్యాంకులో 325 మేనేజర్ పోస్టులు

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ, సీఏ/ ఐసీడబ్ల్యూఏ, పీజీ, పీజీడీఎం, పీజీ డిప్లొమా, పని అనుభవం. చివరితేది: 15.02.2019

పూర్తి సమాచారం www.eenadupratibha.net లో

Pan out, Phase out.. తేడా తెలుసా?

చూడటానికి దగ్గర దగ్గరగా ఉన్నా, అర్థాల్లో మాత్రం తేడాలుండే PHRASAL VERBS **కొన్ని ఉన్నాయి. Pan out, Phase out ఇలాంటివే. ఈ రెంటి మధ్య తేడా, ఏయే సందర్భాల్లో వేటినెలా ఉపయోగించాలో తెలుసుకుందాం.**

PHRASAL VERBS

Lakshman: Our software company is throwing out all old computers and replacing them by new ones (మా సాఫ్ట్‌వేర్ సంస్థ పాత కంప్యూటర్లన్నింటినీ తీసేసి, కొత్తవాటిని తీసుకురానుంది).



ఎం. సురేశన్

Ramana: Why are they doing it? Aren't the old computers useful enough? (ఎందుకలా చేస్తున్నారు? పాత కంప్యూటర్లు పనికి రావా?)

Lakshman: The old computers have outlived their purpose and are no longer useful. That is why they are phasing them out (పాత కంప్యూటర్లన్నింటి పనీ అయిపోయింది. అవి ఇప్పుడు అంత ఉపయోగకరంగా లేవు).

Ramana: They must be spending a huge amount on the new computers. Isn't that a lot of waste of money? (వాళ్లు కొత్త కంప్యూటర్ల మీద ఎక్కువ డబ్బులు వెచ్చిస్తుండాలి. చాలా డబ్బు వృథా కదా?)

Lakshman: They don't care a damn about it. To accelerate the work speedily, they are buying new ones (వాళ్లు ఆ విషయం పట్టించుకోరు. పనిని వేగవంతం చేయడానికే వాళ్లు కొత్త కంప్యూటర్లను కొంటున్నారు).


Ramana: They must be throwing out all the computers. Is that what they are doing? (పాత కంప్యూటర్లన్నీ బయట పడేస్తున్నారు. అదేగా వాళ్లు చేస్తున్న పని?)

Lakshman: They don't care a damn about it. They are blowing over the old computers and are going to forget about them (వాళ్లు ఆ విషయం పెద్దగా పట్టించుకోరు. అసలు పాత కంప్యూటర్లకు అంతగా ప్రాముఖ్యమే ఇవ్వడం లేదు. వాటి గురించే మర్చిపోతున్నారు).

1. Phase out = gradual stopping (క్రమక్రమంగా తీసేయడం).

Harikrishna: What are you trying to do? Are you discontinuing the practice gradually? (ఏం చేస్తున్నావు నువ్వు? ఆచరణలో ఉన్నదాన్ని క్రమక్రమంగా ఆపేస్తున్నావా?)

Prakash: That is so. The old practice does not hold good any longer. So we are stopping it and going for new practices (అవును అంతే. ఈ పాత పద్ధతి అంతగా పనికి రావట్లేదు. అందుకే దానికి స్వస్తి చెప్పి, కొత్తదానికి వెళ్లబోతున్నాం).



2. Pan out = end up / conclude (ఆపేయడం/ ముగించడం).

Harivansh: Our company is gradually discontinuing the use of old methods and are trying to introduce new ones (మా సంస్థ క్రమక్రమంగా పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, కొత్తవాటిని పరిచయం చేయబోతోంది).

Ramanath: Why are they doing it? Aren't the old methods quite useful? Why are they panning out new methods? Are not they satisfied with the old methods? (వాళ్లు అలా ఎందుకు చేస్తున్నారు? పాత పద్ధతులు బాగానే ఉన్నాయి కదా? కొత్తవాటిని ఎందుకు ప్రయత్నిస్తున్నారు? పాత పద్ధతులతో వాళ్లు తృప్తి చెందడం లేదా?)

Harivamsh: They want to update the practices (వాళ్లు కొత్త పద్ధతులను ఆహ్వానించాలనుకుంటున్నారు).

కాల్ కలుస్తలే!



2జీ నుంచి 4జీకి టెక్నాలజీ మారినా.. అదిగదిగో 5జీ అంటూ ప్రపంచం పరుగులు తీస్తున్నా.. మన దేశంలోని పరిస్థితిలో మాత్రం మార్పురావడం లేదు. టెలికం సంస్థల పనితీరుపై వినియోగదారుల్లో అసంతృప్తి రోజు రోజుకూ పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో కాల్‌డ్రాప్ శాతం ప్రతినెలా 3 శాతం నుంచి 7 శాతం వరకు నమోదు అవుతున్నదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాయిస్‌కాల్స్‌తో పాటు మొబైల్ డేటా సామర్థ్యంపై ఫిర్యాదులు పెరుగుతున్నాయి. టవర్లపై పెరుగుతున్న వత్తిడిని అధిగమించేందుకు మౌలిక సదుపాయాలను విస్తరించడం లేదు. గత కొంత కాలంగా ట్రాయ్ పరిశీలనలో వెల్లడైన వాస్తవాలు చూస్తుంటే ప్రతినెలా కొన్ని ప్రధాన నెట్‌వర్క్‌ల పనితీరు పడిపోతున్నట్లు కనిపిస్తోంది.

ప్రయత్నాలు విఫలం..

తెలుగు రాష్ట్రాల్లో కాల్‌డ్రాప్ (అవతలి వ్యక్తికి అనుసంధానం కాకపోవడం, మధ్యలో ఆగిపోవడం), బ్లాక్ కాల్ (నెట్‌వర్క్ విఫలం) ఎక్కువగా ఉంది. మారుమూల ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాలు, నగరాల్లోనూ ఈ పరిస్థితి అధికమైంది. ఇటీవల 'ట్రాయ్' ప్రతినిధులు రైలు మార్గాల్లో ప్రయాణిస్తూ తనిఖీ చేసినపుడు పరిస్థితి దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. నగరాల్లో నెట్‌వర్క్ సామర్థ్యం పెంచడంలేదని, బ్లాక్‌స్పాట్‌లను తొలగించే నూతన టెక్నాలజీ అమలు చేయడం లేదని తేలింది.

బ్రాడ్‌బ్యాండ్ వేగం ఇలా..

టెలికం కంపెనీలు డేటా ఛార్జీలు తగ్గించిన తరువాత చౌకధరల్లో బ్రాడ్‌బ్యాండ్, ఇంటర్నెట్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్‌ఫోన్ల వినియోగదారులు గణనీయంగా పెరుగుతున్నారు. అయితే డేటా వేగం మాత్రం పెరగడంలేదు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ సమాచారం చూసేందుకు స్ట్రీమింగ్ (ప్రారంభ డౌన్‌లోడ్)కు సమయం అధికంగా తీసుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఒక్క ఎంబీ ఫొటోకు కూడా 15 సెకన్లు వేచి ఉండాల్సి వస్తోంది. యూట్యూబ్ వీడియోలు, వెబ్‌సైట్లు తెరుచుకునేందుకు 10 సెకన్ల సమయం తీసుకుంటున్నట్లు ట్రాయ్ గుర్తించింది. టవర్‌పై భారం పెరిగినపుడు డేటా వేగం తగ్గిపోతోందని.. ఒక్కోసారి డేటా అందుబాటులోకే రావడం లేదని వెల్లడైంది.

ట్రాయ్ పరిశీలన..


టెలికం సంస్థల నెట్‌వర్క్‌ల పనితీరును ట్రాయ్ తరచు అధ్యయనం చేస్తోంది. వాయిస్ కాల్, డేటా నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేకంగా యాప్‌లను సిద్ధంచేసి నాణ్యతపై అభిప్రాయాలు తీసుకుంటోంది. ఈ సర్వేల్లో కొన్ని నెట్‌వర్క్‌ల రేటింగ్ పడిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని సంస్థల పనితీరు సరిగా లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

–ఈనాడు హైదరాబాద్


ఇదీ మన పరిస్థితి



- డౌన్‌లోడ్ : సగటున 2.4 ఎంబీపీఎస్
- అప్‌లోడ్ : సగటున 1.3 ఎంబీపీఎస్



- డౌన్‌లోడ్ : సగటున 13.3 ఎంబీపీఎస్
- అప్‌లోడ్ : సగటున 4.8 ఎంబీపీఎస్



నెట్‌వర్క్ విఫలం పరిస్థితి

రాష్ట్రం	2జీ	3జీ	4జీ
తెలంగాణ	1.78	4.75	7.06
ఏపీ	14.43	7.36	2.04

'ఫోన్ చేయుటకన్నా.. పోయి రావడం మిన్న..' దాదాపు రెండు దశాబ్దాల క్రితం జనం వెటకారంగా అనుకునే మాట ఇది. అత్యాధునిక సాంకేతికత.. అధునాతన నెట్‌వర్క్‌లు అందుబాటులోకి వచ్చి, ఇంటర్నెట్, మొబైల్ సేవలపైనే ప్రపంచం నడుస్తున్న నేటి కాలంలో కూడా ఇవే మాటలు మళ్లీ వినిపిస్తుండడం దారుణం. ఫోన్ చేసినపుడు నెట్‌వర్క్ విఫలం, మధ్యలోనే కాల్ ఆగిపోవడం వంటివి మన దేశంలో అత్యంత సాధారణమైపోయాయి.

ట్రాయ్ పరిశీలనలో తేలిన అంశాలివి..



	తెలంగాణలో	ఆంధ్రప్రదేశ్‌లో
వాయిస్ కాల్స్ రేటింగ్స్ ఇలా		
ఇండోర్ ప్రదేశాల్లో	3.6/5	3.8/5
బయటి ప్రాంతాల్లో	3.2/5	3.2/5
ప్రయాణ సమయంలో	4.3/5	3.8/5
నాణ్యతపై ప్రజల స్పందన (శాతాల్లో)		
సంతృప్తికరం	72.86	84.10
అసంతృప్తి	20.08	12.69
కాల్‌డ్రాప్	7.06	3.22



తెలుగు రాష్ట్రాల పరిధిలో కోట్లలో వినియోగదారులు



ఎయిర్‌టెల్	2.99
వోడాఫోన్ ఐడియా	2.33
రిలయన్స్ జియో	2.16
బీఎస్ఎన్ఎల్	1.01
టాటా టెలీసర్వీసెస్	0.17

మొబైల్ వినియోగదారులు 8.68 కోట్లు

పొరుగు కన్నా దిగువనే మనం..

- ★ ఓపెన్‌సిగ్నల్ అనే ఓ సంస్థ సర్వే ప్రకారం భారత్‌లో ఎంబీపీఎస్ వేగం 6.07.
- ★ మయన్మార్, పాకిస్థాన్‌లలో కూడా 4జీ డేటా వేగం ఎక్కువగా ఉంది.
- ★ మయన్మార్‌లో 15.56, పాకిస్థాన్‌లో 13.56 శాతం నమోదు కావడం గమనార్హం.

పరిమితికి మించి కాల్‌డ్రాప్



ట్రాయ్ నిబంధనల మేరకు కాల్‌డ్రాప్ 2 శాతానికి, బ్లాక్‌కాల్ 3 శాతానికి లోబడి ఉండాలి. ఇటీవల హైదరాబాద్, విశాఖపట్నంలో పరిశీలించగా విశాఖలో కాల్‌డ్రాప్, బ్లాక్‌కాల్ శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ పరిధిలో టెలికం సంస్థల నెట్‌వర్క్ పరిశీలించినపుడు కాల్‌డ్రాప్, బ్లాక్‌కాల్ శాతం పరిమితికి లోబడి ఉన్నట్లు తెలిసింది. వినియోగదారుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్నపుడు మాత్రం ఈ శాతం చాలా ఎక్కువగా ఉన్నట్లు ఉంది. కాల్‌డ్రాప్ శాతం ఏపీలో సగటున 3.22 శాతం ఉంటే, తెలంగాణలో 5.94 శాతం ఉందని వెల్లడైంది.

అంతర్జాతీయ టెలికం యూనియన్ ప్రమాణాల ప్రకారం	
కాల్‌డ్రాప్ రేటు	2% లోపే
బ్లాక్‌కాల్ రేటు	3% లోపే

వృద్ధాశ్రమాల నమోదు గడువు 28

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 'తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం' కింద స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమాలు తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని వయోవృద్ధుల సంక్షేమశాఖ పేర్కొంది. ఈ నెల 28లోగా జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో నమోదు చేయించి, గుర్తింపు పత్రం తీసుకోవాలని డైరెక్టర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నమోదు చేయని సంస్థలపై కఠిన చర్యలతో పాటు, రూ.25,000 జరిమానా విధిస్తామన్నారు. నియమ నిబంధనల వివరాల కోసం 040-24559048, 7013150172, 9652957143 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వరంగల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్

- పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శితో జపాన్ బృందం భేటీ

ఈనాడు, హైదరాబాద్: వరంగల్‌లో జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటుపై జపాన్ బృందం పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్‌తో చర్చించింది. బుధవారం సచివాలయంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, టోక్యో వ్యర్థాల నిర్వహణ, క్లీన్ అథారిటీ అంతర్జాతీయ సహకారశాఖ విభాగం డైరెక్టర్ హిడెనోరియో క్యోమా బృందం ప్లాంట్ ఏర్పాటు అధ్యయన నివేదికపై చర్చించింది. ప్లాంట్ నిర్వహణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నట్లు జపాన్ ప్రతినిధులు తెలిపారు. ఘనవ్యర్థాల మార్గదర్శకాలు-2016కు అనుగుణంగా ఈ ప్లాంట్ ఉంటుందని చెప్పారు. 1960లో టోక్యో నగరంలో ఘన వ్యర్థాల సమస్య తీవ్రంగా ఉండేదని స్థానికులు, స్థానిక సంస్థల సహకారంతో ఘనవ్యర్థాల సమస్య తగ్గించుకున్న తీరు, చెత్తను శుద్ధి చేసి పునర్వినియోగిస్తున్న విధానంపై వివరించారు. తాము వినియోగించే పరిజ్ఞానంలో 90శాతం మేర భూ వినియోగం తక్కువగా ఉండటమే కాకుండా 80 శాతం మేర వాసన సైతం ఉండదని చెప్పారు. వరంగల్‌లో ఘనవ్యర్థాలు తక్కువ కెలోరిఫిక్ విలువ కలిగి ఉన్న నేపథ్యంలో దీన్ని పరిగణనలోకి తీసుకుని ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు కోసం ఇప్పటికే జపాన్ బృందం వరంగల్‌లో పరిశీలించింది.

మెస్ ఛార్జీలివ్వండి: ఆర్.కృష్ణయ్య

నల్లకుంట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీ బిల్లు మొత్తాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఆయన బుధవారం ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంలతో విడిగా సమావేశమయ్యారు. గత ఏడు నెలలుగా 2.92 లక్షలమందికి సంబంధించిన రూ.200 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఈ పరిస్థితిని ఇకనైనా చక్కదిద్దాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యానగర్ బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కొందరు నిర్వాహకులు వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ వసతిగృహాలు నడిపిస్తున్నారన్నారు. కృష్ణయ్య వెంట బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కృష్ణ, ఇతర నాయకులు ఉన్నారు.

దోస్త్.. ఇక పూర్తిగా ఆన్‌లైన్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ (దోస్త్) ప్రక్రియ విద్యార్థులకు మరింత సౌకర్యంగా మారనుంది. ప్రవేశాల పక్రియ ముగిసే చివరి దశ వరకు అంతా ఆన్‌లైన్ విధానంలోనే జరగనుంది. ఈ విద్యా సంవత్సరంలో తలెత్తిన సమస్యలు, ఇబ్బందులను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కళాశాల విద్యాశాఖ అధికారులు... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహాయ కేంద్రాల నిర్వాహకులతో సమావేశమై సమీక్షించారు. విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, దోస్త్ కన్వీనర్ ఆచార్య ఆర్.లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కన్వీనర్ నవీన్ మిత్తల్, విద్యామండలి కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్న ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో యాజమాన్య కోటా ఇవ్వాలా? లేక తక్షణ ప్రవేశాల (స్పాట్)కు అవకాశం ఇవ్వాలా? అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని లింబాద్రి తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ మిత్తల్, పక్కన పాపిరెడ్డి

ఇవీ నిర్ణయాలు...

- 2019 దోస్త్‌ను సరళతరంగా, విద్యార్థులకు సౌకర్యంగా చేస్తారు. ప్రక్రియ అంతా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది.
- పేరు రిజిస్ట్రేషన్‌కు పట్టే సమయాన్ని తగ్గిస్తారు.
- సీటు లభించిన తర్వాత నిర్ధరణకు విద్యార్థులు కళాశాలలకు వెళ్లాల్సిన పనిలేదు. ఎంసెట్ తరహాలో ఆన్‌లైన్‌లోనే నిర్ధరణ చేసుకోవచ్చు. రుసుమును కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు.
- సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డుల విద్యార్థులు కూడా డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నందున ఆయా బోర్డులతో దోస్త్ వెబ్‌సైట్‌ను అనుసంధానం చేస్తారు. అంటే రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థి ఇంటర్ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే పూర్తి వివరాలు దరఖాస్తులోకి వస్తాయి. దాంతో విద్యార్థులకు దరఖాస్తు ఫారాన్ని నింపడం సులభం అవుతుంది.
- రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీగా ఈసారి అంకెలు మాత్రమే వస్తాయి.
- సహాయ కేంద్రాలు (హెచ్ఎల్‌సీ)ల్లో కొత్తగా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ యంత్రాలను సమకూరుస్తారు.

అది మోదీ ఫ్రంట్

- మోదీకి ఊడిగం చేయడమే జగన్, కేసీఆర్‌ల పని
- దేశాన్ని భ్రష్టు పట్టించేందుకు ఈ ఫ్రంట్ ఏర్పాటైంది
- ఏపీ సీఎం చంద్రబాబు విమర్శ



ఈనాడు, అమరావతి: ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు పేరిట పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని రెండు సార్లు కలిసిన కేసీఆర్... కోల్‌కతాలో సీబీఐ దాడులను ఎందుకు ఖండించలేదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సహా ఈ దాడులను దేశంలోని నాయకులందరూ ఖండించినప్పటికీ కేసీఆర్, జగన్‌లు మాత్రమే ఆ పనిచేయలేదని అన్నారు. మోదీకి ఊడిగం చేయడమే జగన్, కేసీఆర్ పనిగా ఉందన్నారు. దేశాన్ని భ్రష్టుపట్టించేందుకే ఈ ముగ్గురు మోదీలతో మోదీ ఫ్రంట్ ఏర్పాటైందని విమర్శించారు. బుధవారం ఉదయం నేతలతో టెలికాన్ఫరెన్స్‌లోను, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలోనూ చంద్రబాబు మాట్లాడారు.

తెలుగు విద్యార్థులను సురక్షితంగా తీసుకొస్తాం

'అమెరికాలో చదువుకోటానికి వెళ్లిన తెలుగు విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారు ఎలాంటి తప్పు చేయలేదు. కేంద్రంతో మాట్లాడి వారిని సురక్షితంగా తీసుకొస్తాం. అయితే విద్యార్థులు కూడా దళారీలను, మోసగాళ్లను నమ్మొద్దు' అని చంద్రబాబు అన్నారు.

మోదీకి ఖాళీ కుండలతో స్వాగతం

ఈ నెల 10న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఖాళీ కుండలతో నిరసన తెలియజేయాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన ఐకాస నిర్ణయించింది. విభజన హామీల్ని అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసినందుకే ఈ నిరసన అని పేర్కొంది. దీనికి తెదేపా మద్దతివ్వనుంది. 11న దిల్లీలో చంద్రబాబు చేయనున్న దీక్షకు సంఘీభావంగా రెండు రైళ్లలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధుల్ని తీసుకు వెళ్లనున్నారు.

ఎవరెస్ట్ పిలుస్తోంది... పేదరికం అడ్డుపడుతోంది





పర్వతారోహణకు సంబంధించిన ప్రచార చిత్రాలతో ఆటో నడుపుతున్న యువకుడి పేరు తిరుపతి. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎల్లంకొండకు చెందిన ఆటో డ్రైవర్ కుమారుడైన గుంతల తిరుపతి పర్వతారోహకుడు కావడం విశేషం. ఐటీఐ పూర్తి చేశాడు. తండ్రి అనారోగ్యం కారణంగా... దూరవిద్యలో డిగ్రీ చేస్తూనే మరోవైపు ఇల్లు గడవడానికి ఆటో నడుపుతున్నాడు. ఇతను ఆటో డ్రైవర్ అయినా లక్ష్యం మాత్రం పెద్దదే. ప్రపంచంలోని ఏడు పర్వతాలను అధిరోహించాలనేది ఆశయంగా పెట్టుకున్నాడు. ఇప్పటికే కిలిమంజారో, కోజియాస్కి, మౌంట్‌కెనాక్ పర్వతాలను అధిరోహించాడు. ఇప్పుడు ఎవరెస్ట్ ఎక్కే అవకాశం వచ్చింది. కానీ పేదరికమే అడ్డుపడుతోంది. ప్రభుత్వం సహకారం అందిస్తే తన లక్ష్యాన్ని చేరుకుంటానంటున్నాడు ఆ యువకుడు.

–ఈనాడు, సంగారెడ్డి

8న ఐసెట్ విధివిధానాల రూపకల్పన

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 2019-2020 విద్యాసంవత్సరానికి సంబంధించి, ఐసెట్ నిర్వహణలో విధివిధానాల రూపకల్పన కోసం ఈ నెల 8న తొలి సమావేశం జరగనుంది. ఇది వరంగల్ కేయూలోని ఐసెట్ కార్యాలయంలో ఏర్పాటవుతుందని బుధవారం ఐసెట్ కన్వీనర్- కేయూ వాణిజ్య శాస్త్రం సీనియర్ ఆచార్యులు సీహెచ్.రాజేశం తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య టి.పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు ఆచార్య లింబాద్రి, వెంకటరమణ, ఐసెట్ ఛైర్మన్- కేయూ ఉపకులపతి ఆర్.సాయన్నతో పాటు వివిధ పరీక్షాకేంద్రాల నిర్వాహకులు పాల్గొంటారన్నారు.

అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు: సీఎస్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. రహదారులపై చోదకుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖలో అంతర్గతంగా రహదారి భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసి ఇబ్బందుల్లేని ప్రయాణానికి బాటలు వేయాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్ న్యాక్‌లో రానున్న ఐదేళ్లకు రాష్ట్ర రహదారుల అభివృద్ధికి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి జరగాలంటే తొలుత రోడ్డు సదుపాయం ప్రధానమని చెప్పారు. అన్ని రోడ్లు నాణ్యతతో ఉండాలని, ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో అనుసంధానిస్తూ చేపట్టిన రెండు వరుసల రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

తెలంగాణ పీఆర్‌సీ గడువు పెంపు!

- ప్రభుత్వ నిర్ణయం.. సీఎం వద్దకు దస్త్రం
- త్వరలో ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారుల వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంఘానికి గతంలో నిర్దేశించిన గడువు ఈ నెల 25తో ముగియనుండగా దానిని మరో మూడు నెలల పాటు (మే 26 వరకు) పొడిగించేందుకు దస్త్రం సిద్ధమయింది. ఈ దస్త్రం బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లింది. ఆయన ఆమోదించిన వెంటనే ఉత్తర్వులు జారీ కానున్నాయి. తెలంగాణలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు, ఫించనర్ల వేతన సవరణ కోసం గత ఏడాది మే 18న విశ్రాంత ఐఏఎస్ అధికారి సీఆర్ బిస్వాల్ దీనికి ఛైర్మన్‌గా, విశ్రాంత ఐఏఎస్‌లు ఉమామహేశ్వర్‌రావు, మహ్మద్ అలీ రఫత్‌లు సభ్యులుగా పీఆర్‌సీ ఏర్పాటయింది. మొదట్లో ఈ సంఘానికి మూడు నెలల గడువు నిర్దేశించారు. నివేదిక సిద్ధం కాకపోవడంతో రెండుసార్లు గడువు పెంచారు. అది కూడా ఈ నెల 25తో ముగుస్తుంది. అప్పటిలోగా నివేదిక సిద్ధమయ్యే అవకాశం లేకపోవడంతో మరో మూడు నెలలు గడువు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అటవీ చట్టం

వచ్చే శాసనసభ సమావేశాల్లో తెలంగాణ అటవీ చట్టంపై బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. దీనిని రూపొందించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అటవీ పరిరక్షణ, హరిత హారం కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించాలని సీఎం భావిస్తున్నారు. ఇప్పటికే దీనిపై కసరత్తు మొదలైంది.

తగ్గనున్న బీటెక్ సీట్లు

- 8 కళాశాలల మూసివేత... 26 బ్రాంచీల రద్దుకు దరఖాస్తు
- ఎంటెక్ సీట్లకూ స్వయం కోత
- మొత్తం 140 కోర్సుల రద్దుకు కళాశాలల వినతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాల్లో బీటెక్ సీట్లు సగం తగ్గిపోగా వచ్చే ఏడాది సైతం మరికొన్ని వేల సీట్లకు కోత పడనుంది. ఎనిమిది ఇంజినీరింగ్ కళాశాలలను మూసివేసుకునేందుకు వాటి యాజమాన్యాలు జేఎన్‌టీయూహెచ్‌కు దరఖాస్తు చేసుకున్నాయి. వాటితోపాటు మరో 26 బీటెక్ బ్రాంచీలను కూడా మూసివేసుకోవడానికి జేఎన్‌టీయూ అనుమతి కోరుతూ యాజమాన్యాలు దరఖాస్తు చేశాయి. దరఖాస్తుకు ఈ నెల 5వ తేదీతో గడువు ముగిసింది. మొత్తం మీద 3,500 వరకు సీట్లు తగ్గించుకోవడానికి కళాశాలలే ముందుకు వచ్చాయి. ఇక వర్సిటీ అధికారులు అనుబంధ గుర్తింపునకు తనిఖీలు చేసి నిబంధనల ప్రకారం ప్రమాణాలు, సౌకర్యాలు లేకుంటే ఎన్ని సీట్లకు కోత పెడతారన్నది మే నెలలో తేలనుంది. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 173 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 96,518 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా ఆయా కళాశాలల స్వయం కోతతో సీట్ల సంఖ్య 93 వేలకు తగ్గనుంది. ఇక ఎంటెక్‌లో ఏకంగా 66 బ్రాంచీలను మూసివేయనున్నారు. దానివల్ల 1400 వరకు ఎంటెక్ సీట్లు తగ్గనున్నాయి.

కళాశాలల వారీగా బ్రాంచీల మూసివేత

కోర్సు	బ్రాంచీల సంఖ్య
బీటెక్	26
ఎంటెక్	66
ఎంబీఏ	5
బీ ఫార్మసీ, ఎంఫార్మసీ తదితర	43
మొత్తం	**140**

పరిహారంపై ఏం చెబుతారు?

- 'రేవంత్‌రెడ్డి నిర్బంధం' పిటిషన్‌పై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు
- అక్రమ నిర్బంధమని ప్రకటించి పరిహారం ఇప్పించాలన్న పిటిషనర్
- అక్రమం కాదు.. ఆధారాలిస్తామన్న సర్కారు

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి నిర్బంధానికి సంబంధించి పిటిషనర్ డిమాండ్ చేస్తున్న పరిహారంపై ఏం చెబుతారని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ అంశంలో వివరణ ఇవ్వాలంది. మరోవైపు ఇది అక్రమం కాదని, నిర్బంధానికి దారితీసిన పరిస్థితులన్నింటినీ కోర్టు ముందు ఉంచుతామని ప్రభుత్వం చెప్పడంతో విచారణను 25కు వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డిని అక్రమంగా నిర్బంధించారని, కోర్టులో హాజరుపరచాలని.. పరిహారంగా రూ.25 లక్షలు ఇప్పించాలంటూ కాంగ్రెస్ నేత వేం నరేందర్‌రెడ్డి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బి.ఎస్.ప్రసాద్ వాదనలు వినిపిస్తూ రేవంత్‌రెడ్డిని అదే రోజు విడుదల చేసిన నేపథ్యంలో దీనిపై విచారణ చేపట్టడం వల్ల ప్రయోజనం లేదని, విచారణను మూసివేయాలని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ విచారణ మూసివేయడంపై పిటిషనర్ అభిప్రాయమేమిటో చెప్పాలంది. పిటిషనర్ తరఫు న్యాయవాది సి.వి.మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్‌పై విచారణను మూసివేస్తే ఇకపై కూడా ప్రభుత్వం ఇలానే అక్రమ నిర్బంధాలను కొనసాగిస్తుందన్నారు. పరిహారం ఇప్పించాలని.. అది లక్ష అయినా సరేనని, దీంతో పిటిషనర్‌కు ప్రయోజనం లేకపోయినా ప్రభుత్వ చర్య తప్పని తేలుతుందని చెప్పారు. ఏజీ స్పందిస్తూ.. ఇది అక్రమ నిర్బంధం కాదని, ముఖ్యమంత్రి సభను జరగనివ్వనని రేవంత్‌రెడ్డి ప్రకటించారని, అందుకే నిర్బంధంలోకి తీసుకున్నామని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని పత్రాలను, వీడియోలను సమర్పిస్తామని.. గడువు ఇవ్వాలని కోరారు. ఇందుకు అనుమతించిన హైకోర్టు విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

ఏపీలో వృద్ధాప్య పింఛన్లు దశల వారీగా రూ.3 వేలకు పెంచుతాం

తిరుపతి సమర శంఖారావం సభలో జగన్



ఈనాడు, తిరుపతి: 'మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే 45 ఏళ్లకే పింఛను ఇస్తాం. అవ్వా తాతలకు రూ.2 వేలు నుంచి దశల వారీగా ఆ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతాం. ప్రతి రైతుకు మే నెల రాగానే రూ.12,500 పెట్టుబడి సాయం అందిస్తాం. ఒక్కో ఇంటికి ఏడాదికి రూ.15 వేల వరకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తాం. ఈ విషయాలను మీరు ప్రజలకు వివరించండి...' అని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2014లో ఇచ్చిన ఏ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిగా అమలు చేయలేదని పేర్కొన్నారు. 'బీసీలపై ప్రేమ ఉన్నట్లు నటించి 119 హామీలిచ్చారు. అవి ఏమయ్యాయో తెలియదు. ప్రతి కులానికి కార్పొరేషన్ అంటూ మరో మోసానికి తెరలేపుతున్నారు. నాలుగున్నరేళ్లు గుర్తుకురాని మహిళా సంఘాలు, రైతులు ఇప్పుడు గుర్తొచ్చారు. పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ అంటూ.. మరో నాటకం. జన్మభూమి కమిటీలు గ్రామస్థాయిలో దోచుకుంటే ముఖ్యమంత్రి ఫైవ్ స్టార్ హోటళ్లో కూర్చొని బడా దోపిడీకి పాల్పడుతున్నారు...' అని ఆయన ఆరోపించారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసే క్రమంలో జగన్ బుధవారం తిరుపతి సమీపంలోని రేణిగుంట యోగానంద ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బూత్ కమిటీ సమన్వయకర్తల సమర శంఖారావం సభలో ప్రసంగించారు. దీనికి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నేతలు హాజరయ్యారు.

సెన్సెక్స్ ▲358	నిఫ్టీ ▲128
36975	11063

డోజోన్స్ 25412 ▲ 01 | నాస్‌డాక్ 7380 ▼ 22 | రూపాయి 71.56 ▲ (ఒక అమెరికా డాలరుకు) 01 పైసలు | ముడి చమురు 62.56 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	6న	మార్పు%	నిఫ్టీ	6న	మార్పు%
TECH MAHINDRA	811.35	8.04	ADANI PORT	330.35	-2.78
ZEE ENTERTAINMENT	388.00	6.20	DR. REDDYS LAB	2789.70	-1.13
CIPLA	534.95	5.31	INDUSIND BANK	1526.05	-1.02
TATA STEEL	485.10	4.39	TITAN COMPANY	1059.05	-0.72
GRASIM	733.50	4.20	NTPC	137.10	-0.69
BAJAJ FINANCE	2711.25	4.13	AXIS BANK	725.75	-0.51
HPCL	233.90	3.89			


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	65.14	75.53	బహ్రెయిన్ దీనార్	176.31	201.72
పౌండ్ స్టెర్లింగ్	84.36	97.82	కువైట్ దీనార్	195.15	242.93
యూరో	74.25	86.12	ఒమన్ రియాల్	172.52	197.63
జపనీస్ యెన్/100	59.33	68.82	సౌదీ రియాల్	17.32	20.53
ఆస్ట్రేలియా డాలరు	46.66	54.00	యూఏఈ దిర్హమ్	17.73	20.72
సింగపూర్ డాలరు	48.15	57.04	మలేషియా రింగిట్	15.58	19.17
థాయ్ బాత్/100	208.38	249.15			

బుధవారం నిఫ్టీ కదలికలు



పడి పడి లేచే డీహెచ్‌ఎఫ్‌ఎల్

• ఈసారీ అదే కథ పునరావృతమవుతుందా? • గత 5 నెలల్లో 85% క్షీణించిన షేరు

భవిష్యత్తు బాగుండాలంటే గతాన్ని మర్చిపోకూడదంటుంటారు. నిజమే గత అనుభవాల నుంచి ఎంతో కొంత నేర్చుకొని ముందడుగు వేయడానికి అవకాశం మెండుగా ఉంటుంది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్‌లో అనుభవం అనేది చాలా చాలా కీలకం. ఇప్పుడు ఇదంతా ఎందుకు ప్రస్తావించాల్సి వస్తోందంటే దేవాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) షేరు గురించి మాట్లాడుకోవడానికి! ఇంతకీ ఈ షేరు కథాకమామిషు ఏమిటంటే..

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థగా కొనసాగుతున్న డీహెచ్‌ఎఫ్‌ఎల్ మదుపర్లకు మంచి లాభాలు పంచుతూ వచ్చింది. గతంలో ఈ షేరు పలు సందర్భాల్లో భారీగా క్షీణించింది. అయితే మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో మరింత దూసుకెళ్లింది. వేచి చూసిన మదుపర్లకు మంచి లాభాలు ఆర్జించి పెట్టింది. తాజాగా ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి (రూ.691.50) నుంచి 6 ఏళ్ల కనిష్ఠానికి (రూ.96.80) చేరింది. కేవలం 5 నెలల్లో షేరు ధర 85 శాతానికిపైగా క్షీణించింది. ఈ తరుణంలో ఈ షేరు గత 20 ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే.. భారీగా క్షీణించిన ప్రతిసారీ షేరు ధర మళ్లీ పెరుగుతూ వచ్చింది.

2009లో 78% ఇప్పుడు 85% పతనం

1998 ఫిబ్రవరి 2న డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేరు రూ.5.50 వద్ద ట్రేడయ్యేది. అక్కడి నుంచి పదేళ్ల వ్యవధిలో 2000 శాతానికిపైగా పెరిగి రూ.120కి (2008 జనవరి 11న) చేరింది. అయితే అక్కడి నుంచి 14 నెలల కాలంలో 78 శాతం వరకు కోల్పోయి రూ.27కి (2009 మార్చి 27న) తగ్గింది.



అక్కడి నుంచి మళ్లీ రికవరీ బాట పట్టింది. 2018 సెప్టెంబరు 3 నాటికి దాదాపు 2415 శాతం పెరిగి రూ.678కి చేరింది. అక్కడి నుంచి చాలా వేగంగా తగ్గుతూ వచ్చి 2019 ఫిబ్రవరి 4కి 85% నష్టపోయి రూ.96.80 వద్ద కనిష్ఠ స్థాయిని చేరింది. 5న కొంత కోలుకుని రూ.122.30కి చేరింది. 6న మళ్లీ 1.92% నష్టంతో 119.95 వద్ద ముగిసింది.

ఎందుకిలా..?

ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంస్థ డిఫాల్ట్ అయిన తర్వాత బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల పరిస్థితి దయనీయంగా తయారైంది. ద్రవ్య లభ్యత సంక్షోభంతో కొట్టుమిట్టాడాయి. ఇదే రంగంలోని డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెందిన వాణిజ్య పత్రాలను ఓ మ్యూచువల్ ఫండ్ సంస్థ తెగనమ్మడంతో మార్కెట్‌లో ఈ షేరు ధర పతనం ప్రారంభమైంది. గరిష్ఠ స్థాయి నుంచి కిందకు దిగి వచ్చి రూ.200-250 శ్రేణిలో కొంతకాలం కదలాడింది. కంపెనీ విశ్వసనీయతపై రేటింగ్ ఏజెన్సీ కేర్ కూడా అనుమానాలు వ్యక్తం చేయడంతో మదుపర్లు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఇటీవల కోబ్రా పోస్ట్‌లో ఈ కంపెనీ గురించి వచ్చిన ప్రతికూల వార్తలతో షేరు కుదేలైంది. ప్రమోటర్లు రూ.31,000 కోట్ల కంపెనీ సొమ్మును దారి మళ్లించారన్న ఆరోపణలను మార్కెట్ జీర్ణించుకోలేకపోయింది. దీంతో షేరు ధర భారీగా క్షీణించి రూ.100 దిగువకు చేరింది.

కొనుక్కోవచ్చా?

గత చరిత్రను పరిశీలిస్తే డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేరు ధర క్షీణించిన ప్రతిసారీ చాలా రెట్లు పెరిగిన దాఖలాలున్నాయి. మరి ప్రస్తుత పరిస్థితుల్లో ఈ షేరును కొనుగోలు చేయవచ్చా? లేదా? అనే మీమాంసలో మదుపర్లు ఉన్నారు. చాలా మంది విశ్లేషకులు మాత్రం ఈ షేరు కొనుగోలుకు సిఫారసు చేయడం లేదు. ఈ షేరుకు బదులుగా బజాజ్ ఫైనాన్స్, ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లను ఎంపిక చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే కంపెనీకి ఉన్న కొన్ని ఆస్తులు విక్రయించి నగదు లభ్యత పెంచుకోవడం, వ్యూహాత్మక భాగస్వామి కోసం ప్రయత్నిస్తుండటం వంటి కారణాలతో షేరు మళ్లీ పుంజుకుంటోంది. అయితే ఇది ఎక్కడిదాకా వెళ్లి ఆగుతుందో వేచి చూడాల్సిందే.

డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేరు ధర				
	2.2.1998 5.50	11.1.2008 120.00	30.3.2009 27.00	3.9.2018 678.00
	11.1.2008 120.00	30.3.2009 27.00	3.9.2018 678.00	4.2.2019 96.80
	వృద్ధి 2000% పైగా	క్షీణత 78%	వృద్ధి 2400% పైగా	క్షీణత 85%

వొడాఫోన్ ఐడియా నష్టం రూ.5005 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా ఏకీకృత ప్రాతిపదికన రూ.5005.7 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.1,284.5 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గతేడాది ఆగస్టులో వొడాఫోన్, ఐడియా విలీనం కావడంతో.. ప్రస్తుత ఫలితాలను గతేడాదితో పోల్చిచూడలేమని కంపెనీ వెల్లడించింది. అయితే రెండో త్రైమాసికంతో పోలిస్తే మాత్రం నష్టాలు మరింత పెరిగాయి. ఇక మొత్తం ఆదాయం రూ.7,878.6 కోట్ల నుంచి 52 శాతం వృద్ధితో రూ.11,982.8 కోట్లకు చేరింది. 'సమీక్షిస్తున్న త్రైమాసికంలో తీసుకున్న చర్యలు.. త్రైమాసికం చివర్లో మంచి ఫలితాలు చూపించాయి. అనుకున్న దాని కంటే వేగంగా ముందుకు వెళ్తున్నాం. నెట్‌వర్క్ పరంగా మంచి పురోగతి సాధించాం' అని వొడాఫోన్ ఐడియా సీఈఓ బాలేశ్ శర్మ పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 1.65 శాతం నష్టంతో రూ.29.80 వద్ద ముగిసింది.

తగ్గిన అదానీ పవర్ నష్టం

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో అదానీ పవర్ నష్టం రూ.1,180.78 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నష్టం రూ.1313.74 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.4,916.34 కోట్ల నుంచి రూ.6,667.11 కోట్లకు చేరింది. సగటు ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 58 శాతం నుంచి 73 శాతానికి చేరింది. 'గతంలో ఎదురైన నియంత్రణ సంస్థ సమస్యలు.. ఇప్పుడు వేగంగా పరిష్కారం అవుతున్నాయి. విద్యుత్ నియంత్రణ సంస్థ సెర్క్‌తో కుదుర్చుకున్న పీపీఏలకు సరైన సమయంలో ఆమోదం లభిస్తాయని భావిస్తున్నాం' అని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 0.79 శాతం లాభంతో రూ.38.05 వద్ద ముగిసింది.

అదానీ పోర్ట్స్ ఆకర్షణీయం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అదానీ పోర్ట్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.1,418.93 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.1001 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 42 శాతం అధికం. ఇక మొత్తం ఆదాయం రూ.2,924.85 కోట్ల నుంచి రూ.3,168.88 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.1,330.86 కోట్ల నుంచి రూ.1,347.97 కోట్లకు చేరాయి. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో అన్ని విభాగాలు రెండంకెల వృద్ధి నమోదు చేశాయి. రాబోయే నెలల్లో ఇదే జోరు కొనసాగిస్తున్నాం అంచనా వేస్తున్నాం' అని సంస్థ సీఈఓ కరణ్ అదానీ పేర్కొన్నారు.

బీఎస్ఈలో షేరు 2.46 శాతం నష్టంతో రూ.331.15 వద్ద ముగిసింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2018–19	నికర లాభం/(నష్టం) 2017–18	మొత్తం ఆదాయం 2018–19	మొత్తం ఆదాయం 2017–18
వీల్స్ ఇండియా	15.3	12.9	786	591.9
జిందాల్ స్టెయిన్‌లెస్	52.35	134.73	3,140.59	2,999.66
సీమెన్స్	228	190.5	2,894.8	2,500
ఫ్యూచర్ కన్జ్యూమర్	(5.41)	(6.13)	997.93	789.15
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	1,603	1,774	20,355	18,306
అలహాబాద్ బ్యాంక్	(733)	(1,263.79)	4,756.88	4,755.33
మిండా ఇండస్ట్రీస్	69	59	1,470	1,056
ఇంద్రప్రస్థ గ్యాస్	197.94	165.65	1,661	1,294
కమిన్స్ ఇండియా	187.09	172.9	1,463.27	1,318
జైడస్ వెల్‌నెస్	39.69	36.16	155.83	141.23
పుంజ్ లాయిడ్	(2,795.06)	(183.6)	511.04	1,169.47
మణప్పురం ఫైనాన్స్	244.11	171.73	1,081.20	872
న్యూఇండియా అస్యూరెన్స్	(113.52)	617.29	6,357.35	5,900.68
వి-మార్ట్	41.68	36.68	467.55	368.93
ముత్తూట్ ఫైనాన్స్	485	479	1,717	1,591
అదానీ పవర్	(1,180.78)	(1313.74)	6,667.11	4,916.34
అదానీ పోర్ట్స్	1,418.93	1001.00	3,168.88	2,924.85

నేటి బోర్డు సమావేశాలు

★ టాటా మోటార్స్ ★ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ★ గ్రాసిమ్ ★ సెయిల్ ★ అరబిందో ఫార్మా ★ బజాజ్ ఎలక్ట్రికల్స్ ★ బ్రిటానియా ★ క్యాడిలా హెల్త్‌కేర్ ★ జేఎస్‌డబ్ల్యూ హోల్డింగ్స్ ★ ఎంఆర్ఎఫ్ ★ ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ ★ కాఫీడే ★ ఎండ్యూరెన్స్ టెక్నాలజీస్ ★ ఎరోస్ మీడియా ★ జిల్లెట్ ★ ఇర్కాన్ ★ మిండా కార్పొరేషన్ ★ టైమెక్స్

నిరాశపరచిన లుపిన్

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.151.75 కోట్ల నష్టాన్ని లుపిన్ నమోదు చేసింది. 2017-18 ఇదే కాలంలో సంస్థ రూ.221.73 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయడం గమనార్హం. ఇదే సమయంలో కార్యకలాపాలపై ఆదాయం రూ.3900.36 కోట్ల నుంచి రూ.4377.94 కోట్లకు పెరిగింది. వ్యాజ్యాల కోసం ఒకసారి రూ.342.22 కోట్లు కేటాయించడం వల్ల ఈసారి నష్టం ఏర్పడిందని సంస్థ తెలిపింది. పెరిండోప్రిల్‌కు సంబంధించి ఐరోపా కమిషన్ 2014లో ఇచ్చిన తీర్పును లుపిన్ సవాలు చేయగా, జనరల్ కోర్ట్ ఆఫ్ ది యూరోపియన్ యూనియన్ కూడా పాత తీర్పునే సమర్థించడం వల్ల, 42.8 మిలియన్ యూరోల (రూ.342.22 కోట్లు) జరిమానా చెల్లించాల్సి వచ్చిందని లుపిన్ వివరించింది. ఈ తీర్పును యూరోపియన్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఎదుట సవాలు చేస్తామని సంస్థ తెలిపింది.

బీఎస్ఈలో షేరు 0.56 శాతం లాభంతో రూ.841.95 వద్ద ముగిసింది.

20% తగ్గిన సిప్లా లాభం

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సిప్లా సంస్థ రూ.322.24 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.403.45 కోట్లతో పోలిస్తే ఇది 20 శాతం తక్కువ. కార్యకలాపాల ఏకీకృత ఆదాయం రూ.3,913.82 కోట్ల నుంచి రూ.4,007.54 కోట్లకు చేరింది. పన్ను వ్యయాలు రూ.125.68 కోట్లకు చేరాయి. 'మేము ఊహించిన విధంగానే ఈ త్రైమాసికంలో ఔషధ విపణిలో సవాళ్లు ఎదురయ్యాయి. అమెరికాలో మాత్రం బలమైన పని తీరు కనబరిచాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలోకి అడుగుపెట్టే సమయానికి మంచి ప్రణాళికతో ముందుకెళ్లబోతున్నాం. భవిష్యత్తుపై ఆశావాద దృక్పథంతో ఉన్నాం. ఏడాదికేడాది గణనీయమైన వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామ'ని సిప్లా మేనేజింగ్ డైరెక్టర్, గ్లోబల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) ఉమాంగ్ వోహ్రా వెల్లడించారు.

బీఎస్ఈలో షేరు 3.75 శాతం లాభంతో రూ.527.95 వద్ద ముగిసింది.

ఈ ఏడాది బంగారం, వెండికి గిరాకీ

• 'కార్వీ' కమొడిటీ నివేదిక అంచనా

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాదిలో బంగారం, వెండి ధరలు ఆకర్షణీయంగా పెరిగే అవకాశం ఉన్నట్లు కార్వీ కన్సల్టెంట్స్ విడుదల చేసిన 'కమొడిటీ, కరెన్సీ నివేదిక- 2019' పేర్కొంది. "లోహాలకు 2017లో మంచి గిరాకీ లభించింది. కానీ గత ఏడాదిలో మాత్రం లోహాల ధరలు నీరసించాయి. రూపాయి విలువ కూడా క్షీణించింది. మనదేశంలో లోటు భారం అధికం కావడం, కరెంటు ఖాతాపై ఒత్తిడి ఇందుకు దోహదపడింది. కానీ ఈ ఏడాది మాత్రం లోహాలకు పరిస్థితి సానుకూలంగా మారుతుంది" అని ఈ నివేదిక విశ్లేషించింది. ఈ ఏడాదిలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ రెండుసార్లు వడ్డీరేట్లను పెంచుతుందనే అంచనాలున్నాయని, అందువల్ల బంగారం, వెండిపై పెట్టుబడులు పెరుగుతున్నాయని పేర్కొంది. ఈ సంవత్సరంలో బంగారం, వెండి పెట్టుబడిదార్లకు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వడమే కాకుండా, సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా కూడా నిలుస్తాయి- అని కార్వీ కమొడిటీ అండ్ కరెన్సీ విభాగం సీఈఓ రమేష్ వరఖేద్కర్ అభిప్రాయపడ్డారు.

మరికొన్ని అంచనాలు..

- ✦ ఈ ఏడాదిలో ముడిచమురు ధరలు బాగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఒపెక్, రష్యా దేశాలు ఇప్పటికే ముడిచమురు ఉత్పత్తిని తగ్గించాయి. అదే సమయంలో యూఎస్ ఉత్పత్తిని అధికం చేసింది. అయినప్పటికీ ముడిచమురు ధర పెరిగేందుకు అవకాశం ఉంది.
- ✦ డిమాండ్ తగ్గిన కారణంగా రాగి ధర ఇంకా తగ్గవచ్చు.
- ✦ అదేవిధంగా అల్యూమినియం ధర కూడా దిగువ స్థాయిలోనే ఉండిపోయే అవకాశం ఉంది. రష్యాలోని అగ్రశ్రేణి అల్యూమినియం తయారీ సంస్థ అయిన రసెల్ అధికోత్పత్తిని నమోదు చేయడం దీనికి కొంత కారణం.
- ✦ ఈ ఏడాదిలో పత్తి ధరలు నిలకడగా ఉంటాయి.
- ✦ ఈ ఏడాది ద్వితీయార్థంలో సోయాబీన్ అధిక దిగుబడి నమోదు అవుతుందని అంచనా. అందువల్ల సోయాబీన్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి ఉంటుంది.
- ✦ జీరా, గౌర్ గమ్ ధరలు ఈ ఏడాదిలో ఆకర్షణీయంగా ఉండకపోవచ్చు.

యూఎస్, చైనా వాణిజ్య యుద్ధం

యూఎస్, చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా గత ఏడాదిలో లోహాల ధరలు ప్రభావితమయ్యాయి. గత ఏడాది నవంబరు చివర్లో జీ20 దేశాల సమావేశం సందర్భంగా యూఎస్, చైనా అదనపు సుంకాల వడ్డింపునకు 90 రోజుల విరామం ప్రకటించాయి. ఈ గడువు ముగిసిన తర్వాత మళ్లీ సుంకాల విధింపు అంశం తెర మీదకు రావచ్చు. అందువల్ల ఈ ఏడాదిలో రాగి, లెడ్, నికెల్, జింక్ వంటి ప్రాథమిక లోహాల ధరలపై ఒత్తిడి ఉంటుందని ఈ నివేదిక అభిప్రాయపడింది.

ఆర్‌బీఐపై ఆశలతో ముందుకు..

• 5 నెలల గరిష్ఠానికి సూచీలు

• 11,000 ఎగువన నిఫ్టీ

• 32% క్షీణించిన రిలయన్స్ ఇన్‌ఫ్రా

సమీక్ష

సూచీలు వరుసగా అయిదో రోజూ లాభాలతో ముగిశాయి. మంగళవారం నుంచి ప్రారంభమైన ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష తాలూకు నిర్ణయాల ప్రకటన నేడు వెలువడనుండటంతో పాటు ఆర్థిక సేవలు, ఐటీ, లోహ రంగాల షేర్లలో వచ్చిన కొనుగోళ్ల మద్దతు మార్కెట్‌కు బాగా కలిసొచ్చింది. సూచీలు 5 నెలల గరిష్ఠానికి చేరాయి. సెన్సెక్స్ 358 పాయింట్లు, నిఫ్టీ 128 పాయింట్ల మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ సూచీలకొస్తే ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ స్వల్పంగా పెరిగింది. లునార్ న్యూ ఇయర్ సందర్భంగా చైనా, కొరియా మార్కెట్లు పని చేయలేదు. ఐరోపా మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి.


సెన్సెక్స్ ఉదయం 36,714.54 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆ తర్వాత వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో 37,005.25 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 358.42 పాయింట్ల లాభంతో 36,975.23 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 128.10 పాయింట్ల లాభంతో 11062.45 పాయింట్ల వద్ద స్థిరపడింది.

అడాగ్ షేర్లు విలవిల: అనిల్ అంబానీ గ్రూప్ (అడాగ్) షేర్ల నష్టపరంపర కొనసాగింది. బీఎస్ఈలో రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు 32 శాతం పతనం కాగా.. ఆర్‌కామ్ షేరు ముఖవిలువ అయిన రూ.5కు చేరువైంది. ఇంట్రాడేలో రూ.141.75 వద్ద కనిష్ఠానికి చేరిన రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు.. చివరకు 32.22 శాతం నష్టంతో రూ.154 వద్ద ముగిసింది. ఇక ఆర్‌కామ్ షేరు ఒకానొకదశలో 11 శాతం కోల్పోయి రూ.4.85 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 0.74 శాతం పెరిగి రూ.5.48 దగ్గర స్థిరపడింది. ఇక రిలయన్స్ పవర్ 14 శాతం తగ్గి రూ.10.30కి, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 12 శాతం తగ్గి రూ.26కి, రిలయన్స్ నేవల్ 11 శాతం తగ్గి రూ.7.75 వద్ద 52 వారాల కనిష్ఠాలను తాకాయి. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో రిలయన్స్ నిప్పన్ లైఫ్ మినహా ఆరు అడాగ్ గ్రూప్ షేర్లు 22 శాతం నుంచి 53 శాతం క్షీణించాయి. ఏడు అడాగ్ కంపెనీల మార్కెట్ విలువ 30 శాతం తగ్గి రూ.10,116 కోట్లు ఆవిరైంది.

- ✦ ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 8 శాతానికిపైగా లాభపడింది. బీఎస్ఈలో 8.13 శాతం లాభంతో రూ.811 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో ఇండస్ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ తప్ప మిగిలిన 28 లాభాలతోనే ముగిశాయి.

6న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	406	వరంగల్	408
చిల్లరగా(ఒక గుడ్డు)	4.65	విశాఖపట్నం	416
బెంగళూరు	435	చెన్నై	450
7వ తేదీకి...		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	406	నమక్కల్	430

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 330.35 (339.80) 6687853
ASIAN PAINTS 1469.40 (1450.35) 1088914
AXIS BANK LT 725.75 (729.50) 8077340
BAJAJ AUTO L 2770.15 (2710.65) 495030
BAJAJ FINANC 2711.25 (2603.60) 1798461
BAJAJ FINSER 6208.65 (6017.10) 228970
BHARTI AIRTE 308.75 (308.20) 4688955
BHARTI INFRA 296.35 (288.90) 2707550
BPCL 339.30 (337.95) 2095411
CIPLA 534.95 (508.00) 8775759
COAL INDIA L 219.95 (216.40) 3707342
DR. REDDYS 2789.70 (2821.45) 881795
EICHER MOTOR 21104.25 (20479.65) 129716
GAIL 339.80 (332.10) 4122658
GRASIM IND 733.50 (703.95) 1587847
HCL TECH 1055.20 (1047.75) 1165500
HDFC 1987.95 (1981.40) 2036890
HDFC BANK 2122.65 (2114.05) 2718921
HERO MOTOCOR 2880.05 (2854.55) 445829
HINDALCO IND 211.40 (204.75) 5888996
HINDUSTAN UN 1829.95 (1821.45) 859789
HPCL 233.90 (225.15) 9862953
ICICI BANK 359.30 (352.65) 15396216
INDIABULLS H 653.85 (645.40) 5598360
INDIAN OIL 137.85 (133.75) 4483438
INDUSINDBANK 1526.05 (1541.75) 1541770
INFOSYS LTD 763.30 (754.85) 5880482
ITC 277.70 (274.15) 8097580
JSW STEEL LT 279.30 (273.55) 5746435
KOTAK MAHIND 1279.50 (1279.15) 1158741
LARSEN & TOU 1314.40 (1304.60) 2034886
M&M 695.10 (684.90) 2221744
MARUTI SUZIK 7183.40 (7093.60) 567827
NTPC LTD 137.10 (138.05) 10675675
ONGC 146.70 (142.95) 5075180
POWER GRID C 186.80 (186.10) 2431491
RELIANCE IND 1310.25 (1291.55) 9411585
SBI 289.05 (284.65) 12149759
SUN PHARMA 416.60 (409.90) 5638849
TATA CONSULT 2074.80 (2044.55) 1789812
TATA MOTORS 178.50 (175.80) 10334594
TATA STEEL L 485.10 (464.70) 10999265
TECH MAHINDR 811.35 (751.00) 14860848
TITAN IND 1059.05 (1066.70) 2449722
ULTRATECH 3510.35 (3461.75) 341588
UPL LIMITED 805.25 (795.95) 3747561
VEDANTA LIMI 163.75 (162.60) 13140943
WIPRO 372.20 (368.45) 2179261
YES BANK LTD 176.45 (176.10) 45391450
ZEE ENTERTAI 388.00 (365.35) 25112956

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1259.90 (1257.75) 67825
ACC 1401.45 (1388.80) 1287668
ADITYA BIRLA 82.35 (81.85) 3250195
AMBUJA CEMEN 214.50 (209.25) 2419386
ASHOK LEYLAN 82.55 (82.15) 13068393
AUROBIND PHA 759.85 (743.50) 2020397
AVENUE SUPER 1512.65 (1471.70) 827585
BANDHAN BANK 440.40 (416.65) 2129366
BANK OFBAROD 109.20 (107.95) 11075323
BEL 81.90 (79.80) 6294987
BHEL 60.80 (58.85) 19423985
BIOCON LTD 634.55 (649.30) 1179571
BOSCH LTD 19248.25 (19056.40) 10117
BRITANNIA 3181.40 (3167.05) 313476
CADILA HEALT 317.95 (314.85) 998197
COLGATE PALM 1294.90 (1291.10) 204718
CONTAINER 510.45 (517.40) 448414
DABUR INDIA 453.70 (449.05) 1491252
DLF LIMITED 160.35 (159.75) 10746796
GENERAL INS 241.45 (247.40) 39814
GODREJ CONSU 705.25 (684.50) 596299
HAVELLS INDI 737.50 (730.80) 1638747
HDFC STAND L 369.60 (376.25) 489165
HINDUSTAN ZI 256.90 (254.80) 605504
ICICI LOMBAR 899.05 (884.60) 384830
ICICI PRU LI 288.35 (286.30) 850787
IDEA CELLULR 30.00 (30.45) 26312052
INTERGLOBE A 1197.05 (1174.40) 919960
L&TFIN.HOLD 128.60 (126.40) 3515758
LIC HOUS.FIN 459.80 (459.35) 1420605
LUPIN 842.10 (837.70) 6429178
MARICO LIMIT 364.95 (363.50) 1975403
MCDOWELL 557.40 (549.90) 1010896
MOTHERSON 137.60 (136.50) 2657093
MRF 59936.00 (60004.30) 5305
NHPC LTD 24.20 (23.80) 3884160
NMDC LTD 95.10 (93.90) 2069100
OIL INDIA 171.35 (169.50) 1216381
ORACLE FIN S 3879.70 (3828.25) 14215
P&G HYG&HEAL 9977.90 (9938.50) 2154
PETRONET LNG 219.45 (220.15) 2323154
PIDILITE IND 1125.00 (1119.30) 242917
PIRAMAL ENTE 2171.30 (2171.10) 669449
SAIL 47.30 (45.35) 11978877
SBI LIFE INS 579.40 (584.00) 690808
SHREE CEMENT 16031.15 (15675.65) 13200
SHRIRAM TRAN 1068.10 (1068.10) 1129650
SIEMENS 1020.55 (994.60) 1126560
SUN TV LTD 543.55 (522.00) 1734832

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 4.98 (4.75) 12240
AISHWARYA TE 2.38 (2.38) 60
ALPHAGEO 434.95 (446.55) 396
AMAR RAJA BA 782.95 (771.20) 40803
ANDHRA BANK 24.40 (24.35) 51969
ANDHRA CEMEN 4.08 (4.29) 10375
ANDHRA PAPER 449.50 (449.10) 1139
ANDHRA PETRO 55.50 (55.40) 72111
ANDHRA SUGAR 318.95 (321) 3225
ANJANI PORTL 100.90 (108) 331
ASTRA MICROW 74.90 (75.20) 6584
AUROBINDO PH 760.65 (744.70) 93625
AVANTEL SOFT 225.10 (220.30) 4099
AVANTI FEEDS 317.55 (324.80) 48137
BALAJI AMIN 391.30 (392.60) 914
BARTRONICS 5.66 (6.13) 28005
BHAGIRA CHEM 416 (400) 17646
BHAGYA NAG 31.30 (32.50) 750
BN RATHI SEC 22.30 (24.75) 11211
BRILLIANT SE 0.74 (0.77) 11150
CAMBRIDGE TE 39.35 (41.20) 365
CIL SECURI 15 (15) 200
CONT COFFEE 271.80 (269.50) 1178
COROMAN FERT 445.40 (452.10) 1313
CUBEX TUB 13 (13.68) 130
CYBERMATE 1.83 (1.78) 20541
CYIENT LIMIT 610.80 (606.80) 6773
DIVI'S LAB 1654.10 (1616.45) 33367
DIVYA GRANIT 89.25 (91) 3242
DR REDDY 2791.85 (2826.25) 38394
FOUR SOFT 39.60 (36.45) 50
GATI CORPN 69.25 (70) 38388
GAYATRI PROJ 163.15 (165.45) 1220
GMR INFRASTR 15.10 (14.80) 4088847
GOLDST INFRA 197.80 (201.20) 15731
GOLDSTONE EN 12.96 (13.60) 482
GRANULES (I) 85.50 (85.80) 39815
GSS AMERICA 109 (109.55) 40138
GVK POWER 5.71 (5.54) 232516
HBL NIFE POW 23.85 (24.85) 19248
HERITAGE FOO 482.05 (481.95) 422
HIL LTD 1763.60 (1856.10) 2188
HIND FLUROCA 13.30 (13.30) 1
IDL INDUSTRS 230 (235.90) 384
ILFS ENGINEE 9.69 (10.19) 17321
INCAP 35 (34.85) 778
IVRCL INFRAS 0.82 (0.86) 83682
JEEVAN SCIEN 33.20 (31.75) 3313
KAKATIYA CEM 169.05 (168) 2210
KALLAM SPG 16.10 (16.55) 9733
KAVERI SEED 567.55 (580.55) 18514
KCP LTD 84.35 (83.90) 1534
KERNEX MICRO 23 (23.20) 2901
KNR CONSTRUC 205.85 (205.90) 1786
KREBS BIO 88.50 (94.45) 1268
LANCO INDUS 165.75 (165.25) 3154
LAURUS LABS 345.05 (351.20) 449
LOKESH MACH 40.25 (40) 34187
MADHUCON PRO 5.29 (5.53) 4249
MEDINOVA DIA 15.75 (16.25) 1900
MEGA SOFT 6.44 (6.75) 3256
MIC ELECTRON 0.81 (0.84) 47762
MOLD-TEK.TEC 42.85 (42.70) 2142
MOLDTK PLA 230.80 (231.55) 15298
MSR INDIA LT 9.12 (9.07) 16805
NAGARJAGRICH 30.15 (28) 49845
NATCO PHARMA 673 (681.35) 5956
NAVA BH VENT 110.20 (107.90) 9762
NCC 79.75 (78.15) 530917
NCL IND 112.60 (114.25) 3826
NEHA INTER 4.20 (4.18) 126
NETTLINX 41.80 (41.90) 7166
NEULAND LAB 490.75 (486.50) 488
NIHAR INFO 11.25 (11.80) 204
NILE 297.30 (296.60) 1346
NORTHGATE TE 0.55 (0.57) 3420
OIL COUNTRY 12.13 (12.87) 1759
PANYAM CEMEN 7.79 (8.36) 37430
PENNER IND 34.55 (34.75) 6611
PHYTOCHEM I 38.90 (42.40) 698
PIONEER DIST 114.50 (124.15) 3543
PITTI LAMIN 54.55 (54.50) 2349
POKARNA 166.60 (170.50) 3480
PRAJAY ENGS 7.30 (7.50) 2301
PREMIER EXPL 212.55 (210.70) 1069
PRISM CEMENT 75.15 (66.55) 197655
PRUDENTL PHA 2.80 (2.98) 166718
RAASI REFRAC 17.15 (18.05) 51
RAIN INDUSTR 106.95 (103.20) 566098
RAJ PACKAGIN 27 (27.50) 14137
RAM INFORMAT 42.45 (41.50) 597
REG.CERAMIC 3.50 (3.36) 1001
SAGAR CEM 591.35 (605.65) 474
SAMKRG PIST 172.90 (171.30) 776
SATVAH. ISPA 8.70 (9) 4275
SMS PHARMA 65.05 (66.95) 2806
SREE RAYAL A 32.10 (32.65) 66388
SRINIVASA SH 38.90 (39.60) 3255
STARCHIK SP 30 (30) 535
STEEL EXCHAN 13 (11.92) 3578
SUJANA TOWER 1.54 (1.53) 4
SUJANA UNIVE 0.26 (0.27) 1025
SURANA STRIP 1.84 (1.76) 2
SURANA TELE 4.40 (4.43) 2052
SURYALAKSH.C 37.40 (36.60) 400
SUVEN PHARMA 220.30 (205.55) 118363
TAJ GVK HOTE 173.90 (180.15) 578
TANLA 35.60 (34.10) 13847
TERA SOFTWAR 44.25 (44.75) 305
TRANS BIOTEK 4.94 (5.04) 31705
TRENDY KNIT 0.20 (0.19) 124050
VAMSHI RUBB 28 (27.85) 14
VBC FERRO 35.95 (37.75) 762
VICEROY HOTE 2.57 (2.70) 19225
VIJAY TEXTIL 37.75 (38.90) 287
VIMTA LABS 254.35 (251.50) 2028
VISAKA IND 362.95 (369.05) 4148
VISTA PHARMA 23.95 (24.30) 7825
VIVIMED LABS 20.30 (22.10) 326116
VJIL CONSULT 33.20 (32.20) 1050
VST INDUS 3200 (3200) 61
YBRANT DIGIT 2.87 (2.88) 1174707
ZENOTECH LAB 19.55 (21.70) 49468
ZENTECH 71.05 (72.55) 4759

ఈనాడు బిజినెస్

ఆకాశ్ వివాహం మార్చి 9న ?

23-25ల్లో స్విట్జర్లాండ్‌లో బ్యాచిలర్ పార్టీ



ముంబయి: కుబేరుడు ముకేశ్ అంబానీ తనయుడు ఆకాశ్ అంబానీ, వజ్రాల కంపెనీ అధినేత రసెల్ మెహతా కుమార్తె శ్లోకా మెహతాల వివాహం మార్చి 9న ముంబయిలో జరగనుందని సమాచారం. ఇండియాటుడే వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. చిన్ననాటి నుంచే స్నేహితులైన ఆకాశ్ అంబానీ, శ్లోకా మెహతా మార్చి 9 నుంచి 3 రోజుల పాటు ముంబయిలో జరగనున్న వివాహ వేడుకతో ఒక్కటి కానున్నారు. గత జూన్‌లోనే శ్లోకా-ఆకాశ్‌లకు నిశ్చితార్థం జరిగిన సంగతి విదితమే.

✦ మార్చి 9న ముంబయి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో వరల్డ్ సెంటర్‌లో వివాహం జరగనుందని చెబుతున్నారు. ఆరోజు సాయంత్రం 3.30 గంటలకు విలాసవంత 5 స్టార్ హోటల్ ట్రైడెంట్‌లో మంగల్ బారాత్ ప్రారంభమై, జియో వరల్డ్ సెంటర్‌కు చేరతారు. 6.30 గంటలకు అక్కడ అతిథులకు హై టీపార్టీ ఉంటుంది. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వివాహం జరుగుతుంది.

✦ మార్చి 10న జియో వరల్డ్ సెంటర్‌లోనే అంబానీలు, మెహతాలు కలిసి ఘనంగా విందు నిర్వహిస్తారు. మంగల్ పర్వ్ వేడుక ఇదే రోజు ఉంటుంది. ఈ వేడుకలకు వ్యాపార, రాజకీయ, సినీ ప్రముఖులు హాజరవుతారని భావిస్తున్నారు.

✦ మార్చి 11న జియో వరల్డ్ సెంటర్‌లోనే వివాహ రిసెప్షన్ ఉంటుంది.

500 మంది హాజరు

వివాహానికి ముందుగా ఆకాశ్ అంబానీ బ్యాచిలర్ పార్టీ ఈనెల 23-25 తేదీల్లో స్విట్జర్లాండ్‌లోని సెయింట్ మోరిజ్‌లో అట్టహాసంగా జరగనుందని వార్తలొస్తున్నాయి. సినీ ప్రముఖులు కరణ్ జోహార్, రణ్‌బీర్ కపూర్ వంటి 500 మంది సన్నిహితులు ఈ వేడుకకు హాజరు కానున్నారని తెలుస్తోంది. ఇందుకోసం ముంబయి నుంచి 2 ప్రత్యేక విమానాల్లో అతిథులు తరలి వెళ్తారని సమాచారం. అయితే అధికారికంగా ఎవరూ వివరాలు వెల్లడించలేదు.

✦ తన తల్లితో కలిసి శ్లోకా మెహతా షాపింగ్ చేస్తున్న దృశ్యాలను గమనిస్తే, త్వరలోనే వివాహం ఉంటుందని కొన్ని మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. ఆకాశ్ కవల సోదరి ఈశా అంబానీ-ఆనంద్ పిరమాల్‌ల వివాహాన్ని ముకేశ్ అంబానీ- నీతా అంబానీ గత డిసెంబరులో అత్యంత వైభవంగా నిర్వహించిన సంగతి విదితమే.

అప్పులిచ్చి ఆపసోపాలు

- వసూలు చేసుకోలేక హైరానా
- చివరకు వాటా తీసుకోవాల్సిన పరిస్థితి
- వెంటాడుతున్న కింగ్‌ఫిషర్ అనుభవాలు
- అయోమయావస్థలో బ్యాంకులు



జెట్ ఎయిర్‌వేస్ నుంచి రుణాలు వసూలు చేసుకునే మార్గం లేక, ఆ సంస్థలో వాటా తీసుకునేందుకు బ్యాంకులు సన్నద్ధమవుతున్నాయి. గుట్టలుగా పోగైన నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తుండగా, మళ్లీ జెట్ ఎయిర్ వేస్ రుణాలు ఎన్‌పీఏగా మారితే ఇబ్బంది కరమనే భావనతోనే బ్యాంకులు ఇందుకు అంగీకరించాయని సమాచారం. గతంలో మూతబడిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌లోనూ బ్యాంకులు వాటా తీసుకున్నా, ఫలితం ఏమైందో తెలిసిందే.

ఈనాడు వాణిజ్య విభాగం

దేశీయ విమానయాన రంగంలో ఆరోవంతు వాటా జెట్ ఎయిర్‌వేస్‌దే. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని 26 బ్యాంకుల బృందానికి నరేశ్ గోయెల్ నేతృత్వంలోని జెట్ ఎయిర్‌వేస్ 1.52 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,800 కోట్ల) మేర చెల్లించాల్సి ఉంది. ఎస్‌బీఐకి అధికంగా, ఐసీఐసీఐ బ్యాంక్ (దుబాయి శాఖ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (హాంకాంగ్ శాఖ) కూడా పెద్దమొత్తంలో రుణాలిచ్చాయి. డిసెంబరు 31 నాటికి ఈ రుణ కిస్తీలను చెల్లించకపోవడంతో, ఎగవేతదారుగా జెట్ ఎయిర్‌వేస్ నిలిచింది. తదుపరి 90 రోజుల్లోపు కనుక, కనీసం రూ.1700 కోట్లయినా చెల్లించలేకపోతే, ఈ రుణం నిరర్థక ఆస్తిగా మారుతుంది. అందువల్లే వ్యూహాత్మక పెట్టుబడిదారు/రుణ పునర్‌వ్యవస్థీకరణ కోసం జెట్ ఎయిర్‌వేస్ ప్రయత్నిస్తోంది. రుణం పునరుద్ధరించాలంటే, జెట్ ఎయిర్‌వేస్‌లో 24 శాతం వాటా కలిగిన ఎతిహాద్ ఎయిర్‌వేస్ కనీసం రూ.3,500 కోట్లు పెట్టుబడి పెట్టాలని బ్యాంకర్లు కోరుతున్నారు. ఇది జరిగేలా లేదు. అందుకే రుణం బదులు వాటాలు కేటాయిస్తామని, బ్యాంకులకు జెట్ తెలిపింది. ఈ ప్రతిపాదనకు ఆమోదం పొందేందుకు ఈనెల 21న అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెట్ వెల్లడించింది. ఇలా చేస్తే, సంస్థకు రుణభారం, సత్వర చెల్లింపుల కోసం నగదు అవసరం కొంతవరకు తగ్గుతుంది. ఎన్‌పీఏ పెరగకుండా చూసుకునేందుకు బ్యాంకులూ అంగీకరించే పరిస్థితి ఏర్పడింది.

★ ఎస్‌బీఐకి జెట్ ఎయిర్‌వేస్‌లో కనీసం 15 శాతం వాటా లభిస్తుందని భావిస్తున్నారు. ఇతర బ్యాంకులకూ, వాటి రుణం మేర వాటా ఇస్తారు. అయితే బ్యాంకుల ప్రధాన వ్యాపారం రుణం ఇచ్చి, వడ్డీ పొందడం. అంతేకానీ వ్యాపార సంస్థల నిర్వహణ బాధ్యతలో లేవు. పైగా విమానయాన రంగం అంటేనే అకస్మాత్తు పరిణామాలకు వేదిక. కింగ్‌ఫిషర్ ఉదంతంలోనూ బ్యాంకులకు చేదు అనుభవాలే ఉన్న నేపథ్యంలో, జెట్ ఎయిర్‌వేస్‌లో వాటా పొందడం ఎంతవరకు మేలు చేస్తుందో చూడాల్సిందే.

ఎయిరిండియాకు ముడిపెడితే..



దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్యలో ఏడాది కేడాడికి 20 శాతం వరకు వృద్ధి లభిస్తోంది. గత నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా, విమానయాన సంస్థలు ఆర్థికంగా కష్టాల్లో చిక్కుకుని, మూతబడుతున్నాయి. విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరల్లో క్షీణత, సంస్థల మధ్య పోటీ నేపథ్యంలో టికెట్లను బాగా తక్కువ ధరలకు అందించడం వల్ల దేశీయంగా విమానాల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. తదుపరి ఏటీఎఫ్ ధర పెరిగినా, ఇతర సంస్థలతో పోటీ వల్ల ఛార్జీలు పెంచలేకపోవడం, సిబ్బంది జీతభత్యాలు-ఇతర నిర్వహణ ఖర్చులకు తగినట్లు ఆదాయం, మార్జిన్లు లేకపోవడంతో కొన్ని చిన్న సంస్థలు మూత బడ్డాయి. పూర్తిస్థాయి విమానయాన సేవలందించే దిగ్గజ సంస్థలైన ప్రభుత్వరంగ ఎయిరిండియా, ప్రైవేటురంగ జెట్ ఎయిర్‌వేస్ రుణబాధల్లో చిక్కుకుని, ఎగిరేందుకు అవస్థలు పడుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో, ఎయిరిండియా ప్రైవేటీకరణ తాత్కాలికంగా నిలిచినా, మెడపై కత్తి అలానే ఉంది. ప్రభుత్వ ఆర్థిక సాయంతో బండి లాగిస్తోంది. జెట్ ఎయిర్‌వేస్‌కు ప్రభుత్వ సాయం అందదు. ఈ సంస్థ మూతబడితే, వేల సంఖ్యలో ఉద్యోగాల్లో కోత తప్పదు. ఇదే జరిగితే.. వ్యాపారాల నిర్వహణకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తున్నామని, కోట్ల కొద్దీ ఉద్యోగాలు సృష్టిస్తామని చెబుతున్న మోదీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఇక్కట్లు తప్పకపోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందువల్ల ఎయిరిండియా, జెట్ ఎయిర్‌వేస్‌ను విలీనం చేస్తే, సేవల్లోని సారూప్యత వల్ల ఇరుసంస్థలకూ మేలు కలుగుతుందనే వాదనా వినిపిస్తోంది.

నిర్వహణ ఖర్చులూ రానందునే..

✦ సహేతుకం కాని తక్కువ ఛార్జీలతో ప్రయాణికులను చౌకధరల విమానయాన సంస్థలు ఇండిగో, స్పైస్‌జెట్ ఆకర్షిస్తున్నా, ఇందువల్ల మరికొన్ని సంస్థల ఆర్థిక స్థితి దెబ్బతింటోంది. ప్రతి ప్రయాణికుడి నుంచి కిలోమీటరు దూరానికి లభించిన సగటు ఆదాయాన్ని చూస్తే జెట్ ఎయిర్‌వేస్ పరిస్థితి మెరుగ్గా ఉంది. అయినా కూడా గత 11 ఏళ్లలో 2 ఏళ్లు మాత్రమే జెట్ ఎయిర్‌వేస్ లాభాలు ఆర్జించింది. మార్కెట్‌వాటా కూడా ప్రస్తుతం సగానికి పైగా తగ్గి 16 శాతానికి తగ్గింది.

✦ ఎయిరిండియా మాత్రం సగటు ఆదాయంలో చౌకధరల సంస్థల కన్నా వెనుకే ఉంది. దీనికితోడు రుణాలపై వడ్డీ, విలువ తరుగుదల (డిప్రిసియేషన్) వాటాయే ఆదాయంలో 30 శాతాన్ని హరిస్తున్నాయి. జెట్ ఎయిర్‌వేస్‌కు వచ్చేసరికి ఇది 5 శాతమే.

కష్టాలెలా తీరతాయంటే

అవసరానికి మించి విమానాలను కొనడం వల్లే, ఎయిరిండియా ఆర్థిక కష్టాలు పెరిగాయి. ప్రస్తుతమున్న రూ.50,000 కోట్ల అప్పు తీర్చాలంటే ఆదాయం కావాలి. అయితే చౌకధరల సంస్థలతో పోలిస్తే, నాణ్యమైన సేవలతో పూర్తిస్థాయి విమానయాన సంస్థలు నిలదొక్కుకునేందుకు మంచి అవకాశాలుంటాయి. ప్రపంచంలోనే దిగ్గజ చౌకధరల సంస్థలైన సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ (అమెరికా), రైనైర్ (ఐరిష్), ఎయిరేషియా (మలేసియా)ల సవాలును ఆయా దేశాల్లోని పూర్తిస్థాయి సంస్థలు ఎదుర్కోవడమే ఇందుకు నిదర్శనం.

జెట్ ఆగిందా.. మోదీకి కష్టాలే

జెట్ ఎయిర్‌వేస్ మూతబడితే, దాదాపు 23,000 ఉద్యోగాలు ప్రమాదాలు పడతాయి. మే లోపు ఎన్నికలకు వెళ్లనున్న మోదీ ప్రభుత్వానికి ఇది బాగా ఇబ్బంది కలిగించే అంశమవుతుంది. ఆర్థిక వ్యవస్థకు హానికర విధానాలను మోదీ అవలంబించడం వల్లే, గతంలో విజయవంతంగా నడిచిన జెట్ ఎయిర్‌వేస్ వంటి దిగ్గజ సంస్థలు మూతబడుతున్నాయనేది విపక్షాల వాదన. గత వేసవి నుంచే జెట్ ఎయిర్‌వేస్ కష్టాలు పెరగడంతో, ఆదుకొమ్మని టాటా గ్రూప్‌ను ప్రభుత్వం కోరినట్లు తెలుస్తోంది. కాని అది సఫలం కాలేదు.

ఇవీ ప్రయోజనాలు


ఎయిరిండియా, జెట్ ఎయిర్‌వేస్‌ను కలిపితే ప్రయోజనం ఉంటుందనే వాదనా వస్తోంది. ఇదెలా అంటే.. 2016, 17 ఆర్థిక సంవత్సరాల్లో పన్ను చెల్లింపులకు ముందు ఈ రెండింటి ఆదాయ సగటు (ఎబిటిడా) రూ.5,500 కోట్లుగా ఉంది. ప్రైవేటీకరణ యత్నాల్లో భాగంగా ఎయిరిండియా రుణంలో రూ.25,000 కోట్లు స్వీకరిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. మరో రూ.8,000 కోట్లు తీసుకుని, అప్రధాన ఆస్తులను విక్రయిస్తే, ఇరు సంస్థల రుణభారం రూ.20,000 కోట్లుగా మిగులుతుంది.. ఎబిటిడాకు ఇది 3.6 రెట్లు మాత్రమే అధికం. టికెట్ ధరల పెంపు ద్వారా దీన్నీ తగ్గించుకోవచ్చు.

✦ యాజమాన్యం వృత్తి నిపుణుల చేతుల్లో ఉండాలనేది ఎయిరిండియా సిబ్బంది వాదన. ఇది జెట్ ఎయిర్‌వేస్‌కు ఉంది. అందువల్ల నష్టాలు తగ్గించుకునేందుకు కష్టపడాల్సి ఉన్నా, అసాధ్యమేమీ కాదు.

✦ భారత్‌లో మధ్యతరగతి పెరుగుతుండటం, దేశ జనాభాలో 3 - 3.5 శాతమే విమానాల్లో ప్రయాణిస్తున్నందున, వృద్ధికి అపార అవకాశాలున్నాయి. పటిష్ఠ వ్యవస్థలున్న ఈరెండు కోలుకుంటే, దేశ విమానయాన రంగానికి కచ్చితంగా మేలు జరుగుతుంది.

దాస్‌కు తొలి పరీక్ష

గం.11.45లకు ఆర్‌బీఐ పరపతి విధాన నిర్ణయం



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నేడు వెల్లడించనుంది. ఉదయం 11.45 గంటలకు ఇవి వెల్లడవుతాయి. ఆర్‌బీఐ గవర్నరుగా శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టాక ఇదే మొట్టమొదటి పరపతి విధాన సమీక్ష కావడం గమనార్హం. అంతేకాకుండా తాత్కాలిక బడ్జెట్ అనంతరం జరుగుతోన్న తొలి సమీక్ష కూడా కావడం మరో విశేషం. ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ మూడు రోజుల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. బడ్జెట్లో ప్రతిపాదించిన ద్రవ్యలోటు లక్ష్యానికి 10 బేసిస్ పాయింట్ల దూరంలో నిలవొచ్చని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలను ఎంపీసీ సభ్యులు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే ద్రవ్యలోటు పెరిగితే ద్రవ్యోల్బణానికి ముప్పు ఉండొచ్చని గత డిసెంబరు సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ హెచ్చరించిన సంగతి తెలిసిందే. 2019-20 మధ్యనాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసిన సంగతి తెలిసిందే. బడ్జెట్లో వివిధ వర్గాలకు ప్రకటించిన ప్రతిపాదనల వల్ల ఈ అంచనాకు మించి ద్రవ్యోల్బణం నమోదయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వినిపిస్తుంది. అందువల్ల దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉండకపోవచ్చని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

బోర్డు సమావేశం 18కి వాయిదా!

ఆర్‌బీఐ బోర్డు సమావేశం ఈ నెల 18వ తేదీకి వాయిదా పడినట్లు తెలుస్తోంది. తాత్కాలిక మధ్యంతర బడ్జెట్ అనంతరం జరగనున్న మొట్టమొదటి ఆర్‌బీఐ బోర్డు సమావేశం ఇది. తొలుత 9న సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయించగా ఇప్పుడు 18కి వాయిదా వేశారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

కాగ్నిజెంట్ సీఈఓగా బ్రయాన్ హంప్రైస్



అక్టోబరు- డిసెంబరులో లాభం 64.8 కోట్ల డాలర్లు

దిల్లీ: కాగ్నిజెంట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా (సీఈఓ) బ్రయాన్ హంప్రైస్ నియమితులయ్యారు. 2019 ఏప్రిల్ 1 నుంచి ఆయన నియామకం వర్తిస్తుందని కంపెనీ వెల్లడించారు. డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికానికి 64.8 కోట్ల డాలర్ల నికర లాభాన్ని కాగ్నిజెంట్ ఆర్జించింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో కంపెనీ 1.8 కోట్ల డాలర్ల నష్టాన్ని చవిచూసింది. మరోవైపు ఆదాయం 7.9 శాతం పెరిగి 380 కోట్ల డాలర్ల నుంచి 413 కోట్ల డాలర్లకు పెరిగింది. 'వివిధ విభాగాల్లో ఆదాయ ఆర్జన, పలు క్లయింట్లను జతచేసుకోవడం ద్వారా 2018లో మెరుగైన పనితీరు కనబర్చాము. ఆరు డిజిటల్ విభాగాల్లో పెట్టుబడులు కూడా కంపెనీ పెట్టింద'ని కాగ్నిజెంట్ వైస్ ఛైర్మన్, సీఈఓ ఫ్రాన్సిస్కో డిసౌజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆదాయాలు స్తబ్ధుగానే ఉండొచ్చని కంపెనీ వెల్లడించింది.

అంకుర సంస్థ 'ఎడ్జ్‌టెన్సర్'లో శ్రీ కేపిటల్ పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: అంకుర సంస్థలకు ప్రాథమిక దశలో మూలధన నిధులు సమకూర్చే సంస్థ అయిన శ్రీ కేపిటల్ కొత్తగా ఎడ్జ్‌టెన్సర్ అనే టెక్నాలజీ సంస్థలో వ్యూహాత్మక పెట్టుబడి పెట్టింది. ఎంత మొత్తం సమకూర్చిందీ వెల్లడి కాలేదు. ఎడ్జ్‌టెన్సర్ యూఎస్‌లోని డల్లాస్ కేంద్రంగా పనిచేస్తోంది. దీనికి బెంగుళూరులో అభివృద్ధి కేంద్రం ఉంది. విస్తృతస్థాయిలో వినియోగించగల కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని ఆవిష్కరించటం లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. రాజేష్ నరసింహ, సౌమిత్రి జే. రే దీని వ్యవస్థాపకులు. ఇద్దరూ జార్జియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ పట్టా పుచ్చుకున్నారు. దశాబ్దకాలానికి పైగా ఉద్యోగానుభవం ఉన్న వీరిరువురి వద్ద 75కి పైగా పేటెంట్లు, పరిశోధనా పత్రాలు ఉన్నాయి. రాజేష్ నరసింహ, సౌమిత్రి జే.రే... వంటి సాంకేతిక నిపుణులు ఎంతో అరుదుగా లభిస్తారని శ్రీ కేపిటల్ మేనేజింగ్ పార్టనర్ శశి రెడ్డి అన్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సేవల మార్కెట్ ఎంతో వేగంగా విస్తరిస్తున్నట్లు, అందులో 'ఎడ్జ్‌టెన్సర్' క్రియాశీలకమైన పాత్ర పోషిస్తున్నట్లు విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత అయిదేళ్ల కాలంలో శ్రీ కేపిటల్ 30కి పైగా స్టార్టప్ సంస్థల్లో పెట్టుబడి పెట్టింది. యూఎస్‌లో, మనదేశంలో ఆసక్తికరమైన వ్యాపార విభాగంలో ఉన్న స్టార్టప్ సంస్థల్లో పెట్టుబడి పెట్టటానికి ఇంకా సిద్ధంగా ఉన్నట్లు శశి రెడ్డి వివరించారు.

యూఎస్‌లో ఔషధ ధరల వివాదంలో డాక్టర్ రెడ్డీస్

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్, మరికొన్ని ఇతర కంపెనీలు యూఎస్‌లో ఔషధ ధరల వివాదంలో చిక్కుకున్నాయి. దాదాపు 30 జనరిక్ ఔషధాల ధరలకు సంబంధించిన బిడ్‌లను రిగ్గింగ్ చేయటానికి డాక్టర్ రెడ్డీస్, మరో 42 సంస్థలు ప్రయత్నించాయని యూఎస్‌లోని బీమా సంస్థ అయిన యునైటెడ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ ఫిర్యాదు దాఖలు చేసింది. యూఎస్‌లోని షేర్‌మ్యాన్ చట్టంలోని 1వ సెక్షన్, మిన్నెసోటా తో పాటు మరో 29 రాష్ట్రాల విశ్వాసరాహిత్య చట్టాలను ఈ కంపెనీలు ఉల్లంఘించినట్లు అందులో ఆరోపించింది. వీటిపై చర్యలు తీసుకోవటమే కాకుండా నష్టపరిహారం, ఖర్చులు ఇప్పించాలని కోరింది. కానీ ఈ ఆరోపణలను డాక్టర్ రెడ్డీస్ తోసిపుచ్చింది. తన తప్పులేదని స్పష్టం చేసింది. ఈ న్యాయ వివాదాన్ని ఎదుర్కొంటామని పేర్కొంది. కంపెనీ కార్యకలాపాలపై ఈ వివాదం ప్రభావం లేదని వివరించింది.



లెవిటిరాసెటమ్ ఇంజక్షన్ వెనక్కి...

యూఎస్ మార్కెట్ నుంచి ఒక ఔషధాన్ని డాక్టర్ రెడ్డీస్ స్వచ్ఛందంగా వెనక్కి తీసుకుంటోంది. లేబుల్ తప్పుగా ముద్రించటం దీనికి కారణంగా తెలుస్తోంది. మూర్ఛ వ్యాధికి చికిత్సలో వినియోగించే లెవిటిరాసెటమ్ ఇంజక్షన్‌ను గత ఏడాది ఆగస్టు- సెప్టెంబరు నెలల్లో డాక్టర్ రెడ్డీస్ యూఎస్ మార్కెట్లో విడుదల చేసింది. దీనిపై ముద్రించిన లేబుల్‌లో సమాచారం తప్పుగా ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో ఔషధాన్ని వెనక్కి తీసుకునే ప్రక్రియను కంపెనీ చేపట్టింది.

డిపాజిట్ రేట్లు పెరుగుతాయ్!

- బ్యాంకులకు రూ.20 లక్షల కోట్లు కావాలి
- రుణ వృద్ధికి ఇది తప్పనిసరి: క్రిసిల్



బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేసి నెలవారీ వడ్డీ పొందాలనుకుంటున్న వారు, త్వరలోనే ఆ శుభవార్త వినే వీలుంటుంది. రుణ వితరణలో వృద్ధి కొనసాగాలంటే, 2020 మార్చి నాటికి బ్యాంకులకు రూ.20 లక్షల కోట్ల డిపాజిట్లు అవసరమవుతుంది. ఇంత సమీకరించాలంటే, డిపాజిట్ రేట్లు పెంచక తప్పని స్థితి ఎదురవుతుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ పేర్కొంటోంది.

రుణాలు ఎక్కువ ఇవ్వాలంటే, బ్యాంకుల్లో నగదు తగినంతగా ఉండాలి. డిపాజిట్ల రూపంలోనే నగదు సమకూరుతుంది. బ్యాంకుల ఆర్థిక స్థితి బాగుంటే, డిపాజిట్ చేసేందుకు అధికులు ముందుకు వస్తారు. అందువల్ల కొత్తగా సమకూరే డిపాజిట్లలో, 60 శాతం వాటా, ఆర్థికస్థితి బాగున్న ప్రైవేటు బ్యాంకులకు చేరతాయని క్రిసిల్ అంచనా వేస్తోంది.

ఏడాదికి రూ.7 లక్షల కోట్లే..

గత కొన్నేళ్లుగా ఇతర పెట్టుబడి పథకాల కంటే, కాలావధి డిపాజిట్లపై తక్కువ ప్రతిఫలం రావడంతో, బ్యాంకుల డిపాజిట్లలో వృద్ధి పరిమితంగానే ఉంటోంది. అందువల్లే ఏడాదికి సగటున రూ.7 లక్షల కోట్ల మేర డిపాజిట్లనే బ్యాంకులు సమీకరించగలిగాయి.

✦ ఏడాది కాలంలోనే రూ.20 లక్షల కోట్లు కావాలంటే, దాదాపు మూడింతల మేర సమీకరించాలి. డిపాజిట్ రేట్లు పెంచితే, ఎక్కువమంది ఆకర్షితులవుతారు. అయితే ఇందువల్ల రుణాలపై వడ్డీరేట్లు పెంచాల్సి వస్తుంది.

ఇవన్నీ అనుకూలిస్తాయ్

ఈక్విటీ మార్కెట్లలో ఒడుదొడుకులకు తోడు ఇతర పెట్టుబడి పథకాల్లోకి నిధులు ఒక మాదిరిగానే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, డిపాజిట్‌రేట్లు పెరిగితే, గృహాల్లో పొదుపు రూపంలో దాచుకునే నగదు, మళ్లీ బ్యాంకులకు చేరుతుందని క్రిసిల్ విశ్లేషించింది. గత కొన్ని నెలల్లో డిపాజిట్ రేట్లు సగటున 0.40-0.60 శాతం మేర పెరిగాయని, ఫలితంగా నిధుల వ్యయం.. దీనికనుగుణంగా రుణాలపై వడ్డీ పెంచక తప్పదని వివరించింది.

✦ రుణ గిరాకీని పెంచేందుకు, చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి (ఎస్‌ఎల్‌ఆర్)కి మించి ప్రభుత్వ సెక్యూరిటీల్లో బ్యాంకులు ఇటీవల కాలంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పుడు డిపాజిట్ రేట్లు పెంచక తప్పని స్థితి. బ్యాంకుల అదనపు ఎస్‌ఎల్‌ఆర్ 4 శాతానికి తగ్గుతుంది.

✦ 2017-18లో రుణ వృద్ధి 8 శాతం కాగా, 2018-19, 2019-20 సంవత్సరాలలో 13-14 శాతానికి పెరుగుతుందనేది అంచనా.

✦ ఇది జరగాలంటే, డిపాజిట్ల వృద్ధి కూడా 2017-18 నాటి 6 శాతం నుంచి 10 శాతానికి చేరాలి. ఇంత పెరిగినా కూడా 2006-07 నాటి 25 శాతం కంటే తక్కువే అవుతుంది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరకు, డిపాజిట్లతో పోలిస్తే రుణాల శాతం 78 శాతానికి చేరుతుంది. 2017-18 ఆఖరుకు ఇది 73 శాతంగా ఉంది. 2020 మార్చికి ఇది చారిత్రాత్మక గరిష్ఠమైన 80 శాతానికి చేరుతుందన్నది అంచనా.

ప్రైవేటు బ్యాంకుల హవా

ఆర్థిక స్థితి బాగున్న ప్రైవేటు బ్యాంకులతో పాటు రుణ వితరణ పెరగడం కూడా డిపాజిట్ల ఆకర్షణకు దోహద పడనుంది. కొత్తగా సమీకరించబోయే డిపాజిట్లలో 55-60 శాతం ఇవే సమీకరించగలుగుతాయని అంచనా. సత్వర దిద్దుబాటు చర్యల (పీసీఏ)కు వెలుపలే ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులు 30-35 శాతం సమీకరించ గలుగుతాయి.

✦ మొత్తం డిపాజిట్లలో ప్రైవేటు బ్యాంకుల వాటా 30 శాతానికి చేరింది. అయిదేళ్ల క్రితంతో చూస్తే, ఇది 7 శాతం కావడం గమనార్హం.

2017-18లో 50 ఏళ్ల కనిష్ఠానికి డిపాజిట్ల వృద్ధి

2016 నవంబరులో రూ.500, 1000 నోట్లు రద్దు చేసిన అనంతరం ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో, బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం అంటేనే ప్రజల్లో భయం ఏర్పడింది. ఫలితంగా 2017-18లో డిపాజిట్లలో వృద్ధి 6.7 శాతానికి పరిమితమై, రూ.114 లక్షల కోట్లకు చేరాయి. 1962-63 తరవాత ఇదే అత్యంత తక్కువ. పాత నోట్లను మార్చుకునేందుకు తప్పనిసరిగా జమచేయాల్సి రావడం వల్ల మాత్రమే 2016-17 చివరకు డిపాజిట్లు 15.8 శాతం వృద్ధితో రూ.108 లక్షల కోట్లకు చేరాయి.

ఇవిగో రోబో నర్సులు



థాయ్‌లాండ్‌లో రోబోలు నర్సు అవతారమెత్తాయి. బ్యాంకాక్‌లోని మోంగ్ కువట్టానా జనరల్ ఆసుపత్రిలో చకచకా విధులు నిర్వర్తిస్తున్నాయి. మందుల నుంచి వైద్య పత్రాల వరకు ఇట్టే రోగుల చెంతకు చేరుస్తున్నాయి.

ఐదురోజులుగా...

తిండి లేదు.. కాపాడండి

ఆర్మీనీయలో చిక్కుకున్న పంజాబీ యువత వినతి

అమృత్‌సర్: "ట్రావెల్ ఏజెంట్ల చేతిలో నిలువునా మోసపోయాం. ఐదు రోజులుగా తిండి లేదు. ఆశ్రయం ఇచ్చిన వ్యక్తి బయటకు పొమ్మంటున్నారు. మమ్మల్ని ఎలాగైనా భారత్‌కు తీసుకెళ్లండి" అని అభ్యర్థిస్తూ... ఆర్మీనీయలో చిక్కుకున్న పంజాబీ యువత విడుదల చేసిన వీడియో కలవరం సృష్టిస్తోంది. అమృత్‌సర్‌కు చెందిన జితేందర్‌సింగ్, భోలత్‌కు చెందిన షంషేర్‌సింగ్-పింకీ దంపతులతో పాటు మరో వ్యక్తి గత నవంబరు 3న ఉపాధి నిమిత్తం ఆర్మీనీయకు వెళ్లారు. ఆ దేశంలో ఉద్యోగాలు, పని వీసా ఇప్పిస్తామంటూ ధిల్వాన్, పట్టి ప్రాంతాలకు చెందిన ఏడుగురు ట్రావెల్ ఏజెంట్లు ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షలు చొప్పున తీసుకున్నారు. అయితే, అక్కడకు వెళ్లిన తర్వాత వారికి ఎలాంటి ఉపాధి లేదు! ఏజెంట్లు ఇచ్చింది కేవలం సందర్శక వీసా మాత్రమేనని తేలింది. దీనికి తోడు అప్పట్నుంచి ఆశ్రయమిచ్చిన వ్యక్తి... వారిని వెళ్లిపోవాలని తేల్చి చెప్పాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో వారు నిద్రాహారాలు లేకుండా రోజులు గడుపుతున్నారు.

"ఏడుగురు ట్రావెల్ ఏజెంట్లు మమ్మల్ని మోసగించారు. వారిపై చర్యలు తీసుకోండి. ఐదు రోజులుగా మాకు తిండి లేదు. ఎలాగోలా మమ్మల్ని భారత్‌కు తీసుకువెళ్లండి" అంటూ బాధితులు సంగ్రూర్ ఎంపీ భగవంత్ మన్‌ను తమ వీడియోలో వేడుకున్నారు. ఇది చక్కర్లు కొట్టడంతో కపుర్తలా పోలీసులు స్పందించారు. ఆర్మీనీయలో స్థిరపడిన ఓ ట్రావెల్ ఏజెంటుతో పాటు మొత్తం ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. కాగా... ఏజెంట్ల మోసంపై ధిల్వాన్ పోలీసులకు 15 రోజుల కిందటే ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని షంషేర్‌సింగ్ సోదరుడు జగదీప్‌సింగ్ వాపోయారు. బాధితులను త్వరలోనే వెనక్కు తీసుకొస్తామని ఎంపీ భగవంత్‌సింగ్ హామీ ఇచ్చారు.

ప్రతిభకు పట్టం

సంగీత్‌నాటక్ అకాడమీ పురస్కారాలు ప్రదానం

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం సంగీత్ నాటక్ అకాడమీ అవార్డులను ప్రదానం చేశారు. అయిదు కేటగిరీల్లో ఈ పురస్కారాలను పొందిన 42 మంది కళాకారులకు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వాటిని అందచేశారు. కూచిపూడి నర్తకి దీపికా రెడ్డి కూడా బుధవారం ఈ పురస్కారం రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించిన వారిలో ఉన్నారు. అనంతరం దీపికారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ అవార్డును పొందడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. గురువు వెంపటి చినసత్యంను ఆదర్శంగా తీసుకుని వందల మందికి నృత్యంలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అభినందనలు తెలపడం అమితానందాన్నిస్తోందని చెప్పారు.



దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బుధవారం కూచిపూడి నర్తకి దీపికా రెడ్డికి సంగీత్ నాటక్ అకాడమీ అవార్డును ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ఇరుక్కుపోయిన రూ.వెయ్యి కోట్లు

- క్రిప్టోకరెన్సీ సంస్థ సీఈఓ హఠాన్మరణం
- పాస్‌వర్డ్ లేక వినియోగదారుల సొమ్ము గల్లంతు

టోరంటో: ఓ కెనడా వ్యాపారవేత్త హఠాన్మరణం కారణంగా క్రిప్టో కరెన్సీ రూపంలో ఉన్న సొమ్ము భారీ మొత్తంలో ఇరుక్కుపోయింది. క్వాడ్రిగా అనే సంస్థలో వినియోగదారులకు చెందిన రూ.1037 కోట్ల విలువైన బిట్ కాయిన్లు, ఇతర డిజిటల్ ఆస్తులు ఆచూకీ లేక గల్లంతయ్యాయి. తిరిగి వారికి చెల్లింపులు జరిపే మార్గం లేక ఆ సంస్థ కోర్టును ఆశ్రయించింది. క్వాడ్రిగా సీఈఓ జెరాల్డ్ కాటన్ (30) ఇటీవల భారత్ పర్యటనకు వచ్చి అనూహ్యంగా మృత్యువాత పడ్డారు. అనాథాశ్రమాన్ని ప్రారంభించేందుకు ఇక్కడికి వచ్చిన ఆయన పేగు సంబంధ వ్యాధితో డిసెంబర్ 9న కన్నుమూశారు. క్వాడ్రిగా క్రిప్టో కరెన్సీ నిల్వలు 'కోల్డ్ వ్యాలెట్స్' అనే ఆఫ్‌లైన్ ఖాతాల్లో స్టోర్ చేసి ఉన్నాయి. హ్యాకింగ్ ముప్పు లేకుండా వీటిని ఇలా నిర్వహిస్తున్నారు. ఈ ఖాతాలను వినియోగించాలంటే పాస్‌వర్డ్ తప్పనిసరి. అది జెరాల్డ్‌కు మాత్రమే తెలుసు. వ్యాపార కార్యకలాపాలకు ఆయన వినియోగించే ల్యాప్‌టాప్ ఎన్‌క్రిప్ట్ అయ్యింది. దీని నుంచి సమాచారం వెలికితీసేందుకు సంస్థ హ్యాకర్లను ఆశ్రయించింది. అయినా ఫలితం రాలేదు. రుణదాతల నుంచి రక్షణ కోసం క్వాడ్రిగా కెనడాలోని నోవా స్కోషియా కోర్టును ఆశ్రయించింది. జెరాల్డ్ పాస్‌వర్డ్‌ను ఎక్కడా రాసి కూడా పెట్టలేదని ఆయన భార్య జెన్నీఫర్ రాబర్ట్సన్ కోర్టుకు తెలిపారు. సమస్యను పరిష్కరించుకునేందుకు క్వాడ్రిగాకు కోర్టు 30 రోజుల పాటు సమయం ఇచ్చింది.



జెరాల్డ్ కాటన్

క్రిప్టో కరెన్సీ అంటే..

ఒక రకమైన డిజిటల్ నగదు. బ్లాక్‌చెయిన్ సాంకేతికతపై ఆధారపడి ఈ వ్యవస్థ పనిచేస్తుంది. దీనిపై ఎవరి నియంత్రణా ఉండదు. శక్తిమంతమైన రహస్య సంక్షిప్త ప్రక్రియల ద్వారా లావాదేవీలు జరుగుతాయి. కేంద్ర బ్యాంకులు గానీ, ప్రభుత్వాలు గానీ వీటిని అదుపు చేయడం సాధ్యం కాదు. మొట్టమొదటగా బిట్ కాయిన్ ఇలా రూపొందింది.

మీ రాక మాకు సంతోషమే

- కానీ.. చట్టబద్ధంగా రావాలి
- అమెరికాలోకి వలసలపై ట్రంప్ ఉద్ఘాటన

వాషింగ్టన్: ప్రతిభ ఆధారంగానే అమెరికాలోకి వలసదారులు ప్రవేశించాలన్న తన వాదనను దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. విదేశీయుల రాక తనకు సంతోషమేనని స్పష్టం చేశారు. వారు చట్టబద్ధంగా దేశంలోకి ప్రవేశించాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. గ్రీన్‌కార్డుల కేటాయింపులో దేశాలవారీ కోటా కారణంగా తీవ్రంగా నష్టపోతున్న వేలాదిమంది భారతీయ ఐటీ నిపుణుల్లో ఆయన మాటలు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. మరోవైపు, అక్రమ వలసలను అడ్డుకునేందుకుగాను మెక్సికోతో సరిహద్దుల్లో గోడ నిర్మించి తీరతానని ట్రంప్ స్పష్టీకరించారు.

అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో మంగళవారం ట్రంప్ 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' వార్షిక ప్రసంగం చేశారు. దేశ పౌరులు, చట్టబద్ధంగా వచ్చిన వలసదారుల జీవితాలు, ఉద్యోగాలను రక్షించేలా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను రూపొందించాల్సిన నైతిక బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. "చట్టబద్ధ వలసదారులు లెక్కలేనన్ని రకాలుగా మన దేశాన్ని సుసంపన్నం చేస్తున్నారు. సమాజాన్ని బలోపేతం చేస్తున్నారు. మన దేశంలోకి ప్రజలు రావాలని నేను కోరుకుంటున్నాను. కానీ, వారు చట్టబద్ధంగా రావాలి" అని ట్రంప్ అన్నారు. మెక్సికోతో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి కాంగ్రెస్ నిధులు కేటాయించకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. "ఈ గదిలో ఉన్నవారిలో అత్యధికులు గతంలో గోడ నిర్మాణానికి అంగీకారం తెలిపిన వారే. కానీ సరైన గోడ నిర్మాణం జరగలేదు. నేను నిర్మిస్తాను" అని పేర్కొన్నారు.

ప్రతీకార రాజకీయాలు విడనాడండి

'ప్రభుత్వ షట్‌డౌన్' మళ్లీ తలెత్తకుండా ఉండేందుకుగాను డెమోక్రాట్లు, రిపబ్లికన్లు చేతులు కలపాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ప్రతీకార రాజకీయాలు విడనాడాలని కోరారు. ముంచుకొస్తున్న జాతీయ సంక్షోభాన్ని నివారించేందుకు కాంగ్రెస్‌కు 10 రోజుల సమయముందన్నారు. ప్రభుత్వ వ్యయాలకు, మెక్సికోతో సరిహద్దు రక్షణకు నిధులిచ్చే బిల్లును ఈలోగా ఆమోదించాలని విన్నవించారు.



ఉత్తర కొరియాతో యుద్ధాన్ని నివారించా

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ఈ నెల 27, 28 తేదీల్లో తాను భేటీ కానున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గతేడాది జూన్‌లో ట్రంప్-కిమ్ సింగపూర్‌లో సమావేశమయ్యారు. ఉత్తర కొరియాతో యుద్ధాన్ని తాను నివారించానని ట్రంప్ పేర్కొన్నారు. తాను దేశాధ్యక్షుడిని కాకపోయి ఉంటే ప్రస్తుతం ఆ దేశంతో అమెరికా యుద్ధం చేస్తూ ఉండేదని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వమే తప్పుదోవ పట్టించింది

'ఫార్మింగ్టన్ వర్సిటీ' వ్యవహారంపై న్యాయవాది పెశావరియా స్పందన

వాషింగ్టన్: 'ఫార్మింగ్టన్ వర్సిటీ' వ్యవహారంలో అమెరికా ప్రభుత్వం పాత్రను ప్రముఖ భారతీయ అమెరికన్ న్యాయవాది అనూ పెశావరియా తప్పుపట్టారు. నకిలీ వర్సిటీని ఏర్పాటు చేసి విద్యార్థులను అమెరికా హోంల్యాండ్ భద్రత విభాగం కావాలనే తప్పుదోవ పట్టించిందని ఆమె ఆరోపించారు. విద్యార్థులకు ఐ-20లు జారీ చేసే అధికారం కల్పించే విద్యా బోర్డులో ఫార్మింగ్టన్ పేరు నమోదై ఉందని, హోంల్యాండ్ భద్రత విభాగం ఆమోదం కూడా ఆ వర్సిటీ పొందిందని ఆమె గుర్తుచేశారు. "తెలిసి నేరానికి పాల్పడితే విద్యార్థులను శిక్షించాలి. కానీ వారిని ఉచ్చులో ఇరికించారు. నేరానికి పాల్పడేలా ప్రోత్సహించారు. అలాంటప్పుడు వారికి సాయం అందాలి. అధికారులకు నకిలీ వర్సిటీ అని తెలుసు కాబట్టి వారిని ముందే ఆపాల్సింది. అమాయకుల జీవితాలను మాత్రం నాశనం చేయొద్దు. వారిని కటకటాల వెనక్కినెట్టడం సరికాదు" అని పెశావరియా అన్నారు.

సింహబలుడు

దాడికి దిగిన సింహాన్ని ఖతం చేసిన అమెరికావాసి

కొలరాడో: ఓ వ్యక్తి తనపై దాడికి తెగబడిన సింహంతో కలబడి, తీవ్రగాయాలైనా సరే వెరవకుండా పోరాడి చివరకు దానిని ఊపిరాడకుండా చేసి చంపేసిన ఘటన అమెరికాలోని కొలరాడోలో జరిగింది. తీవ్రగాయాలతో ఆ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. సోమవారం కాలిన్స్ కోట ప్రాంతంలో పరుగుతీస్తున్న ఆ వ్యక్తికి హఠాత్తుగా వెనకనుంచి ఏదో విచిత్రమైన చప్పుడు వినిపించింది. వెనుదిరిగి చూశాడు. మౌంటెన్ లయన్‌గా పేర్కొనే సింహం ఒకటి అతడివైపే తీవ్రంగా చూడటం కనిపించింది. కళ్లు మూసి తెరిచేలోగా ఆ సింహం కాస్తా వ్యక్తిపై ఎగబడింది. ముఖంపై తీవ్రంగా గాయపరచింది. ముంజేతిని కరిచేసింది. ఈ హఠాత్‌పరిణామంతో ఏం చేయాలో పాలుబోని ఆ వ్యక్తి వెంటనే తేరుకున్నారు. ధైర్యాన్ని కూడదీసుకుని తానే సింహం మీదకు లంఘించాడు. ఉభయుల మధ్య కాసేపు హోరాహోరీ జరిగింది. చివరకు రక్తమోడుతున్న ఆ వ్యక్తి ఓ పక్కకు... ఆ వ్యక్తి ఉడుం పట్టుతో ఊపిరాడక చనిపోయిన సింహం మరోపక్కకు పడిపోయారు.

తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన అతడు త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని వైద్యులు చెప్పారు. ఇంతకీ సింహాన్ని ఎలా చంపానన్నది ఆయన చెప్పలేదు. కాకపోతే దానిని తాను ఊపిరాడకుండా చేసి చంపినట్లు మాత్రం చెప్పారు.

పారామిలటరీ దళాల్లో 76,500 పోస్టుల భర్తీ: కేంద్రం

దిల్లీ: కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో (సీఏపీఎఫ్‌లలో) మొత్తం 76,578 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు హోంశాఖ వెల్లడించింది. ఇందులో 7,646 పోస్టులను మహిళలకు కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది.

- 54,953 కానిస్టేబుల్ స్థాయి పోస్టులను సిబ్బంది ఎంపిక సంఘం (ఎస్ఎస్‌సీ) ద్వారా భర్తీ చేస్తారు. సీఆర్‌పీఎఫ్‌లో 21,566; బీఎస్ఎఫ్‌లో 16,984; ఎస్ఎస్‌బీలో 8,546; ఐటీబీపీలో 4,126; అస్సాం రైఫిల్స్‌లో 3,076 పోస్టులు చొప్పున ఈ పోస్టులున్నాయి. మిగతావి సీఐఎస్ఎఫ్ తదితర కేంద్ర సాయుధ బలగాలకు చెందినవి. వీటి భర్తీకి ఎస్ఎస్‌సీ ఈ నెలలోనే అభ్యర్థులకు కంప్యూటర్ ఆధార రాత పరీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.
- వీటితో పాటు కమ్యూనికేషన్, ఇంజినీరింగ్, పారామెడికల్, మెడికల్, మినిస్టీరియల్ తదితర విభాగాల్లో ఉన్న 20,086 ప్రమోషనల్ పోస్టులను కూడా సీఏపీఎఫ్ భర్తీ చేస్తున్నట్లు హోంశాఖ పేర్కొంది.

12 ఏళ్ల వయస్సు తర్వాత ప్రత్యేక రంగాలవైపు మళ్లించాలి: జగ్గీ వాసుదేవ్

దిల్లీ: చిన్నారులకు 12 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత వారిని ప్రత్యేకరంగాల వైపు మళ్లించాలని సద్గురు జగ్గీవాసుదేవ్ చెప్పారు. అద్భుత ప్రతిభను సొంతం చేసుకునేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్‌ను ఉదాహరణగా చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయపాఠశాలల ప్రిన్సిపాళ్ల జాతీయ స్థాయి సమ్మేళనాన్ని ఉద్దేశించి బుధవారం ఇక్కడ ఆయన మాట్లాడారు. పన్నెండేళ్ల వయసు వచ్చే వరకూ చిన్నారులకు వివిధ అంశాలను పరిచయం చేయాలి. పన్నెండేళ్లు దాటిన తర్వాత మాత్రం వారు అనితరసాధ్యమైన ప్రతిభను సొంతం చేసుకునేలా ప్రత్యేక రంగాల దిశగా పయనం మొదలు పెట్టాలని సద్గురు చెప్పారు.

ఐసీయూల్లో యాంటీబయోటిక్స్ వినియోగంపై మార్గదర్శకాలు

దిల్లీ: ఐసీయూల్లోని రోగులకు చికిత్సల్లో యాంటీబయోటిక్స్ వినియోగంపై ఎయిమ్స్, మరికొన్ని ఆసుపత్రుల వైద్యులు కలిసి మార్గదర్శకాలు రూపొందించారు. యాంటీబయోటిక్ నిరోధకత పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో వైద్యులు, ఆసుపత్రులు వీటిని అనుసరించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. భిన్నమైన ఔషధాల నిరోధకత వల్ల తలెత్తే ముప్పు గురించి రోగులందరినీ ముందుగానే పరీక్షించాలని వారు వైద్యులకు సూచించారు. ఇన్ఫెక్షన్ ఏ రకమైనదో మొదట గుర్తించాలని, అనంతరం రోగికి ఏ రకమైన యాంటీ బయోటిక్ ఇస్తే ప్రభావం చూపుతుందో విశ్లేషించాలని సలహా ఇచ్చారు.

రాజకీయాలకు దూరంగా ఉండండి

సైన్యం, ఐఎస్ఐలకు పాక్ సుప్రీంకోర్టు ఆదేశం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో శక్తిమంతమైన వ్యవస్థగా పేరొందిన సైన్యానికి ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీవ్ర శరాఘాతం ఎదురైంది. సైనిక బలగాల సభ్యులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడాన్ని పాక్ సుప్రీంకోర్టు నిషేధించింది. ఐఎస్ఐ వంటి ప్రభుత్వ సంస్థలు చట్ట పరిధిలోనే వ్యవహరించాలని స్పష్టం చేసింది. విద్వేషం, తీవ్రవాదం, ఉగ్రవాద చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2017లో తెహ్రీక్ ఎ లబ్బాయిక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) తదితర ఉగ్రవాద సంస్థలు ఫైజాబాద్‌లో ఇస్లామాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారిపై 20 రోజులపాటు చేపట్టిన ధర్నా, ఆందోళనలకు సంబంధించిన కేసులో బుధవారం చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సందర్భంగా జస్టిస్ ఖాజి ఫయేజ్, జస్టిస్ ముషిర్ ఆలంలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. విద్వేష ప్రచారాన్ని, తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై కన్నేసి ఉంచాలని, కుట్రదారులను చట్టం పరిధిలో విచారించాలని కేంద్ర, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలను ఆదేశించింది.

మోదీలో పరాజయ భయం

- ఓటమి తప్పదని ఆయనకు అర్థమైంది
- రాహుల్ గాంధీ ఎద్దేవా

గోపాలపూర్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. దేశ ప్రజలను మాటలతో మభ్యపెట్టిన మోదీలో ప్రస్తుతం పరాజయ భయం ఆవహించిందని, ఆయన ముఖ కవళికలు మారిపోయాయని ఎద్దేవా చేశారు. యువత భవితను ప్రధాని కాలరాశారని విమర్శించారు. ఒడిశాలోని రవుర్కెలా, భవానీపాట్నాల్లో కాంగ్రెస్ బుధవారం నిర్వహించిన బహిరంగ సభల్లో రాహుల్ మాట్లాడారు. చౌకీదార్(మోదీని ఉద్దేశించి) పాలన దేశ ప్రజలకు తీరని శాపమని పేర్కొన్నారు.

మోదీ పాలనలో కేవలం 15 మంది బడా బాబులు బాగుపడ్డారని, రైతులు తీవ్రంగా మోసపోయారని రాహుల్ ఆరోపించారు. పారిశ్రామికవేత్తలకు భారీగా పన్నులు మాఫీ చేసిన ప్రధాని, రైతు రుణాల మాఫీకి మాత్రం ససేమిరా అన్నారని విమర్శించారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం కింద రైతు కుటుంబాలకు రోజుకు కేవలం రూ.17 ఇవ్వనుండటం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్త అనిల్ అంబానికి రఫేల్ ఒప్పందం ద్వారా మోదీ రూ.30 వేల కోట్ల లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. రవుర్కెలాలో రఫేల్ యుద్ధ విమానం నమూనా చూపించిన రాహుల్.. అలాంటి నమూనాలనైనా తయారుచేయగల సామర్థ్యం లేని అనిల్ అంబానీకి ప్రభుత్వం భారీ కాంట్రాక్టులు అప్పగించిందని మండిపడ్డారు. మోదీపై రైతులు, కార్మికులు, ఆదివాసీలు, మహిళలు ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భాజపాకు పరాజయం తప్పదని ఆయనకు అర్థమైందని పేర్కొన్నారు.



'మాటల రాజు – విధ్వంసక పాలన'

మోదీ పాలనలో యువతకు ఉద్యోగాలు కరవయ్యాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. మోదీని 'మాటల రాజు'గా, ఆయన పాలనను 'విధ్వంసక పాలన'గా ట్విటర్‌లో బుధవారం అభివర్ణించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో నిరుద్యోగ తీవ్రతపై మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని తన ట్వీట్‌కు జోడించారు.

'మన్ కీ బాత్'కు పోటీగా.. 'అప్నీ బాత్... రాహుల్ కే సాథ్'

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి మోదీ పాల్గొనే 'మన్ కీ బాత్'కు పోటీగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కొత్త కార్యక్రమానికి తెరతీశారు. 'అప్నీ బాత్, రాహుల్ కే సాథ్ (రాహుల్‌తో మీ మాట)' పేరున వివిధ వర్గాల ప్రజలతో ఆయన సంభాషించనున్నారు. దేశవ్యాప్తంగా పలు బహిరంగ ప్రదేశాల్లో వివిధ వర్గాల ప్రజలను రాహుల్ నేరుగా కలిసి మాట్లాడేలా కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక రూపొందించింది. గతవారం దిల్లీలోని ఓ రెస్టారెంట్‌లో ఏడుగురు విద్యార్థులతో ఆయన భేటీ అయిన మాదిరిగా... ఉభయ పక్షాలు పరస్పరం చర్చించుకునేలా ఇవి ఉండనున్నాయి. 'రాబోయే రోజుల్లో రైతులు, న్యాయవాదులు, దినసరి కూలీలు, మహిళలు, వైద్యులు, ఇంజినీర్లు... ఇలా వివిధ వర్గాల వారితో రాహుల్ సమావేశమవుతారు. ఒక భేటీ మాత్రం సినీ తారలతో ఉండనుంది. దీనికి స్వర భాస్కర్, కరీనా కపూర్, సైఫ్ అలీఖాన్ వంటి కళాకారులు హాజరవుతారు" అని కాంగ్రెస్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఇక సామాజిక మాధ్యమాల్లో ఉద్ధృతంగా...: సామాజిక మాధ్యమాల్లో ఇక నుంచి విస్తృతంగా దూసుకుపోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రత్యక్ష ప్రసారాల (లైవ్) ద్వారా ప్రజలతో రాహుల్ సంభాషించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

వ్యవసాయ మార్కెట్లకు ఊతం

- రూ.2,000 కోట్లతో నిధి
- పైరసీ భూతాన్ని అడ్డుకునేందుకు చట్ట సవరణ
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

దిల్లీ: గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు, క్రమబద్ధీకరించిన టోకు మార్కెట్ల అభివృద్ధి, స్థాయి పెంపునకుగాను రూ.2,000 కోట్లతో అగ్రి-మార్కెట్ మౌలిక సదుపాయాల నిధి (ఏఎంఐఎఫ్) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్రమంత్రివర్గం పలు ప్రతిపాదనల్ని ఆమోదించింది. సమావేశం వివరాలను కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. 10,000 గ్రామాలు, 585 మార్కెట్ కమిటీల్లో మౌలిక వసతుల అభివృద్ధికిగాను రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు రాయితీ రుణాలను ఏఎంఐఎఫ్ అందిస్తుంది. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో కూడిన ప్రాజెక్టులతో సహా సమీకృత మార్కెట్ వసతుల కోసం రాష్ట్రాలు ఏఎంఐఎఫ్‌ను వినియోగించుకోవచ్చు.

- చలనచిత్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న పైరసీ సమస్యను నిరోధించేందుకు, కఠినంగా జరిమానాలు విధించేందుకు వీలుగా సినిమాటోగ్రఫీ చట్ట సవరణ ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'పైరసీ' నేరాలకు పాల్పడేవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా లేదా రెండింటినీ విధించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది.
- గోవుల పరిరక్షణ, సంరక్షణ, అభివృద్ధి కోసం 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్'ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు ఆమోదం.
- ఆదాయ పన్ను, పరోక్ష పన్నుల అంబుడ్స్‌మన్ సంస్థలను రద్దు చేయాలని నిర్ణయం. ఫిర్యాదులు, పరిష్కారాల యంత్రాంగం ఆన్‌లైన్ వ్యవస్థగా ఉండాలని ప్రజలు కోరుకుంటుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.
- 'అనియంత్రిత డిపాజిట్ పథకాల నిషేధం బిల్లు, 2018'కి సవరణలు చేపట్టాలన్న ప్రతిపాదనకు సమ్మతి. అక్రమ డిపాజిట్ల సేకరణ కార్యకలాపాలను మరింత సమర్థంగా ఎదుర్కోవడం, ఇలాంటి పథకాలు పేదల్ని మోసం చేయకుండా అడ్డుకోవడమే దీని లక్ష్యం.
- ప్రసారభారతికి మౌలిక సదుపాయాల్ని బలోపేతం చేయడం, నెట్‌వర్క్ అభివృద్ధి కోసం 2020 వరకు మూడేళ్ల వ్యవధిలో రూ.1,054.52 కోట్లు కేటాయించే పథకానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం.
- 12 వేల మెగావాట్ల సామర్థ్యంతో గ్రిడ్ అనుసంధానిత సోలార్ ఫొటోవోల్టాయిక్(పీవీ) విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ(సీపీఎస్‌యూ) పథకం రెండో దశ కింద దాదాపు రూ.48 వేల కోట్ల పెట్టుబడితో 2022-23లోగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుల్లో వినిమయ వ్యత్యాస నిధి(వీజీఎఫ్)ని రూ.8,580 కోట్లుగా అంచనా వేశారు.

ఒడిశా ఎంపీ మృతికి లోక్‌సభ సంతాపం

దిల్లీ: ఒడిశాకు చెందిన ఎంపీ లాడూ కిశోర్ స్వైన్ మృతికి లోక్‌సభ బుధవారం సంతాపం తెలిపింది. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది. సభ సమావేశం కాగానే స్పీకర్ సుమిత్ర మహాజన్ సభ్యులకు ఎంపీ స్వైన్ మృతి చెందిన విషయాన్ని తెలియజేశారు. సీనియర్ బీజేడీ నేత, ఆస్కా ఎంపీ స్వైన్ (71) అనారోగ్యంతో భువనేశ్వర్‌లో మంగళవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలతో బాధ పడుతున్నారు.

'వధువును ఆశీర్వదిస్తూ ప్రభుత్వం తులం బంగారం'

గువాహటి: పెళ్లిచేసుకుని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టే వధువుకు ప్రభుత్వం తరపున తులం బంగారం (11.66 గ్రాములు) అందజేస్తామని అసోంలో సోనోవాల్ ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి హిమాంత్ బిశ్వ శర్మ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో పేదలపై వరాల జల్లు కురిపించారు. పేదలకు రూపాయికే కిలో బియ్యం ఇస్తామని ప్రతిపాదించారు. వధువుకు తులం బంగారం ఇస్తామని ప్రకటించారు. మొత్తం రూ.1,193 కోట్ల లోటుతో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి తాజాగా ఎలాంటి పన్నులు విధించలేదు.

మా మద్దతు కోరబోమని.. ప్రమాణపత్రంపై సంతకం చేయండి

ప్రధాని మోదీ, అమిత్ షాలకు తేజస్వీ యాదవ్ సవాల్

కోల్‌కతా: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి ప్రతిపక్ష పార్టీ నేతల్లో ఏ ఒక్కరి సహాయం కోరబోమని ప్రధానమంత్రి మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, రవిశంకర్ ప్రసాద్‌లు ప్రమాణపత్రంపై సంతకం చేయాలని ఆర్జేడీ యువ నేత, బిహార్ శాసనసభలో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ సవాల్ చేశారు. మంగళవారం కోల్‌కతాలో మమతా బెనర్జీతో భేటీ సందర్భంగా ఆయన ఈ సవాల్ విసిరారు. ఇదే విషయాన్ని బుధవారం పునరుద్ఘాటించారు. "అందరు నాయకులు అవినీతిపరులని ప్రధానమంత్రి మోదీ అండ్ కో అంటోంది. కాబట్టి లోక్‌సభ ఎన్నికల తర్వాత 23 ప్రతిపక్ష పార్టీల్లో ఏ ఒక్క పార్టీ సహాయం తీసుకోబోమని వారు హామీ ఇవ్వాలి" అని తేజస్వీ వ్యాఖ్యానించారు. "ఈ 23 పార్టీలతో కూటమి కట్టబోమని ప్రమాణపత్రం దాఖలు చేయగలరా అని ప్రధాని మోదీ, అమిత్‌షా, ఇతర నేతలకు సవాల్ విసురుతున్నాను" అని ట్విటర్‌లో పేర్కొన్నారు.

పాన్, ఆధార్ అనుసంధానం తప్పనిసరి

దిల్లీ: ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించినప్పుడు శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)తో ఆధార్‌ను అనుసంధానం చేయడం చట్టపరంగా తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆదాయపు పన్ను చట్టంలోని 139 ఏఏ సెక్షన్ చెల్లుబాటవుతుందని గతంలో తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వీటిని అనుసంధానం చేయక తప్పదని జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. పాన్‌తో ఆధార్ అనుసంధానం చేయనప్పటికీ 2018-19 సంవత్సరపు ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించవచ్చంటూ శ్రేయ సేన్, జయశ్రీ సత్పుటేలకు అనుకూలంగా ఇంతకుముందు దిల్లీ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వీటిని సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

రూ.239 కోట్ల ఆల్కెమిస్ట్ ఆస్తుల జప్తు

దిల్లీ: నగదు అక్రమ చలామణి కేసులో ఆల్కెమిస్ట్ గ్రూపు సంస్థలకు చెందిన రూ.239 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం జప్తు చేసింది. చండీగఢ్, సిమ్లా, పంజాబ్‌లోని ఎస్ఏఎస్ నగర్ తదితర చోట్ల ఉన్న ఆస్తులతో పాటు... బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తాలను కూడా ఈడీ స్తంభింపజేసింది. ఈ గ్రూపు వివిధ మార్గాల్లో సేకరించిన సొమ్మును తన గ్రూపు సంస్థలకు మళ్లించి... వాటితో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆస్తులను కొనుగోలు చేశారన్నది ఆరోపణ.

ఘోర పరాభవం

- టీమ్‌ఇండియాకు కివీస్ మరో షాక్
- తొలి టీ20లో 80 పరుగులతో చిత్తు
- టీ20ల్లో ఇదే అతి పెద్ద ఓటమి
- భారత బౌలింగ్‌ను ఉతికారేసిన సీఫెర్ట్

అన్ని రంగాల్లో ఆధిపత్యం.. హ్యాట్రిక్ విజయాలు.. ఇంకో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే ఐదు వన్డేల సిరీస్ కైవసం.. ఇక టీమ్‌ఇండియాకు తిరుగే లేదనుకున్నా రంతా! కానీ తర్వాతి మ్యాచ్‌లో 92 పరుగులకే ఆలౌట్.. ఘోర పరాజయం!

ఆ ఓటమి తర్వాత పుంజుకుని.. బలమైన జట్టుతో, ఘనమైన రికార్డుతో టీ20 సిరీస్‌లో అడుగుపెట్టిన భారత్‌కు ఎదురుండదనే అంచనా వేశారంతా! కానీ తొలి టీ20లో ఏకంగా 80 పరుగుల తేడాతో పరాభవం!

8 మంది ఉన్నారు కానీ..

220 పరుగుల లక్ష్యం.. ఓవర్‌కు 11 పరుగులు చేయాలి. కోహ్లి లేకపోతేనేం.. రోహిత్, ధావన్‌ల రూపంలో తిరుగులేని ఓపెనింగ్ జోడీ.. పంత్, హార్దిక్ పాండ్య లాంటి విధ్వంసకారులు.. ధోని, కార్తీక్ లాంటి అనుభవజ్ఞులు.. మొత్తంగా ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్.. ఇలాంటి లైనప్ ఉన్న భారత్‌కు లక్ష్యం మరీ కష్టమైనదేమీ కాదు. కానీ భారత్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా అడుగులు వేయలేదు. కివీస్ బౌలర్ల ప్రతిభకు తోడు.. మన బ్యాట్స్‌మెన్ నిర్లక్ష్యం కూడా తోడై.. టపటపా వికెట్లు పడ్డాయి. పుల్‌షాట్లతో అలవోకగా సిక్సర్లు బాదే రోహిత్ శర్మ.. ఈసారి బంతిని సరిగా కనెక్ట్ చేయలేకపోయాడు. అతను ఒక్క పరుగుకే వెనుదిరగడంతో 220 పరుగుల ఛేదన కష్టమే అని తేలిపోయింది. కాసేపు మెరుపులు మెరిపించిన ధావన్ (29; 18 బంతుల్లో 2×4, 3×6).. ఫెర్గూసన్ యార్కర్ బంతికి సమాధానమే ఇవ్వలేకపోయాడు. పేలవంగా బంతిని ఎదుర్కొని బౌల్డయ్యాడు. పంత్ (4) అయితే స్పిన్నర్ వేసిన యార్కర్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. క్రీజులోకి రాగానే షాట్ ఆడాలని చూడటం చేటు చేసింది. ఫించ్ హిట్టర్‌గా వచ్చి ప్రతి బంతినీ గాల్లోకి లేపాలని చూసిన విజయ్ శంకర్.. ఒక షాట్‌కు టైమింగ్ తేడా రావడంతో ఫీల్డర్‌కు దొరికిపోయాడు. ధావన్, శంకర్ (27; 18 బంతుల్లో 2×4, 2×6) ఉన్నంతసేపు ఓ మోస్తరుగా పరుగులొచ్చాయి. తర్వాత అంతా పతనమే. కార్తీక్ (5), హార్దిక్ పాండ్య (4) తేలిపోయారు. 77/6కు చేరుకున్న భారత్.. పరాభవాన్ని ఖాయం చేసుకుంది. ధోని (39; 31 బంతుల్లో 5×4, 1×6), కృనాల్ పాండ్య (20) కొన్ని షాట్లు ఆడి ఓటమి అంతరాన్ని తగ్గించారు కానీ.. టీ20ల్లో భారత్‌కు అతి పెద్ద ఓటమిని మాత్రం తప్పించలేకపోయారు. మరోవైపు భారత బౌలర్ల ప్రదర్శనా పేలవమే. కొత్త బంతి బౌలర్లు భువనేశ్వర్ (47), ఖలీల్ అహ్మద్ (48) కలిపి 8 ఓవర్లలో ఏకంగా 95 పరుగులిచ్చేశారు. తీసినవి రెండు వికెట్లే. అవి కూడా నష్టం జరిగిపోయాక పడ్డవే. ఆరంభంలో వీళ్లిద్దరూ తేలిపోయారు. భువిలో మునుపటి వాడి కనిపించలేదు. అతడి నకుల్ బంతి ప్రభావం కోల్పోయింది. ఛేంజ్ బౌలర్‌గా వచ్చిన పాండ్య (4 ఓవర్లలో 51) కూడా ప్రభావం చూపలేదు. ఉన్నంతలో చాహల్ (4 ఓవర్లలో 1/35) ఒక్కడే పర్వాలేదనిపించాడు.


రోహిత్ (1)

3
న్యూజిలాండ్‌లో ఆడిన మూడు టీ20ల్లోనూ భారత్ ఓటమి పాలైంది.

42
ఈ మ్యాచ్‌కు ముందు సీఫెర్ట్ ఏడు టీ20 ఇన్నింగ్స్‌ల్లో కలిపి చేసిన పరుగులు. ఇప్పుడు ఒకే మ్యాచ్‌లో 84 పరుగులు సాధించాడు.

80
భారత్ ఓటమి అంతరం. టీ20ల్లో భారత్‌కు పరుగుల పరంగా అతి పెద్ద ఓటమి ఇదే. 2010లో ఆస్ట్రేలియా చేతిలో 49 పరుగుల తేడాతో ఓడటమే ఇప్పటిదాకా చెత్త రికార్డు.

219
న్యూజిలాండ్ స్కోరు. భారత్‌పై ప్రత్యర్థి సాధించిన రెండో అత్యధిక టీ20 స్కోరిది. 2016లో వెస్టిండీస్ అత్యధికంగా 245 పరుగులు చేసింది.

వెల్లింగ్టన్

న్యూజిలాండ్ పర్యటనలో టీమ్‌ఇండియాకు మరో షాక్ తగిలింది. నాలుగో వన్డేలో ఘోర పరాభవం చవిచూసిన భారత్.. టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లోనూ అలాంటి ఓటమే ఎదుర్కొంది. రోహిత్ సారథ్యంలో ఫేవరెట్‌గా సిరీస్‌లో అడుగు పెట్టిన టీమ్‌ఇండియా.. తొలి టీ20లో చిత్తుగా ఓడింది. యువ వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (84; 43 బంతుల్లో 7×4, 6×6) భారత బౌలింగ్‌ను తుత్తునియలు చేయడంతో మొదట కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అనంతరం బ్యాట్స్‌మెన్ కూడా బౌలర్ల లాగే పేలవ ప్రదర్శన చేయడంతో భారత్ 19.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. 39 పరుగులు చేసిన ధోనీనే టాప్‌స్కోరర్. కివీస్ బౌలర్లలో సౌథీ (3/17), ఫెర్గూసన్ (2/22), శాంట్నర్ (2/24) సత్తా చాటారు. బౌలింగ్, బ్యాటింగ్ మాత్రమే కాదు.. ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ కూడా పేలవమే. అన్ని రంగాల్లో సమష్టిగా విఫలమై టీ20ల్లో తన అతి పెద్ద ఓటమిని మూటగట్టుకుంది టీమ్‌ఇండియా. మూడు టీ20ల సిరీస్‌లో తర్వాతి మ్యాచ్ ఆక్లాండ్‌లో శుక్రవారం జరుగుతుంది.

మెరుపులే మెరుపులు..

మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కివీస్. . ఇన్నింగ్స్ ఆద్యంతం మెరుపులు మెరిపించింది. వన్డే సిరీస్‌కు భిన్నంగా కివీస్‌కు ఈ మ్యాచ్‌లో మెరుపు ఆరంభం లభించింది. 6 ఓవర్లకు 66/0.. 8 ఓవర్లకు 86/0.. ఇదీ ఆ జట్టు ఇన్నింగ్స్ సాగిన తీరు. ఓవైపు సీఫెర్ట్, మరోవైపు మన్రో (34; 20 బంతుల్లో 2×4, 2×6) భారీ షాట్లతో విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ప్రధాన బౌలర్ భువనేశ్వర్ కానీ.. అతడి భాగస్వామి ఖలీల్ కానీ.. వీరిని ఏమాత్రం నియంత్రించలేకపోయారు. హార్దిక్ పాండ్య వచ్చాక కూడా పరిస్థితి మారలేదు. పట్టపగ్గాల్లేకుండా సాగుతున్న కివీస్‌కు 9వ ఓవర్లో చాహల్ బ్రేక్ వేశాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో మన్రో ఔటయ్యాడు. తర్వాత విలియమ్సన్ (34; 22 బంతుల్లో 3×6) నుంచి సీఫెర్ట్‌కు చక్కటి సహకారమందింది. కివీస్ కెప్టెన్ సైతం సిక్సర్ల మోత మోగించడంతో.. ఆ జట్టు 11వ ఓవర్లోనే 100 దాటింది. సెంచరీ దిశగా సాగుతున్న సీఫెర్ట్ ఔటయ్యాక ఇన్నింగ్స్ కొంచెం నెమ్మదించినా.. విలియమ్సన్, టేలర్ (23), కుగిలైన్ (20 నాటౌట్) తలో చేయి వేయడంతో కివీస్ భారీ స్కోరు సాధించింది.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫెర్ట్ (బి) ఖలీల్ 84; మన్రో (సి) శంకర్ (బి) కృనాల్ 34; విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 34; మిచెల్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 9; టేలర్ (సి) ఖలీల్ (బి) భువనేశ్వర్ 23; గ్రాండ్‌హోమ్ (సి) సిరాజ్ (బి) హార్దిక్ 3; శాంట్నర్ నాటౌట్ 7; కుగిలైన్ నాటౌట్ 20; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) **219**

వికెట్ల పతనం: 1-86, 2-134, 3-164, 4-164, 5-189, 6-191

బౌలింగ్: భువనేశ్వర్ 4-0-47-1; ఖలీల్ అహ్మద్ 4-0-48-1; కృనాల్ పాండ్య 4-0-37-1; హార్దిక్ పాండ్య 4-0-51-2; చాహల్ 4-0-35-1

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) ఫెర్గూసన్ (బి) సౌథీ 1; ధావన్ (బి) ఫెర్గూసన్ 29; విజయ్ శంకర్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) శాంట్నర్ 27; పంత్ (బి) శాంట్నర్ 4; ధోని (సి) ఫెర్గూసన్ (బి) సౌథీ 39; కార్తీక్ (సి) సౌథీ (బి) సోధి 5; హార్దిక్ (సి) మిచెల్ (బి) ఇష్ సోధి 4; కృనాల్ (సి) సీఫెర్ట్ (బి) సౌథీ 20; భువనేశ్వర్ (సి) సీఫెర్ట్ (బి) ఫెర్గూసన్ 1; చాహల్ (బి) మిచెల్ 1; ఖలీల్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (19.2 ఓవర్లలో ఆలౌట్) **139; వికెట్ల పతనం:** 1-18, 2-51, 3-64, 4-65, 5-72, 6-77, 7-129, 8-132, 9-136

బౌలింగ్: సౌథీ 4-0-17-3; కుగిలైన్ 2-0-34-0; లోకీ ఫెర్గూసన్ 4-0-22-2; శాంట్నర్ 4-0-24-2; మిచెల్ 2.2-0-13-1; ఇష్ సోధి 3-0-26-2



అనామకుడే అదరగొట్టాడు..

టిమ్ సీఫెర్ట్.. క్రికెట్ ప్రపంచానికి పెద్దగా పరిచయం లేని పేరు. న్యూజిలాండ్ తరపున ఆడిన వన్డేలు మూడే. అత్యధిక స్కోరు 33. టీ20ల్లో 7 ఇన్నింగ్స్‌ల్లో కలిపి చేసిన పరుగులు కేవలం 42. భారత్‌తో టీ20 సిరీస్‌కు ఎంపికైన అతడిపై ఎవ్వరూ దృష్టిపెట్టలేదు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో ఐదుసార్లు ఏడో స్థానంలో ఆడిన సీఫెర్ట్.. విధ్వంసక ఓపెనర్ గప్టిల్ దూరమైన నేపథ్యంలో ఓపెనింగ్‌లో అవకాశం దక్కించుకున్నాడు. 43 బంతుల్లోనే 84 పరుగులు చేసి, మ్యాచ్‌ను భారత్ నుంచి లాక్కెళ్లిపోయాడు. పాదాలను చక్కగా ఉపయోగిస్తూ.. మోకాళ్లపై కూర్చుని అతను భారీ షాట్లు ఆడాడు. హార్దిక్ పాండ్య బౌలింగ్‌లో స్వీప్ చేస్తూ డీప్ స్క్వేర్ లెగ్ దిశగా బాదిన సిక్సర్ అయితే మ్యాచ్‌కే హైలైట్. 17 పరుగుల వద్ద ధోని క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన సీఫెర్ట్ ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని కివీస్‌కు భారీ స్కోరు అందించాడు. 71 పరుగుల వద్ద అతడి మరో క్యాచ్‌ను కార్తీక్ వదిలేశాడు.


కార్తీక్

అంత మంచి క్యాచ్ పట్టినోడే..

దినేశ్ కార్తీక్ బుధవారం ద్విపాత్రాభినయం చేశాడు. ఒక క్యాచ్‌ను కళ్లు చెదిరే రీతిలో అందుకుని ఔరా అనిపించిన అతను.. సులువైన రెండు క్యాచ్‌లు వదిలేసి ఆశ్చర్యపరిచాడు. ముందు చేతిలో పడుతున్న సీఫెర్ట్ క్యాచ్‌ను వదిలేసిన కార్తీక్.. తర్వాత మిచెల్ క్యాచ్‌ను అందుకున్న తీరు అమోఘం. సిక్సర్‌గా వెళ్లేలా కనిపించిన బంతిని గాల్లోకి ఎగిరి వెనక్కి తోసిన కార్తీక్.. బౌండరీ అవతలికి వెళ్లి, తిరిగొచ్చి క్యాచ్ అందుకున్నాడు. అతడి సమయస్ఫూర్తి ప్రశంసలందుకుంది. కానీ తర్వాత రాస్ టేలర్ అందించిన మరో సులువైన క్యాచ్‌ను విడిచిపెట్టాడు.

మంధాన మెరిసినా..

- కివీస్ చేతిలో భారత్ ఓటమి
- స్మృతి రికార్డు అర్ధసెంచరీ

ఓవైపు తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూనే.. ఉన్నట్లుండి దారుణ ప్రదర్శన చేసే అలవాటును టీమ్ ఇండియా కొనసాగించింది. టీ20ల్లో అతి పెద్ద ఓటమిని ఖాతాలో వేసుకుంది.

బుధవారం పురుషుల జట్టు పోటీయే ఇవ్వకుండా న్యూజిలాండ్‌కు తల వంచితే.. కివీస్ అమ్మాయిలతో టీ20 పోరును ఆరంభించిన మహిళల జట్టు గెలవాల్సిన మ్యాచ్‌ను చేజార్చుకుంది.


మంధాన (58)

వెల్లింగ్టన్

160.. న్యూజిలాండ్ మహిళలతో తొలి టీ20లో భారత లక్ష్యం ఇది. గెలవాలంటే ఓవర్‌కు ఎనిమిది పరుగులు సాధించాలి. భారత జట్టు ఛేదించడం కష్టమే అనిపించింది. కానీ స్మృతి మంధాన (58; 34 బంతుల్లో 7×4, 3×6) చెలరేగి ఆడుతుంటే లక్ష్యం వేగంగా కరుగుతూ వచ్చింది. ఆమె క్రీజులో ఉన్నంత సేపు కివీస్ బౌలర్లు పొదుపు అన్న మాటే మరిచారు. గెలుపు కష్టమే అనుకున్న టీమ్‌ఇండియాకు విజయం తేలిగ్గా కనిపించింది. స్మృతి రికార్డు వేగంతో అర్ధసెంచరీ చేయడంతో విజయం దిశగా దూసుకెళ్లిన భారత జట్టు.. ఆమె నిష్క్రమించాక గాడి తప్పి పరాజయంపాలైంది. 19.1 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. పేసర్ తహూహు (3/20) విజృంభించడంతో న్యూజిలాండ్ 23 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. మొదట సోఫీ డివైన్ (62), సాతర్త్‌వైట్ (33), కేటి మార్టిన్ (27 నాటౌట్) దూకుడుగా ఆడటంతో కివీస్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసింది.

వాళ్లిద్దరే..

లక్ష్య ఛేదనలో భారత జట్టుకు తొలి ఓవర్లోనే ఎదురుదెబ్బ తగిలింది. అరంగేట్ర బ్యాటర్ ప్రియ పూనియా (4).. సాతర్త్‌వైట్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరింది. ఆ తర్వాత జెమీమా రోడ్రిగ్స్ (39) అండగా నిలవడంతో మంధాన ధనాధన్ షాట్‌లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడింది. 24 బంతుల్లో అర్ధసెంచరీ చేసుకుంది. భారత్ తరపున ఇదే వేగవంతమైన యాభై. అంతకుముందు రికార్డు (25 బంతులు) ఆమెదే. భారీ షాట్ ఆడే క్రమంలో మంధాన ఔటైంది. అప్పుడు జట్టు స్కోరు 11.3 ఓవర్లలో 102/2. మరోవైపు జెమీమా కూడా ఔటవడంతో జట్టు కోలుకోలేక పోయింది. కెప్టెన్ హర్మన్ (17) విఫలమైంది. జట్టులో ముగ్గురే రెండంకెల స్కోరు చేశారు. స్టార్ బ్యాటర్ మిథాలీ బెంచ్‌కే పరిమితమైంది. రెండో టీ20 శుక్రవారం జరుగుతుంది.

విజయం ముంగిట విదర్భ

రంజీ ఫైనల్

సౌరాష్ట్ర లక్ష్యం 206 ● ప్రస్తుతం 58/5


ఆదిత్య సర్వాతె

నాగ్‌పూర్: సౌరాష్ట్ర రంజీ కల మరోసారి చెదిరిపోయేలా ఉంది. గతంలో రెండుసార్లు రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఆ జట్టుకు మళ్లీ భంగపాటు తప్పేలా లేదు. పగుళ్లు ఏర్పడి పరుగులు చేయడమే కష్టంగా మారిన పిచ్‌పై సౌరాష్ట్ర పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. 206 పరుగుల లక్ష్య ఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 58 పరుగులు చేసిన ఆ జట్టు ఇప్పటికే సగం వికెట్లు కోల్పోయింది. ఆ జట్టు విజయానికి ఇంకో 148 పరుగులు కావాలి. వరుసగా రెండుసార్లు రంజీ టైటిల్ గెలిచిన ఆరో జట్టుగా విదర్భ రికార్డు సృష్టించడానికి కావాల్సింది మరో 5 వికెట్లు మాత్రమే.

పుజారా విఫలం: పుజారా డకౌట్ కావడం సౌరాష్ట్ర విజయావకాశాలను సంక్లిష్టంగా మార్చింది. ఫామ్‌లో ఉన్న స్నెల్ పటేల్ (12), హార్విక్ దేశాయ్ (8) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఈ ముగ్గురి వికెట్లు లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వాతె (3/13) ఖాతాలో చేరాయి. ఉమేశ్ యాదవ్ (1/27)తో కలిసి కొత్త బంతిని పంచుకున్న ఆదిత్య.. తొలి పది ఓవర్లలోపే టాప్ ఆర్డర్ కథ ముగించాడు. ఒకే ఓవర్లో హార్విక్, పుజారాలను ఔట్ చేశాడు. పుజారా ఎల్బీగా వెనుదిరిగాడు. షెల్డన్ జాక్సన్ (7) కూడా విఫలమయ్యాడు. స్పిన్‌కు దాసోహమైన పిచ్‌పై తోక బ్యాట్స్‌మెన్ నిలిచి సౌరాష్ట్ర విజయం సాధిస్తే అద్భుతమే. వీఎమ్ జడేజా (23) ఒక్కడే ఆ జట్టులో పోరాడుతున్నాడు. అంచనాల మేరకు సాగితే.. లంచ్‌లోపే సౌరాష్ట్ర కథ ముగియొచ్చు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 55/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 200 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ గణేశ్ సతీశ్ (35), వసీం జాఫర్ (11) త్వరగానే నిష్క్రమించారు. ఐతే ఆదిత్య సర్వాతె (49), కాలె (38) సౌరాష్ట్ర స్పిన్నర్లకు ఎదురొడ్డి కీలకమైన పరుగులు సాధించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర సింగ్ జడేజా (6/96) ఆరు వికెట్లు పడగొట్టగా, ఆఫ్‌స్పిన్నర్ మక్వానా (2/51) రెండు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 312 పరుగులు చేయగా.. సౌరాష్ట్ర 307 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. మ్యాచ్‌కు గురువారం ఆఖరి రోజు.

డేవిస్‌కప్‌లో పాక్‌తో భారత్ ఢీ

నాగ్‌పూర్: సెప్టెంబరులో ఆసియా/ఓసియానా గ్రూప్‌లో డేవిస్ కప్ మ్యాచ్ ఆడనున్న భారత్‌కు బుధవారం తీసిన డ్రాలో పాకిస్థాన్ ప్రత్యర్థిగా పడింది. ఇది భారత జట్టు.. దేశం వెలుపల ఆడాల్సిన మ్యాచ్. అంటే పాకిస్థాన్‌లో ఆడాలి. ఐతే టెన్నిస్ జట్టు పాక్ వెళ్లేందుకు భారత ప్రభుత్వం అనుమతించే అవకాశం లేదు. కొన్నేళ్లుగా ప్రభుత్వం పాక్‌లో పర్యటించేందుకు ఏ క్రీడా జట్టునూ అనుమతించట్లేదన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్-పాక్ డేవిస్ మ్యాచ్ తటస్థ వేదికలో నిర్వహించాల్సివుంటుంది. వేదికను మార్చాలంటే ఐటీఎఫ్ అంగీకరించాలి. పాక్ నిరుడు ఉజ్బెకిస్థాన్, కొరియాలకు ఇస్లామాబాద్‌లో ఆతిథ్యమిచ్చిన నేపథ్యంలో మార్పునకు అంతర్జాతీయ సమాఖ్య ఒప్పుకోకపోవచ్చు. పాక్ వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించకపోతే, వేదికను మార్చేందుకు ఐటీఎఫ్ నిరాకరిస్తే.. అప్పుడు భారత జట్టు వాకోవర్ ఇవ్వక తప్పదు. 1971లో భారత జట్టు ఇలాగే వాకోవర్ ఇచ్చింది. 1964 తర్వాత ఒక్క భారత డేవిస్‌కప్ జట్టు కూడా పాకిస్థాన్‌కు వెళ్లలేదు.

పది డకౌట్‌లు.. పదికి ఆలౌట్


వాన్ వీన్


సిడ్నీ: క్రికెట్లో ఇలాంటి గణాంకాలు ఎప్పుడూ చూసివుండరు. జట్టులో ఒక్కరు మాత్రమే ఖాతా తెరిచారు.. మిగతా పది మంది డకౌటయ్యారు.. ఆ ఒక్కరు చేసిన పరుగులు నాలుగు మాత్రమే. మిగతావన్నీ ఎక్స్‌ట్రాలు. బుధవారం ఆస్ట్రేలియాలో జరిగిన ఓ స్థానిక మ్యాచ్‌లో ఈ విచిత్రం చోటు చేసుకుంది. దేశవాళీ టోర్నీలో న్యూ సౌత్ వేల్స్‌తో మ్యాచ్‌లో దక్షిణ ఆస్ట్రేలియా మహిళల జట్టు ఈ అరుదైన చెత్త రికార్డును ఖాతాలో వేసుకుంది. న్యూసౌత్ వేల్స్ బౌలర్ రాక్సాన్నె వాన్ వీన్ ఒక్క పరుగు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లను పడగొట్టింది. నవోమి వుడ్స్ వేసిన రెండు బంతుల్లో వికెట్లు తీసుకుంది. పది మంది ఖాతానే తెరవకున్నా.. దక్షిణ ఆస్ట్రేలియా జట్టు 10.2 ఓవర్లు ఆడటం విశేషం. ఆ జట్టులో మాన్సెల్ 33 బంతులు ఎదుర్కొని 4 పరుగులు చేసింది. ఆ తర్వాత న్యూసౌత్‌వేల్స్ 2 వికెట్లు కోల్పోయి 15 బంతుల్లో లక్ష్యాన్ని అందుకుంది.

అహ్మదాబాద్‌పై కోచి విజయం

కోచి: ప్రో వాలీబాల్ లీగ్‌లో బుధవారం కోచి బ్లూ స్పైకర్స్ జట్టు 3-2 (10-15, 15-11, 11-15, 15-12, 15-12) తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై విజయం సాధించింది. కోచి తరపున డేవిడ్ లీ 10 పాయింట్లు స్కోర్ చేశాడు. అహ్మదాబాద్ తరపున విక్టర్ సిసోవ్ 13 పాయింట్లు సాధించాడు.

పాండ్య, రాహుల్‌లపై కేసు





జోధ్‌పుర్: క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లకు కొత్త చిక్కొచ్చి పడింది. 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో మహిళలను కించపరిచేలా మాట్లాడినందుకు వారితోపాటు కరణ్ జోహార్‌పై జోధ్‌పుర్‌లో కేసు నమోదైంది. కొన్ని మ్యాచ్‌లకు సస్పెండ్ చేయడం ద్వారా పాండ్య, రాహుల్‌ను బీసీసీఐ ఇప్పటికే శిక్షించిన సంగతి తెలిసిందే. ఆ ముగ్గురిపై కేసు నమోదుకు ఆదేశించాలంటే జోధ్‌పుర్‌కు చెందిన ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

TG





వావ్.. లఖ్‌నవ్ బస్‌స్టేషన్!

ఉత్తర్‌ప్రదేశ్: ఈ అద్భుత నిర్మాణాన్ని బయట నుంచి చూస్తే ఎవరైనా పెద్ద కార్పొరేట్ భవనమనో లేదా విలాసవంతమైన హోటలనో అనుకుంటారు. లోపలికెళితే విమానాశ్రయానికి వెళ్లిన అనుభూతికి లోనవుతారు. కానీ ఇదో బస్‌స్టేషన్ అని తెలిస్తే ఆశ్చర్యచకితులవుతారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా లఖ్‌నవూలోని ఆలంబాగ్‌లో నిర్మించిన ఈ బస్‌స్టేషన్ ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ ప్రయాణ ప్రాంగణాన్ని 2018 జూన్‌లో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించారు.

హంగులు: రూ. 253 కోట్లతో మూడంతస్తుల్లో నిర్మితమైంది. మరో 21 ప్రాంతాల్లోనూ ఇలాంటివి నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బస్‌స్టేషన్‌లోకి ప్రవేశించగానే తొలుత ప్రయాణికులను, వారి సామగ్రిని తనిఖీ చేస్తారు. మొదటి అంతస్తులో విశ్రాంతి తీసుకోవడానికి కుర్చీలతోపాటు ఏసీని ఏర్పాటు చేశారు. రకరకాల వంటకాలతో కూడిన ఫుడ్‌కోర్టు కూడా ఉంది. ఇక్కడ ఉచితంగా వైఫై కూడా ఉంటుంది. భవనంలోని కింది భాగంలో 49 ప్లాట్‌ఫారాలున్నాయి. బస్సుల వేళలను ప్రదర్శించేందుకు డిజిటల్ మానిటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి పొరుగు రాష్ట్రాలకే కాకుండా, నేపాల్‌కి కూడా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఈ బస్‌స్టేషన్‌లో దిగి నేరుగా మెట్రో స్టేషన్‌కి వెళ్లిపోవచ్చు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని మొత్తం 86 సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ప్రతి దృశ్యాన్ని రికార్డు చేసేలా వీటిని ఏర్పాటు చేశారు. ప్రతి అంతస్తులోనూ భద్రతా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది సేద తీరడానికి మూడో అంతస్తులో చక్కటి విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. రోడ్డు రవాణా అధికారుల కోసం ప్రత్యేక కార్యాలయాన్ని సిద్ధం చేశారు. సిబ్బంది కోసం హోటళ్లను కూడా ఏర్పాటు చేశారు. ఉన్నత ప్రమాణాలతో నిర్మితమైన ఈ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం షాపింగ్ మాల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఓ వాణిజ్య సముదాయాన్ని సిద్ధం చేశారు. బ్యాంకింగ్, పోస్టాఫీస్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే సిద్ధమైన మల్టీప్లెక్స్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. ఇక్కడ బస చేయాలనుకునే ప్రయాణికుల కోసం సౌకర్యవంతమైన, చవకైన గదులను నిర్మించారు. దీన్ని చూశాక విమానాల్లో ప్రయాణించే వాళ్లు సైతం ఒక్కసారైనా ఈ బస్‌స్టేషన్ చూసేందుకు లఖ్‌నవూలో బస్సెక్కాలని ఉవ్విళ్లూరుతారంటే అతిశయోక్తి కాదు.

తెలంగాణ లోనూ..

తెలంగాణలో బస్‌స్టేషన్ల ఆధునికీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రయాణికులకు సకల సౌకర్యాలతో, అత్యాధునిక హంగులతో వీటిని రూపొందించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు గాను వివిధ రాష్ట్రాల్లోని బస్‌స్టేషన్ల నమూనాలను పరిశీలిస్తున్న రోడ్డు రవాణా అధికారులు లఖ్‌నవూలోనూ పర్యటించారు. ఇద్దరు సాంకేతిక నిపుణులతో కలిసి ఈడీ పురుషోత్తం నాయక్, ఇతర అధికారులు రాజేంద్రప్రసాద్, సీతారాంబాబులు ఈనెల 1 నుంచి 3 వరకు ఆలంబాగ్ బస్‌స్టేషన్‌ను సందర్శించారు. ప్రయాణ ప్రాంగణ విశేషాలను అధ్యయనం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ అవలంబిస్తున్న రవాణా విధానాలను తెలంగాణలో అమలు చేసేందుకు సాధ్యాసాధ్యాలను సమీక్షించారు.

వర్ణ శోభిత వడోదర!

గుజరాత్: అంతర్జాతీయ కళల ఉత్సవం వడోదర నగరాన్ని వర్ణ శోభితం చేసింది. దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన కళాకారులు వేసిన వర్ణచిత్రాలతో నగరం ఇప్పుడు రంగుల తివాచీని తలపిస్తోంది. కళలకు, సంస్కృతికి పెట్టింది పేరైన వడోదరలో జనవరి 5న ప్రారంభమైన ఈ కళల పండగ (ఆర్ట్ ఫెస్టివల్) నెల రోజుల పాటు కనులపండువగా సాగింది. 19 దేశాలకు చెందిన 27 మంది చిత్రకారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొందరు కుడ్య చిత్రాలకు ప్రాణం పోయగా.. మరికొందరు శిల్పాలను తీర్చిదిద్దారు. నగరంలోని ప్రముఖ కూడళ్లు, బస్టాండ్ల గోడలు ఇప్పుడు సరికొత్త రీతిలో దర్శనమిస్తున్నాయి. వడోదరకు రావడం ఎంతో సంతోషంగా ఉందని.. గుజరాత్ తమలో స్ఫూర్తిని నింపిందని బెల్జియమ్‌కు చెందిన కుడ్య చిత్రకారిణి మీకా తెలిపారు. వడోదర కళాత్మకతకు మంత్రముగ్ధులైన కళాకారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అద్భుత చిత్రాలు వేసిన వారందరికీ జిల్లా కలెక్టర్ శాలిని అగర్వాల్ ధన్యవాదాలు తెలిపారు.



వడోదరలో గోడలపై చిత్రాలు వేస్తున్న విదేశీ కళాకారులు

పల్లెకు పట్నం సొబగులు!

- గ్రామాల్లో పార్కులు, కన్వెన్షన్ కేంద్రాలు, అత్యాధునిక డంపింగ్ యార్డులు
- రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదనలు
- ప్రస్తుత వసతులపై సర్వేకు సాఫ్ట్‌వేర్ తయారీ
- సదుపాయాల తొలి అంచనా విలువ రూ.1,898 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామాలు..పట్టణాలకు దీటుగా మౌలిక వసతులను సంతరించుకోబోతున్నాయి. పార్కులు, కన్వెన్షన్ సెంటర్లు, ఆధునిక శ్మశానాలు, అత్యాధునిక డంపింగ్ యార్డులు, ఉన్నత విద్య, వైద్యం... వంటి హంగులు అద్దుకోనున్నాయి. ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించిన తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ నిధుల కోసం సంబంధిత నివేదికను కేంద్రానికి పంపింది.

గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు నివారించే లక్ష్యంతో కేంద్రం 2016, ఫిబ్రవరిలో 'రూర్బన్ మిషన్'కు రూపకల్పన చేసింది. దీని కింద తెలంగాణలోని దాదాపు 400 గ్రామాలతో గల 16 క్లస్టర్లకు సాయం అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే సమ్మతి తెలిపింది. ఒక్కో క్లస్టర్‌కు కేంద్రం గరిష్ఠంగా రూ.30 కోట్ల చొప్పున ఇస్తుంది. మరో రూ.70 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఖర్చు చేయాల్సి ఉంటుంది. 16 క్లస్టర్ల పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.1,898 కోట్లు అవసరమని ఇప్పటికే అంచనా వేశారు. ఒక్కో క్లస్టర్‌కు కేంద్రం ఇచ్చే రూ.35 లక్షలతో తొలుత ఆయా గ్రామాల్లో కుటుంబ సర్వే నిర్వహించి, వివరాలను కంప్యూటరీకరించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా ఆయా గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న వసతులపై సర్వే నిర్వహించేందుకు గానూ టీసీఎస్ కంపెనీ సాయంతో ఓ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది.

కేంద్రానికి ప్రతిపాదనలు

రాష్ట్రం ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు, పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు, రహదారులకు మధ్యలో విభాగినిలు వంటివి ఏర్పాటు చేసింది. అవి ఏ మాత్రం సరిపోవని భావించిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇక ముందు చేపట్టదలచిన కార్యక్రమాలపై నివేదికను రూపొందించింది. ఇటీవల దిల్లీలో రూర్బన్ మిషన్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆ వివరాలను వెల్లడించింది. వివిధ శాఖలు అమలు చేసే పథకాలను ఆయా క్లస్టర్లకు అనుసంధానించి, గ్రామాలను పకడ్బందీగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొంది. ఒక్కో క్లస్టర్‌కు కేంద్రం 30 శాతం వాటాగా ఇచ్చే రూ.30 కోట్ల నిధులతో గ్రామాల్లో పార్కులు మొదలుకుని, బస్టాండుల వరకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఆధునిక హంగులతో చేపడతామని పేర్కొంది. 'ఈ పథకం కింద అంచనాల మేరకు కేంద్రం నిధులు మంజూరు చేసే పక్షంలో గ్రామాలు అత్యద్భుతంగా రూపుదిద్దుకుంటాయని' గ్రామీణాభివృద్ధి శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

పట్టణ వసతులను కల్పించే 400 గ్రామాలు గల క్లస్టర్లు ఇవే

జిల్లా	క్లస్టర్
వికారాబాద్	అల్లాపూర్
కుమురం భీం	చిత్రకుంట
కామారెడ్డి	జుక్కల్
సంగారెడ్డి	రాయకల్
భూపాలపల్లి	నాగారం
పెద్దపల్లి	సుల్తానాబాద్
నాగర్‌కర్నూల్	వెన్నచర్ల
కరీంనగర్	బిజిగిరి షరీఫ్
యాదాద్రి భువనగిరి	చౌటుప్పల్
సిద్దిపేట	జలిగాన్
నల్గొండ	కొండ భీమనపల్లి
నిర్మల్	కుంటాల
మహబూబ్‌నగర్	నన్నెర్ల
మెదక్	పాపన్నపేట
రంగారెడ్డి	శంకరపల్లి
నిజామాబాద్	ఎడపల్లి

కన్నడనాట బడ్జెట్ రాజకీయం

- 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డుమ్మా
- 'ఆపరేషన్ కమల'పై అనుమానాలు

ఈనాడు డిజిటల్, బెంగళూరు: 'ఆపరేషన్ కమల'తో భీతిల్లుతున్న కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వానికి అనుకున్నట్లే తొమ్మండుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు షాకిచ్చారు. విప్‌ను సైతం ధిక్కరించి వారు శాసనసభకు డుమ్మా కొట్టారు. వీరిలో నలుగురు గత నెలలో జరిగిన శాసనసభాపక్ష సమావేశానికీ రాలేదు. ప్రతిపక్ష భాజపాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు కూడా శాసనసభకు గైర్హాజరయ్యారు. వీరిలో కీలకమైన ఇద్దరు 'ఆపరేషన్ కమల'ను ముందుకు నడిపే పనిలో ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. సంకీర్ణ ప్రభుత్వ బడ్జెట్ సమావేశాలు బుధవారం తొలిరోజే వేడెక్కిపోయాయి. ఉభయసభల సభ్యులనుద్దేశించి గవర్నర్ వజూబాయి వాలా ప్రసంగిస్తున్నప్పుడు ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. 10 నిమిషాల్లోనే 22 పుటల ప్రసంగాన్ని ముగించిన గవర్నర్ తీవ్ర అసహనానికి గురై సభ నుంచి తిరిగి వెళ్లారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేలా గవర్నర్‌తో ప్రసంగాన్ని తయారు చేయించారని భాజపా సభ్యులు అరుపులు- కేకలతో హోరెత్తించి సభలో ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఏర్పాటులో చట్టబద్ధతను వారు ప్రశ్నించారు. ప్రభుత్వం సభా విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. ఇటీవల మరణించిన సిద్ధగంగ మఠాధిపతి డాక్టర్ శివకుమార స్వామి, కేంద్ర మాజీ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ తదితరులకు నివాళులర్పించాక సభ వాయిదాపడింది. ఈ నెల 15 వరకు తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరు కావాలని సీఎల్పీ నేత సిద్ధరామయ్య బుధవారం రెండోసారి విప్ జారీ చేశారు. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భాజపావైపు చూస్తున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. 'ప్రభుత్వ అసలు రంగు ఏమిటనేది బడ్జెట్ సమావేశాల్లో బయటపడిపోతుంది. కుమారస్వామిని సీఎంగా అంగీకరించబోమని 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బాహాటంగానే చెప్పారు. ప్రజలకే కాకుండా సొంత శాసనసభ్యులకూ సీఎంపై విశ్వాసం లేదు' అని విపక్ష నేత బి.ఎస్.యడ్యూరప్ప విమర్శించారు. అవిశ్వాసాన్ని తాము ప్రవేశపెట్టబోమని, ప్రభుత్వమే దానంతట అది పడిపోయే పరిస్థితి వస్తుందని చెప్పారు.

ఆలోచన అదిరింది.. స్వచ్ఛత వెలిసింది



ఆలోచనకు తగ్గ శ్రమ ఉంటే అబ్బుర పరిచే పనులు చేయవచ్చని మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నిరూపించారు. ఈ పాఠశాలలో 242 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి సరిపడా మూత్రశాలలు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సి వచ్చేది. పక్కనే రోడ్డు ఉండటంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందేవారు. అదనపు మూత్రశాలల ఏర్పాటు కోసం వీరు సృజనాత్మకతకు పదును పెట్టారు. అతి తక్కువ ఖర్చుతో 13 మూత్రశాల కుండీలను ఏర్పాటు చేశారు. పాత సామగ్రి విక్రయించే వారి వద్ద దొరికే పాడైపోయిన 20 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాలను సేకరించారు. డబ్బా మధ్య భాగాన ఒక వైపు చతురస్రాకారంలో తొలగించి వైపులకు అనుసంధానం చేసి గోడకు ఏర్పాటు చేశారు. వీటన్నింటికి రూ.5,500 ఖర్చు అయినట్లు ప్రధానోపాధ్యాయులు సుధీర్‌కుమార్ తెలిపారు. వీటిని దాతల ద్వారా సేకరించినట్లు చెప్పారు. ప్రస్తుతం మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు.

- న్యూస్‌టుడే, ధన్వాడ

రెండో పీజీ విద్యార్థులపై నిఘా!

- చట్టబద్ధ నివాసం కోసం నిబంధనలు అతిక్రమిస్తున్నారనే అనుమానం
- గదులకు వెళ్లి ఆరా... కొందరికి తాఖీదులు
- అమెరికా వలస విభాగ అధికారుల చర్యలు
- అప్రమత్తమై వెనుదిరిగే యత్నాల్లో భారతీయ విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్: రెండో పీజీ పేరిట భారతీయ విద్యార్థులు తమ విశ్వవిద్యాలయాల్లో చేరి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని భావిస్తున్న అమెరికా అధికారులు అటువంటి వారిపై నిఘా తీవ్రతరం చేశారు. అమెరికాలో స్థిరపడాలన్న లక్ష్యంతో విద్యార్థులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) అధికారులు అనుమానిస్తూ చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అయిదేళ్లకు పైబడి దేశంలోనే నివసిస్తున్న వారి వివరాలను ఆరా తీస్తున్నారు. విద్యార్థులు ఉండే గదులు, ఇళ్లకు వెళ్లి ప్రశ్నిస్తున్నారు. న్యాయస్థానానికి హాజరు కావాలని కొందరికి తాఖీదులు (నోటీసు) కూడా జారీ చేస్తున్నారు. రెండో పీజీ చేస్తున్న భారతీయ విద్యార్థులు తమ దేశంలో ఎంత మంది ఉన్నారనే పక్కా సమాచారం ఐసీఈ విభాగం వద్ద ఉందని తెలుస్తోంది.

గడువు ముగిసేలోగా హెచ్1బీ వీసా లభిస్తే..

అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం(స్టెమ్) మాస్టర్ డిగ్రీ(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు పొందే వారికి రెండేళ్ల చదువుతో పాటు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ) పేరిట మూడేళ్ల పాటు కోర్సుకు సంబంధించిన పూర్తి కాల ఉద్యోగం చేయొచ్చు. ఆ గడువు తీరే లోపు హెచ్1బీ వీసా పొందితే ఆరేళ్లపాటు (మొదట 3, తర్వాత మరో మూడేళ్లు పొడిగిస్తారు) ఉద్యోగం చేయడానికి వీలవుతుంది.

ఫార్మింగ్టన్ వ్యవహారంతో నిఘా తీవ్రం

ప్రపంచంలోని వివిధ దేశాల వారు అమెరికా హెచ్1బి వీసాల కోసం ఏటా 2 లక్షల మంది వరకూ దరఖాస్తు చేసుకుంటుండగా వారిలో 85 వేల మందికే జారీ అవుతున్నాయి. అందుకే భారతీయ విద్యార్థులు అమెరికాలో చట్టబద్ధంగా ఉంటున్నారన్న హోదా (స్టేటస్) కోసం మరో రెండేళ్ల పాటు అక్కడే ఉండేందుకు రెండో పీజీ చేస్తున్నారు. అందులోనూ తక్కువ రుసుములు ఉండే వర్సిటీల్లో, తరగతులు జరగని వాటిల్లో చేరుతూ నిబంధనలకు విరుద్ధంగా పూర్తికాల ఉద్యోగాలు చేస్తున్నారని అమెరికా భావిస్తోంది. తాజాగా ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం వ్యవహారంతో రెండో పీజీ విద్యార్థులపైనా ఆరా తీస్తున్నారు. మొదటి పీజీలో ఓపీటీ ద్వారా ఉద్యోగం చేసిన వారికి రెండో పీజీలో ఓపీటీ ఇవ్వరు. కాకపోతే వారానికి 20 గంటలకు మించకుండా కరికులమ్ ప్రాక్టికల్ ట్రైనింగ్(సీపీటీ) ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయవచ్చు.

ఆరా తీస్తున్నారు...నోటీసులు ఇస్తున్నారు

ఐసీఈ అధికారులు విద్యార్థులు ఉండే ఇళ్లు, గదులకు వచ్చి రెండో పీజీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటో కూపీ లాగుతున్నారు. సరైన సమాధానాలు చెప్పని వారికి నోటీసులు ఇస్తున్నారు. కాలిఫోర్నియాలో రెండో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న ఒక తెలుగు విద్యార్థికి నోటీసులు ఇచ్చి మార్చి 14న న్యాయస్థానంలో హాజరుకావాలని ఆదేశించారని, ఆ విద్యార్థి సహాయం కోసం తనకు ఫోన్ చేశారని అమెరికాలోని కెంటకీ రాష్ట్రం లూయిస్ విల్లే నగరంలో ఓ వర్సిటీలో సహ ఆచార్యుడుగా పనిచేస్తున్న పల్లా కిశోర్ తెలిపారు. ఫార్మింగ్టన్ వర్సిటీలో 600 మంది ప్రవేశాలు పొందినా 130 మందిని మాత్రమే అక్రమ వలసదారులుగా పేర్కొంటూ అక్కడి అధికారులు నిర్బంధించారు. ఈ క్రమంలో మిగిలినవారు అప్రమత్తమై ఎవరికి వారు స్వదేశానికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

చట్టబద్ధంగా ఉండేందుకే ఈ పాట్లు

మెక్సికో లాంటి పలు దేశాల వారు చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటుంటారు. భారతీయ విద్యార్థులు చట్టబద్ధంగా నివసించటం కోసం రెండో పీజీ చేస్తున్నారు. నాకు తెలిసిన ఒక తెలుగు విద్యార్థి నాలుగు పీజీలు కూడా చేశాడు. రెండో పీజీ చేసే వారిపై నిఘా ఉందని ప్రచారం జరుగుతుండటంతో కొందరు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరుతున్నారు. అప్పుడు పీజీ, పీహెచ్‌డీ వేర్వేరు కాబట్టి పీహెచ్‌డీలో మళ్లీ ఓపీటీ కూడా చేయొచ్చు. విద్యార్థులకు చదువుపరంగా ఎటువంటి మార్గదర్శకం కావాలన్నా నేను ఉచితంగా సహాయం చేస్తాను.



– పల్లా కిశోర్, సహాయ ఆచార్యులు, అమెరికా

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00